Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —

ఈనాడు

Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —

విజయవాడ 16-11-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 96

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్


కుల్‌దీప్ 2/12

దక్షిణాఫ్రికా 159 ఆలౌట్..! ప్రపంచ టెస్టు ఛాంపియన్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేశామని, భారీ ఆధిక్యం ఖాయమని సంబరపడిపోయే ఉంటుంది భారత్.

కానీ ఆతిథ్య జట్టు గొప్ప స్కోరేమీ చేయలేదు. 189 పరుగులకే ఆలౌట్.. ఆధిక్యం 30కే పరిమితం. మ్యాచ్ చేజారలేదని.. తామూ పోటీలోనే ఉన్నామని ఎంతో సంతోషపడే ఉంటుంది సఫారీ జట్టు.

కానీ రెండో రోజు ఆట చివరికి చూస్తే.. సంబరమంతా భారత జట్టుదే. మిగిలిన కాస్త సమయంలోనే దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో వంద లోపే 7 వికెట్లు తీసిన టీమ్ఇండియా విజయానికి బాటలు పరుచుకుంది.

కానీ ప్రమాదకరంగా కనిపిస్తున్న ఈడెన్ పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కోవడం కఠిన సవాలుగా మారిన నేపథ్యంలో లక్ష్యం చిన్నదైనా విజయానికి గ్యారెంటీ లేదు. కాబట్టి సఫారీల కథ త్వరగా ముగించి, ఛేదనలో జాగ్రత్తగా ఆడాల్సిందే.

బౌలర్ల ఈ'డెన్'

- ఒకే రోజు 15 వికెట్లు
- భారత్ 189 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 93/7

బంతి జోరు.. బ్యాటర్లు బేజారు


జడేజా 4/29

కోల్‌కతా

దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌ను విజయంతో ఆరంభించే అవకాశం టీమ్ఇండియా ముందు నిలిచింది. తొలి టెస్టు వేదిక ఈడెన్ గార్డెన్స్‌లో ఒక్క రోజులోనే 15 వికెట్లు నేల కూలగా.. భారత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 30 పరుగులకు పరిమితమైంది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ జట్టును 93/7కు కట్టడి చేయడం ద్వారా విజయానికి బాటలు పరుచుకుంది శుభ్‌మన్ సేన. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ తీయలేకపోయిన రవీంద్ర జడేజా.. రెండో ఇన్నింగ్స్ (4/29)లో విజృంభించి దక్షిణాఫ్రికాను గట్టి దెబ్బ తీశాడు. కుల్‌దీప్ యాదవ్ (2/12) సైతం ఆకట్టుకున్నాడు. 3 వికెట్లు చేతిలో ఉన్న దక్షిణాఫ్రికా 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. బవుమా (29 బ్యాటింగ్) పోరాడుతున్నాడు. పిచ్ ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో లక్ష్యం వంద దాటకుండా చూసుకోవాల్సిన అవసరముంది. అంతకుముందు 37/1తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. సైమన్ హార్మర్ (4/30), యాన్సెన్ (3/35)ల ధాటికి 189 పరుగులకు ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (39) టాప్‌స్కోరర్.

తొలి రోజు లాగే..: తొలి రోజు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా తొలి పది ఓవర్లలో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. వికెట్ కోల్పోకుండా 50కి పైగా పరుగులు చేసింది. ఆ ఆట చూసి బ్యాటర్లదే ఆధిపత్యం.. పెద్ద స్కోరు ఖాయం అనుకున్నారంతా. కానీ తర్వాత దక్షిణాఫ్రికా అనూహ్యంగా తడబడి 159 పరుగులకే కుప్పకూలింది. రెండో రోజు ఉదయం భారత జట్టు బ్యాటింగ్ కూడా ముందు రోజును తలపించింది. ఆరంభంలో బాగానే ఆడినా.. తర్వాత తడబాటు తప్పలేదు. కేఎల్ రాహుల్ (ఓవర్‌నైట్ స్కోరు 13), వాషింగ్టన్ సుందర్ (ఓవర్‌నైట్ 6) ఆచితూచి ఆడుతూ.. ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. దాదాపు గంట పాటు వికెట్ ఇవ్వలేదు. కానీ పిచ్ నుంచి అందుతున్న సహకారాన్ని ఉపయోగించుకున్న స్పిన్నర్ హార్మర్.. సుందర్ (29)ను కఠినమైన బంతులతో పరీక్షించి ఎడ్జ్ రాబట్టాడు. మార్‌క్రమ్ చక్కటి క్యాచ్‌తో జట్టుకు రెండో రోజు తొలి వికెట్ అందించాడు. కెప్టెన్ శుభ్‌మన్ మెడనొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. రాహుల్‌కు పంత్ (27) తోడవడంతో ఇన్నింగ్స్ సాఫీగానే సాగుతున్నట్లు అనిపించింది. కానీ అర్ధశతకం దిశగా సాగుతున్న రాహుల్‌ను కేశవ్ పెవిలియన్ చేర్చాడు. ఈ క్యాచ్‌ను కూడా స్లిప్‌లో మార్‌క్రమే అందుకున్నాడు. తర్వాత పంత్, జడేజా (27) నిలకడగా ఆడడంతో భారత్‌తో 132/3తో మెరుగైన స్థితిలో నిలిచింది. కానీ రెండు సిక్సర్లు బాది ఊపుమీద కనిపించిన పంత్‌ను బోష్ పెవిలియన్ చేర్చడంతో దక్షిణాఫ్రికా పోటీలోకి వచ్చింది. అక్కడి నుంచి క్రమం తప్పకుండా వికెట్లు పడ్డాయి. హార్మర్.. జడేజా, జురెల్ (14), అక్షర్ (16)లను ఔట్ చేసి భారత్‌ను గట్టి దెబ్బే తీశాడు. లోయరార్డర్ బ్యాటర్ల నుంచి ఏమాత్రం ప్రతిఘటన లేకపోవడంతో భారత్ స్వల్ప ఆధిక్యంతోనే ఇన్నింగ్స్‌ను ముగించింది. చివరి 7 వికెట్లు 67 పరుగుల తేడాలోనే పడ్డాయి.


బవుమా, యాన్సెన్

ఈడెన్ ఇలా అయ్యిందేంటి?

ఈడెన్ గార్డెన్స్ అంటే బ్యాటర్లకు బాగా అనుకూలించే మైదానాల్లో ఒకటి. ఇక్కడ బౌలర్లు, ముఖ్యంగా స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారన్న సంగతి తెలిసిందే. అయితే సాధారణంగా మూడో రోజు నుంచే బంతి బాగా తిరుగుతుంది. కానీ ఈసారి పిచ్ ఎవ్వరి అంచనాలకు అందని విధంగా స్పందించింది. తొలి రెండు రోజుల్లో పేసర్ల ప్రభావం ఉంటుందన్న అంచనా ముందు నుంచి ఉన్నదే కానీ.. తొలి రోజు బుమ్రా ఆ స్థాయిలో చెలరేగుతాడని ఎవ్వరూ ఊహించలేదు. రెండో రోజు స్పిన్నర్ల జోరు మామూలుగా లేదు. విపరీతమైన టర్న్, ఊహించని బౌన్స్ వల్ల స్పిన్నర్ల బంతులను ఎదుర్కోవడం బ్యాటర్లకు శక్తికి మించిన పనే అయింది. జడేజా బంతిని ఆత్మవిశ్వాసంతో డిఫెన్స్ ఆడిన స్టబ్స్.. తాను బౌల్డయ్యానని తెలిసి తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. బంతి అనూహ్యంగా బౌన్స్, టర్న్ అయి అతడిని బోల్తా కొట్టించింది. ఆడితే ఎడ్జ్, ఆడకపోతే బౌల్డ్ లేదా ఎల్బీడబ్ల్యూ అన్నట్లుగా పరిస్థితి మారి.. బ్యాటర్లకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. పిచ్ పూర్తిగా ఇలా బౌలర్ల పక్షం వహించడంపై విమర్శలు వస్తున్నాయి. బ్యాటుకు, బంతికి సమతూకం లేకపోతే.. మరీ మూడు రోజుల్లోనే ఆట ముగిసిపోతే ఇక టెస్టు మ్యాచ్‌లో ఏం మజా ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మ్యాచ్ ఆరంభానికి ముందు పిచ్‌కు నీళ్లు పట్టించకపోవడం వల్లే త్వరగా పగుళ్లు వచ్చి ఇలా స్పందిస్తోందని వ్యాఖ్యాత దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు.

స్పిన్నర్ల ముప్పేట దాడి: భారత్ ఆధిక్యాన్ని తక్కువకే పరిమితం చేశామనే ఆనందం దక్షిణాఫ్రికాకు ఎంతోసేపు నిలవలేదు. టీకి అర గంట ముందు దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆరంభం కాగా.. అందుబాటులో ఉన్న 35 ఓవర్లలోనే భారత్ 7 వికెట్లు పడగొట్టింది. పిచ్ స్పిన్ స్వర్గధామంగా మారడంతో ఆరంభం నుంచే స్పిన్నర్లను దించేశాడు తాత్కాలిక కెప్టెన్ పంత్. వికెట్ల కోసం ఎంతోసేపు ఎదురు చూడాల్సిన అవసరం లేకపోయింది. కుల్‌దీప్ బౌలింగ్‌లో రికిల్‌టన్ (11) వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోగా.. కాసేపటికే మార్‌క్రమ్ (4)ను జడేజా పెవిలియన్ చేర్చాడు. టర్న్, బౌన్స్‌ను ఈ ఇద్దరు స్పిన్నర్లు గొప్పగా ఉపయోగించుకోవడంతో వీరిని ఆడడం సఫారీ బ్యాటర్లకు శక్తికి మించిన పనైంది. ముఖ్యంగా జడేజాను ఎదుర్కోవడం సవాలుగా మారింది. ముల్డర్ (11), జోర్జి (2), స్టబ్స్ (5) అతడికి వికెట్లిచ్చేశారు. అయితే ఓ ఎండ్‌లో కెప్టెన్ బవుమా మాత్రం నిలబడ్డాడు. చక్కటి ఫుట్‌వర్క్‌తో స్పిన్నర్లను ఎదుర్కొన్న అతను.. సులువుగానే బౌండరీలు రాబట్టాడు. కానీ మరోవైపు వికెట్ల పతనం కొనసాగింది. వెరీన్ (9)ను అక్షర్ పటేల్.. యాన్సెన్ (13)ను కుల్‌దీప్ ఔట్ చేయగా.. బవుమాతో పాటు బోష్ (1) నాటౌట్‌గా నిలిచాడు.

అరుదైన క్లబ్‌లో జడేజా

టెస్టుల్లో 4 వేల పరుగులు, 300 వికెట్ల ఘనత సాధించిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో టీమ్ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చోటు సంపాదించాడు. ఇప్పటిదాకా కపిల్‌దేవ్ (భారత్), డానియెల్ వెటోరి (న్యూజిలాండ్), ఇయాన్ బోథమ్ (ఇంగ్లాండ్) మాత్రమే ఈ క్లబ్‌లో ఉన్నారు. ఇప్పటికే 300 వికెట్ల మైలురాయిని అందుకున్న అతను.. శనివారం 4 వేల పరుగుల మార్కును చేరుకున్నాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 4017 పరుగులు, 342 వికెట్లు ఉన్నాయి.

గిల్‌కు ఏమైంది?


గిల్

ఈడెన్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 4 పరుగులే చేసి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడం భారత్‌ను దెబ్బ తీసింది. రాగానే ఒక ఫోర్ కొట్టి ఊపుమీద కనిపించిన గిల్.. తర్వాత మెడ పట్టేయడంతో ఇబ్బంది పడ్డాడు. ఫిజియో వచ్చి చికిత్స అందించినా.. అతను బ్యాటింగ్ కొనసాగించలేకపోయాడు. తర్వాత అయినా శుభ్‌మన్ బ్యాటింగ్‌కు వస్తాడేమో అనుకుంటే.. 9వ వికెట్ పడ్డాక కూడా వెనక్కి రాలేదు. అనంతరం దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ మొదలైనా గిల్ మైదానంలో అడుగు పెట్టలేదు. వైస్ కెప్టెన్ పంత్ తాత్కాలికంగా సారథ్య బాధ్యతలు అందుకున్నాడు. గిల్ ఇక ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు లేవని జట్టు వర్గాల సమాచారం.

39 ఈ మ్యాచ్‌లో ఇప్పటిదాకా అత్యధిక వ్యక్తిగత స్కోరు. కేఎల్ రాహుల్ సాధించాడు. భారత్‌లో జరిగిన టెస్టుల్లో రెండు తొలి ఇన్నింగ్స్‌లు అయ్యేసరికి నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోర్లలో ఇదే అత్యల్పం.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159
భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (బి) యాన్సెన్ 12; రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 39; సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 29; శుభ్‌మన్ రిటైర్డ్ హర్ట్ 4; పంత్ (సి) వెరీన్ (బి) బోష్ 27; జడేజా ఎల్బీ (బి) హార్మర్ 27; జురెల్ (సి) అండ్ (బి) హార్మర్ 14; అక్షర్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 16; కుల్‌దీప్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1; సిరాజ్ (బి) యాన్సెన్ 1; బుమ్రా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (62.2 ఓవర్లలో ఆలౌట్) **189; వికెట్ల పతనం:** 1-18, 2-75, 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189; **బౌలింగ్:** యాన్సెన్ 15-4-35-3; ముల్డర్ 5-1-15-0; కేశవ్ మహరాజ్ 16-1-66-1; బోష్ 11-4-32-1; హార్మర్ 15.2-4-30-4
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికిల్‌టన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 11; మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4; ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11; బవుమా బ్యాటింగ్ 29; టోనీ డి జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2; స్టబ్స్ (బి) జడేజా 5; వెరీన్ (బి) అక్షర్ 9; యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప్ 13; బోష్ బ్యాటింగ్ 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (35 ఓవర్లలో 7 వికెట్లకు) **93; వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91; **బౌలింగ్:** బుమ్రా 6-1-14-0; అక్షర్ పటేల్ 11-0-30-1; కుల్‌దీప్ 5-1-12-2; జడేజా 13-3-29-4

సంజు ఇక సూపర్ కింగ్

- జడేజా రూ.14 కోట్లకే రాజస్థాన్‌కు
- రసెల్, వెంకటేశ్‌లను వదులుకున్న కోల్‌కతా


ధోని శాంసన్

ముంబయి

వచ్చే ఐపీఎల్ చాలా కొత్తగా కనిపించనుంది. చెన్నై స్టార్ ఆల్‌రౌండ్ రవీంద్ర జడేజా రాజస్థాన్‌కు, రాజస్థాన్ కెప్టెన్ సంజు శాంసన్ చెన్నైకి మారిపోయారు. ఈ మార్పిడి గురించి ఇప్పటికే వార్తలొచ్చినా.. శనివారం అధికారికంగా ప్రకటించారు. ఆటగాళ్ల రిటెన్షన్‌కు గడువు శనివారంతో ముగిసింది. జడేజా అసలు రేటు కంటే రూ.4 కోట్ల తక్కువ మొత్తానికి రాజస్థాన్‌కు వెళ్లడం గమనార్హం. చెన్నై తరపున జడేజా రూ.18 కోట్లు పొందగా.. రాజస్థాన్ అతడికి రూ.14 కోట్లు ఇవ్వనుంది. చెన్నై మాత్రం శాంసన్‌కు అతడి ప్రస్తుత ఫీజు రూ.18 కోట్లనే చెల్లించనుంది. "సీఎస్కే తరపున జడేజా 12 ఏళ్లు ఆడాడు. 250కి పైగా మ్యాచ్‌లు ఆడిన అతడు.. టోర్నీలో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లలో ఒకడు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అతడి లీగ్ ఫీజును రూ.18 కోట్ల నుంచి రూ.14 కోట్లకు సవరించారు. రాజస్థాన్ కెప్టెన్, వికెట్‌కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌కు చెన్నై అతడు ప్రస్తుతం పొందుతున్న ఫీజు (రూ.18 కోట్లు)నే చెల్లిస్తుంది" అని ఐపీఎల్ పేర్కొంది. 177 మ్యాచ్‌లు ఆడిన శాంసన్‌కు చెన్నై.. మూడో ఫ్రాంఛైజీ. 2013లో అరంగేట్రం చేసినప్పటి నుంచి రెండు సీజన్లలో (2016, 2017లో రాయల్స్ సస్పెండైంది) మినహా అతడు ఇప్పటివరకు అన్ని సీజన్లలోనూ రాజస్థాన్‌కే ఆడాడు. మరోవైపు జడేజా.. రాజస్థాన్ జట్టులోకి పునరాగమనం చేసినట్లయింది. అతడు ఐపీఎల్ తొలి రెండు సీజన్లలో రాయల్స్‌కే ఆడాడు. మధ్యలో రెండేళ్లు మినహా జడేజా 2012 నుంచి చెన్నైకే ప్రాతినిధ్యం వహించాడు. 2016, 2017లో సీఎస్కే సస్పెండైన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా చెన్నై.. జడేజాతో పాటు సామ్ కరన్ (రూ.2.4 కోట్లు)ను కూడా రాయల్స్‌కు ఇచ్చింది. మరోవైపు ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి (రూ.10 కోట్లు) సన్‌రైజర్స్ నుంచి లఖ్‌నవూకు వెళ్లాడు. సచిన్ తెందుల్కర్ తనయుడు అర్జున్ తెందుల్కర్ (రూ.30 లక్షలు) ఇకపై ఎల్‌ఎస్‌జీ జెర్సీని ధరించనున్నాడు. ముంబయి నుంచి అతడు బదిలీ అయ్యాడు. నితీష్ రాణా (రూ.4.2 కోట్లు) రాజస్థాన్ నుంచి దిల్లీకి వెళ్లాడు. మ్యాక్స్‌వెల్‌ను పంజాబ్, ఆకాశ్‌దీప్, మిల్లర్‌లను లఖ్‌నవూ వదిలేసుకున్నాయి.

కేకేఆర్, చెన్నై మధ్య యుద్ధమే!: ఈసారి మినీ వేలంలో చెన్నై సూపర్‌కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ గట్టిగా పోటీ పడనున్నాయి. చేతిలో ఎక్కువ డబ్బున్న ఫ్రాంఛైజీలు ఇవే. ఎక్కువ మంది ఆటగాళ్లను వదిలేయడంతో ఈ జట్ల దగ్గర అధిక మొత్తం ఉంది. కేకేఆర్ రూ.64.30 కోట్లతో, చెన్నై రూ. 43 కోట్లతో బిడ్డింగ్‌కు సిద్ధమవుతున్నాయి. ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్‌తో సుదీర్ఘ అనుబంధానికి కోల్‌కతా తెరదించింది. రసెల్ (రూ.12 కోట్లు)తో పాటు వెంకటేశ్ అయ్యర్ (రూ.23.75 కోట్లు)ను కేకేఆర్ వదులుకుంది. కోల్‌కతా భారీ మొత్తానికి కొనుక్కున్న వెంకటేశ్.. గత సీజన్‌లో పేలవ ప్రదర్శనతో తీవ్రంగా నిరాశపరిచాడు. రసెల్‌లో ఒకప్పటి జోరు లేదు. డికాక్, నోకియా, మొయిన్ అలీలను కూడా కేకేఆర్ అట్టిపెట్టుకోలేదు. మరోవైపు జడేజా, కరన్‌లను బదిలీ చేసిన చెన్నై.. కాన్వే, రచిన్ రవీంద్ర, పతిరన, రాహుల్ త్రిపాఠిలను వదిలేసింది. కేకేఆర్ 13 మందిని.. చెన్నై 9 మంది ఆటగాళ్లను తీసుకోవాల్సివుంది.

మిగిలిన డబ్బు.. ఖాళీలు		
చెన్నై	రూ.43.40 కోట్లు	9
దిల్లీ	రూ.21.80 కోట్లు	8
గుజరాత్	రూ.12.90 కోట్లు	5
కోల్‌కతా	రూ.64.30 కోట్లు	13
లఖ్‌నవూ	రూ.22.95 కోట్లు	6
ముంబయి	రూ.2.75 కోట్లు	5
పంజాబ్	రూ.11.50 కోట్లు	4
బెంగళూరు	రూ.16.40 కోట్లు	8
రాజస్థాన్	రూ.16.05 కోట్లు	9
హైదరాబాద్	రూ.25.50 కోట్లు	10

ఫ్రాంఛైజీలు వదిలేసిన లేదా బదిలీ అయిన ముఖ్యమైన ఆటగాళ్లు

పంజాబ్: మ్యాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్, జేమీసన్.
లఖ్‌నవూ: మిల్లర్, రవి బిష్ణోయ్, శార్దూల్ ఠాకూర్ (ముంబయికి), ఆకాశ్‌దీప్, షమర్ జోసెఫ్.
సన్‌రైజర్స్: షమి (లఖ్‌నవూకు), ఆడమ్ జంపా, రాహుల్ చాహర్.
ముంబయి: అర్జున్ తెందుల్కర్ (లఖ్‌నవూకు), ముజీబ్ రెహ్మాన్, సత్యనారాయణ రాజు.
దిల్లీ: డుప్లెసిస్, డొనోవన్ ఫెరీరా (రాజస్థాన్‌కు) జేక్ మెక్‌గుర్క్, మోహిత్ శర్మ.
గుజరాత్: రూథర్‌ఫర్డ్ (ముంబయికి), శానక, కొయెట్జీ.
రాజస్థాన్: సంజు శాంసన్ (చెన్నైకి), నితీశ్ రాణా (దిల్లీకి), తీక్షణ, హసరంగ.
కోల్‌కతా: వెంకటేశ్ అయ్యర్, ఆండ్రీ రసెల్, నోకియా, మొయిన్ అలీ, డికాక్, గుర్బాజ్.
బెంగళూరు: మయాంక్ అగర్వాల్, లివింగ్‌స్టన్, ఎంగిడి.
చెన్నై: జడేజా (రాజస్థాన్‌కు), కాన్వే, రచిన్, పతిరన, సామ్ కరన్ (రాజస్థాన్‌కు), రాహుల్ త్రిపాఠి, షేక్ రషీద్.

విజేతలు దేవ్ షా, నాగమోక్ష

జాతీయ పికిల్‌బాల్


దేవ్ షా, నాగమోక్ష

ఈనాడు, బెంగళూరు: జాతీయ పికిల్‌బాల్ ఛాంపియన్‌షిప్ అండర్-18 మిక్స్‌డ్ టీమ్ విభాగంలో దేవ్ షా, నాగమోక్ష జంట విజేతగా నిలిచింది. ప్రియా 'సబల మిల్లెట్స్' స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ఈ టోర్నీలో శనివారం వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. 30+ పురుషుల విభాగంలో రాహుల్ బెల్వాల్, 50+ మహిళల్లో గౌరిక చోప్రా.. బాలికల డబుల్స్ అండర్-14లో రవణశ్రీ-అశ్రిత, అండర్ 12లో అశ్రిత-రితన్యశ్రీ.. 50+ పురుషుల విభాగంలో అఖిల్ మాథూర్, అండర్ 16 బాలుర సింగిల్స్‌లో కియాన్, అండర్-18 బాలికల సింగిల్స్‌లో నాగమోక్ష టైటిళ్లు సాధించారు. విజేతలకు కర్ణాటక పికిల్‌బాల్ సమాఖ్య, సబల మిల్లెట్స్ ప్రతినిధులు పతకాలు ప్రదానం చేశారు. పోటీల మూడో రోజు ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహారశాలల వద్ద 'సబల మిల్లెట్స్' చిరుధాన్యాల రెడీ టు ఈట్ పదార్థాలు వడ్డించారు. పోటీల వేదికైన 'ద స్పోర్ట్స్ స్కూల్' పరిసరాల్లోని అడ్వెంచర్ స్పోర్ట్స్ విభాగాల్లోనూ క్రీడాకారులు, ప్రేక్షకులు 'సబల' ఉత్పత్తులను రుచి చూశారు. ఈ టోర్నీ ఆదివారం ముగియనుంది.

భారత ఫుట్‌బాల్ జట్టులో ఆస్ట్రేలియా ప్లేయర్

దిల్లీ: బంగ్లాదేశ్‌తో ఢాకాలో నవంబర్ 18న జరిగే ఏఎఫ్‌సీ ఆసియా కప్ ఫుట్‌బాల్ 2027 క్వాలిఫయర్స్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో ఆడే భారత జట్టులో ఆస్ట్రేలియా ఆటగాడు ర్యాన్ విలియమ్స్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా పౌరసత్వాన్ని వదులుకున్న ర్యాన్.. భారత పౌరసత్వం, పాస్‌పోర్టు పొందాడు. ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ సంఘం, ఫిఫా, ఏఎఫ్‌సీ నుంచి నిరభ్యంతర పత్రాన్ని పొందిన తర్వాత అతడిని తుది జట్టులో ఆడిస్తారు. 23 మంది సభ్యుల భారత జట్టుకు గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

స్లొవేనియా చేతిలో భారత్ ఓటమి

బిల్లీ జీన్ కింగ్ కప్

బెంగళూరు: బిల్లీ జీన్ కింగ్ కప్ టెన్నిస్ టోర్నీలో క్వాలిఫయర్స్ చేరాలన్న భారత్ ఆశ తీరలేదు. శనివారం ప్లేఆఫ్స్ గ్రూప్-జి మ్యాచ్‌లో భారత్ 1-2తో స్లొవేనియా చేతిలో ఓడింది. తొలి సింగిల్స్‌లో శ్రీవల్లి రష్మిక 3-6, 6-4, 1-6తో తమారా జిదాన్‌సెక్ చేతిలో ఓడింది. తొలి సెట్ చేజారినా.. రెండో సెట్లో రష్మిక బలంగా పుంజుకుంది. 4-1తో ఆధిక్యంలో నిలిచిన ఈ తెలుగమ్మాయి.. అదే జోరుతో సెట్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో సెట్లో రష్మిక తేలిపోయింది. కేవలం ఒక్క గేమ్ మాత్రమే గెలిచి మ్యాచ్‌ను ప్రత్యర్థికి అప్పగించింది. మరో తెలుగమ్మాయి సహజ యమలపల్లి 4-6, 2-6తో కజా జువాన్ చేతిలో ఓడింది. అప్రాధాన్య డబుల్స్ పోరులో అంకిత-ప్రార్థన 1-6, 6-3, 10-7తో జకుపోవిచ్-రాడిసిచ్‌పై నెగ్గారు. ఆదివారం నెదర్లాండ్స్‌తో భారత్ తన చివరి గ్రూప్ పోరులో తలపడుతుంది. దీని ఫలితం ఎలా ఉన్నా.. వచ్చే ఏడాది ఆసియా ఓసియానియాలో భారత్ ఆడాల్సి ఉంటుంది.

నిఖత్ సత్తా చాటేనా!


నిఖత్

నేటి నుంచి ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా: మాజీ ప్రపంచ ఛాంపియన్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్‌కు సవాల్. ఆదివారం ఆరంభమయ్యే ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నీలో స్వర్ణం గెలవడమే లక్ష్యంగా ఈ భారత బాక్సర్ బరిలో దిగుతోంది. 51 కేజీల విభాగంలో ఆమె పోటీపడుతుంది. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌లోనే ఓడిన నిఖత్.. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. ప్రపంచ ఛాంపియన్లు జైస్మిన్ లాంబోరియా (57 కేజీ), మీనాక్షి హుడా (48 కేజీ) కూడా ఈ టోర్నీలో ఆడుతున్నారు. ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ 22 నెలల నిషేధాన్ని పూర్తి చేసుకున్న పర్వీన్ హుడా (60 కేజీ) పునరాగమనం చేస్తోంది. వాడాకు తన వివరాలు సరైన సమయంలో ఇవ్వకపోవడంతో పర్వీన్‌పై నిషేధం పడింది. దీంతో 57 కేజీల ఒలింపిక్ కోటా స్థానంతో పాటు ఆసియా క్రీడల కాంస్య పతకాన్ని కూడా కోల్పోయింది. ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ టోర్నీలో పురుషుల్లో జాదుమణి సింగ్ (50 కేజీ), సచిన్ సివాచ్ (60 కేజీ), సుమిత్ కుందు (65 కేజీ), అభినాష్ (65 కేజీ) పోటీలో ఉన్నారు.

నేడు పాకిస్థాన్‌తో భారత్ ఢీ

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్ టీ20 టోర్నీలో ఆసక్తికర పోరుకు వేళైంది. జితేశ్ శర్మ నేతృత్వంలోని భారత్-ఎ జట్టు ఆదివారం పాకిస్థాన్ షహీన్స్ జట్టుతో తలపడనుంది. కళ్లన్నీ వైభవ్ సూర్యవంశీ పైనే. భారత్ తొలి మ్యాచ్‌లో అతడు యూఏఈపై చెలరేగిపోయాడు. సిక్స్‌ల మోత మోగించిన వైభవ్.. 42 బంతుల్లోనే 144 పరుగులు చేశాడు. పాక్ బౌలర్లను ఎలా బాదేస్తాడో చూడాలి. ఈ మ్యాచ్ సందర్భంగా పాక్ ఆటగాళ్లతో భారత క్రికెటర్లు కరచాలనం చేయరు.

లక్ష్యసేన్ పరాజయం

కుమామొటో (జపాన్): జపాన్ మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో అతడు 19-21, 21-14, 12-21తో ప్రపంచ నంబర్ 13 ఆటగాడు కెంటా నిషిమొటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

టైటిల్ పోరుకు సినర్

ట్యూరిన్: ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినర్ ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో టైటిల్ పోరుకు దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ సినర్ 7-5, 6-2తో డిమినార్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. కార్లోస్ అల్కరాస్-అగర్ అలియాసిమ్ (కెనడా) మధ్య సెమీఫైనల్ విజేతతో సినర్ ఫైనల్లో తలపడనున్నాడు. గ్రూప్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సెమీస్ చేరిన అల్కరాస్.. ఈ ఏడాదిని నంబర్‌వన్‌గా ముగించబోతున్నాడు. అతడు ఫైనల్లో అడుగుపెడితే.. సినర్‌తో హోరాహోరీ పోరు తప్పదు.

క్వార్టర్స్‌లో అర్జున్


అర్జున్

హరికి మరో డ్రా


పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో అర్జున్ ఇరిగేశి అదరగొడుతున్నాడు. జోరు కొనసాగిస్తూ అతడు క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో అర్జున్ 1.5-0.5తో రెండుసార్లు ఛాంపియన్ లెవోన్ అరోనియన్ (అమెరికా)ను ఓడించాడు. తొలి గేమ్‌ను డ్రా చేసుకున్న అర్జున్.. శనివారం రెండో గేమ్‌లో దూకుడుగా ఆడాడు. నల్ల పావులతో ఆడిన అతడు.. ఆరంభం నుంచి అరోనియన్‌కు ఉచ్చు బిగించాడు. ముఖ్యంగా మిడిల్ గేమ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఎత్తుల ముందు అరోనియన్ తేలిపోయాడు. 33 ఎత్తుల్లో అరోనియన్ ఓటమిని అంగీకరించాడు. మరోవైపు పెంటేల హరికృష్ణకు వరుసగా రెండో డ్రా ఎదురైంది. జోస్ అల్కాంటారా (మెక్సికో)తో పోరును అతడు 35 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. ఆదివారం హరి టైబ్రేక్ ఆడనున్నాడు. నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్థాన్) 1.5-0.5తో గాబ్రియెల్ సర్గిసియన్ (ఆర్మేనియా)పై, సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్) అంతే తేడాతో ఫ్రెడరిక్ (జర్మనీ)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరారు. సామ్ షంక్‌లాండ్ (అమెరికా)-డానియల్ దబోవ్ (రష్యా), ఇసిపెంకో (ఫిన్లాండ్)-అలెక్సీ గ్రెబ్నెవ్ (ఫిన్లాండ్) గేమ్‌లు డ్రా అయ్యాయి.

బాబర్ 807 రోజుల తర్వాత..

అంతర్జాతీయ సెంచరీ

రావల్పిండి: పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ సుదీర్ఘ విరామం తర్వాత మూడంకెల స్కోరు అందుకున్నాడు. 807 రోజుల తర్వాత అంతర్జాతీయ సెంచరీ చేశాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శ్రీలంకతో రెండో వన్డేలో బాబర్ (102 నాటౌట్; 119 బంతుల్లో 8×4) అజేయ శతకం సాధించడంతో పాక్ 8 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసి ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. మొదట లంక 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. జనిత్ లియనాగె (54), కమిందు మెండిస్ (44), సమరవిక్రమ (42), హసరంగ (37 నాటౌట్) రాణించారు. బాబర్ సెంచరీతో పాక్ 48.2 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. బాబర్‌తో పాటు ఫకార్ జమాన్ (78), రిజ్వాన్ (51 నాటౌట్), సయీమ్ అయూబ్ (33) రాణించారు. 2023 ఆగస్టులో బాబర్ చివరిగా శతకం అందుకున్నాడు.

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 16-11-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 96
రూ. 8-00 పేజీలు 18+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



సమాజ హితులకు దార్శనికుడి పురస్కారాలు

నేడు రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

హాజరు కానున్న ఉపరాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

ఈనాడు, హైదరాబాద్: రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీ రావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం జరగనుంది. వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన, సమాజహితమే లక్ష్యంగా శ్రమిస్తున్న ఏడుగురికి ఈ పురస్కారాలను ప్రదానం చేయాలని రామోజీ గ్రూప్ నిర్ణయించింది. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ-సంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్.. ఈ ఏడు విభాగాల్లో సేవలందించిన విశిష్ట వ్యక్తులకు వీటిని అందజేయనున్నారు. రామోజీరావు జయంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే ఈ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ తదితరులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామోజీ నిఘంటువులను విడుదల చేయనున్నారు.

నిస్వార్థ సేవకులను సన్మానించుకోవడమే..

దేశ ప్రగతి, ప్రజల ఉన్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు రామోజీరావు. సమాజానికి తిరిగి ఇవ్వడమే నిజమైన విజయమని ఆయన బలంగా నమ్మారు. ఇతరుల్లో స్ఫూర్తి నింపడం, అవకాశాలు సృష్టించడం, ప్రతి రంగంలో శ్రేష్ఠతను (మిగతా 2లో)

ప్రతిభామూర్తులకు రామోజీ పట్టం 2లో

₹13 లక్షల కోట్ల పెట్టుబడులు

613 ఒప్పందాలు

- 16.31 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- ఫలించిన పెట్టుబడుల సదస్సు
- ప్రభుత్వ అంచనాలకన్నా 30% అదనంగా పెట్టుబడులు
- వచ్చే ఏడాది నవంబరు 14, 15 తేదీల్లో మళ్లీ విశాఖలోనే
- భాగస్వామ్య సదస్సు కోసం ఆంధ్ర మండప నిర్మాణం



సీఐఐ-ఏపీ 30వ భాగస్వామ్య సదస్సు విజయవంతంగా నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కరతాళధ్వనులతో అభినందనలు తెలియజేస్తున్న రాడ్నెరైవైరీ, ఎడిత్ నార్మత్, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మేమాని, టాడ్ మిఖలే, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, జోడి మికే, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్ల, రిచర్డ్ రోసో

ఈనాడు - అమరావతి

మూడు రోజుల్లో 613 ఒప్పందాలు.. 12 రంగాల్లో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు.. 16.31 లక్షల మందికి ఉద్యోగావకాశాలు.. ఇవన్నీ విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ఫలాలు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు తరలివచ్చి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను అర్థం చేసుకున్నారు. పరిశ్రమలకు రెడ్‌కార్పెట్ పరుస్తున్న ప్రభుత్వ విధానాలపై నమ్మకం ఉంచారు. రూ. లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలపై సంతకాలు చేశారు. 14, 15 తేదీల్లో భాగస్వామ్య సదస్సు అని ప్రకటించినా.. ఒకరోజు ముందే నగరంలో పెట్టుబడుల సందడి మొదలైంది. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రతినిధులతో విశాఖలో ఓ మినీ ప్రపంచపు సందడి కనిపించింది. 16 నెలల కిందటి వరకు ఏపీ అంటేనే వణికిపోయి, రాష్ట్రాన్ని వదిలిపోయిన పారిశ్రామికవేత్తలు సైతం ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ బారులు తీరారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు తర్వాత.. తామూ అదే రంగంలో పెట్టుబడులకు సిద్ధమంటూ ప్రముఖ సంస్థలు విశాఖ తలుపుతట్టాయి. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ సంస్థలు 1,000 మెగావాట్ల చొప్పున డేటా సెంటర్ల ఏర్పాటుకు వేర్వేరుగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. పెద్దపెద్ద సంస్థలే కాదు, వైకాపా ప్రభుత్వ వేధింపులకు బలైనవారు, పారిశ్రామిక ప్రోత్సాహకాలకు నోచుకోక ఇబ్బందులు పడిన వారూ కొత్త పెట్టుబడులకు ఉత్సాహంతో ముందుకొచ్చారు. పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు.. చంద్రబాబు కీలక నిర్ణయాలు ప్రకటించారు. వచ్చే ఏడాది మళ్లీ నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలోనే సదస్సు నిర్వహిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా విశాఖ తీరాన 'ఆంధ్ర మండపం' ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మాటల్లోనే కాదు.. చేతల్లో చూపిస్తూ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే పారిశ్రామికవేత్తల్లో భరోసా కల్పించే చర్యలు చేపట్టారు. 15 రోజులకోసారి (మిగతా 3లో)

రాష్ట్రానికి రేమండ్
రాయలసీమ కేంద్రంగా రూ.1,200 కోట్ల పెట్టుబడులు 6లో

సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లో ఇదే అత్యుత్తమం

2047 వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగానే ప్రణాళికల్ని, పాలసీలను తయారు చేసుకుంటున్నాం. ఇప్పటివరకు సీఐఐ నిర్వహించిన భాగస్వామ్య సదస్సుల్లో ఇదే అత్యుత్తమం అవుతుంది. భాగస్వామ్యం అంటే కేవలం ఎంవోయూలు, పెట్టుబడులే కాదు. ఈసారి ఎజెండా మార్చాం. దావోస్ తరహాలో సెషన్లు నిర్వహించాం. గ్లోబల్‌గా ఏం జరుగుతోంది? ఒకరి నుంచి ఒకరు ఏం పరిజ్ఞానం నేర్చుకోవచ్చు? అనే దానిపై ఆలోచనల్ని పరస్పరం పంచుకోగలిగాం.
- చంద్రబాబు

మంగళగిరి చీరలకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు

మనం ఒకరినొకరు అర్థం చేసుకోవాలి.. నేర్చుకోవాలి.. సంస్కృతిని గౌరవించాలని ప్రతినిధులకు చెప్పాను. 14న సాయంత్రం రాడిసన్ బ్లూలో జరిగిన గాలా డిన్నర్‌లో ఆస్ట్రేలియా-ఇండియా సీఈవో ఫోరం డైరెక్టర్ జోడీ మెకేను అక్కడ చీరలో చూశాను. 'మీరు చీరలో చాలా అందంగా ఉన్నారు. మా సంప్రదాయాన్ని గౌరవించారు. మంగళగిరి చీరను ధరించి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు' అని ఆమెను అభినందించాను.
- చంద్రబాబు



సుచిత్ర ఎల్ల అందజేసిన మంగళగిరి చేనేత చీరను ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓ ఫోరమ్ బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా డైరెక్టర్ జోడి మికేకు బహూకరిస్తున్న చంద్రబాబు

ఈసారి కుటుంబసభ్యులతో కలిసి రండి

వచ్చే ఏడాది నవంబరులో మళ్లీ విశాఖలో జరిగే సదస్సుకు రావడానికి టికెట్లు రిజర్వ్ చేసుకోండి. విశాఖ అందమైన నగరమే కాదు.. మంచి మనసున్న ప్రజలున్నారు. అందరూ అరకు కాఫీ ఆస్వాదించారా? ఈసారి అరకు కాఫీ తోటల్లో, సాగుచేసిన గిరిజనులతో కలిసి కాఫీ తాగుదాం. ఈసారి మీ కుటుంబసభ్యులతో కలిసి రావాలి. సదస్సు తర్వాత ఒకరోజు ఇక్కడ మీరంతా గడపాలి. ఆంధ్రప్రదేశ్‌ను మర్చిపోవద్దు. తరచూ పర్యటించాలి.
- విదేశీ ప్రతినిధులతో చంద్రబాబు



మంత్రి లోకేశ్ సమక్షంలో క్వాంటమ్ టెక్నాలజీకి చెందిన ఓ సంస్థ ప్రతినిధితో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్

నాడు జీనోమ్.. నేడు క్వాంటమ్
ఈ రంగాన్ని ముందుకు నడిపిస్తాం • మంత్రి లోకేశ్
క్వాంటమ్ వ్యాలీకి వచ్చేందుకు సిద్ధమన్న నిపుణులు
23 కంపెనీలతో ఎంవోయూలు 7లో

ఒప్పందాలన్నీ మూడున్నరేళ్లలో ఆచరణలోకి

- పెట్టుబడిదారుల నిబద్ధత చూశాకే సంతకాలు చేశాం
- ఐదేళ్లలో 50 లక్షల ఉద్యోగాలు
- 20 లక్షల లక్ష్యాన్ని ఇలా పెంచుతున్నాను
- విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

భాగస్వామ్య సదస్సులో చేసుకున్న రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను మూడున్నరేళ్లలో ఆచరణలోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "ఈసారి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాం. పెట్టుబడిదారులతో ముందే అన్నీ మాట్లాడాం. నిబద్ధత ఉన్నవారితోనే ఒప్పందాలపై సంతకాలు చేశాం. వారిలో ఎవరికైనా అనుకోని ఆర్థిక ఇబ్బందులు వస్తే తప్ప.. మొత్తం ప్రతిపాదనలన్నీ ఆచరణలోకి వస్తాయి" అని ఆయన పేర్కొన్నారు. శనివారం పెట్టుబడిదారుల సదస్సు ముగిశాక ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లలో 50లక్షల ఉద్యోగాలు, పదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని 50 లక్షలకు పెంచుతున్నానని తెలిపారు. విశాఖలో రెండురోజుల పాటు నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సు సూపర్‌హిట్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం ఇదే నెలలో, ఇవే తేదీల్లో విశాఖలోనే భాగస్వామ్య సదస్సు జరుగుతుందన్నారు.

హైబ్రిడ్ మోడల్ అమలు చేశాం


"ఇంతవరకు 30సార్లు భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తే ఏడుసార్లు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టాం. సాధారణంగా ఇలాంటి సదస్సుల్లో ఎంఓయూలకే ప్రాధాన్యమిస్తారు. కానీ కొత్త ఆవిష్కరణలు, విజ్ఞానం, వివిధ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులపై చర్చ జరగాలి. (మిగతా 3లో)



విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు ప్రారంభం

రేపు, ఎల్లుండి పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన
నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం లోపలి పేజీల్లో

ఇదీ సంగతి!



విడాకులు ఇస్తాను గానీ ఒక కండిషన్.. కుక్కల పోషణకు కూడా భరణం ఇప్పించండి సార్!

తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌ది హత్యే

- మృతుడి సోదరుడి ఫిర్యాదు ఆధారంగా కేసు
- పరకామణి కేసులో ప్రత్యర్థులే నిందితులు
- వారే చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేసిన ఫిర్యాదుదారు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్
- సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులు



గురువారం రాత్రి గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి వెళ్తున్న సతీష్‌కుమార్

ఈనాడు, అమరావతి, అనంతపురం, న్యూస్‌టుడే - తాడిపత్రి, పెద్దపప్పూరు, తిరుపతి నేర విభాగం: తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణిలో జరిగిన చోరీ కేసులో ఫిర్యాదుదారైన అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్‌వో), ప్రస్తుత రైల్వే సీఐ సతీష్ కుమార్‌ది హత్యేనని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్‌లోని 103(1) సెక్షన్ పెట్టి హత్యానేరం కింద కేసు కట్టారు. పరకామణిలో చోరీ, రాజీ కేసుల్లో ప్రత్యర్థులను నిందితులుగా పేర్కొన్నారు. అయితే వారి పేర్లేవీ ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించలేదు. వీరెవరనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సతీష్‌కుమార్‌ది తొలుత అనుమానాస్పద మృతిగా భావించినప్పటికీ.. ఘటనా స్థలంలోని పరిస్థితులు, ఆధారాలు, పోస్టుమార్టం నివేదికలు పరిశీలించిన పోలీసులు అది హత్యేనని ప్రాథమికంగా అంచనాకొచ్చారు. మరోవైపు మృతుడి కుటుంబ సభ్యులు సైతం ఇదే హత్యేనని ఆరోపిస్తూ ఫిర్యాదు ఇవ్వడంతో.. గుత్తి రైల్వే పోలీసులు ఆ మేరకు కేసు నమోదు చేశారు. పరకామణిలో కానుకల చోరీ కేసులోని వ్యక్తులు తనను ఏమైనా చేస్తారని సతీష్ భయపడ్డాడంటూ అతని సోదరుడు యాలాటి శ్రీహరి ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో సీఐడీ అధికారుల ఎదుట నోరు విప్పొద్దంటూ సతీష్‌కుమార్‌ను ఎవరినైనా బెదిరించారా? సతీష్ మరణానికి కొన్ని గంటల ముందు ఆయన్ను ఎవరెవరు కలిశారు? అనే వివరాలను పోలీసులు రాబడుతున్నారు.

గుంతకల్లు, గుత్తి మధ్య ఎవరెవరు ఎక్కారు? దిగారు?

పరకామణి కేసులో సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యేందుకు గురువారం రాత్రి 11.53 గంటలకు గుంతకల్లు (మిగతా 16లో)

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్



కరేబియన్ దీవులు కేంద్రంగా కొత్త సినిమాల పైరసీ
నెల రోజులుగా ఆమ్‌స్టర్‌డామ్‌లో పాగా
కూకట్‌పల్లిలో చిక్కిన నిందితుడు
అపార్టుమెంట్‌లో రూ.3 కోట్ల నగదు, వందల హార్డ్ డిస్కులు?
లోపలి పేజీలో »

పేలుడు పదార్థాల శాంపిల్స్ తీస్తుండగా విస్ఫోటం

9 మంది మృతి, 32 మందికి గాయాలు

- వందల మీటర్ల దూరంలో ఎగిరిపడ్డ శరీర భాగాలు
- జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు



జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్‌లో పేలుడు అనంతరం ధ్వంసమైన పోలీస్‌స్టేషన్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ఘటనలో 9 మంది మృతి చెందారు. 32 మంది గాయపడ్డారు. ఇటీవల ఫరీదాబాద్ ఉగ్ర కుట్రకు సంబంధించి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల నుంచి శాంపిల్స్ తీస్తుండగా (మిగతా 2లో)

గుంజీల శిక్షకు ఆరో తరగతి బాలిక బలి

100 గుంజీలు తీయించిన ఉపాధ్యాయులు

పాల్ఘర్: బడికి ఆలస్యంగా వచ్చిందని ఆరో తరగతి విద్యార్థిని చేత వంద గుంజీలు తీయించడం ఆమె ప్రాణాన్ని బలిగొంది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా వసాయ్ ప్రాంతంలోని సతివలిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో అంశిక గౌడ్ చదువుతోంది. ఈ నెల 8న ఆ బాలికతోపాటు నలుగురితో ఉపాధ్యాయులు గుంజీళ్లు తీయించారు. వీపు నుంచి పుస్తకాల సంచీనైనా తొలగించకుండా ఇలాంటి శిక్షను అమానవీయంగా వేసి తన కుమార్తె ప్రాణాన్ని బలిగొన్నారని (మిగతా 3లో)

మద్యం కేసులో అనిల్ చోఖ్రాకు రిమాండ్

ఈ నెల 21 వరకు విధించిన ఏసీబీ కోర్టు
ముడుపుల సొమ్ము రీ రూటింగ్‌లో అతనే కీలక పాత్రధారి
డొల్ల కంపెనీల నుంచి వైకాపా మద్యం ముఠాకు
రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న సిట్



అనిల్ చోఖ్రాను జైలుకు తరలిస్తున్న పోలీసు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో నాటి ప్రభుత్వ పెద్దలకు ముడుపులు చేరవేసేందుకు డొల్ల కంపెనీలను సృష్టించిన ముంబయికి చెందిన వ్యాపారి అనిల్ చోఖ్రా (ఏ49)కు విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 21 వరకు రిమాండ్ విధించింది. నిందితుణ్ని అరెస్టు చేసిన సిట్ అధికారులు శనివారం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. వైకాపా ప్రభుత్వంలో మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న డిస్టిలరీలు నగదు రూపంలో ఇచ్చిన ముడుపులను అప్పటి ప్రభుత్వ పెద్దలకు షెల్ కంపెనీల ద్వారా చేరవేతలో నిందితుడు కీలకపాత్ర (మిగతా 2లో)



విశాఖ జిల్లా గంభీరంలోని ఐఐఎం ప్రాంగణం

ప్రకృతి సిగలో చదువుల శిఖరం



ప్రాంగణంలో తీర్చిదిద్దిన క్రికెట్ మైదానం



ఐఐఎంలో ఓ తరగతి గది

పచ్చని కొండల మధ్య భవన సముదాయాలు.. చుట్టూ పచ్చని ఆహ్లాదకర వాతావరణంతో విశాఖ ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) అలరారుతోంది. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి ఐఐఎం కేటాయించింది. 2018లో డీపీఆర్ ఆమోదం పొందగా, విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో 241 ఎకరాల్లో రూ.8 వేల కోట్లతో దీని నిర్మాణం ప్రారంభించారు. అన్ని పనులూ పూర్తి చేసుకుని గతేడాది ఫిబ్రవరిలో ఐఐఎం ప్రాంగణం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ విద్యార్థుల క్రీడా సాధనకు ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. పిచ్ మినహా మిగిలిన మైదానమంతా కృత్రిమ గడ్డి పరిచారు. మరో పక్క ఫుట్‌బాల్ మైదానం నిర్మించారు. విద్యుత్తు అవసరాలకు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న కొండ ప్రాంతాల్లో సౌరఫలకలు ఏర్పాటు చేశారు. రహదారులకు ఇరువైపులా పచ్చని మొక్కలు పెంచడంతో ఈ చదువుల ప్రాంగణం హరితవనంలా భాసిల్లుతోంది.

– ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే-ఆనందపురం

మనకూ ఐఎస్‌వో పంచాయతీలు!

- ప్రయోగాత్మకంగా 19 జిల్లాల్లో 24 గ్రామాల ఎంపిక
- వీటిలో మెరుగైన సేవలు, సుపరిపాలన దిశగా చర్యలు
- కేరళ స్ఫూర్తితో ముందడుగు



చిత్తూరు జిల్లా కార్వేటినగరం పంచాయతీ కార్యాలయంలో ఫ్రంట్ ఆఫీస్



ప్రజల కోసం కార్యాలయంలో తాగునీటి సదుపాయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 24 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు కోసం కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 52 పంచాయతీలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి తొలి దశలో 24కు గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటోంది. రెండో దశలో మిగిలిన 28 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయనుంది. ప్రజలకు అందిస్తున్న పౌర సేవలు, దస్త్రాల నిర్వహణ, సుపరిపాలన, ఘనవ్యర్థాల నిర్వహణ, పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం.. ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో పలు సంస్కరణలు తీసుకొస్తోంది. పాలనలో పారదర్శకత, మెరుగైన పౌరసేవల కోసం చర్యలు తీసుకుంటోంది. తాజాగా 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్‌ను ప్రారంభించింది. కేరళ స్ఫూర్తితో ఐఎస్‌వో గుర్తింపునకు ఇప్పుడు అడుగులు వేస్తోంది. ఆ రాష్ట్రంలో 941 పంచాయతీలు, 152 బ్లాకులు ఐఎస్‌వో గుర్తింపు సాధించాయి. దేశంలో ఈ ఘనత సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ గుర్తింపు సాధించింది. ఏపీలో 19 జిల్లాల్లో ఎంపిక చేసిన 25 పంచాయతీల్లో ఆరు నెలల కిందట కసరత్తు ప్రారంభమైంది. కేరళకు చెందిన స్థానిక పరిపాలనా వ్యవహారాల సంస్థ సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటోంది. ఐఎస్‌వో ప్రమాణాల మేరకు 80% పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. నెలాఖరులోగా మిగతా 20% పూర్తిచేసి ఐఎస్‌వో గుర్తింపునకు నివేదించనున్నారు. దీనిపై సంబంధిత ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుని సర్టిఫికెట్ కోసం సిఫార్సు చేయనుంది.

ఏమిటీ ఐఎస్‌వో?

సేవలు, నాణ్యత, భద్రత, ఉత్పత్తులు, సామర్థ్యం వంటి అంశాల్లో తగిన ప్రమాణాలు పాటించే సంస్థలకు జెనీవా ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది ప్రభుత్వేతర సంస్థ. 160కి పైగా సభ్య దేశాలు ఈ సంస్థకు అనుబంధంగా ఉన్నాయి. ఇందులో భారత్ కూడా ఒకటి. ప్రపంచంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు ఐఎస్‌వో గుర్తింపు పొంది నిర్దేశిత గడువు తరువాత మళ్లీ పునరుద్ధరించుకుంటాయి. వీటిలో స్థానిక ప్రభుత్వాలూ ఉన్నాయి. దేశంలో మహారాష్ట్ర, ఒడిశా ప్రభుత్వాలు కూడా తమ రాష్ట్రాల్లో పంచాయతీలకు ఐఎస్‌వో గుర్తింపునకు తాజాగా దరఖాస్తు చేశాయి.

పంచాయతీల్లో సేవలు ఇలా...

- రాష్ట్రంలో ఎంపిక చేసిన పంచాయతీల్లో పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నారు.
- ప్రతి కార్యాలయంలోనూ ఫ్రంట్ ఆఫీస్.
- ప్రజలు తమ సమస్యలు ఒకరి తరువాత మరొకరు సిబ్బందికి తెలిపేలా టోకెన్ సిస్టం.
- సమస్యలు పరిష్కరించాక ప్రజల మొబైల్ ఫోన్లకు సమాచారం.
- అందుబాటులోకి అనేక దశాబ్దాల క్రితం నాటి దస్త్రాలు.
- ప్రజలు అడిగిన సమాచారం నిర్దేశిత గడువు లోగా అందించే ఏర్పాట్లు.
- మరణ, జనన ధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్లు గంటల వ్యవధిలో జారీ చేసే వ్యవస్థ.
- 500 రకాలైన సేవలు ప్రజలకు తెలిసేలా సమాచార బోర్డుల ప్రదర్శన.
- సేవలపై ఏటా అంతర్గత ఆడిట్.
- నైపుణ్యాలు పెంచుకునేలా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ.
- కార్యాలయాలకు వచ్చే వారి కోసం ఆవరణలో మరుగుదొడ్లు. ◆ తాగునీటి సదుపాయం.
- చంటి పిల్లల సంరక్షణ కేంద్రం.

ప్రతిభామూర్తులకు రామోజీ పట్టం

ఇక ప్రతిపటా ప్రదానం



సేవ, త్యాగం, ధైర్యం, సృజన.. ఇవి ఒక మనిషిని సమూహం నుంచి వేరు చేసి చరితార్థుడిని చేసేవి. రామోజీరావు ఈ లక్షణాలన్నీ పుణికిపుచ్చుకున్న వ్యక్తి. సమకాలీన భారతదేశంలో ఆయనలాంటి దార్శనికులు, కృషీవలురు అరుదు.

నేడు రామోజీరావు జయంతి. నవంబరు 16.. రామోజీ సంస్థలకు ఒక ఆధ్యాత్మిక పర్వదినం. ఒక మహనీయుని ఆలోచనలకు, విలువలకు నూతన జీవం లభించే రోజు. రామోజీ గ్రూప్ సంస్థలు ఆయన విలువలవారసత్వాన్ని కొనసాగించేందుకు రామోజీరావు జయంతిని 'ఫౌండేషన్ డే'గా నిర్వహిస్తున్నాయి. ఇది స్ఫూర్తి, స్మృతి, సంకల్పాల సమ్మేళనం. ధైర్యం, క్రమశిక్షణ, సృజనాత్మకత, ముందుచూపు ఆయన వ్యక్తిత్వ స్తంభాలు. ఆ దార్శనికతను సజీవంగా కొనసాగించేందుకు రామోజీ గ్రూప్ ఇక నుంచి ప్రతి ఏటా రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఇవ్వాలని తలపెట్టింది. దేశం కోసం, మానవత కోసం, విలువల కోసం నిశ్శబ్దంగా సేవ చేస్తున్న స్ఫూర్తిప్రదాతలను గుర్తించి గౌరవించడం దీని ఉద్దేశం. ఈ సంవత్సరం మొదటిసారిగా ఏడు విభాగాల్లో ఏడుగురు ప్రతిభావంతులు ఎంపికయ్యారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, శాస్త్ర సాంకేతికం, కళలు-సంస్కృతి, మహిళా సాధికారత, యువతకు స్ఫూర్తి... ఇవన్నీ రామోజీరావు గారికి హృదయానికి అత్యంత దగ్గరైన విషయాలు.

రామోజీరావు తెలుగునాట ఇంటింటికీ తెలిసిన పేరే అయినా, మీడియా రారాజుగా అత్యంత ప్రముఖుడైనా ఆయన విజయాల వెనుక ఉన్న నిర్విరామ కృషి చాలా మందికి తెలియదు. ఆయన పట్టిందల్లా బంగారం అంటారు కానీ ఆ విజయాల వెనుక ఉండే శ్రమ, తపన అద్వితీయం. ఇంటర్వ్యూలు ఇవ్వడం తక్కువ. ఒక వ్యక్తి స్వశక్తితో ఎంత ఎత్తుకు ఎదగగలరో, ఎదగవచ్చో ఆయన నిరూపించారు. ఒకటి కాదు రెండు కాదు ఒకదానికొకటి సంబంధం లేని అనేక రంగాల్లో ప్రవేశించి అత్యున్నత శిఖరాలను అధిరోహించారు.

నడిచే దారి సరైనదైతే విజయం తప్పక నీదవుతుందనే బలమైన నమ్మకమే ఇందుకు కారణం.

భారతీయ సంస్కృతికి పట్టం

రామోజీరావుకు భారతీయ సంస్కృతి, మాతృభాషలంటే ఎనలేని మమకారం. తెలుగు భాష పరిరక్షణకు చివరి వరకూ కృషి చేస్తూనే ఉన్నారు. ఆయన కలలు గన్న మహా నిఘంటువులు కూడా ఈరోజే ఆవిష్కరణ అవుతున్నాయి. ఈటీవీ యాంకర్ల వేషధారణ, అలంకరణ భారతీయత ఉట్టి పడేలా ఉండడానికి ఆయన సంకల్పమే కారణం. రామాయణ, మహాభారతాలంటే ఎంతో ఇష్టం. ఇంటి గోడలపై విఖ్యాత చిత్రకారుడు బాపుతో బొమ్మలు వేయించుకున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ, కళాంజలి ఆయనలోని కళాత్మక దృష్టికి ప్రతిబింబాలు. ఫిల్మ్‌సిటీ ప్రపంచంలోనే అతి పెద్ద చిత్ర నిర్మాణ కేంద్రంగా, భారతీయ సృజనాత్మకతకు ప్రతీక. కళాంజలి.. హస్తకళలు, సంస్కృతి పట్ల ఆయన ప్రేమకు సజీవచిహ్నం.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాణం పోస్తున్న వ్యక్తి నేడు... ఈ రంగంలో రామోజీ అవార్డు స్వీకరించనుండటం సంతోషకరమైన విషయం.

సరిహద్దుల్లో సైనికుడు... సమాజంలో పాత్రికేయుడు

జర్నలిజం అంటే ప్రజాసేవ అన్నారు గాంధీజీ. దేశానికి సైనికుడు ఎలాగో, సమాజానికి పాత్రికేయుడు అలాగే. రామోజీరావుకు ఎన్ని సంస్థలున్నా ఈనాడు మీడియా అంటే ప్రాణం. మిగతావన్నీ వ్యాపారాలు.. ఈనాడు మాత్రం కాదనేవారు. రోజులో 80 శాతం సమయం పత్రిక, టీవీలకే వినియోగించేవారు. రామోజీరావు నికార్సైన పాత్రికేయుడు. ఆయనకు ఎన్ని వ్యాపకాలున్నా ఎడిటర్ హోదా నచ్చినంతగా మరేదీ నచ్చదు. ప్రింట్, టెలివిజన్, డిజిటల్, రేడియో మాధ్యమాలు అన్నింటిలోనూ ఆయనది బలమైన ముద్ర. హైదరాబాద్ నుంచే ఆయన జాతీయ స్థాయిలో ప్రభావం చూపించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో మీడియా భవనాల సముదాయాన్ని చూస్తే ఒక మినీ పార్లమెంట్‌ని తలపిస్తుంది. విశ్వసనీయతే మీడియాకు ప్రాణవాయువు అని నమ్మారు. ప్రభుత్వాలు అనేక పర్యాయాలు కక్ష గట్టి తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడినా వెరవకుండా ఢీకొట్టి నిలిచారు. యాదృచ్ఛికమైనా ఆయన పుట్టినరోజు జాతీయ పత్రికా దినోత్సవం కావడం ఒక విశేషం.

రామోజీరావు పేరుతో స్థాపించిన తొలి మీడియా అవార్డును ఆయన లక్షణాలనే పుణికిపుచ్చుకున్న ఆణిముత్యం లాంటి ఒక జర్నలిస్టు నేడు అందుకోనున్నారు.

గ్రామ సీమల్లోనే భారతీయ ఆత్మ

గ్రామీణ భారతం అభివృద్ధి చెందకపోతే దేశానికి ప్రగతి లేదు. పల్లెటూర్లో జన్మించి, బాల్యం పూర్తిగా గ్రామీణ వాతావరణంలో గడిపిన రామోజీరావుకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గురించి బాగా తెలుసు. గ్రామీణుల జీవనశైలి, కష్టాలు, సమస్యలు ఆయనను ప్రభావితం చేశాయి. గ్రామీణాభివృద్ధికి ఉపయోగపడాలన్న సంకల్పంతో ఐదున్నర దశాబ్దాలకు క్రితమే అన్నదాత పత్రికను, ఈనాడు దినపత్రికలో రైతేరాజు శీర్షికను ప్రారంభించారు. ఈనాడు జిల్లా సంచికలు గ్రామీణ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజా చైతన్యాన్ని కలిగించాయి. మీడియా ద్వారా రైతన్నల గొంతుకను బలపరచాలన్న దృష్టితో ఈటీవీలో అన్నదాత, జైకిసాన్ కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం సుజలాం-సుఫలాం, శ్రమైవ జయతే వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారు. గ్రామీణ ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేస్తూ పచ్చళ్ల తయారీతో 'ప్రియ' అనే అంతర్జాతీయ బ్రాండ్‌ను నిర్మించారు.

గ్రామీణాభివృద్ధి ఆయనకు అత్యంత ప్రీతిపాత్రం. ఆ కేటగిరీలో విశేష కృషి చేస్తున్న వ్యక్తి ఈరోజు రామోజీ ఎక్సలెన్స్ అవార్డు స్వీకరిస్తున్నారు.

విజ్ఞాన గవాక్షం!

రామోజీరావు చిన్ననాటి నుంచే శాస్త్రీయ దృక్పథం కలిగిన వ్యక్తి. తెలియని విషయాన్ని ప్రశ్నించి తెలుసుకోవడం, కొత్త విషయాన్ని పరిశీలించి అర్థం చేసుకోవడం ఆయన స్వభావం. ఈనాడు పత్రిక ప్రారంభ దశల్లోనే విజ్ఞానాన్ని ప్రజలకు చేరవేయాలన్న సంకల్పంతో సైన్స్-సైన్స్, జ్ఞాననేత్రం వంటి శీర్షికల ద్వారా ప్రజల్లో శాస్త్రీయ విషయాలపై ఆసక్తిని రేకెత్తించారు. రెండు దశాబ్దాలుగా ఈనాడు పత్రికలో ప్రత్యేక సైన్స్ అండ్ టెక్నాలజీ పేజీ ద్వారా ప్రపంచ విజ్ఞాన ప్రవాహాన్ని తెలుగు పాఠకులకు అందిస్తున్నారు. శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని సమాజంలో వ్యాప్తి చేయడం తన బాధ్యతగా భావించిన ఆయన అనేక కార్యక్రమాలకు ప్రోత్సాహమిచ్చారు.

ఇప్పుడొక యువ శాస్త్రవేత్తకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డు లభించడం దేశానికే గర్వకారణం. విశేష కృషి చేసిన ఆ శాస్త్రవేత్త ఈ పురస్కారాన్ని స్వీకరించనుండడం ఈ వేడుకకు ప్రత్యేకతను అందిస్తోంది.

మహిళా సాధికారతకు కృషి

ఈనాడు పత్రికలో 1992లో మహిళల కోసం ప్రత్యేకంగా 'వసుంధర' పేజీ ప్రారంభం, ప్రతిఘటన, మౌన పోరాటం, మయూరి, అశ్విని వంటి స్ఫూర్తిదాయక చిత్రాల నిర్మాణం స్త్రీశక్తి పట్ల ఆయనకున్న విశ్వాసానికి అద్దం పట్టాయి. దేశంలోని అతి పెద్ద చిట్‌ఫండ్ సంస్థకూ, ప్రపంచంలోని అతి పెద్ద ఫిల్మ్ స్టూడియోకూ మహిళల్ని సారథులుగా నిలపడం స్త్రీల సామర్థ్యం పట్ల ఆయనకున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం.

రామోజీరావు విలువలకు తగినట్లుగా, ఆయన పేరుతో ఏర్పాటైన 'ఉమెన్ ఎచీవర్ అవార్డు'ను ఒక సాహస మహిళా మూర్తి నేడు అందుకోనున్నారు.

ఆపన్నహస్తం

ప్రజల కోసమే పత్రిక అన్న ఉదాత్త భావంతో 'ఈనాడు సహాయనిధి'ని స్థాపించారు రామోజీరావు. 1976లో రూ.10 వేలతో ప్రారంభమైన ఈ నిధి, కాలక్రమేణా కోట్లాది రూపాయలతో, లక్షల మంది సహకారంతో మహత్తర సేవాఉద్యమంగా మారింది. దివిసీమ ఉప్పెన నుంచి గోదావరి వరదలు, హుద్‌హుద్ తుపాను, సునామీ, గుజరాత్ భూకంపం వరకు ప్రతి విపత్తులో శాశ్వత పునరావాస గృహాలు, స్కూల్ భవనాలు, తుపాను షెల్టర్లు వంటి వందలాది నిర్మాణాలను ఏర్పాటుచేశారు. వరదలు, తుపానులు, మహమ్మారుల సమయంలో లక్షలాది ఆహారపొట్లాలు, వైద్యసాయం, పాఠశాల భవనాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు నిర్మించారు. ఇటీవలి సంవత్సరాల్లో అమరావతికి రూ.10 కోట్లు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు రూ.30 కోట్లు, మానసిక దివ్యాంగుల భవనానికి రూ.70 లక్షలు, వృద్ధాశ్రమాలు, పాఠశాలలు, క్రీడాకారులకు తోడ్పాటు, బసవతారకం, ఎల్వీప్రసాద్ ఆసుపత్రులకు కోట్ల రూపాయల సాయం అందించారు. పత్రిక ప్రజల కోసం ఉన్నదనే విలువకు రామోజీ రావుగారు నిలువెత్తు నిదర్శనం.

మానవ సేవే మాధవ సేవగా భావిస్తున్న వ్యక్తి, ఈ విభాగంలో నేడు ఎక్సలెన్స్ అవార్డు స్వీకరిస్తున్నారు.

యువకిరణం

వృద్ధాప్యం అంటే వయసు పైబడడం కాదు... నేర్చుకోవడం ఆగిపోవడం అంటారు హెన్రీఫోర్డ్. ఈ లెక్కన రామోజీరావు ఎప్పుడూ నవ యువకుడే. 80 ఏళ్లు దాటినా ఆయనలోని అన్వేషణ ఎప్పుడూ తగ్గలేదు. యువతకు ఉండే పట్టుత్వం, తాజాదనం, దూకుడు ఆయన ప్రత్యేకతలు. ఈనాడు పత్రిక గురించీ ఆయన తరచూ చెప్పేవారు: మనకు వయసు రావచ్చు, కానీ పత్రిక మాత్రం ఎప్పుడూ నవయవ్వనంలో ఉండాలి అని. యువతను అర్థం చేసుకునే ఆయన దృష్టి, భవిష్యత్తును ముందుగానే చదివే ఆయన దూరదృష్టి అన్ని సంస్థల్లోనూ ఇన్నోవేషన్‌కు దారితీశాయి. 88 ఏళ్ల వయసులో కూడా ఆయన ఆలోచనలు 28 ఏళ్ల యువకుడిలానే ఉండేవి.

ఆయన ఆదర్శాలకు నిదర్శనంగా ప్రారంభమైన 'యూత్ ఐకాన్' అవార్డును భవిష్యత్తు భారతానికి వెలుగు దీపంలా వెలిగే ఒక యువకిరణం అందుకోనుండటం యువతకు గర్వకారణం.

సమాజ హితులకు 'దార్శనికుడి' పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించడం.. ఆయన ఆదర్శాలు. క్రమశిక్షణ, సంకల్పం, దేశ సేవ.. ఈ మూడు మంత్రాలు తరతరాలకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయి. అదే స్ఫూర్తిని సార్థకం చేస్తూ.. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ఏడుగురికి ఈ ఏడాది నుంచి ప్రతిష్ఠాత్మక రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేయనున్నారు. రామోజీ ఎక్సలెన్స్ పురస్కారాల స్థాపనపై రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ.. "ఈ అవార్డులు రామోజీరావు అచంచల దీక్షకు కొనసాగింపు. సమగ్రత, ఆవిష్కరణ, సమాజ హితం.. ఈ విలువలతో జీవించే నవతరాన్ని గుర్తించడం మాకు ఆనందాన్నిస్తుంది. మరింత జ్ఞానవంతమైన, ప్రగతిశీల భారతం కోసం మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం" అని స్పష్టం చేశారు.



నిన్న కాదు.. నేడు ముఖ్యం

ఏ పనయినా సరే చేయగలమన్న నమ్మకం కలిగే వరకూ ఆగాలి. అందుకు అవసరమైన కసరత్తు చేయాలి. ఒకసారి దిగిన తర్వాత వెనుదిరిగిపోయేలా ఉండకూడదు. నిన్న ఎంత బాగా చేశావన్నది కాదు.. నేడు ఇంకెంత బాగా చేస్తావన్నది ముఖ్యం.

దిల్లీ తితిదే ఆలయంలో శృంగేరి పీఠాధిపతి అనుగ్రహభాషణ

ఈనాడు, దిల్లీ: దిల్లీలోని గోల్‌మార్కెట్ ప్రాంతంలో ఉన్న తితిదే శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి శనివారం భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ధర్మ విజయయాత్రలో భాగంగా దిల్లీ పర్యటనకు వచ్చిన ఆయనకు తితిదే లోకల్ ఏరియా కమిటీ ప్రెసిడెంట్ సుమంత్‌రెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఇక్కడి ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనుగ్రహభాషణం చేశారు. ప్రతి ఒక్కరూ ధర్మాచరణ ద్వారా జీవనం సాగించాలని, దురాశను వీడి భగవత్ దర్శనాన్ని పొందాలని సందేశం ఇచ్చారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా ప్రతి ఒక్కరూ కనీసం వారానికి ఒకసారైనా ఆలయాన్ని సందర్శించాలని భక్తులకు ఉపదేశించారు.



సరకులను కొండలపైకి తీసుకెళ్తున్న గిరిజనులు



పాఠశాలకు వెళ్లేందుకు కర్ర సాయంతో కొండపై ఉపాధ్యాయుడి అవస్థలు



పనసలపాడు నుంచి గిరిజన గ్రామాలకు వెళ్లే అధ్వాన మార్గం

నరకానికి నకళ్లు.. గిరిశిఖర గ్రామాల మార్గాలు!

గిరిశిఖర గ్రామాలకు రహదారి సదుపాయం లేక కొండలు, గుట్టలు దాటి ప్రమాదకర పరిస్థితుల్లో కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం తాటిపూడి జలాశయం అవతల ఉన్న దిగువ కొండపర్తి పంచాయతీ పరిధిలోని 14 గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి చెందిన సుమారు 16 గ్రామాలున్నాయి. వీటిలో సుమారు వెయ్యి కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. వీరంతా నిత్యావసరాలకైనా, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలకైనా కొండ దిగువన ఉన్న గంట్యాడ, ఎస్.కోట పట్టణాలకు వస్తారు. సుమారు ఐదు కి.మీ. దూరం వరకు బండలు, రాళ్లపై నడుస్తూ దిగువనున్న పెదపాడు గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మూడు కి.మీ. దూరంలో మట్టిదారిలో కాలినడకన దిగువకొండపర్తికి వెళ్లి, అక్కడి నుంచి రెండు కి.మీ. దూరంలో ఉన్న అడ్డతీగకు వాహనాల్లో వెళ్తారు. అక్కడి నుంచి జలాశయం దాటి తాటిపూడికి చేరుకుంటారు. ప్రతి నెలా రేషన్ సరకులు తీసుకునేందుకు పై గ్రామస్థులంతా అష్టకష్టాలు పడుతూ అడ్డతీగకే వచ్చి వెళ్తున్నారు. విద్య, వైద్య ఇతర ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న సుమారు 20 మంది మైదాన ప్రాంతం నుంచి ఈ గిరిశిఖర గ్రామాలకు అవస్థలు పడుతూ వెళ్తున్నారు. ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి సమస్యను వివరించామని, రోడ్డు నిర్మాణానికి ఆయన హామీ ఇచ్చారని గ్రామ సర్పంచి సీతమ్మ తెలిపారు.

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

పేలుడు పదార్థాల శాంపిల్స్ తీస్తుండగా విస్ఫోటం

(మొదటి పేజీ తరువాయి)

ఈ విస్ఫోటం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి 11.20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. భారీ పేలుడుతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించింది. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సహాయ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి శిథిలాల్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. పేలుడు ధాటికి దాదాపు 300 మీటర్ల దూరంలో శరీర భాగాలు పడడం ప్రమాద తీవ్రతకు అద్దం పడుతోంది. స్టేషన్‌లో పార్కింగ్‌లో ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల భవనాలకూ పగుళ్లు వచ్చాయి. ఇటీవల హరియాణా, జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా ఫరీదాబాద్‌లోని ఓ ఇంట్లో సోదాలు నిర్వహించి, 360 కిలోల పేలుడు పదార్థాలతో పాటు పలు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. వీటిని చిన్న చిన్న సంచుల్లో ఉంచి, పికప్ ట్రక్కులో జమ్మూకశ్మీర్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలను జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వెల్లడించారు. 'ఫరీదాబాద్ నుంచి పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపేందుకు సిద్ధం చేశారు. ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ.. దురదృష్టవశాత్తూ పేలాయి. దీనిపై అనవసర ఊహాగానాలు వద్దు. ఈ ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఎస్ఐఏ(రాష్ట్ర దర్యాప్తు సంస్థకు చెందిన అధికారి), ఎఫ్ఎస్ఎల్ బృందంలోని ముగ్గురు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఆ బృందంతో సంబంధమున్న ఒక టైలర్ మరణించారు. మరో 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, పక్కనే ఉన్న ముగ్గురు పౌరులు గాయపడ్డారు.

మద్యం కేసులో అనిల్ చోఖ్రాకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

పోషించాడని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ కోర్టుకు తెలిపారు. రూ.77.55 కోట్ల సొమ్మును నిందితుడు మళ్లించాడని.. దీనిపై లోతైన దర్యాప్తు నిమిత్తం అనిల్ చోఖ్రాకు రిమాండ్ విధించాలని కోరారు. వాదనలు విన్న న్యాయాధికారి భాస్కరరావు నిందితుడికి రిమాండ్ విధించారు. దీంతో నిందితుణ్ని విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. ఈ కేసులో అనిల్ చోఖ్రా పాత్రను రిమాండ్ రిపోర్టులో సిట్ ప్రస్తావించింది.

తొలుత నాలుగు కంపెనీల్లోకి మళ్లింపు: వైకాపా మద్యం ముఠాకు ముడుపులు చెల్లించేందుకు అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ25), లీలా డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ26), ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లు ముంబయికి చెందిన నాలుగు డొల్ల కంపెనీల ఖాతాల్లోకి రూ.77.55 కోట్లు మళ్లించాయని సిట్ అధికారులు గుర్తించారు. తొలుత ఓల్వీక్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ11), క్రిపటి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ12), నైస్నా మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ13), విశాల్ ఎంటర్‌ప్రైజెస్ (ఏ19) ఖాతాల్లోకి డబ్బు జమ చేయగా.. ఆ సంస్థల నుంచి మరో 32కు పైగా డొల్ల కంపెనీల ఖాతాల్లోకి ఈ నిధులు మళ్లాయని తేల్చారు. వాటి నుంచి చివరిగా ఆ సొమ్ము మద్యం ముఠా సభ్యులకు చేరిందని నిర్ధారించారు. ఈ రీరూటింగ్‌లో అనిల్ చోఖ్రా కీలక పాత్ర పోషించారని తేల్చారు.

వైట్‌ను బ్లాక్‌లోకి మార్చేందుకే..: అదాన్ డిస్టిలరీస్ నుంచి రూ.18.20 కోట్లు, లీలా డిస్టిలరీస్ నుంచి రూ.20.28 కోట్లు, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ నుంచి రూ.39 కోట్లు ఓల్వీక్, క్రిపటి, నైస్నా, విశాల్ ఎంటర్‌ప్రైజెస్ వంటి డొల్ల కంపెనీల ఖాతాల్లో జమ చేశారు. ఓల్వీక్ నుంచి 14 కంపెనీల్లోకి రూ.31.33 కోట్లు, క్రిపటి నుంచి 22 కంపెనీల్లోకి రూ.31.51 కోట్లు, నైస్నా నుంచి 3 కంపెనీల్లోకి రూ.10.58, విశాల్ నుంచి 4 కంపెనీల్లోకి రూ.4.08 కోట్లు మళ్లించారు. ఇవన్నీ అనుమానాస్పద లావాదేవీలే. ఆయా కంపెనీలు పేర్కొన్న చిరునామాల్లో సిట్ అధికారులు పరిశీలించగా అసలు ఎప్పుడూ అక్కడ అలాంటి కంపెనీలే లేవని తేలింది. వైట్‌ను బ్లాక్‌లోకి మార్చి సంబంధిత వ్యక్తులకు అందజేయడానికి అనిల్ చోఖ్రాయే ఈ డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది.

గ్రహం అనుగ్రహం

16–11–2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
ద్వాదశి: తె. 5-09 తదుపరి త్రయోదశి
హస్త: తె. 3-34 తదుపరి చిత్త
వర్జ్యం: ఉ. 10-58 నుంచి 12-40 వరకు
అమృత ఘడియలు: రా. 9-11 నుంచి 10-53 వరకు
దుర్ముహూర్తం: సా. 3-51 నుంచి 4-36 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.09; సూర్యాస్తమయం: సా.5.21
వృశ్చిక సంక్రమణం రా. 1–22

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	10.2	28.8
శ్రీకాకుళం	18.0	29.0
రాజమహేంద్రవరం	18.0	34.0
అనంతపురం	18.3	31.6
కర్నూలు	18.4	31.5
విశాఖపట్నం	18.6	29.4
విజయనగరం	19.0	28.0
కడప	19.0	29.0
విజయవాడ	19.0	29.8
తిరుపతి	19.6	29.2
తాడేపల్లిగూడెం	26.0	29.0

పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీల్లో ఎంపిక చేసిన వైద్యులకు జాతీయ ఎయిడ్స్, లైంగిక సంక్రమణ వ్యాధుల నియంత్రణ కార్యక్రమం కింద విజయవాడలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పేర్కొంది.



సీఐఐ-ఏపీ భాగస్వామ్య సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులతో మంత్రులు నారాయణ, బీసీ జనార్దనరెడ్డి, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, వివిధ దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఎడిత్ నార్మత్, రాడ్నెరైవైరీ (క్లస్టర్ కోఆర్డినేటర్ ప్రైవేట్ సెక్టార్ డెవలప్‌మెంట్-స్కిల్లింగ్, టీవీఈటీ, జీఐజెడ్), సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మేమాని, న్యూజిలాండ్ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ మంత్రి టాడ్ మిఖలే, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్ల, డైరెక్టర్ ఆస్ట్రేలియా-ఇండియా సీఈఓ ఫోరమ్ బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రేలియా జోడి మికే, ఇండియా అండ్ ఎమెర్జింగ్ ఏసియా ఎకనామిక్స్ సీనియర్ అడ్వైజర్ అండ్ ఛైర్మన్ రిచర్డ్ రోసో

₹13 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు నిర్వహించి, పెద్దఎత్తున అనుమతులిచ్చారు. ఆ వెంటనే మంత్రివర్గ సమావేశాలు నిర్వహించి ఆమోదం తెలిపారు. తక్షణమే ఉత్తర్వులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సు నాటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి.

అంచనాలకు మించి..

భాగస్వామ్య సదస్సు సందర్భంగా సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే అంతకు మించిన స్పందన లభించింది. సుమారు రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఇది అంచనాకంటే 30% అదనం. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామికవేత్తలు విశాఖకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇదే సమయంలో విశాఖ నుంచే వివిధ సంస్థలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కే తలమానికంగా నిలిచే డ్రోన్, స్పేస్‌సిటీలకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు వర్చువల్‌గా భూమిపూజ చేశారు.

భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు: 613
మొత్తం పెట్టుబడులు: రూ.13,25,716 కోట్లు
ఉద్యోగావకాశాలు: 16,31,188
హాజరైన ప్రతినిధులు: 4,975 (ఏపీ అధికారులు కాకుండా)
నిర్వహించిన సెషన్లు: 41
ప్రభుత్వ ప్రతినిధుల సమావేశాలు: యూరప్, ఇటలీ, తైవాన్, జపాన్, సింగపూర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం, న్యూజిలాండ్, మెక్సికో

రెండు నెలల ముందు నుంచే ప్రణాళిక.. వివిధ దేశాల్లో పర్యటనలు

ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరించడం, పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా.. సదస్సుకు రెండు నెలల ముందు నుంచే చంద్రబాబు, లోకేశ్ ఫోకస్ పెట్టారు. భాగస్వామ్య సదస్సు విజయవంతం దిశగా ప్రణాళికలు రూపొందించారు. చంద్రబాబు సింగపూర్, యూఏఈ, లండన్ సహా వివిధ దేశాలకు వెళ్లి రోడ్‌షోలు నిర్వహించి ప్రమోషన్ చేశారు. మంత్రి లోకేశ్ అమెరికా, ఆస్ట్రేలియాలో పర్యటించి, పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీంతో పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలు సదస్సుకు తరలివచ్చారు.

లోకేశ్ చొరవ.. దిగ్గజ సంస్థలతో సంప్రదింపులు

దిగ్గజ సంస్థల్ని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా మంత్రి లోకేశ్ కొంతకాలం కిందటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. సంస్థల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. ఆరేళ్ల కిందట రాష్ట్రాన్ని వదిలిన సంస్థలకూ తామున్నామని భరోసా ఇచ్చారు. దీంతో రూ.2.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఏపీ తలుపు తట్టాయి.

✦ బ్రూక్‌ఫీల్డ్ సంస్థ రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చింది. రెన్యూపవర్ రూ.82 వేల కోట్లు, ఎస్ఏఈఎల్ రూ.22 వేల కోట్లు, హిందూజ రూ.20 వేల కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నాయి.

వివిధ రంగాల వారీగా..

రంగం	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉద్యోగావకాశాలు
విద్యుత్తు	5,33,351	2,66,722
పరిశ్రమలు	2,80,384	5,19,083
మౌలిక వసతులు	2,01,758	3,06,649
ఐటీ, ఎలక్ట్రానిక్స్	1,59,467	2,96,315
ఏపీసీఆర్‌డీఏ	48,711	41,625
పర్యాటకం	21,036	1,05,804
ఆహారశుద్ధి	13,008	47,390
పట్టణాభివృద్ధి	4,944	12,150
టెక్స్‌టైల్స్	4,490	8,450
వైద్యారోగ్యం	4,208	24,000
విద్య	4,359	3,000
ఇతర శాఖలు	50,000	

రుషికొండలో రిసార్ట్స్ ఏర్పాటుకు అట్మాస్ఫియర్ కోర్ ఆసక్తి

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: రుషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్ నిర్మించేందుకు అట్మాస్ఫియర్ కోర్ ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూప్ అట్మాస్ఫియర్ కోర్ దక్షిణాసియా ఎండీ సౌవాగ్య మొహపాత్ర, గ్రూప్ ఎండీ సలిల్ పాణిగ్రాహితో సీఎం చంద్రబాబు శనివారం సమావేశమయ్యారు. తిరుపతి, విశాఖపట్నం, అమరావతిల్లో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మూడు ప్రాజెక్టుల్ని రాబోయే మూడేళ్లలో పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు. పర్యాటక రంగ అభివృద్ధి, ప్రీమియం లగ్జరీ హోటల్ ఫోర్ట్‌ఫోలియోల విస్తరణ అంశాలపై సీఎం వారితో చర్చించారు. గండికోటలో ఎడ్వెంచర్ రిసార్ట్స్, అరకు- అనంతగిరిలో హిల్ రిసార్ట్స్ ఏర్పాటుపై ఆలోచించాలన్నారు. బొబ్బిలి, విజయనగరం కోటల్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై అభిప్రాయం చెప్పాలని సూచించారు.

1,161 మంది విద్యార్థినులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

మంత్రి లోకేశ్ సహకారంతో మహిళా ఉద్యోగ మేళా

వింజనంపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని వింజనంపాడు కిట్స్ కళాశాలలో అపిటా సంస్థ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ నిర్వహించిన మహిళా ఉద్యోగ మేళాలో 1,161 మంది విద్యార్థినులు రూ.3.60 లక్షల వార్షిక శిక్షణ వేతనంతో కొలువులు సాధించారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో ప్రత్యేకంగా ఈ ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ నెల 5 నుంచి జరిగిన ఇంటర్వ్యూలకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని 75 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 13,655 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఎంపికైన వారికి ఈ-మెయిల్ ద్వారా నియామక పత్రాలు అందాయని శనివారం కిట్స్ ఛైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు.

బిర్సా ముండా ఆదివాసీల ఆధ్యాత్మిక మార్గదర్శి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నివాళులు

ఈనాడు, అమరావతి: భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. 'ఆయన కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు ఆదివాసులకు ఆధ్యాత్మిక మార్గదర్శకుడు. ఆదివాసీల జీవన విధానాన్ని రక్షించేందుకు పాటుపడ్డారు' అని పేర్కొన్నారు. 'మన అడవులను రక్షిద్దాం. మన మూలాలను బలోపేతం చేద్దాం' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.



చివరి రోజు వరకూ అదే పట్టుదల

సాధించిన దానితో సంతృప్తిపడటం అనేది చేతకానివారి పని. మనిషి ఇంకా సాధించాలనే పట్టుదలతో పని చేయాలి. జీవితంలో చివరి రోజు వరకూ అదే పట్టుదల కొనసాగాలి. ఆకాశానికి హద్దు ఎలా ఉండదో మన లక్ష్యాలూ అలాగే ఉండాలి. అవి సాధించేందుకు అడ్డదారులు తొక్కకూడదు. మంచి ఆలోచనలు, సామర్థ్యంతో శ్రమించాలి.

ఒప్పందాలన్నీ మూడున్నరేళ్లలో ఆచరణలోకి

(మొదటి పేజీ తరువాయి)

దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుల్లో ఎంఓయూలు ఉండవు. విశాఖ పారిశ్రామిక సదస్సులో హైబ్రిడ్ మోడల్ తీసుకొచ్చాం. ఒకపక్క పెట్టుబడిదారులతో ఎంఓయూలు చేస్తూనే, మరోపక్క చర్చలకు ప్రాధాన్యమిచ్చాం'' అని వివరించారు.

దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించాం

'2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరిగిందో అందరూ గుర్తు పెట్టుకోవాలి. వాళ్లు పెట్టుబడుల్ని ప్రోత్సహించలేదు సరికదా.. ఉన్నవాటిని తరిమేశారు. పారిశ్రామికవేత్తలను అవమానించారు. సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసినవారి నుంచి విద్యుత్ కొనబోమని మొండికేశారు. కోర్టు అక్షింతలు వేయడంతో... కరెంటు కొనకపోయినా రూ.9వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చింది. డబ్బు పోవడంతో పాటు ఎకోసిస్టమ్ దెబ్బతింది. ఈ 18 నెలల్లో దాన్ని గాడిలో పెట్టాం. ఇప్పుడు రాష్ట్రంలో పెద్దసంఖ్యలో హరిత ఇంధన ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయి కాబట్టే డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ముందుకొచ్చింది. ఇప్పుడు డేటా సెంటర్లు పెడతామని మరో ఐదారుగురు ఆసక్తి చూపుతున్నారు. అత్యంత విశ్వసనీయత కలిగిన సింగపూర్‌ను వేధించి తరిమేస్తే, మళ్లీ మేం వెళ్లి నచ్చజెప్పి తీసుకొచ్చాం. దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడం వల్లే రాష్ట్రానికి ఈ 18 నెలల్లో రూ.21 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఏర్పడింది. 24 లక్షల ఉద్యోగాలు కల్పించే పరిస్థితికి వచ్చాం. ఇది ఆరంభమే.

పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించేందుకే ఎస్క్రో ఖాతా

ఏ ప్రభుత్వం వచ్చినా పెట్టుబడిదారులకు ఇబ్బంది ఉండదన్న నమ్మకాన్ని కలిగించేందుకే ఎస్క్రో ఖాతా ఏర్పాటుచేస్తున్నాం. వైకాపా పాలనలో ఐదేళ్లలో చాలా నష్టపోయాం. ఇకపై అలా జరగడానికి లేదు. పరిశ్రమల నిర్మాణం మొదలయ్యాక వారినుంచి ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో వచ్చే మొత్తంలో 60-80 శాతం ఎస్క్రో ఖాతాల్లో జమచేస్తాం.

రాష్ట్రాల మధ్య పోటీ తప్పదు

సహకార సమాఖ్య వ్యవస్థలో పోటీ అనివార్యం. రాష్ట్రాలు పోటీపడితేనే ప్రజలు లబ్ధి పొందుతారు. నేనెప్పుడూ పోటీతత్వాన్ని ప్రోత్సహిస్తాను. మా ప్రభుత్వ విధానాలతో కొందరు పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారు. దీంతో ఆ రాష్ట్రాలు ఇబ్బంది పడుతున్నాయి. కానీ తప్పదు. అందరూ నిరంతరం పనిచేయాల్సిందే.



ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో ఎంఓయూ కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు. చిత్రంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి జనార్దనరెడ్డి తదితరులు

మా ప్రభుత్వంలో ఎవరికీ వేధింపులు ఉండవు

ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడిదారుల్ని మేమేమీ నిరుత్సాహపరచడం లేదు. వారిలో నిబద్ధత ఉన్నవారిని ప్రోత్సహిస్తున్నాం. మా ప్రభుత్వంలో ఏ పరిశ్రమల్నీ వేధించం. పెట్టుబడులకు సంబంధించి అన్ని ప్రాంతాలకూ సమాన ప్రాధాన్యం ఇస్తున్నాం. ఓర్వకల్లులో రిలయన్స్ బెవరేజెస్ పరిశ్రమను ఫిబ్రవరిలో ప్రారంభిస్తున్నారు. అనంతపురం జిల్లాలో హార్టికల్చర్ మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటుచేస్తున్నాం. రాయలసీమలో డ్రోన్, ఎలక్ట్రానిక్ సిటీ వస్తున్నాయి. విశాఖలో సముద్రం ఉండటంతో డేటా సెంటర్లు వస్తున్నాయి. వాటికి అవసరమైన విద్యుత్ రాయలసీమ నుంచి రావాలి. మాకు అన్ని ప్రాంతాలూ సమానమే. మొన్నటివరకు మొత్తం డబ్బులన్నీ అమరావతిలో పెడుతున్నామన్నారు. ఇప్పుడు విశాఖ అంటున్నారు. రేపు రాయలసీమలో పెడుతున్నామంటారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకు అలా మాట్లాడేవారు ఎప్పుడూ ఉంటారు. మా లక్ష్యం సుస్పష్టం. మూడు ప్రాంతాల్లో మూడు ఎకనమిక్ రీజియన్లు అభివృద్ధి చేస్తున్నాం.

విశాఖ ఉక్కును తెల్ల ఏనుగులా మారుస్తామంటే కుదరదు

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరగదు. దాన్ని ప్రైవేటీకరించాలనుకుంటే కేంద్రం రూ.12 వేల కోట్లు ఎందుకు పెడుతుంది? రాష్ట్రప్రభుత్వం ఆదాయ పన్ను, నీటి పన్ను ఎందుకు వదులుకుంటుంది? విద్యుత్ బకాయిల్ని ఈక్విటీగా మార్చి ఎప్పుడో చెల్లిస్తామంటే ఎందుకు అంగీకరిస్తుంది? అవన్నీ చేశామంటేనే ఆ పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కమిట్‌మెంట్‌ని అర్థం చేసుకోవాలి. అలాగని విశాఖ ఉక్కు ఉద్యోగులు, కార్మికులు సరిగ్గా పనిచేయకుండా దాన్ని తెల్ల ఏనుగులా మారుస్తామంటే కుదరదు. ప్రొఫెషనల్‌గా నడిపి లాభాల్లోకి తేవాలి. విశాఖ ఉక్కు పనితీరుపై నేను ప్రతి మూడు నెలలకోసారి నివేదిక తెప్పించుకుంటున్నాను' అని ముఖ్యమంత్రి చెప్పారు.

90% ఉద్యోగాలు ఇక్కడివారికే: లోకేశ్

రాష్ట్రానికి వస్తున్న ఐటీ పరిశ్రమల్లో 90-95% ఉద్యోగాలు రాష్ట్రానికి చెందినవారికే వస్తాయని లోకేశ్ తెలిపారు. ఐటీ కంపెనీల్లో కొన్ని అమరావతిలో పెట్టకుండా, అన్నీ విశాఖలోనే ఎందుకు పెడుతున్నారన్న ప్రశ్నకు... "దయచేసి ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ఎవరూ ప్రయత్నించొద్దు. ఐటీ కంపెనీల ఏర్పాటుకు ఒక ఎకోసిస్టమ్ కావాలి. ఒక కంపెనీ విశాఖలో, మరో కంపెనీ అమరావతిలో పెడితే... చివరకు ఏమీ మిగలవు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటుచేస్తున్నాం. దానికి సంబంధించిన ఎకోసిస్టమ్ అక్కడ అభివృద్ధి చెందుతుంది'' అని పేర్కొన్నారు.

ఐదు ఓఎంసీ గనుల్లో సర్వే పూర్తి

అటవీ శాఖాధికారి గురుప్రభాకర్ వెల్లడి



గనుల్లో సరిహద్దు వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా డి.హిరేహాళ్ మండలం ఓబుళాపురంలోని (ఓఎంసీ-ఓబులాపురం మైనింగ్ కంపెనీ) ఆరు గనుల్లో.. ఐదింట సర్వే పూర్తయినట్లు జిల్లా సామాజిక అటవీ శాఖాధికారి గురుప్రభాకర్ చెప్పారు. ఓఎంసీ గనులను అనంతపురం, చిత్తూరు జిల్లాల సర్కిల్ అటవీ సంరక్షణాధికారి యశోదాబాయితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "మొత్తం ఐదు గనుల్లో సర్వే పూర్తయింది. కర్ణాటక వైపు ఉన్న వివాదాస్పద గంగమ్మ గని సర్వే చేయాల్సి ఉంది. దీనిపై ఆ రాష్ట్ర అటవీ శాఖాధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సర్వే ఆగింది. అనుమతుల నిమిత్తం ఆ రాష్ట్ర ఉన్నతాధికారులను సంప్రదించాం'' అని పేర్కొన్నారు. గనుల సరిహద్దుల ఉల్లంఘన, అక్రమ మైనింగ్‌పై పలువురు మైనింగ్ యజమానులు గతంలో సుప్రీంకోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశాల మేరకు ఉన్నతస్థాయి కమిటీ సభ్యులతో సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. సర్వే పూర్తయ్యాక నివేదికను సుప్రీంకోర్టుకు నివేదించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

కర్ణాటకలో కృష్ణ జింకల మరణమృదంగం

బెళగావి, న్యూస్‌టుడే: కర్ణాటకలో కృష్ణ జింకల మృత్యువాత కలకలం రేపుతోంది. బెళగావి సమీపంలోని కిత్తూరు చెన్నమ్మ మినీ జంతు ప్రదర్శనశాలలో గురువారం 8, శనివారం మరో 20 కృష్ణ జింకలు అనుమానాస్పదంగా చనిపోయాయి. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అవి అనారోగ్యంతో మరణించాయని స్థానికులు ఆరోపించారు. పోస్టుమార్టం చేసేందుకు మైసూరు జంతు ప్రదర్శనశాల నుంచి వైద్య నిపుణులు వస్తున్నారని ఏసీఎఫ్ నాగరాజ్ తెలిపారు.

గుంజీల శిక్షకు ఆరో తరగతి బాలిక బలి

(మొదటి పేజీ తరువాయి)

అంశిక తల్లి విలపిస్తున్నారు. గుంజీళ్ల తర్వాత మెడ, వెన్నునొప్పితో బాలిక విలవిల్లాడిందని, లేవలేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ముంబయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి బాలిక ప్రాణాలు కోల్పోయింది. బాలికకు ఆరోగ్య సమస్యలున్నా బ్యాగుతో సహా గుంజీలు తీయించారని 'మహారాష్ట్ర నవనిర్మాణ సేన' నేత సచిన్ మోరె ఆరోపించారు. బాలిక మరణానికి కచ్చితమైన కారణం తెలుసుకునేందుకు అధికారులు విచారణ ప్రారంభించారు.

మూలపేటలో మెరైన్ పరికరాల తయారీ పరిశ్రమ

- రూ.500 కోట్ల పెట్టుబడి
- సాగర్ డిఫెన్స్ ప్రతినిధుల పరిశీలన

టెక్కలి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేట సమీపంలో మెరైన్ పరికరాల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు సాగర్ డిఫెన్స్ సంస్థ ముందుకొచ్చింది. భావనపాడు-మూలపేట మధ్య రూ.500 కోట్లతో పరిశ్రమ నెలకొల్పేందుకు సంస్థ ప్రతినిధులు ఈ ఏడాది జులై, అక్టోబరు నెలల్లో స్థలాన్ని పరిశీలించారు. విశాఖ సీఐఐ సదస్సులో సాగర్ డిఫెన్స్ సంస్థ ప్రతినిధి.. రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్నారు. మెరైన్ రోబోటిక్, డిఫెన్స్ ఇన్నోవేషన్, నేవిగేషన్ అంశాల్లో ఈ సంస్థకు పేటెంట్లు ఉన్నాయి. డిఫెన్స్ సొల్యూషన్స్, మానవ రహిత సముద్ర వ్యవస్థలు, అటానమస్ వెసల్స్ తయారు చేసిన అనుభవం సంస్థకు ఉంది. పోర్టుకు సమీపంలో కెరటాల తాకిడి లేని ప్రదేశాన్ని సంస్థ ప్రతినిధులు కోరుతున్నారు. పోర్టు రెండోదశను అభివృద్ధి చేయనున్నందున భావనపాడు సమీపంలో స్థలాన్ని ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సంస్థ ప్రతినిధులకు తెలిపారు. దీనిపై ప్రభుత్వ స్థాయిలో చర్చలు సాగుతున్నాయి.



మూలపేట పోర్టు ప్రాంతం

రేపు, ఎల్లుండి పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో బుధవారం వరకూ తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో, సోమ, మంగళవారాల్లో ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

✦ సోమవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

✦ మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని అంచనా వేస్తోంది.

✦ అల్పపీడనం ప్రభావంతో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది.

✦ ఈ నెల 21 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. దీని ప్రభావంతో 24 నుంచి 27 వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

అరకులో 7 డిగ్రీల ఉష్ణోగ్రత..

రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. తెలంగాణ, ఒడిశా సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో శుక్రవారం రాత్రి అత్యల్పంగా 7 డిగ్రీలు నమోదైంది. అదే జిల్లాలోని డుంబ్రిగుడలో 7.6, హుకుంపేట, ముంచంగిపుట్టులో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


ఈనాడు

ఎవరో వస్తారని... ఏదో చేస్తారని...

కొత్త సవాళ్లు ఎదురైనప్పుడల్లా వాటికి తగ్గట్టుగా ఆలోచనలను మార్చుకుని సరికొత్త వ్యూహాలను రచించాలన్నదే- ఆనంద్ నీలకంఠన్ ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చిన 'కాంట్రరీ థింకింగ్'లోని అంతస్సూత్రం. 'మూసలోంచి బయటపడటం ముఖ్యం' అంటుందది. షార్జా వేదికగా భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ పోరు ఉత్కంఠగా సాగుతోంది. ఉన్నట్టుండి ఇసుక తుపాన్ ముంచుకొచ్చి ఆటను కుదించడంతో లక్ష్యం సంక్లిష్టంగా మారింది. తిరిగి మైదానంలోకి అడుగుపెడుతూ సచిన్ తెందుల్కర్ అంపైర్లతో ఏదో చర్చించాడు. వ్యాఖ్యాత హర్షభోగ్లే గమనించాడది. ఆట ముగిశాకా దాని గురించి ప్రశ్నించాడు. 'నా దేశం గెలవాలంటే ఇంకెన్ని పరుగులు అవసరమని అడిగాను' అన్నాడు సచిన్. మొత్తం జట్టు లక్ష్యాన్ని సచిన్ స్వీయ గమ్యంగా మార్చుకోవడం చూసి హర్షభోగ్లే విస్తుపోయాడు. అంతమందిలో గీతోపదేశం ఒక్క అర్జునుడికే దక్కే పక్షంలో- 'అర్జునుడు నేనే ఎందుకు కాకూడదు' అన్నట్లు తోచింది సచిన్ ధోరణి. 'ఆటలో నీ పరిమితులు ఏమిటి' అంటే- 'ఒక బంతికి ఏడు పరుగులు రాబట్టలేకపోవడం' అన్నాడు సచిన్. 'థింక్ బిగ్' అంటే అదీ అర్థం! 'కసిగా పారించాడు- పరుగుల వరదల్ని... రాజై పాలించాడు అందరి ఎడదల్ని' తీరులో వర్ణించాడు హర్షభోగ్లే.

అనగనగా... అంటూ మొదలయ్యే కథలెన్నో మనం వినే ఉంటాం. కొన్ని ప్రశ్నలకు సరైన జవాబులిస్తే- 'రాకుమార్తెతో పెళ్లి చేస్తాం... అర్ధరాజ్యం రాసిస్తాం...' వంటి ప్రకటనలకు నవ్వుకునే ఉంటాం. ఒట్టి కాకమ్మ కథలు కావవి. విభిన్నంగా ఆలోచించగల చురుకైన యువకుల్ని వెతికి పట్టుకోవడం- వాటి పరమార్థం. 'థింక్ డిఫరెంట్...' అనేది స్టీవ్‌జాబ్స్‌కు చాలా ఇష్టమైన నినాదం. 'కాంట్రరీ థింకింగ్' అనేది 'వి-8' ఫార్ములా ఇంజిన్ల తయారీలో హెన్రీ'ఫోర్డ్' అనుసరించిన సూత్రం. 'స్పేస్ ఎక్స్' ఏర్పాటులో అది ఎలాన్ మస్క్‌ను నడిపించిన స్ఫూర్తి మంత్రం. తెలుగు సాహితీరంగంలో 'భూమార్గం పట్టిస్తాను... భూకంపం పుట్టిస్తాను... భువన భవనపు బావుటానై పైకి లేస్తాను' అన్న తపనే శ్రీశ్రీని యుగకర్తను చేసింది. 'ఈ శతాబ్దం నాది' అన్నంత ధీమాను ఇచ్చింది. ఆ తపనే లేకుంటే చేసే పనులన్నీ నిర్లిప్తంగా సాగి, 'పనిమంతుడు పందిరేస్తే కుక్కతోక తగిలి కూలిపోయింది' వంటి సామెతలు మనపట్ల నిజం అవుతాయి. అలాక్కాదు- 'కనపడితే సముద్రాలు తడబడేలా... నిలబడితే రాజ్యాలు సాగిలపడేలా' అన్నట్టుండాలి బతుకంటే!

దురదృష్టవశాత్తూ అధిక భాగం యువతలో అలాంటి పూనిక లోపిస్తోంది. 'ఎవరో వస్తారు, ఏదో చేస్తారు' తరహా ఎదురుచూపులతోనే కాలం గడచిపోతోంది. "తనకంటె ఇతరమైనను 'మనకెందుకులే' యటంచు, మనదాకా వచ్చినప్పుడు 'మన కర్మములే' అనియు" చూస్తూ ఊరుకుంటారని విశ్వనాథ చెప్పింది- ఇటువంటివారి గురించే! ఈ బలహీనత నుంచి బయటపడితే యువత ఎంతటి ఘనకార్యాలు సాధిస్తుందో, ఎంత ఆదర్శంగా నిలుస్తుందో విజయనగరం జిల్లాకు చెందిన రాంసింగ్ నవీన్ నిరూపించారు. మారుమూల ప్రాంతంలో గిరిజనుల రాకపోకలకు వీలుగా గెడ్డ(జల ప్రవాహం)పై అడ్డంగా వేసుకున్న విద్యుత్ స్తంభం మొన్నటి మొంథా తుపాన్‌కు కొట్టుకుపోయింది. ప్రజల అగచాట్లు చూశారు- యువ యూట్యూబర్ నవీన్. ముందుకొచ్చి మూడడుగుల వెడల్పు వంతెనను సొంత ఖర్చుతో నిర్మించారు. ఎందుకంటే- ఆయన 'కాంట్రరీ థింకర్' కనుక! 'అర్జునుణ్ని నేనే ఎందుకు కాకూడదు' అని ఆలోచించారు కనుక! గీతలో చెప్పిన 'కర్మతోనే సిద్ధి' ఆయనకు అర్థం అయింది కనుక!



శాస్త్ర పరిశోధనలకు పల్లె బతుకులే ముడిసరకు కావాలి.. గ్రామీణ జీవితమే గీటురాయి కావాలి. గ్రామీణ విప్లవ సాధనకు ప్రతి శాస్త్రవేత్తా ఒక సామాజిక వేత్త కావాలి.

– రామోజీరావు

పరమాత్ముని పట్టపురాణి

శ్రీమహాలక్ష్మి పద్మావతీదేవిగా దివి నుంచి భువికి దిగి వచ్చి శ్రీనివాసుడి ఆగమన లక్ష్యాన్ని సంపూర్ణం చేసింది. ఆ ఆపద్బాంధవుడు తిరుమలలో అవతరించి భక్తులకు కొంగుబంగారమైతే, ఆమె తిరుచానూరులో ఆవిర్భవించి కరుణాలయగా కటాక్షిస్తోంది. శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మి ప్రతిరూపాలే పద్మావతీ శ్రీనివాసులు. వారి అనుబంధాన్ని భక్తకవులు పున్నమికీ వెన్నెలకి, సూర్యునికీ కిరణాలకి, కడలికీ అలలకి, పూలకీ పరిమళానికి మధ్య ఉన్న బంధంతో పోల్చారు. శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యద కావ్యంలో మరింత రమ్యంగా లక్ష్మీదేవి ధరించిన రత్నహారంలో విష్ణుదేవుడి సౌందర్యం, ఆ స్వామి అలంకరించుకున్న కౌస్తుభమణి దర్పణంలో లక్ష్మీదేవి సౌందర్యం పరస్పరం ప్రతిబింబిస్తూ ఉంటాయని అభివర్ణించాడు. పోతనామాత్యులు, అన్నమాచార్యులు ఆ పరమపావనిని 'పరమాత్మ పట్టపురాణి'గా ప్రస్తుతించారు.

శ్రీదేవి తోడుగా ఉన్నందునే సప్తగిరీశుడు 'శ్రీ'నివాసుడయ్యాడని, శౌర్యలక్ష్మిగా వక్షస్థలంలో కొలువై ఉన్నందునే ఆ లోకేశుడు లోకాల్ని సమర్థంగా సంరక్షిస్తున్నాడని, భాగ్యలక్ష్మిగా ఆ బ్రహ్మాండ నాయకుడిలో సగభాగమైనందునే భక్తజనులకు భోగభాగ్యాలను ప్రసాదిస్తున్నాడని అమ్మవారి ఉపాసకుల ప్రగాఢవిశ్వాసం. ఆ దేవదేవి ధ్యానంతో మానసిక ప్రశాంతతతో పాటు, ఇంద్రియనిగ్రహం సుసాధ్యమవుతాయంటారు భక్తులు. అమ్మవారు వెలసిన దివ్యధామం 'శాంతినిలయం'గా ప్రసిద్ధం. శాంతితో పాటు తన భక్తుల్లో క్షమాగుణాన్నీ వృద్ధి చేసే శక్తిమతి ఆ పద్మావతి. అందుకే ఆ తల్లిని 'తత్‌క్షాంతి సంవర్ధినీమ్' అని స్తుతిస్తారు. తిరుచానూరులో కొలువైన అలమేలు మంగమ్మను దర్శనం చేసుకుంటేనే తిరుపతి యాత్ర పూర్తయినట్లని భక్తజనులు విశ్వసిస్తారు.



అంతర్యామి

అన్నమయ్య మనవడు తాళ్లపాక చిన్నన్న పద్మావతి అమ్మవారి వైభవాన్ని ఓ తాళపత్రంలో సంపూర్ణంగా వివరించాడు. పద్మపురాణం ప్రకారం శ్రీనివాసుడు పన్నెండేళ్లు తన హృదయేశ్వరి కోసం ఈ పుణ్యస్థలిలో తపస్సు చేశాడు. ఆ తపోఫలంగా కార్తికశుక్ల పంచమి, శుక్రవారం ఉత్తరాషాఢ నక్షత్రంలో తిరుచానూరు పద్మసరోవరంలో ఆ జగన్మాత పద్మావతిగా అవతరించింది. తీవ్రసాధనల ఫలంగానే జ్ఞానలక్ష్మి వరిస్తుందని స్వయంగా పరమాత్మే నిరూపించిన ఘట్టమిది. అందుకే సిరులతల్లి ఆవిర్భవించిన శ్రీకొలను, తిరుమల పుష్కరిణి అంతటి పరమపవిత్రం. తిరుచానూరు తీర్థక్షేత్రంలో ఆ కరుణాంతరంగ చతుర్భుజాలతో పద్మాసనియై దర్శనమిస్తుంది.

అమ్మవారి దేవాలయ విశాల ప్రాంగణం ఒకానొకప్పుడు శ్రీవారి ధాన్యాగారమట. ఆ దివ్యధామాన్ని అలమేలుమంగపట్నం, శ్రీశుకపురం అని కూడా పిలుస్తారు. కార్తికమాసంలో ఆ దేవదేవికి అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. వేడుకల వేళ విశ్వజనని వాహనవైభవం వీక్షకులకు నయనానందకరం. శేషవాహనంపై అనంతలక్ష్మిగా, హంసవాహినియై సరస్వతిగా, కల్పవృక్షంపై కామితార్థ ప్రదాయినిగా... ఇలా రోజుకొక్క రూపంలో దర్శనమిస్తూ ఆ బ్రహ్మాండనాయకి భక్తుల్ని ధన్యుల్ని చేస్తుంది.

– బి.సైదులు

మహా మనీషి రామోజీ!



"తెలుగు జాతి ఆధునిక చరిత్రలో పలువురు మహనీయులు తమకంటూ ప్రత్యేక స్థానాలను సంపాదించుకున్నారు. అపూర్వమైన దూరదృష్టి, అసాధారణమైన సృజనాత్మకత, అద్భుతమైన నిబద్ధత వారికి ఆ గౌరవాన్ని తీసుకొచ్చాయి. జాతికి దివిటీలుగా నిలిచిన అలాంటి వ్యక్తుల్లో ఒకరు దివంగత రామోజీరావు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందే స్థాయికి ఎదిగారు. తన మూలాలను వదులుకోని, విలువల విషయంలో రాజీపడని స్ఫూర్తిదాయక ప్రస్థానం రామోజీరావుది!"



జి.కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

రామోజీరావును నేను తొలిసారి కలిసింది 1980ల్లో. అప్పట్లో కళాశాల విద్యార్థిగా బీజేపీలో పూర్తిస్థాయి కార్యకర్తగా ఉన్నాను. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ఈనాడు ప్రధాన కార్యాలయంలో అయిదో అంతస్తులో అడుగుపెట్టిన ఆ రోజు నాకు ఇంకా గుర్తుంది. అది నా జీవితంలో మరచిపోలేని అనుభవం. ఓ సంస్థకు యజమాని అంటే, డాబూ దర్పాలతో ఉంటారని ఊహించుకుంటూ వారి గదిలో అడుగుపెట్టాను. కానీ ఆయన నిరాడంబరంగా భాసిల్లుతూ కనిపించారు. నాపట్ల ఆప్యాయత చూపిస్తూ, హోదా తేడాల్లేకుండా ఆత్మీయంగా పలకరించారు రామోజీరావు. వర్తమాన రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను కూలంకషంగా వివరించారు. వివిధ అంశాలపై వారికున్న లోతైన అవగాహన కాసేపట్లోనే అర్థమైంది.

ఎన్నో కుటుంబాలకు కల్పతరువు

వ్యవస్థలను అనుకరించే వ్యక్తులను చూశాం. కానీ బలమైన పునాదులపై వ్యవస్థలకు ప్రాణప్రతిష్ఠ చేసే అతి తక్కువ మంది వ్యక్తుల్లో రామోజీరావు పేరు ముందు చెప్పుకోవాలి. తాను ఉన్నా లేకున్నా ఆ వ్యవస్థ అలాగే చెక్కుచెదరకుండా ఉండి ముందుకు సాగేలా అద్భుతంగా నిర్మించడమే రామోజీరావు గొప్పదనం. ఆర్థికంగా లాభాలు సాధిస్తూనే- మన భాష, సంస్కృతి-సంప్రదాయాలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు, దేశ భవిష్యత్తు, విలువల విషయంలో రాజీ పడకూడదన్నది రామోజీ జీవిత సందేశం. అందుకే ఎక్కువ కష్టం, తక్కువ లాభం ఉండే పత్రిక, టీవీ రంగాల్లోకి అడుగుపెట్టి, దేశవ్యాప్తంగా ప్రజల ఆదరాభిమానాలు అందుకునేలా వాటిని ఆదర్శంగా నిలబెట్టగలిగారు. దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించేలా తమ సంస్థల్లో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. వారు స్థాపించిన అనేక సంస్థలు వేలాది కుటుంబాలకు ఉద్యోగాలు మాత్రమే కాదు... క్రమశిక్షణను, గౌరవాన్ని, భద్రతను, భవిష్యత్తుపై నమ్మకాన్ని ఇచ్చాయి. వాటిలో పని చేస్తున్న ఏ ఉద్యోగి అయినా ఈనాడు, ఈటీవీ, రామోజీ ఫిల్మ్ సిటీ తదితర పేర్లు చెప్పడంలో ఒక గర్వంతో కూడిన అనుభూతికి లోనవుతారు. ఇదంతా ఒక్క రోజులో వచ్చింది కాదు. దశాబ్దాల పాటు క్రమశిక్షణ, అంకిత భావాలతో రామోజీరావు చేసిన అక్షర యజ్ఞం, పాటించిన ఆదర్శాల కారణంగానే అదంతా సాధ్యమైంది.

పత్రికా రంగానికే మార్గదర్శి

'ఈనాడు'ను ఒక వార్తాపత్రికగా మాత్రమే కాకుండా, తెలుగు ప్రజల భావోద్వేగాల ప్రతిబింబంగా మలిచారు రామోజీరావు. అమెరికా నుంచి ఆదిలాబాద్‌లోని గోండుల తండాల వరకు ప్రతి ప్రాంతం వార్తలకు తగిన ప్రాధాన్యమిస్తూ ప్రచురించారు. అంతరిక్షం నుంచి అగ్రికల్చర్ వరకు ప్రతి అంశంపైనా సంపూర్ణ విశ్లేషణలను తెలుగు ప్రజలకు అందించారు. ఆధునిక ప్రయోగాల దగ్గర నుంచి చిన్న చిన్న సమస్యల వరకు ఏ విషయంలోనైనా ప్రజలకు విస్తృతమైన విశ్లేషణాత్మకమైన సమాచారం అందించాలనే అభిలాషతో ఈనాడు నిర్మితమైంది. రామోజీరావు సాకారం చేసిన మరో మహా విప్లవం- జిల్లా పత్రికల ఏర్పాటు. జర్నలిజం నగరాలకే పరిమితమై ఉన్న సమయంలో గ్రామీణ జీవితాలను పత్రికా ముఖంగా వెలుగులోకి తెచ్చారాయన. మన పల్లెల్లో కనిపించే శ్రమైక జీవన సౌందర్యం దేశవ్యాప్తంగా కనిపించేలా, వినిపించేలా రామోజీ చేసిన కృషి పత్రికా రంగానికే మార్గదర్శిగా నిలిచింది. అసహాయుల గొంతుకగా 'ఈనాడు'ను తీర్చిదిద్దారాయన. టీవీ రంగంలోనూ రామోజీరావు సంచలనాలెన్నో సృష్టించారు. వివిధ భారతీయ భాషల్లో ఒకేసారి వార్తా వినోద ఛానెళ్లు తీసుకొచ్చి.. 'ఈటీవీ మీటీవీ' అంటూ ప్రతి భారతీయుడి గుండెనూ స్పృశించారు. సమాజం కోసం తన ఛానళ్ల ద్వారా ఆధ్యాత్మిక భావనలను, నైతిక విలువలను వ్యాపింపజేశారు. ఈటీవీలో ప్రసారమైన శివలీలలు, శ్రీభాగవతం, తీర్థయాత్ర, దివ్యక్షేత్రం, ధర్మమార్గం, పంచతంత్రం వంటి కార్యక్రమాలెన్నో ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచిపోయాయి. నేషనల్ న్యూస్ నెట్‌వర్క్ అంటే హిందీలోనో, ఇంగ్లిషులోనో ఉండాలన్న సంప్రదాయాన్ని రామోజీరావు మార్చేశారు. దాదాపు 13 భారతీయ భాషల్లో ఈటీవీ ఛానళ్లను ప్రారంభించి, దేశంలోనే అత్యంత విస్తృత న్యూస్ నెట్‌వర్క్‌ను నిర్మించారు. ఇవాళ ప్రముఖ ఛానళ్లన్నీ ప్రాంతీయ భాషల్లోకి అడుగుపెడుతున్నాయి. రామోజీరావు దూరదృష్టితో వేసిన బాటలను అవి అనుసరిస్తున్నాయి.

నిజాయతీయే ఆయుధం

భారత సినీరంగానికి తలమానికమైనది రామోజీ ఫిల్మ్ సిటీ. సినిమాల నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కు ఫిల్మ్ సిటీని కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దారు రామోజీరావు. ఆయన అపార శ్రమకు నిదర్శనమైన ఆర్ఎఫ్‌సీ ప్రతి తెలుగువాడు గర్వపడే సంస్థల్లో ఒకటి. ఓ మహాయజ్ఞంతో మీడియా, సినిమా, ఆర్థిక రంగాల్లో బలమైన, ఆదర్శవంతమైన వ్యవస్థలను నెలకొల్పినా అత్యంత సాధారణంగా ఉండే అసాధారణ వ్యక్తి రామోజీరావు. నిరాడంబరత ఆయన అలంకారం, నిజాయతీ ఆయన ఆయుధం, క్రమశిక్షణ ఆయన ధర్మం. ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్న సందర్భంలో రామోజీరావుకు ఎన్నో సమస్యలు వచ్చినా ఒంటరిగానే పోరాడారు. పదవులు దగ్గరికి వచ్చినా వినమ్రంగా తిరస్కరించారు. తాను గీసుకున్న లక్ష్మణ రేఖను ఏనాడూ దాటలేదు. తాను నమ్మిన సిద్ధాంతాలను మరిచిపోలేదు. నేను వ్యక్తిగతంగా రామోజీరావును అభిమానించడానికి మరో కారణం.. మాతృభాషను కాపాడేందుకు ఆయన అహరహం అవిశ్రాంతంగా పనిచేయడం. అమ్మభాష కోసం గళమెత్తిన కాళోజీ స్ఫూర్తి సందేశాన్ని రామోజీరావు ప్రజలకు చేరువచేశారు. 'ఈనాడు', 'తెలుగు వెలుగు' వంటి పత్రికలు, ఈటీవీ ద్వారా భాషా అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపూర్వమైనది. తెలుగు మాట్లాడే ప్రతి ఒక్కరి గుండెల్లో రామోజీరావు స్థానం అజరామరమైనది.

శాశ్వత స్ఫూర్తి ప్రదాత

మీడియా అంటే ప్రజాస్వామ్య సౌధాన్ని నిలబెట్టే నాలుగో స్తంభం అనే మాటను రామోజీరావు మనసా వాచా కర్మణా విశ్వసించి ఆచరించారు. ప్రభుత్వాలు సమాజ సంక్షేమాన్ని మరిచినప్పుడల్లా, అవి దారితప్పినప్పుడల్లా అక్షర కణికలతో వాటికి వాతలుపెట్టారు. ప్రభుత్వాలను జాగృతం చేసే పత్రికా రంగ బాధ్యతను సమర్థంగా నెరవేర్చారు. ఇలాంటి ఎన్నో విశేషాలతో రామోజీరావు జీవితం మనందరికీ నిత్యం మార్గదర్శనం చేస్తోంది. తెలుగువారికి జాతీయ స్థాయిలో గౌరవం తీసుకురావడమే కాదు; మన భరత జాతి ప్రతిభను ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి రామోజీరావు. ఆయన విజయాలు మనందరికీ గర్వకారణం. ఆయన చూపిన మార్గం భవిష్యత్తుకు దిక్సూచి. ఆయన జీవితమే ఒక శాశ్వత స్ఫూర్తి. 89వ జయంతి సందర్భంగా భారతీయులందరి పక్షాన పద్మవిభూషణ్ రామోజీరావుకు ఇదే నా అక్షర నివాళి!

జైహింద్!!

ఐక్యంగా అడుగేసి... గెలుపు జెండా ఎగరేసి!

బిహార్‌లో పోలింగ్ ముగియగానే ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో రకరకాల అంచనాలు వెలువడ్డాయి. చర్చోపచర్చలు జరిగాయి. చివరికి అంతిమ ఫలితాలు రాగానే ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎగ్జిట్ పోల్స్ విఫలమయ్యాయని తేలిపోయింది. లోక్‌సభ, వివిధ శాసన సభ ఎన్నికల్లో ఇదే తంతు పునరావృతమవుతూ వస్తోంది. వివిధ వర్గాల ప్రజల్లో వస్తున్న మార్పును ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకులు, ఎన్నికల విశ్లేషకులు పసిగట్టలేకపోతున్నారన్నది వాస్తవం.

నిరుపేద రాష్ట్రమైన బిహార్‌లో ప్రజలు కులాలవారీగానే ఓటు వేస్తారనేది ఒకప్పటి మాట. ఇప్పుడు కొత్త సమస్యలు, కొత్త దృక్కోణాలు ప్రజల మనోభావాలను మార్చేస్తున్నాయి. ఆ సంగతిని రాజకీయ నాయకులు, విశ్లేషకులు గుర్తించలేకపోయారు. పేదరికం ముందు కులం కానీ, మరే ఇతర భేదాలు కానీ బిహార్ జనాన్ని ప్రభావితం చేయలేదు. పేదరికం నుంచి తమను బయటపడేయగలరు అనుకునే పార్టీలు, నాయకులకే బిహారీలు ఓటు వేశారు. అలాగని నేతలు ఇచ్చే హామీలను నమ్మే పరిస్థితి లేదు. మాటలు చేతలు కావాలి. వాగ్దానాలు ఆచరణలోకి రావాలి- అదీ వేగంగా! అలా చేయగలరని తాము నమ్మినవారికే బిహార్ ప్రజలు ఓట్లు వేశారు. అందరిలాగే వారు కూడా మెరుగైన జీవితం కోరుకున్నారు. వారి ఆశను తాము తీర్చగలమని ఎన్డీయే కూటమి భరోసా ఇచ్చింది. ముఖ్యంగా మహిళా ఓటర్ల నమ్మకాన్ని చూరగొంది. మహా గఠ్‌బంధన్ పార్టీల ప్రచారంలో ఈ ఊసే లేదు. తమకు ఆర్థిక ఊతమిస్తామని హామీ ఇచ్చిన ఎన్డీయేకి మహిళా ఓటర్లు బ్రహ్మరథం పట్టడంలో ఆశ్చర్యమేముంది? సాధారణంగా తాము చెప్పిన పార్టీకి ఓటు వేయని గృహిణులను భర్తలు తాగివచ్చి కొడుతుంటారు. ఎన్డీయే ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మహిళలకు ఆ బాధ తప్పించారు. బిహార్‌లో మద్యనిషేధాన్ని విధించి స్త్రీలకు ఆపద్బాంధవుడయ్యారు. మహిళలపై హింసకు మద్యపానమే ప్రధాన కారణమని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా తేల్చింది.





అనేక ప్రభావాల నడుమ...

కులమత భేదాలకన్నా సమాజ శ్రేయస్సు, ప్రగతిశీల భావజాలం ప్రధానమనుకునే ఓటర్లు ప్రతి రాష్ట్రంలోనూ అధిక సంఖ్యలో ఉంటారు. అదే సమయంలో ఓటర్లపై వివిధ ప్రభావాలు పనిచేస్తుంటాయనీ గ్రహించాలి. ఉదాహరణకు చుట్టూ ఉన్న రాష్ట్రాలతోపాటు నేపాల్ ప్రభావమూ బిహార్ సరిహద్దు ప్రాంతాల ప్రజలపై ఉంది. నేపాల్‌లో యువతరం రాజకీయంగా పెనుమార్పులు సృష్టించింది. అది ఆ దేశాన్ని ఆనుకుని ఉన్న బిహార్ ప్రాంత ప్రజల భావోద్వేగాలను ప్రభావితం చేయకమానదు. పశ్చిమ్ బెంగాల్‌లో మహిళలపై జరిగిన హింసనూ బిహారీలు గమనిస్తూనే ఉన్నారు. ఝార్ఖండ్‌లో నక్సలిజం బలంగా ఉన్నప్పుడు అది దక్షిణ బిహారీల మనోభావాలపై ముద్ర వేసింది. ఇలా రకరకాల పరిణామాలు, ఘటనలు బిహారీ ఓటర్ల ఎంపికలను ప్రభావితం చేస్తాయి. ఏతావాతా కులం కానీ, మరే ఒక్క అంశం కానీ ఫలితాలను నిర్ణయిస్తుందనుకోవడం పొరపాటని తాజా ఎన్నికలు తేల్చేశాయి. మరి ఒకటో రెండో చోట్ల ఇలా జరిగితే కానీ ఎన్నికల పండితులకు తత్వం బోధపడకపోవచ్చు.

ఇక్కడ ముస్లిం ఓటర్ల ధోరణిని కూడా గమనించాలి. బలరాంపూర్‌లో పోటీచేసిన 18మంది అభ్యర్థుల్లో 12 మంది ముస్లిములే. వారిలో మజ్లిస్ పార్టీ (ఏఐఎంఐఎం), సీపీఐ(ఎంఎల్ లిబరేషన్) పార్టీల అభ్యర్థులకు 80వేలు, 79వేల చొప్పున ఓట్లు వచ్చాయి. కానీ, ఆ నియోజకవర్గంలో లోక్‌జనశక్తి పార్టీకి చెందిన సంగీతాదేవి 389ఓట్ల తేడాతో గెలిచారు. సమస్తిపూర్ నియోజకవర్గంలో ఇద్దరు మాత్రమే ముస్లిం అభ్యర్థులు. వారిలో 81వేల పైచిలుకు ఓట్లు సాధించిన ఆర్జేడీ అభ్యర్థి రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఇక్కడ దాదాపు 14వేల ఓట్ల మెజార్టీతో జేడీయూ అభ్యర్థిని అశ్వమేధ్ దేవి విజయం సాధించారు. మరో ముస్లిం జనాధిక్య ప్రాంతమైన కాస్బా నియోజకవర్గంలో మజ్లిస్ అభ్యర్థి మూడో స్థానంలో ఉండగా, కాంగ్రెస్‌కు చెందిన మరో ముస్లిం అభ్యర్థి రెండో స్థానంలో నిలిచారు. వారిద్దరికీ కలిపి లక్ష పైచిలుకు ఓట్లు వచ్చినా అక్కడ ఎల్జేపీకి చెందిన ముస్లిమేతర అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఇక మరీ పేద ప్రాంతమైన దక్షిణ బిహార్‌లో ఓటర్లు తక్షణ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తారు. అక్కడ సగటు నెలవారీ ఆదాయం రూ.3వేలు మాత్రమే. మహిళలకు ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ రూ.10వేలు ఇవ్వడం ఆ ప్రాంతంలో బాగా పనిచేసింది.


కాంగ్రెస్ అత్యాశ

ఎన్డీయే ఏకతాటిపై నిలిచి ఎన్నికల్లో పోరాడగా, ప్రతిపక్ష కూటమి మహా గఠ్‌బంధన్ లుకలుకలమయమైపోయింది. ఎన్డీయేలో సీట్ల పంపిణీ సహేతుకంగా, శాస్త్రీయంగా జరిగింది. కిందటి ఎన్నికల్లో చిరాగ్ పాసవాన్ నాయకత్వంలోని ఎల్జేపీఆర్వీ పార్టీ ఒంటరిగా పోటీ చేసి జేడీయూ ఓట్లను చీల్చింది. ఈసారి ఎల్జేపీఆర్వీని ఎన్డీయేలో చేర్చుకుని అలా జరగకుండా జాగ్రత్త పడ్డారు. మరోవైపు మహా గఠ్‌బంధన్ పార్టీలేమో సీట్ల పంపకం తరవాత కూడా జుట్టూజుట్టూ పట్టుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ తన తాహతుకు మించిన సీట్లు డిమాండ్ చేసింది. ఎన్డీయే పకడ్బందీగా ఎన్నికల పోరులోకి దిగి దూసుకెళ్లింది. కానీ, మహా గఠ్‌బంధన్ పార్టీలేమో ఎన్నికల తేదీలు ముంచుకొచ్చే వరకు కిందామీదా పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు ఇచ్చామని ఆర్జేడీ బాధ పడుతూనే ఉంది. కలిసికట్టుగా పోరాడిన ఎన్డీయేలో భారతీయ జనతా పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకుని అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో ఆ పార్టీ మహిళా కేంద్రిత పథకాలతో సాధించిన విజయాన్ని బిహార్‌లోనూ పునరావృతం చేసింది. ఇలా కొత్తకొత్త వరాలు, వ్యూహాలతో భాజపా తన విజయ పరంపరను కొనసాగించాలనుకుంటోంది.

– బిలాల్ భట్

పెద్దల కోసం... పిల్లల గురించి!

పిల్లలు పెద్దలుగా ఎదిగే క్రమంలో మధ్యలో ఒక దశ ఉంటుంది. అప్పుడు వాళ్లను పిల్లలు అనలేం, అలాగని పెద్దలూ అనలేం. వాళ్లు కూడా అంతే. తమను తాము పెద్దవాళ్లలో చేర్చుకుంటారు. పనుల్లోనేమో పసితనపు అమాయకత్వాన్ని ప్రదర్శిస్తారు. భౌతికంగా, మానసికంగా జరిగే మార్పులకు తోడు సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, ప్రేమ లేకపోతే వాళ్ల జీవితకథలు ఫెయిల్యూర్ స్టోరీలుగా మిగిలిపోతాయి.



అలాంటిదే డెబ్బై అయిదేళ్ల క్రితం అమెరికన్ రచయిత జె.డి.శాలింజర్ రాసిన 'ద క్యాచర్ ఇన్ ద రై'. ఇరవయ్యో శతాబ్దపు అత్యుత్తమ నవలల్లో ఒకటిగా, వంద ఉత్తమ ఇంగ్లిష్ నవలల్లో ఒకటిగా పేరొందిన పుస్తకం ఇది.

నెర్వస్ బ్రేక్‌డౌన్‌తో మానసిక చికిత్సాలయంలో ఉండి తన కథ చెబుతాడు హోల్డెన్ కాల్‌ఫీల్డ్. అతడు సంపన్న కుటుంబానికి చెందిన కుర్రాడు. బోర్డింగ్ స్కూల్లో చదువుతుంటాడు. ఇంగ్లిష్ తప్ప మిగిలిన నాలుగు సబ్జెక్టుల్లోనూ ఫెయిలైనందుకు స్కూల్ నుంచి బహిష్కరిస్తారు. అప్పటికే నాలుగు స్కూల్స్‌లో బహిష్కరణ ఘట్టం ముగిశాకే ఇక్కడ చేరినా తిరిగి అదే పరిస్థితి ఎదురవుతుంది. వెంటనే ఇంటికి వెళ్లడం అతడికిష్టం లేదు. స్కూలు ద్వారానే ఆ విషయం అమ్మానాన్నలకు తెలిసే దాకా నాలుగు రోజులు ఎక్కడైనా గడపాలనుకుంటాడు. ఆ క్రమంలో అతడికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి, ఎటువంటి దృశ్యాలు చూశాడు, వాటికి తను ఎలాంటి భాష్యాలు చెప్పుకొన్నాడు, అవి అతడి మనసుపై ఎలాంటి ముద్ర వేశాయి... అన్నది కథ. హాస్టల్ రూమ్మేట్ ఇంగ్లిష్‌లో తనకో వ్యాసం రాసిపెట్టమని అడిగితే సరేనంటాడు. లుకేమియాతో చనిపోయిన తన తమ్ముడికి ఇష్టమైన బేస్‌బాల్ గ్లోవ్ గురించి అద్భుతంగా రాస్తాడు. తీరా ఆ అబ్బాయి డేటింగ్‌కి వెళ్లింది తన గర్ల్‌ఫ్రెండ్‌తో అని తెలిసి గొడవపడతాడు హోల్డెన్. అలా కాదని ఊరికి వెళ్లి హోటల్లో ఉందామని బయల్దేరతాడు. క్లాస్‌మేట్స్‌తో, దారిలో పరిచయమైన టూరిస్టులతో, క్యాబ్ డ్రైవర్లతో, అమ్మాయిలతో, తన టీచర్లతో... అందరితోనూ మాట్లాడాలని, స్నేహం చేయాలని ప్రయత్నిస్తాడు హోల్డెన్. కానీ ప్రతి చోటా ఏదో ఒక అపోహ. ప్రతి పనినీ అపార్థం చేసుకుంటాడు. కాబట్టి పరిస్థితి అతని కంట్రోల్ తప్పుతుంటుంది. ఎవరూ నచ్చరు, సొసైటీ నియమాలను అనుసరించడం అతడికి నచ్చదు. దాంతో ఎవరూ అతణ్ని ఇష్టపడరు. మనుషులందరూ నటిస్తుంటారని వారిని అసహ్యించుకునే హోల్డెన్‌లో చెల్లెలితో ఉన్నప్పుడు మాత్రం ఎంతో సున్నిత హృదయుణ్ని చూస్తాం. చిన్నప్పుడు చదివిన కవిత స్ఫూర్తితో కొండమీది నుంచి పడిపోకుండా పిల్లల్ని కాపాడే వ్యక్తిగా తనని తాను ఊహించుకుంటూ ఉంటాడు. అందరికీ దూరంగా వెళ్లి మూగ, చెవిటి వ్యక్తిగా గ్యాస్ స్టేషన్‌లో పనిచేసుకుని బతుకుదామనుకుంటాడు. తనూ అతనితో వచ్చేస్తానని ఏడుస్తుంది చెల్లెలు. పెద్దల ప్రపంచంనుంచి తన బాల్యాన్ని కాపాడుకుంటున్నట్లుగా సాగే హోల్డెన్ ప్రవర్తనలో చివరికి వచ్చేసరికి కాస్త పరిణతి కన్పిస్తుంది. త్వరలో మరో స్కూలుకు వెళ్లబోతున్నానని చెబుతూ ఆశావహంగా ముగిస్తాడు.

చైతన్యస్రవంతి తరహాలో ఫస్ట్‌పర్సన్‌లో సాగుతుంది నవల. టీనేజర్లు వాడే భాష, లైంగిక విషయాల ప్రస్తావన ఈ నవలను తరచూ చర్చనీయాంశం చేస్తుంటాయి. స్కూలు విద్యార్థులు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకంగా పేర్కొంటారు కానీ నిజానికి పిల్లల్ని అర్థం చేసుకోవడానికి పెద్దలు చదవాల్సిన ఈ నవల తెలుగులోకీ వచ్చింది.

– మిహిర

విద్యార్థుల ఉదారత..
రైతుబిడ్డలకు చేయూత

విద్యార్థి దశలో పసిమనసులు ఎంత సున్నితంగా ఉంటాయో తెలిపే ఉదంతమిది. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్ పట్టణ సరస్వతి భువన్ హైస్కూలు విద్యార్థులు 90 మంది ఇటీవల అధ్యయన యాత్రకు వెళ్లి వచ్చారు. యాజమాన్యం అన్ని ఖర్చులకు కలిపి ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేలు చొప్పున వసూలు చేసింది. యాత్ర అనంతరం మిగిలిన రూ.27 వేలను ఒక్కొక్కరికి రూ.300 చొప్పున వెనక్కు ఇవ్వాలని నిర్ణయించారు. మహారాష్ట్రలో ఇటీవల వచ్చిన వరదలకు చాలామంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా సమావేశమై ఆ డబ్బు తమకు వెనక్కు ఇవ్వకుండా రైతుల పిల్లల ఫీజులు కట్టాలని సూచించారు. ఎంతో పెద్దమనసు చూపి విద్యార్థులు తీసుకున్న ఈ నిర్ణయంతో ఆరుగురు



విద్యార్థుల ఫీజులు కట్టినట్లు ప్రిన్సిపల్ విశ్వరూప్ నికుంభ్ తెలిపారు. తమ పిల్లల నిర్ణయం గురించి విన్న కొందరు తల్లిదండ్రులు అవసరమైతే మరికొంత డబ్బు సర్దుబాటు చేస్తామని ముందుకు వచ్చినట్లు వెల్లడించారు.

విమాన ప్రమాదంలో మృతి..
రూ.278 కోట్ల పరిహారం

ఇంటర్నెట్‌డెస్క్: ఆరేళ్ల క్రితం జరిగిన ఇథియోపియా బోయింగ్ విమాన ప్రమాద ఘటనలో ఓ భారత కుటుంబానికి భారీ ఊరట లభించింది. బాధితురాలి కుటుంబానికి 28 మిలియన్ డాలర్లు (రూ.248 కోట్లు) పరిహారాన్ని చెల్లించాలంటూ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు షికాగో(అమెరికా)లోని ఫెడరల్ కోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతోపాటు బోయింగ్ సైతం బాధితురాలి భర్తకు ప్రత్యేకంగా మరో 3.4 మిలియన్ డాలర్ల(రూ.30 కోట్లు) పరిహారం అందించడానికి అంగీకరించింది. దీంతో ఆ కుటుంబం మొత్తం రూ.278 కోట్లు అందుకోనుంది. 2019 మార్చిలో ఇథియోపియన్ విమానయాన సంస్థకు చెందిన బోయింగ్ 737 మ్యాక్స్ జెట్ లైనర్ ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో భారతీయ పౌరురాలైన శిఖాగార్గ్ మరణించారు. అప్పుడు ఆమె ఐరాసలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఐరాస పర్యావరణ అసెంబ్లీ



శిఖాగార్గ్

సమావేశంలో పాల్గొనేందుకు నైరోబీకి వెళ్తుండగా... విమాన ప్రమాదం చోటుచేసుకుంది. 737 మ్యాక్స్ జెట్‌లైనర్‌లో లోపాలున్నాయని తెలిసినా... ప్రజలను హెచ్చరించడంలో బోయింగ్ విఫలమైందంటూ శిఖాగార్గ్ కుటుంబం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలోనే 12న షికాగోలోని కోర్టు రూ.248 కోట్లు పరిహారాన్ని అందించాలని బోయింగ్‌ను ఆదేశించింది.

యూపీలో కుప్పకూలిన క్వారీ.. శిథిలాల కింద డజను మంది?

సోన్‌భద్ర: ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో శనివారం సాయంత్రం ఓ రాతి క్వారీ కుప్పకూలింది. ఈ ఘటనలో శిథిలాల కింద దాదాపు డజనుమంది కార్మికులు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. బిల్లి మర్కుండి గ్రామం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన జరిగిన వెంటనే సహాయ బృందాలు అక్కడికి చేరుకుని శిథిలాల్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యాయి. క్వారీ కూలడానికి కారణాలపై దర్యాప్తుచేస్తున్నారు.

ఓట్లెక్కువ వచ్చినా సీట్లలో కోత!

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) ఓట్లపరంగా తొలి స్థానంలో నిలిచింది. 143 స్థానాల్లో పోటీ చేసి.. 25 స్థానాలనే గెలుచుకున్న ఆ పార్టీ అందరికంటే ఎక్కువగా 23 శాతం ఓట్లను సాధించింది. 101 స్థానాల్లో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందిన భాజపా 20.8 శాతం ఓట్లను సాధించింది. ఎన్నికల్లో ఆర్జేడీకి 1.15 కోట్ల ఓట్లు పడ్డాయి. భాజపాకు దాదాపు కోటి ఓట్లు పడ్డాయి. ఆర్జేడీకి 15 లక్షల ఓట్లు ఎక్కువగా వచ్చాయి. పోటీ చేసిన స్థానాలు ఎక్కువ కావడంతో సహజంగానే ఓట్ల శాతం పెరిగింది.



ప్రయత్నానికి పరిమితుల్లేవు

మనందరిలోనూ అపరిమితమైన శక్తి ఉంటుంది. దాన్ని తెలుసుకోవడంలోనే అంతా ఉంది. మనకేం కావాలో.. ఏం వద్దో మన శరీరమే చెబుతుంది. గ్రహించగలిగే శక్తి ఉంటే.. ఆ ప్రకారం నడుచుకుంటే అంతా సవ్యంగానే ఉంటుంది. ఎంత చెయ్యాలన్న దానికి పరిమితులు, కొలమానాలు లేవు. చెయ్యాలన్న చిత్తశుద్ధి, చేసి చూపాలన్న దృఢ దీక్ష మాత్రమే కావలసింది.

ఎర్రకోట.. ముమ్మర వేట

- ఊపందుకున్న దర్యాప్తు
- మరో ఇద్దరు అల్ ఫలా వైద్యుల అరెస్టు

దిల్లీ: ఉగ్రవాద భావజాలం ఉన్న అల్‌ఫలా విశ్వవిద్యాలయ వైద్యులు చేసిన పన్నాగంపై మరిన్ని ఆధారాలు బయటపడుతున్నాయి. సోమవారం ఎర్రకోట మెట్రోస్టేషన్‌కు చేరువగా ఉన్న సిగ్నల్‌వద్ద కారు పేలినప్పుడు అందులో వాడిన అమ్మోనియం నైట్రేట్ దాదాపు రెండు కిలోలు ఉంటుందని తేలింది. దిల్లీ, ఫరీదాబాద్ ఘటనలతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని తాజాగా అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు అల్ ఫలా విశ్వవిద్యాలయ వైద్యులే కావడం విశేషం. వారు హరియాణాలోని నూహ్‌కు చెందిన మొహమ్మద్, ముస్తకీం. కారుతో విధ్వంసాన్ని సృష్టించిన డాక్టర్ ఉమర్ నబీతో, మరో నిందితుడు డాక్టర్ ముజమ్మిల్ గనాయీతో వీరిద్దరికీ పరిచయాలు ఉన్నట్లు ప్రాథమికంగా తేలింది. పేలుడు జరిగినప్పుడు వీరిలో ఒకరు దిల్లీలోనే ఉన్నారు. విస్తృత కుట్రలో వీరి భాగస్వామ్యం ఎంత ఉందో తెలుసుకునేందుకు లోతుగా ప్రశ్నిస్తున్నారు. ముజమ్మిల్‌తో సంప్రదింపులు జరిపిన 15 మంది వైద్యులు ఆచూకీ లేరు. కాల్ డేటా ఆధారంగా వారితో మాట్లాడటానికి పోలీసులు ప్రయత్నిస్తే స్విచాఫ్ అని వస్తోంది.

కారు నుంచి ఎవరైనా దిగారా?

పేలుడుకు ముందు రామ్‌లీలా మైదాన్‌కు సమీపంలో ఉమర్ వెళ్లిన మసీదునూ అధికారులు సందర్శించారు. ఆరోజు వచ్చినవారి వివరాలు సమర్పించాలని నిర్వహణ కమిటీని కోరారు. ముఖ్యంగా ఆ కారు ఆగిన మూడు గంటల సమయంలో వచ్చిన ప్రతి వాహనం వివరాలు క్షుణ్నంగా తెలుసుకున్నారు. పేలుడు జరిగినప్పటి నుంచి అక్కడే ఉన్న వాహనాల వివరాలు తెలుసుకుని, అంతా సవ్యంగా ఉందంటే యజమానులకు అప్పగిస్తున్నారు. ఉమర్ నబీ వాడిన కారులో ఇంకెవరైనా ఉన్నారా, మధ్యలో ఎవరైనా వెళ్లారా అని ఆరా తీస్తున్నారు. పేలుడు పదార్థాలను అక్కడే కారులోకి తరలించారా అని తెలుసుకునేందుకు ఈ వివరాలు కీలకం కానున్నాయి. తన ఫోనుకు ఛార్జింగ్ పెట్టాల్సిందిగా ఉమర్ ఎవరినో కోరినట్లు ఫరీదాబాద్‌లో నిఘా కెమెరాలో నమోదైంది. ఉగ్రభావజాలం ఉన్న వైద్యులంతా అల్-ఫలా విశ్వవిద్యాలయానికి చెందినవారే కావడంతో ఆ సంస్థపై రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. యూజీసీ, నాక్ గుర్తించిన తీవ్రస్థాయి అవకతవకల నేపథ్యంలో నేర విభాగ పోలీసులు ఈ కేసులు పెట్టారు. ఓఖ్లాలోని వర్సిటీ కార్యాలయం నుంచి వివరాలు రాబట్టారు. ఫార్మకాలజీ విభాగానికి చెందిన సయీద్‌పై వేటు వేయడానికి రంగం సిద్ధమైంది. ఆమె సభ్యత్వంపై జీవితకాల నిషేధం విధించేందుకు భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) చర్యలు చేపట్టింది. విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయమున్న ఓఖ్లాకూ పోలీసులు వెళ్లి అనుమానితుల గురించి వివరాలు కోరారు. ఆ వర్సిటీ విద్యార్థులు ఇళ్లబాట పట్టారు.



ఎర్రకోట సమీపంలో భద్రతా సిబ్బంది తనిఖీలు

టీ దుకాణంలో కూర్చొన్నా ఏమీ కొనలేదు

ఇప్పటివరకు లభించిన పేలుడు పదార్థాల నమూనాలను ఫోరెన్సిక్ బృందం పరిశీలించింది. పేలుడు జరపడానికి ముందు దగ్గర్లోని ఓ మసీదు పార్కింగ్ ప్రాంతం వద్ద నబీ మూడు గంటలపాటు ఎందుకు వేచి ఉన్నాడనేదానిపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎర్రకోటకు ఉమర్ వస్తూ మధ్యలో వజీర్‌పుర్ పారిశ్రామిక ప్రాంతంలో టీ దుకాణం వద్ద ఆగినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కనిపించడంతో వాటిని చూపించి, ఆ దుకాణదారుడినీ పోలీసులు ప్రశ్నించారు. ముసుగులో ఉన్న వ్యక్తి ఆరోజు పావుగంటసేపు కూర్చొన్నా.. ఏమీ కొనలేదని దుకాణదారుడు గుర్తుచేసుకున్నారు.

గర్భధారణలో 'జెనెటిక్ స్విచ్'ది కీలక పాత్ర
ఐసీఎంఆర్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: గర్భధారణపై భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిర్వహించిన పరిశోధనలో ఓ కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. గర్భం దాల్చాలంటే తొలుత పిండం గర్భాశయ గోడకు అతుక్కోవాలి. ఈ ప్రక్రియలో జెనెటిక్ స్విచ్ కీలక పాత్ర పోషించనుందని నిర్ధారణైంది. ఈ పరిశోధనలో బనారస్ హిందూ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ (ఐసీఎంఆర్-ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్), ఇండియన్



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) కలిసి పనిచేశాయి. "హెచ్‌ఓఎక్స్‌ఏ 10, టీడబ్ల్యూఐఎస్‌టీ2 అనే రెండు జన్యువులను కనుగొన్నాం. ఇవి గర్భాశయ గోడ దగ్గర తలుపులా పనిచేస్తాయి. పిండం వచ్చేటప్పుడు హెచ్‌ఓఎక్స్‌ఏ 10 తాత్కాలికంగా ఆఫ్ అవుతుంది. టీడబ్ల్యూఐఎస్‌టీ2 చర్య ప్రారంభిస్తుంది. గర్భాశయ గోడ తలుపు తెరచుకుంటుంది. ఈ జన్యువులే గర్భధారణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి" అని పరిశోధనలో పాల్గొన్న డాక్టర్ దీపక్ మోదీ తెలిపారు. ఎలుకలు, కోతులు, మానవ కణాలపై జరిపిన అధ్యయనంలో ఈ రెండు జన్యువుల పనితీరును శాస్త్రవేత్తలు అర్థం చేసుకున్నారు. "సాధారణంగా గర్భాశయ గోడ తక్కువగా తెరుచుకుంటే పిండం కుదురుకోదు. ఎక్కువగా తెరుచుకున్నా.. గర్భం నిలువదు. ఇప్పుడు ఈ స్విచ్ఛాఫ్, స్విచ్ఛాన్ ద్వారా మహిళల్లో ఆరోగ్యకరమైన పిండాలున్నా.. వారిలో ఎందుకు పిండం కుదురుకోదో.. గర్భస్రావం ఎందుకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. హెచ్‌ఓఎక్స్‌ఏ10, టీడబ్ల్యూఐఎస్‌టీ2 మధ్య సమతుల్యతను సాధించడం ద్వారా గర్భస్రావాలను అరికట్టవచ్చు" అని డాక్టర్ గీతాంజలి సచ్‌దేవ తెలిపారు. ఈ అధ్యయనాన్ని అంతర్జాతీయ జర్నల్ 'సెల్ డెత్ డిస్కవరీ' ప్రచురించింది.

కాంగ్రెస్.. ముస్లిం లీగ్, మావోయిస్టు పార్టీ

- ప్రధాని మోదీ ధ్వజం

సూరత్/డేడియాపాడా: కుల రాజకీయాలు చేస్తూ విషం చిమ్మిన వ్యక్తులను బిహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ముస్లింలీగ్, మావోయిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎంఎంసీ)గా అభివర్ణించారు. ఒకప్పుడు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ లాంటి జాతీయ నేతల కింద పనిచేసిన వారు ప్రస్తుత కాంగ్రెస్ పరిస్థితిపై ఆవేదన చెందుతున్నారని అన్నారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం నేపథ్యంలో సూరత్‌లో మోదీని స్థానిక బిహారీలు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, ఎంఎంసీని ప్రజలు తిరస్కరించారని, గత పదేళ్లుగా ఆ పార్టీకి ఎదురవుతున్న పరాజయాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎందుకు ఓడిపోతున్నామన్న విషయాన్ని కాంగ్రెస్ తన కార్యకర్తలకు చెప్పుకోలేక. . ఈవీఎంలు, ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితాలను నిందిస్తోందని ఆక్షేపించారు. కుల రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తున్నారన్న విషయం బిహార్ ఎన్నికలతో నిరూపితమైందని అన్నారు.

గిరిజనులను గాలికొదిలేసింది

గుజరాత్ పర్యటనకు వచ్చిన మోదీ.. నర్మదా జిల్లాలో జరిగిన భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజనులు మహోన్నత పాత్ర పోషించారని, కానీ వారి సేవలను కాంగ్రెస్ గుర్తించలేదని ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాలనలో గిరిజనుల సమస్యలను ఆ పార్టీ గాలికి వదిలేసిందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గిరిజన యోధుల సేవలను కొనియాడుతూ.. అల్లూరి సీతారామరాజు పేరును మోదీ ప్రస్తావించారు. నర్మదా జిల్లాలోని దేవ్‌మోగ్రా గ్రామానికి చేరుకొని గిరిజనుల కుల దేవత పండోరి మాత ఆలయంలో పూజలు నిర్వహించారు.



బిర్సా ముండా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రధాని

ఆర్జేడీలో చిచ్చు!

- రాజకీయాల నుంచి వైదొలగిన లాలు కుమార్తె రోహిణి

పట్నా: బిహార్‌లో ఓటమితో ఆర్జేడీలో చిచ్చు రేగింది. తాను రాజకీయాల నుంచి వైదొలగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని ఆ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటించారు. 'నేను రాజకీయాలను వదిలేస్తున్నా. నా కుటుంబానికి దూరంగా జరుగుతున్నా. ఈ పని చేయాలని నాకు సంజయ్ యాదవ్, రమీజ్ సూచించారు. నిందలన్నీ నేనే భరిస్తా' అని శనివారం ఎక్స్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీగా ఉన్న సంజయ్ యాదవ్.. తేజస్వీకి సన్నిహితుడు. రమీజ్.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందినవారు. తేజస్వీకి చిరకాల మిత్రుడు. అయితే వారిద్దరూ రోహిణికి ఏం సూచించారనేది స్పష్టంగా తెలియడం లేదు. వారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి



రాలేదు. వైద్యురాలైన రోహిణి.. భర్తతో కలిసి సింగపూర్‌లో స్థిరపడ్డారు. తన తండ్రి లాలుకు కొన్నేళ్ల కిందట కిడ్నీ దానం చేసి వార్తల్లో నిలిచారు. గత లోక్‌సభ ఎన్నికల్లో శరణ్ నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు.

తేజ్ ప్రతాప్ బహిష్కరణతో అసంతృప్తి

లాలు పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్‌ను ఆర్జేడీ నుంచి బహిష్కరించడంపై రోహిణి అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె. తేజస్వికి మద్దతుగానే ప్రచారం చేశారు.

ఎన్నికల ప్రక్రియే ప్రశ్నార్థకం

- ఈసీది ఏకపక్షం
- త్వరలో ఆధారాలతో వస్తాం
- కాంగ్రెస్ స్పష్టీకరణ

దిల్లీ: బిహార్‌లో మొత్తం ఎన్నికల ప్రక్రియే ప్రశ్నార్థకంగా మారిందని, పారదర్శకత లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్ (ఈసీ) తీరువల్లే ఓడిపోయామని, ఫలితాలను విశ్లేషిస్తామని, రానున్న కొద్ది వారాల్లో కచ్చితమైన ఆధారాలతో ముందుకు వస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'బిహార్ ఎన్నికల ఫలితాలు మేమంతా నమ్మలేని విధంగా ఉన్నాయి. బిహార్‌లోని ప్రజలెవరూ ఈ ఫలితాలను నమ్మడం లేదు. మా భాగస్వాములూ ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అందరితో చర్చిస్తాం. ఎందుకంటే 90శాతం కంటే ఎక్కువ స్ట్రైక్‌రేట్ (ఎక్కువ స్థానాల్లో పోటీ చేసిన పార్టీలు) భారత రాజకీయ చరిత్రలో ఏ పార్టీకీ రాలేదు. అందుకే బిహార్ నుంచి డేటాను సేకరిస్తున్నాం. ఒకటి రెండు వారాల్లో కచ్చితమైన ఆధారాలతో వస్తాం' అని పేర్కొన్నారు. 'ఎన్నికల సంఘం పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరించింది. వారు ఏదైతే చేశారో.. అందులో పారదర్శకత లేదు. అందువల్లే మొత్తం ప్రక్రియ ప్రశ్నార్థకంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. హరియాణా ఎన్నికల నుంచీ ఇదే విషయం మాట్లాడుతున్నామని తెలిపారు.

దేశాన్ని అప్రతిష్ఠ పాల్జేసేవారికి శిక్ష

- సర్‌పై కాంగ్రెస్ ఆరోపణలు అర్థరహితం
- బిహార్ ఫలితాలపై భాజపా వ్యాఖ్యలు

దిల్లీ: దేశాన్ని అప్రతిష్ఠ పాల్జేసే విపక్షాలకు బిహార్ ఎన్నికలు సరైన శిక్ష విధించాయని భాజపా వ్యాఖ్యానించింది. సర్‌ను కారణంగా చూపుతున్న కాంగ్రెస్‌ను తీవ్రంగా తప్పుబట్టింది. బిహార్ ప్రజలు ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ ఇవ్వడంద్వారా తమకు జీవనోపాధి, అభివృద్ధి, శ్రేయస్సు ముఖ్యమని నిరూపించారని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ పేర్కొన్నారు. జంగిల్ రాజ్, మాఫియా, ముస్లిం రాజకీయాలు, నక్సలిజం తమకు వద్దని తేల్చి చెప్పారని వివరించారు. ఓట్ల చోరీతో భాజపా గెలిచిందన్న కాంగ్రెస్, ఇతర విపక్షాల వ్యాఖ్యలపై శనివారం ఆయన స్పందించారు. 'జాతి వ్యతిరేక విధానాలను, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటాన్ని, దేశాన్ని అవమానపరచడాన్ని, కులమతాల పరంగా సమాజంలో చీలికలు తేవడాన్ని ప్రజలు తిప్పికొట్టారు' అని చుగ్ వ్యాఖ్యానించారు.

సర్ తర్వాతా 3 లక్షల ఓట్లను చేర్చాం

- బిహార్‌పై ఈసీ స్పందన

దిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తర్వాత ప్రకటించిన తుది జాబితాకు అదనంగా 3 లక్షల ఓట్లను చేర్చామని ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. అక్టోబరు 6వ తేదీన ఇచ్చిన జాబితాలో 7.42 కోట్ల ఓట్లున్నాయని, అది సెప్టెంబరు 30వ తేదీ నాటికి ఇచ్చిన జాబితా అని, తర్వాత మరో 3 లక్షల ఓట్లు చేరాయని వెల్లడించింది. షెడ్యూల్ ప్రకటించిన సమయంలో 7.42 కోట్లుగా ఉన్న ఓట్లు.. ఆ తర్వాత 7.45 కోట్లకు చేరాయని కాంగ్రెస్ ఆరోపించిన నేపథ్యంలో శనివారం ఈసీ అధికారులు స్పందించారు. నామినేషన్ల చివరి తేదీ నాటికి 10 రోజుల ముందు వరకూ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవడానికి నిబంధనలు అనుమతిస్తాయని వారు తెలిపారు. అందువల్లే అక్టోబరు 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను స్వీకరించి అర్హులను ఓటర్ల జాబితాలో చేర్చామని వివరించారు. అవి 3 లక్షల వరకూ ఉన్నాయని వెల్లడించారు.

బిహార్ ఎన్నికలలో స్కాం: శివసేన (ఉద్ధవ్)

దిల్లీ: బిహార్ ఎన్నికలను ఓ స్కాంగా శివసేన (ఉద్ధవ్) అభివర్ణించింది. ఎన్నికల సంఘం దానికి ఏర్పాట్లు చేయగా.. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ఓట్ల చోరీ ద్వారా గెలిచిందని ఆరోపించింది. మహారాష్ట్రలో అనుసరించిన విధానాన్నే బిహార్‌లోనూ ఎన్డీయే అనుసరించిందని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో శివసేన (ఉద్ధవ్) విమర్శించింది. 'మళ్లీ ఓట్లు చోరీ అయ్యాయి. ఫలితంగానే బిహార్‌లో ఎన్డీయే గెలిచింది' అని వ్యాఖ్యానించింది.

■ బిహార్‌లో గెలిచినందుకు నీతీశ్‌కు శుభాకాంక్షలు చెబుతూనే.. ఎన్నికల సంఘం తీరుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శలు గుప్పించారు.



పట్నాలో బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌తో కేంద్రమంత్రి చిరాగ్ పాస్వాన్

కొత్త సర్కారులో చేరుతాం: చిరాగ్
సీఎం నీతీశ్ నివాసానికి వెళ్లి భేటీ

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ - రామ్ విలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వంలో చేరేందుకు తమ పార్టీ ఎదురుచూస్తోందని, బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ కొనసాగుతారన్నది తన 'వ్యక్తిగత' అభిప్రాయమన్నారు. సీఎంగా, డిప్యూటీ సీఎంగా ఎవరు ఉండాలన్నది శాసనసభ్యులు నిర్ణయిస్తారని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల్లో ఘనవిజయం అనంతరం శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిహార్‌కు సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన నీతీశ్‌తో తనకు సత్సంబంధాలు లేవని విపక్షాలు తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. తాజా ఫలితాల్లో ఎల్‌జేపీ (రాం విలాస్) 19 స్థానాల్లో విజయంతో సత్తా చాటగా, విజేతలను చిరాగ్ మీడియాకు పరిచయం చేశారు. నీతీశ్ నేతృత్వంలో ఎన్డీయే బిహార్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందున తామంతా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేసినట్లు తెలిపారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎన్డీయే భాగస్వామిగా పోటీ చేయకపోవడంతోనే ఆర్జేడీ లబ్ధి పొంది ఫలితాల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిందని చిరాగ్ అన్నారు.

ఓడినా ప్రజాసేవలోనే: ఆర్జేడీ

ఇంటర్నెట్ డెస్క్: ఎన్నికల్లో ఓడిపోయినా, ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా ప్రజాసేవ కొనసాగుతూనే ఉంటుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) స్పష్టం చేసింది. ఓటమితో విచారం, విజయంతో అహంకారం ఉండదని పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీ స్పందించింది. 'ప్రజా సేవ అనేది నిరంతర ప్రక్రియ. అది కొనసాగుతూనే ఉంటుంది. ఆర్జేడీ పేదల పార్టీ. వారి మధ్య ఉంటూ.. వారి గొంతుకను వినిపిస్తూనే ఉంటుంది' అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది.

ఓడింది ఒక్క మంత్రే

పట్నా: బిహార్ ఎన్నికల్లో పోటీ చేసిన 25 మంత్రుల్లో 24 మంది విజయం సాధించారు. ఒక మంత్రి మాత్రమే పరాజయం పాలయ్యారు. ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలు తారాపుర్, లఖిసరాయ్ నియోజకవర్గాల నుంచి గెలుపొందారు. శాసన మండలి సభ్యుడైన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పోటీ చేయలేదు. ఎన్నికల బరిలోకి దిగిన 15 మంది భాజపా మంత్రులూ గెలుపొందారు. వ్యవసాయశాఖ మంత్రి ప్రేమ్‌కుమార్ (భాజపా) వరుసగా ఎనిమిదోసారి గయ టౌన్ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఈ రికార్డును జేడీయూకు చెందిన మరో క్యాబినెట్ మంత్రి బిజేంద్ర యాదవ్.. సుపౌల్ స్థానం నుంచి నెగ్గి సమం చేశారు. మంత్రి సుమీత్ కుమార్ సింగ్‌కు మాత్రం అదృష్టం దక్కలేదు. జమునియా నుంచి పోటీ చేసిన ఆయన 13,000 ఓట్ల తేడాతో ఆర్జేడీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు.

మెజారిటీ 100 కంటే తక్కువే

బిహార్‌లో మూడు నియోజకవర్గాల్లో 100 కంటే తక్కువ ఓట్లతో అభ్యర్థులు నెగ్గారు. సందేశ్ స్థానం నుంచి జేడీయూకి చెందిన రాధాచరణ్ కేవలం 27 ఓట్లతో సమీప ప్రత్యర్థి దీపు సింగ్(ఆర్జేడీ)పై విజయం సాధించారు. అగియావ్ నియోజకవర్గం నుంచి శివ ప్రకాశ్ రంజన్ (సీపీఐ).. కేవలం 95 ఓట్లతో ఓడిపోయారు. ఆయనపై భాజపా అభ్యర్థి మహేశ్ పాస్వాన్ గెలుపొందారు. రామ్‌ఘర్ స్థానంలో బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి సతీశ్ కుమార్ సింగ్ యాదవ్ కేవలం 30 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆయన భాజపా అభ్యర్థి అశోక్ కుమార్ సింగ్‌ను ఓడించారు.



రెబల్స్‌పై భాజపా చర్యలు.. కేంద్ర మాజీమంత్రిపై వేటు

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపొందిన అనంతరం భాజపా తన దృష్టిని రాష్ట్రంలోని రెబల్స్‌పైకి మళ్లించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకుగానూ కేంద్ర మాజీ మంత్రి ఆర్కే సింగ్ సహా మరో ఇద్దరు నేతలను సస్పెండ్ చేసింది. పార్టీ నుంచి వారిని ఎందుకు బహిష్కరించకూడదో వారంలోపు వివరణ ఇవ్వాలంటూ ముగ్గురు నేతలకు భాజపా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నేతలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో భాజపాకు నష్టం వాటిల్లిందని.. పార్టీ దీనిని తీవ్రంగా పరిగణించిందని నోటీసులో పేర్కొంది. అందువల్లే ఆర్కే సింగ్‌తోపాటు శాసనమండలి సభ్యుడు అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది.

ఆధార్ కేవలం గుర్తింపు పత్రమే

- పౌరసత్వ నిర్ధారణకు, ఓటర్ల జాబితా కోసమో వినియోగించరాదు
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం

దిల్లీ: ఆధార్ కార్డును గుర్తింపు కోసమే వినియోగించాలని, పౌరసత్వ నిర్ధారణ కోసమో, బిహార్‌లో సవరించిన ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడానికో, తొలగించడానికో ఉపయోగించరాదని ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. 1950నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 23(4) సెక్షన్ ప్రకారం ఆధార్‌ను వ్యక్తిగత గుర్తింపునకు, ధ్రువీకరణకు మాత్రమే వినియోగించేలా ఉత్తర్వులు జారీచేయాలని న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు సెప్టెంబరు 8న సరిగ్గా ఇదే ఆదేశం జారీచేసిందని కేంద్ర ఎన్నికల కమిషన్ వివరించింది. ఆ ఆదేశాలను పాటించాలంటూ బిహార్ ప్రధాన ఎన్నికల అధికారికి సెప్టెంబరు 9న తాము సూచించామని తెలిపింది. ఆధార్ పౌరసత్వ ధ్రువీకరణకు కానీ, పుట్టిన తేదీ, చిరునామాల నిర్ధారణకు కానీ వాడరాదని 2023లోనే భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ స్పష్టం చేసిన సంగతినీ గుర్తుచేసింది.

పీజీ వైద్య సీట్ల ఖాళీలపై రేపు సుప్రీం విచారణ



దిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ప్రీ-క్లినికల్, పారా-క్లినికల్ విభాగాల్లోని ఒక్క పీజీ సీటు కూడా ఖాళీగా ఉండకుండా ఓ వ్యవస్థను రూపొందించేలా జాతీయ వైద్య కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. దీంతోపాటు గత ఐదేళ్లలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను వెల్లడించాల్సిందిగా కమిషన్‌ను ఆదేశించాలనీ పిటిషనర్లు సుప్రీంను కోరారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన ధర్మాసనం దీన్ని విచారించనుంది.

మెదడువాపు కలకలం... శబరిమల భక్తులకు అడ్వైజరీ

పథనంతిట్టా: కేరళలో మెదడువాపు వ్యాధి విజృంభిస్తుండటంతో శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు రాష్ట్ర ఆరోగ్యశాఖ అడ్వైజరీని జారీ చేసింది. వైద్య చికిత్స తీసుకుంటున్న యాత్రికులు మందులను నిలిపివేయకుండా యథావిధిగా కొనసాగించాలని సూచించింది. నదుల్లో స్నానాలు ఆచరించేటప్పుడు నీరు లోపలికి వెళ్లకుండా ముక్కు మూసుకోవాలని తెలిపింది. అలసట, ఛాతీ నొప్పి సమస్యలతో బాధపడుతున్నవారు నెమ్మదిగా, విరామాలు తీసుకుంటూ కొండను ఎక్కాలని, గోరువెచ్చని నీటిని మాత్రమే తాగాలని, తినే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, కడిగిన పళ్లనే తినాలని అడ్వైజరీలో తెలిపారు. మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. అత్యవసర సేవలకోసం 04735203232ను సంప్రదించాలని ఆరోగ్యశాఖ సూచించింది.

బీబీసీపై రూ.44వేల కోట్లకు దావా వేస్తా
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

లండన్: అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా తాను చేసిన ప్రసంగాన్ని మార్చినందుకు గాను బీబీసీ సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. "వచ్చే వారంలో బీబీసీపై 100 కోట్ల డాలర్ల నుంచి 500 కోట్ల డాలర్ల (రూ.8,870 కోట్ల నుంచి రూ.44,344 కోట్ల) వరకు దావా వేస్తా. నా నోటి నుంచి రాని మాటలను వారు తప్పుగా ప్రసారం చేసి మోసం చేశారు. అది ఎడిటింగ్ లోపమంటూ క్షమాపణలు అడిగారు. కానీ జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడానికి నిరాకరించారు. అందుకే వారిపై దావా వేయాలని ఆలోచిస్తున్నా. త్వరలోనే బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మాట్లాడతా" అని విలేకరులకు ట్రంప్ తెలిపారు. అంతకుముందు ఆ సంస్థపై 100 కోట్ల డాలర్ల దావా వేస్తానని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆ ప్రసంగాన్ని మార్చినందుకు తాను, బీబీసీ సంస్థ చింతిస్తున్నట్లు ఛైర్మన్ సమీర్ షా... శ్వేత సౌధానికి వ్యక్తిగత లేఖ పంపారు. ట్రంప్ డిమాండ్ చేసిన బిలియన్ డాలర్ల పరిహారాన్ని చెల్లించేందుకు నిరాకరిస్తున్నామని బీబీసీ ఓ కథనంలో పేర్కొంది.



ఏపీ నుంచి కచ్చితంగా నేర్చుకోవాలి



నేను ఇక్కడ ఓ కొత్త విషయం నేర్చుకుని, దానిని నెదర్లాండ్స్ తీసుకెళుతున్నాను. ఈ ముఖ్యమంత్రి.. విజన్‌ను నిజం చేసి చూపిస్తున్నారు. ఇలా మళ్లీ మళ్లీ చేస్తారు కూడా. ఇంత తెలిసినప్పటికీ ఇంకా వినడానికి సిద్ధమయ్యే ఇక్కడి నాయకత్వం చెప్పడం స్ఫూర్తిదాయకం. ప్రేరణనిచ్చే నాయకత్వం ఎలా ఉండాలో ఏపీని చూసి మా రాజకీయ నాయకులు నేర్చుకోవాలి. రాజకీయ నాయకత్వమే కాదు, వ్యాపార విషయాల గురించి తెలుసుకోవాలి.

– ఎడిత్ నోర్మన్, నెదర్లాండ్స్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ

అవకాశాలు, సామర్థ్యం గురించి మాట్లాడుకుంటారు



సదస్సును అత్యుత్తమంగా నిర్వహించినందుకు అభినందనలు. నాణ్యత, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు దిశానిర్దేశం చేసేలా కార్యక్రమమిది. ఇక్కడ ప్రతిపాదించిన పరిష్కారాలు, చర్చించిన అంశాలు, ఆసియా దేశాల మధ్య నిర్మిస్తున్న బలమైన భాగస్వామ్యాలు ఎంతో నచ్చాయి. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 మంది వాణిజ్య మంత్రులు ఇక్కడి జ్ఞాపకాలతోపాటు అవకాశాలు, సామర్థ్యం గురించి మాట్లాడుకుంటారు. ఈ సదస్సుతో నేను ఆరోసారి భారత్‌ను సందర్శించినట్లైంది. మరోసారి తప్పకుండా వస్తాను.

– టాడ్ మెక్‌క్లే, న్యూజిలాండ్ వాణిజ్య మంత్రి


అపార ఆర్థిక సామర్థ్యం ఉంది



మూడు వారాల క్రితం లోకేశ్ ఆస్ట్రేలియా వచ్చినప్పుడు ఆయనను సిడ్నీ హార్బర్‌కు తీసుకెళ్లాను. తను చాలా సంతోషించారు. కానీ ఇప్పుడు నేను ఏపీలో తీరప్రాంతం చూసి ఆశ్చర్యపోయాను. అందమైన తీరమే కాదు, ఆర్థిక సామర్థ్యమూ అదే స్థాయిలో రాష్ట్రంలో ఉంది. ఈ సమిట్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని తపిస్తున్న తీరు నిజంగా అభినందనీయం. సీఎం చంద్రబాబు, ప్రభుత్వానికి ఆస్ట్రేలియా తరఫున ధన్యవాదాలు. ఇండియా-ఆస్ట్రేలియా ప్రభుత్వాల ప్రస్తుత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండోదశపై చర్చలు సాగిస్తున్నాం.

– జోడి మెకే, ఆస్ట్రేలియా-ఇండియా సీఈవో ఫోరం డైరెక్టర్

రాష్ట్రానికి రేమండ్..



- రాయలసీమ కేంద్రంగా రూ. 1,200 కోట్ల పెట్టుబడులు
- మూడు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం



రేమండ్ గ్రూప్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి టీ.జీ.భరత్, రేమండ్ సంస్థ ప్రతినిధులు గౌతం మైనీ, జతిన్ ఖన్నా తదితరులు

ఈనాడు, విశాఖపట్నం: రేమండ్ గ్రూపు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. రూ.1,200 కోట్ల పెట్టుబడులతో మూడు యూనిట్లను ఏర్పాటు చేయనుంది. సీఐఐ సదస్సు ప్రాంగణం నుంచి శనివారం ఉదయం రేమండ్ గ్రూపు రాష్ట్రంలో తలపెట్టిన మూడు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని మరో మూణ్నాలుగేళ్లలో చేరుకుంటాం. రాప్తాడులో రూ.497 కోట్ల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అపరెల్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్కు, అనంతపురం జిల్లా గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నారు. సత్యసాయి జిల్లా టేకులోడు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మూడు పరిశ్రమల ద్వారా 6,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయి' అని వివరించారు. "రాయలసీమలో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశాం. కియా మోటార్స్ ఇప్పటికే ఉంది. ఏరోస్పేస్, డిఫెన్సు కారిడార్లు వస్తున్నాయి. విమానాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా వాటి ఉత్పత్తి మరింతగా పెరగాలి. రేమండ్ గ్రూపు ఏరోస్పేస్, రక్షణ అవసరాలను తీర్చేలా పరికరాలు తయారు చేయడం అభినందనీయం" అని సీఎం పేర్కొన్నారు. 2027 నాటికి ఈ మూడు ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభిస్తాయని రేమండ్ గ్రూపు ఎండీ గౌతం మైనీ సీఎంకు హామీ ఇచ్చారు.

2028 నాటికి బెస్ట్ ప్రాజెక్టుగా శ్రీసిటీ

- వర్చువల్‌గా ఐదు యూనిట్లను ప్రారంభించిన సీఎం
- రూ.2,320 కోట్లతో 12 కొత్త ప్రాజెక్టులకు ఒప్పందాలు

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: "శ్రీసిటీని త్వరలో విస్తరిస్తాం. 50 దేశాలకుపైగా కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. త్వరలో 1.50 లక్షల మందికి ఉద్యోగాలతో శ్రీసిటీ అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఏపీ ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు భారీ ప్రణాళికలు చేశాం. 2028 నాటికి శ్రీసిటీని ఓ ఉత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన వర్చువల్‌గా శ్రీసిటీలోని ఐదు యూనిట్లను ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడ కొత్తగా ఏర్పాటు చేయబోయే 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. రూ.2,320 కోట్లతో ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తుల ప్రాజెక్టులకు సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందాలు జరిగాయి. ఈ పెట్టుబడుల ద్వారా 12,365 మందికి ఉపాధి లభించనుంది.

అత్యుత్తమ పారిశ్రామిక టౌన్ షిప్

"దేశంలో శ్రీసిటీ అత్యుత్తమ పారిశ్రామిక టౌన్‌షిప్‌గా ముద్ర వేసుకుంది. వివిధ దేశాలకు చెందిన పరిశ్రమలు శ్రీసిటీ పారిశ్రామిక టౌన్ షిప్‌నకు రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు చెందిన హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్, వైద్య పరికరాలు తదితర కంపెనీలకు రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చాం" అని చంద్రబాబు తెలిపారు. శ్రీసిటీ సమీపంలో ఎయిర్ స్ట్రిప్‌ను సైతం త్వరలో నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఈ తరహా మోడల్స్ మరిన్ని రావాలన్నారు.



సీఐఐ సదస్సులో భాగంగా నిర్వహించిన సమావేశానికి హాజరైన పారిశ్రామికవేత్తలు

160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తే లక్ష్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ కేంద్రం ఏర్పాటుకు ఎంఓయూ

ఈనాడు-విశాఖపట్నం, వన్‌టౌన్-న్యూస్‌టుడే: 'ప్రపంచమంతా గ్రీన్ ఎనర్జీ వినియోగంపై ఆలోచిస్తోంది. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అతి తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి సాధించి సరఫరా చేయాలనేది ప్రభుత్వ ఆలోచన' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శనివారం సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ కేంద్రం ఏర్పాటుకు సీఎం సమక్షంలో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను కూడా తయారు చేసుకోవాలని సూచించారు. ఏఐ లాంటి సాంకేతికతల వినియోగం ద్వారా విద్యుత్ పంపిణీ నష్టాలు, సరఫరా వ్యయం తగ్గించాలన్నారు. అప్పుడే ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యమన్నారు. ఎక్కడికక్కడ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా విధానాలను కూడా తయారు చేసుకుంటున్నామన్నారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఏపీలో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టును వేగంగా చేపట్టామన్నారు.

విద్యుత్ సవాల్‌ను ఎదుర్కొంటాం

'6 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ విశాఖకు రావాలని ప్లాన్ చేస్తే, అది ఇప్పటికే సాకారమైంది. డేటా సెంటర్లు వినియోగించే విద్యుత్‌ను తయారు చేయడం ఓ సవాల్. తక్కువ వ్యయంతో విద్యుత్తును తయారు చేయడం కీలకం. అధిక ధరలకు విద్యుత్‌ను ఉత్పత్తి చేసి డేటా సెంటర్లకు సరఫరా చేస్తే వ్యయం ఎక్కువ అవుతుంది. అందుకే ఆధునిక టెక్నాలజీపై ఆలోచనలు చేసి సీఎం వాటిని నిజం చేస్తున్నారు' అని మంత్రి లోకేశ్ అన్నారు. సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియన్స్ సెంటర్ అనేది విద్యుత్తు వ్యవస్థల రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఆలోచన చేస్తే తక్షణమే అమలు చేయాలని సీఎం ఆదేశించారని, వాటిని సాకారం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఎండీ జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ ఏపీలో ఇంధన భద్రత, సైబర్ భద్రత అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమన్నారు.



సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధులు. చిత్రంలో మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్


ఐదేళ్ల తర్వాత ఇక్కడో అద్భుతం



బిల్ క్లింటన్‌తో పాటు నేను తొలిసారి హైదరాబాద్ వచ్చా. అప్పట్లో చంద్రబాబు సైబర్ టవర్స్ గురించి ప్రస్తావించారు. ఐదేళ్ల తర్వాత అక్కడికి వెళ్లినప్పుడు ఆ దార్శనికత రూపుదాల్చడం చూశాను. ఇప్పుడు విశాఖను చూస్తే.. ఐదేళ్ల తర్వాత ఈ ప్రాంతం కూడా ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టంగా అనిపిస్తోంది.

– రిచర్డ్ రోసో, అమెరికా

ఇది ఓ అసాధారణ కార్యక్రమం



ఈ సదస్సు ఓ అసాధారణ కార్యక్రమం. హ్యాట్సాఫ్ చెప్పాలి. రాష్ట్రంలో వ్యాపారాన్ని ప్రోత్సహించడం, అభివృద్ధిని నడిపించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులను ఒకచోటకు చేర్చడం ప్రశంసనీయం.

– డాక్టర్ రోడ్నీ రివెరా, జర్మనీ, క్లస్టర్ కోఆర్డినేటర్

ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం..

- కీలక రంగాల్లో సహకారం అందించండి
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ ఎండీ జెరెమీ జుర్గెన్స్‌తో మంత్రి లోకేశ్ భేటీ

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: ఏపీని ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సీఐఐ సదస్సులో శనివారం వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. 'పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.10.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. దేశ గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యంలో 30% ఏపీలోనే సాధించాలన్నది మా లక్ష్యం. మీ వంతు సహకారం అందించాలి' అని కోరారు.

"సైబర్ సెక్యూరిటీ జాతీయ భద్రతలో కీలకం. ప్రపంచవ్యాప్తంగా 2033 నాటికి సైబర్ దాడులు సుమారు లక్ష కోట్ల డాలర్ల నష్టం కలిగించొచ్చని అంచనా. ఇది చాలా ఆందోళనకరమైన విషయం. ఐటీ హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 లక్షల మంది సైబర్ నిపుణుల లోటును తీర్చే అవకాశం మాకు ఉంది. చమురు, సహజవాయువు, విద్యుత్తు లాంటి కీలక రంగాల్లో సైబర్ సెక్యూరిటీ నమూనాలను అమలు చేయడంలో సహకారాన్ని అందించండి" అని కోరారు.

పారిశ్రామిక విప్లవం-4.0లో ఏపీ ప్రధాన పాత్ర

"ప్రపంచ ఆర్థిక వేదిక అభివృద్ధి చేసిన 'స్ట్రాటెజిక్ సైబర్ సెక్యూరిటీ టాలెంట్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రయోగాత్మకంగా అమలుచేసి, సైబర్ సెక్యూరిటీ టాలెంట్ పూల్‌ను ప్రోత్సహించండి. పారిశ్రామిక విప్లవం-4.0లో ఏపీ కీలకపాత్ర పోషిస్తోంది. ఆర్థికంగానే కాకుండా మేధోపరంగా, కార్యరూపకంగానూ ఈ ప్రయాణంలో భాగస్వాములుగా మాతో చేరండి' అని అన్నారు. జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ.. "అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో క్లీన్ ఎనర్జీ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు మొబిలైజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ క్లీన్ ఎనర్జీ ఇన్ ఎమర్జింగ్ ఎకానమీస్ (ఎంఐసీఈఈ) కార్యక్రమం పెట్టుబడులను ఆవిష్కరించి, ఆర్థిక నమూనాలను అభివృద్ధి చేయడంలో మా సెంటర్ తోడ్పాటునందిస్తుంది. సైబర్ సెక్యూరిటీపై మా సెంటర్ ప్రత్యేకంగా దృష్టిసారిస్తుంది" అని పేర్కొన్నారు.

పర్యావరణ హితం.. సాంకేతికత సౌరభం!

ఈనాడు, విశాఖపట్నం: భాగస్వామ్య సదస్సులో పర్యావరణ హితానికి పెద్దపీట వేశారు. ఎక్కడా ప్లాస్టిక్ కనిపించలేదు. తాగునీటి సీసా నుంచి సంతకం చేసే పెన్ను వరకు అన్నీ పర్యావరణ హిత వస్తువులే. సమావేశాలు, చర్చాగోష్ఠుల్లో పాల్గొనే పారిశ్రామికవేత్తలు, నిపుణులు.. మట్టి, గాజు సీసాలనే వినియోగించారు. ప్యానలిస్టులకు కానుకలను కాగితపు సంచుల్లో పెట్టి అందించారు. అతిథులు, సందర్శకులకు టీ, కాఫీలతో పాటు తాగునీటిని పేపర్ గ్లాసుల్లో ఇచ్చారు. భోజనాల సమయంలో పింగాణీ ప్లేట్లు, కాగితపు కప్పులను వాడారు. సదస్సుకు వచ్చేవారికి కొత్త ప్రపంచంలో అడుగుపెట్టిన అనుభూతి కలిగేలా సాంకేతిక సొబగులను అద్దారు. సమావేశ మందిరాల్లోకి ప్రవేశించేవారికి ఏఐ ఆధారిత ముఖగుర్తింపు విధానం అమలుచేశారు. ఏపీ పెవిలియన్‌లో చిట్టి రోబోల పలకరింపులు, వర్చువల్ రియాలిటీ ప్రయాణం సందర్శకులకు సరికొత్త సాంకేతికతను పరిచయం చేశాయి.



కాగితపు పెన్నులు



మట్టి సీసాలు

ఒకసారి నేర్చుకొని జీవితాంతం పని చేయలేరు

- నిత్య అభ్యాసకులుగా మారాలి
- 'ఏఐ- ఉద్యోగాల భవిష్యత్తు'పై సదస్సులో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఒకసారి నేర్చుకొని జీవితాంతం పనిచేసే కాలం పోయిందని, నిత్య అభ్యాసకులుగా మారాల్సిన పరిస్థితులు వచ్చాయని మంత్రి లోకేశ్ అన్నారు. సదస్సులో శనివారం 'కృత్రిమ మేధ- ఉద్యోగాల భవిష్యత్తు- సవాళ్లను అవకాశంగా మార్చుకోవడం'పై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'మార్పును అడ్డుకోవడం కాదు.. దాని రూపకల్పనలో మనమంతా భాగస్వాములం కావాలి. కొత్త సాంకేతికతకు భయపడకుండా దాన్ని మరింత సౌలభ్యంగా మార్చుకుందాం. రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ ద్వారా రేపటి ఉద్యోగాలకు అనువైన ఎకోసిస్టమ్‌ను మనం నిర్మించాలి. ఏపీలో భవిష్యత్తు నైపుణ్య ప్రాజెక్టు ఇప్పటికే ప్రారంభమైంది. ఏఐ ఎథిక్స్, రోబోటిక్ ప్రాసెస్, ఆటోమేషన్‌పై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఏఐ శిక్షణ, నైతిక పర్యవేక్షణ, మానవ వనరుల సహకారంతో 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని అంచనా. భవిష్యత్తు సాంకేతికతలతో ఉద్యోగాలు పొందడమే కాకుండా వాటిలో అసాధారణ ప్రతిభ చూపేలా యువతను తయారు చేయాలి' అని సూచించారు.

భవిష్యత్తు మన చేతుల్లోనే..

'పారిశ్రామిక విప్లవం వచ్చిన ప్రతిసారీ ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఏఐ ఇప్పుడు పరిశ్రమల పనితీరును సమూలంగా మార్చేస్తోంది. ఉత్పాదకతను పునర్నిర్వచిస్తోంది. పని నియమాలను నిర్ణయిస్తోంది. అడ్డంకులు, అసమానతలు లేకుండా ఏఐ ద్వారా మరింత డైనమిక్‌గా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం మన చేతిలో ఉంది. ఇందుకోసం ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించుకోవాలి. పునర్నైపుణ్యం, పునరాలోచనపై దృష్టి పెట్టాలి. దేశ జనాభాలో 65% మంది 35 ఏళ్ల లోపు వారే. వీరికి ఆధునిక సాంకేతికత అందించడం ద్వారా భవిష్యత్తు వ్యవస్థకు పెట్టుబడిగా మలుచుకోవచ్చు. నేతలు, పాలసీ తయారీదారులు, టీచర్లు, పౌరులు దీనిపై దృష్టిపెట్టాలి. ఏఐ ఇక భవిష్యత్తు సాంకేతికత కాదు. అది ఇప్పుడు ఇక్కడే ఉంది. అందుకే ఏఐని భవిష్యత్తుకు అడ్డంకిలా కాకుండా ఒక వంతెనలా చూడాలి' అని లోకేశ్ పేర్కొన్నారు. 'ఈజ్ ఇండియా రెడీ ఫర్ అథెంటిక్ ఏఐ' నివేదికను ఆయన విడుదల చేశారు.



సీఐఐతో ఎంఓయూ చేసుకున్న భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల. చిత్రంలో రాజీవ్ మేమాని, లోకేశ్, చంద్రజిత్ బెనర్జీ

భారత్ బయోటెక్ తరఫున 30 వేల మందికి నైపుణ్య శిక్షణ

భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎండీ, సీఐఐ వైస్ ఛైర్మన్ సుచిత్ర ఎల్లతో.. సీఐఐ ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే ఐదేళ్లలో విజయవాడలో 30 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, కెరీర్ కౌన్సెలింగ్, ఉద్యోగాల కల్పన ఒప్పందం లక్ష్యం. ఈ సందర్భంగా సుచిత్ర ఎల్ల మాట్లాడుతూ.. 'ఈ ఒప్పందం చిన్న అడుగు మాత్రమే. రాబోయే కొన్నేళ్లలో దీన్ని మరింత విస్తరిస్తాం. ఉపాధి సృష్టి కోసం ముందుకెళ్తాం. మా అభ్యర్థనను ఆమోదించినందుకు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

క్వాంటమ్ కంపెనీలకు వెంటనే అనుమతులు

- పాలసీ ఖరారు చేసిన ప్రభుత్వం
- ప్రకటించిన రోజే 23 ఎంవోయూలు

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను విశాఖ భాగస్వామ్య సదస్సులో ఐటీ కంపెనీల ప్రతినిధులకు వివరించింది. పాలసీ నిబంధనలు ఐదేళ్ల (2025-30) అమల్లో ఉంటాయని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలకు సోమవారం నుంచే అనుమతులు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రోత్సాహకాలపై స్పష్టత ఇచ్చింది. పాలసీని ప్రకటించిన మొదటి రోజే పెట్టుబడులు పెట్టేందుకు 23 సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేసేందుకు వీలుగా కంపెనీల చట్టం కింద అమరావతి క్వాంటమ్ కంపెనీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఏపీలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఏపీఈడీబీతో అనంత్‌రాజ్ ఒప్పందం

రెండు దశల్లో రూ.4,500 కోట్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ

రాష్ట్రంలో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు అనంత్‌రాజ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అనంత్‌రాజ్ క్లౌడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి(ఏపీఈడీబీ)తో ఒప్పందం చేసుకుంది. ఆధునిక డేటా సెంటర్ మౌలిక వసతులు, క్లౌడ్ సేవలకు రెండు దశల్లో రూ.4,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 8,500, పరోక్షంగా 7,500 ఉద్యోగాలు లభిస్తాయి. ప్రస్తుతం అనంత్‌రాజ్ కంపెనీ మానెసర్, పంచకులలోని తన క్యాంపస్‌లలో 20 మెగావాట్ల ఐటీ లోడ్‌ను నిర్వహిస్తోంది. మానెసర్, రాయ్, పంచకులల్లో మొత్తం సామర్థ్యాన్ని 307 మెగావాట్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సెమీకండక్టర్స్, చిప్ డిజైనింగ్ యూనిట్ పెట్టండి



ఏపీలో సెమీ కండక్టర్స్, చిప్ డిజైనింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని సిలికాన్ జెన్ సంస్థ ఛైర్మన్ చీదా చిదంబరాన్ని మంత్రి నారా లోకేశ్ కోరారు. సీఐఐ సదస్సులో వ్యాపారవేత్త చిదంబరంతో మంత్రి భేటీ అయ్యారు. 'ఏపీలో కో-లొకేటెడ్ ఓశాట్‌తో సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి. ఏపీ ఐటీ, సెమీ కండక్టర్స్ పాలసీ ద్వారా దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు ఇస్తున్నాం' అని లోకేశ్ తెలిపారు. ఈ అభ్యర్థనకు చిదంబరం స్పందిస్తూ, 'సమీకృత సిస్టమ్-ఇన్-ప్యాకేజ్ (ఎస్ఐపీ) సొల్యూషన్స్ కోసం అధునాతన త్రీడీ వేఫర్ స్టాకింగ్‌పై మేం దృష్టి సారించాం. ఏఐ జీపీయూలు, సీపీయూలు, హై-బ్యాండ్‌విడ్త్ మెమరీ, పవర్ మేనేజ్‌మెంట్ ఐసీలు తయారీపై మాకు ఆసక్తి ఉంది. ఏపీ ప్రతిపాదనలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

అమరావతిలో నారాయణ హృదయాలయ

వైద్య సేవల రంగంలో ప్రఖ్యాతిగాంచిన నారాయణ హృదయాలయ గ్రూపు రాజధాని అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయనుంది. విశాఖలో పెట్టుబడిదారుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆ సంస్థ వైస్ ఛైర్మన్ వీరేన్ షెట్టి 'ఈనాడు' ముఖాముఖిలో ఈ విషయం వెల్లడించారు. 500 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సాధారణంగా రూ.వెయ్యి కోట్లు ఖర్చవుతుందని, అమరావతిలో ఎంత పెట్టుబడి పెడతామన్న విషయంలో త్వరలో పూర్తి స్పష్టత వస్తుందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలం అవసరమవుతుందన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసే ఆసుపత్రిలో హృద్రోగ, క్యాన్సర్, ఆర్థోపెడిక్, జీర్ణకోశ వ్యాధులకు అత్యాధునిక చికిత్స, రోబోటిక్ సర్జరీ సదుపాయాలు వంటివి ఏర్పాటు చేస్తామని తెలిపారు. 'అమరావతిలో ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని సంప్రదించింది. అమరావతి కొత్తగా నిర్మిస్తున్న నగరం. అక్కడ చాలా అవకాశాలు ఉండడంతో ఏర్పాటుకు ముందుకు వచ్చాం' అని తెలిపారు.

పునరుత్పాదక ఇంధన విడిభాగాల యూనిట్‌ను ఏర్పాటు చేయండి

సౌర విద్యుత్ ప్యానళ్లు, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థల కోసం ఏపీలో పునరుత్పాదక ఇంధన మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మను మంత్రి నారా లోకేశ్ కోరారు. భాగస్వామ్య సదస్సులో జెలెస్ట్రా పవర్ సీఈఓతో మంత్రి భేటీ అయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ.. విడిభాగాల ఎగుమతికి సౌలభ్యంగా ఉండేలా నౌకాశ్రయ సమీపంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

రూ.5వేల కోట్లతో షిప్ బిల్డింగ్, మరమ్మతుల కాంప్లెక్స్



రాష్ట్రంలో రూ.5 వేల కోట్లతో సమీకృత షిప్ బిల్డింగ్, మరమ్మతుల కాంప్లెక్స్ ఏర్పాటుకు ఆసక్తి చూపిన గోవాషిప్ యార్డ్స్ సంస్థను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం సరైన నిర్ణయమన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆ సంస్థ ప్రాజెక్టు అధిపతి ఆదికేశ్ వాసుదేవన్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఆదికేశ్ మాట్లాడుతూ 'మేం నిర్మించబోయే షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ద్వారా 20 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ప్రధానంగా భారత నౌకాదళం, తీర రక్షక దళానికి సేవలందిస్తున్నాం. అధునాతన సాంకేతికతతో కూడిన యుద్ధనౌకలు తయారు చేస్తున్నాం. వాణిజ్య నౌకలకు లైఫ్ సైకిల్ సపోర్టు, పునర్నిర్మాణం, అప్‌గ్రేడ్, మరమ్మతులు నిర్వహిస్తున్నాం' అని వివరించారు.

అమరావతిలో 12 ఎకరాల్లో ఫుట్‌బాల్ స్టేడియం

ఏఐఎఫ్ఎఫ్ ఛైర్మన్ కళ్యాణ్ చౌబే

అమరావతిలో 12 ఎకరాల్లో ఫుట్‌బాల్ స్టేడియం ఏర్పాటు చేయనున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఛైర్మన్ కళ్యాణ్ చౌబే తెలిపారు. సీఐఐ సదస్సులో మంత్రి లోకేశ్‌ను ఆయన కలిశారు. క్షేత్రస్థాయిలో ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేందుకు పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు ఏఐఎఫ్ఎఫ్ భాగస్వామ్యం వహిస్తుందని వెల్లడించారు. ఫుట్‌బాల్ శిక్షకుల సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తామని చౌబే పేర్కొన్నారు. ఏపీలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని లోకేశ్ చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటీవల డీఎస్సీలో 3శాతం క్రీడా కోటా అమలు చేశామని వెల్లడించారు.

కళ్ల ముందు కదిలే పర్యాటక ప్రదేశాలు



వర్చువల్ రియాలిటీని తిలకిస్తున్న సందర్శకులు


ఈనాడు, విశాఖపట్నం: ఏపీలోని పర్యాటక ప్రదేశాలన్నింటినీ 2-3 నిమిషాల వ్యవధిలోనే చుట్టేసిన అనుభూతి కలిగేలా ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ డెస్టినేషన్ అందరినీ ఆకట్టుకుంది. భాగస్వామ్య సదస్సులోని ఏపీ పెవిలియన్ హాల్‌లో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన వీఆర్‌డీ ద్వారా గండికోట, బెలూం గుహలు, బొర్రా గుహలు, అరకు, లంబసింగి, సబ్‌మెరైన్, టీయూ-142, భీమిలి, ఆర్కే బీచ్‌లు, రాక్‌గార్డెన్స్, లేపాక్షి, అన్నవరం, అనంతగిరి, హార్స్లీ హిల్స్ వంటి ప్రదేశాలను చాలామంది తిలకించారు. విశాఖ విమానాశ్రయం, విజయవాడ పర్యాటక శాఖ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. టచ్ స్క్రీన్ ఇంట్రాయాక్టివ్ కియోస్కోలు సైతం పర్యాటక ప్రదేశాల సమాచారం తెలియజేసేలా అందుబాటులో ఉంచామన్నారు.

రాష్ట్రానికి పాదరక్షల తయారీ సంస్థ ఫాసంగ్

తమిళనాడు బదులు ఏపీ వైపు మొగ్గు

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: గ్లోబల్ బ్రాండ్ అడిడాస్‌కు ఉత్పత్తులు సరఫరా చేసే దక్షిణ కొరియాకు చెందిన ఫాసంగ్ బూట్ల తయారీ సంస్థ ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకుంది. విశాఖ భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వంతో ఈ మేరకు ఎంవోయూ కుదుర్చుకుంది. తొలుత తమిళనాడులో రూ.1,720 కోట్ల పెట్టుబడితో తోలు రహిత బూట్లు తయారీ చేసే యూనిట్ ఏర్పాటుకు గత ఆగస్టులో అక్కడి ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. దీని ద్వారా 20 వేల మందికి ఉపాధి కల్పించేందుకు ప్రతిపాదించింది. అయితే, మారిన పరిణామాల నేపథ్యంలో అక్కడ పెట్టుబడులు పెట్టాలన్న ప్రతిపాదన ఉపసంహరించుకుంది. ప్రత్యామ్నాయంగా ఏపీలో పెట్టుబడులు పెట్టాలని సంస్థ నిర్ణయించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సంప్రదింపులు జరిపారు.

"ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారికి శిక్షణ ఇవ్వడం, అభివృద్ధి పథంలో నడిచేలా చేయడమే ధ్యేయం'. - లోకేశ్



ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని విడుదల చేస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు

నాడు జీనోమ్.. నేడు క్వాంటమ్!

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రతినిధి

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ముందుకు నడిపించే సామర్థ్యం ఏపీకి ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. భారత కలను సాకారం చేసేలా క్వాంటమ్ మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్‌మ్యాప్‌ను ఆంధ్రప్రదేశే తొలుత రూపొందించిందని చెప్పారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ద్వారా క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు, యూజ్ కేసులు, పరిశోధనలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయడం. దీనికి అవసరమైన హార్డ్‌వేర్ తయారీలను కీలకంగా తీసుకున్నామని వివరించారు. భాగస్వామ్య సదస్సులో 'ఆత్మనిర్భర్ క్వాంటమ్- బిల్డింగ్ ఇండియాస్ ఇండిజీనస్ క్వాంటమ్ స్టాక్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన ప్లీనరీలో లోకేశ్ మాట్లాడారు. క్వాంటమ్ గురించి ఇప్పటికీ నేర్చుకుంటున్నానన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ (2025-30)ని ఆవిష్కరించారు. అప్పుడు జీనోమ్ వ్యాలీ అయితే.. ఇప్పుడు 'క్వాంటమ్' తో ముందుకెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా 23 సంస్థలు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఐటీ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, నేషనల్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, ఇండియా స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ హెడ్ సీవీ శ్రీధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, పాస్కల్ సీఈవో రాబర్ట్ మారో పాల్గొన్నారు.

క్వాంటమ్‌తో అద్భుతాలు
- శ్రీనివాసరావు ఆలూరి, క్యూన్యూ ల్యాబ్స్ ఛైర్మన్

1999లో సీఎం చంద్రబాబుతో కలిసి జీనోమ్ వ్యాలీ ఏర్పాటుకు పనిచేశా. 25 ఏళ్ల కిందట ఆయనకు ఆ ఆలోచన రావడమే అద్భుతం. అది ప్రపంచస్థాయి గుర్తింపు సాధించింది. ఇలాంటి అద్భుతాలు ఏపీలో కూడా జరగాలి. అమరావతి క్వాంటమ్ వ్యాలీతో అద్భుతాలు చేయడానికి ఏపీకి ఇదే సరైన సమయం. క్వాంటమ్ కంప్యూటర్లు ఇప్పుడున్న మొత్తం సమాచార భద్రతను పూర్తిగా ఛేదించేయగలవు. అందుకే మేం తొమ్మిదేళ్ల కిందట క్వాంటమ్ కంప్యూటర్ రాక ముందే దాని నుంచి మనకు రక్షణ ఇచ్చే కంపెనీని ప్రారంభించాలని ప్రయత్నించాం.

'సాంకేతికం'లో ఏపీ కీలకం
- విశాల్ ఛత్రథ్, క్వాంట్రోల్ ఓఎక్స్ సీఈవో

ఐబీఎంతో అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తర్వాత సాంకేతిక రంగంలో ఏపీ కీలకంగా మారనుంది. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు చూసిన తర్వాత 'బిగ్ బ్యాంగ్'తో ఇక్కడికి రావాలనుకుంటున్నాం. ఇప్పుడు ఏపీ రెండో దశకు సన్నద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన క్వాంటమ్ పాలసీ చూస్తే వారి లక్ష్యం ఏంటో స్పష్టంగా తెలుస్తోంది. గతంలో కొన్ని వారాలు పట్టే చిప్ పరీక్షలను ఒక బటన్ నొక్కి, 20 నిమిషాల్లో పూర్తి చేసే స్థాయికి చేరాం. తైవాన్‌లోని మా వినియోగదారులు ప్రస్తుతం ఏడాదికి 300 రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యూజ్ కేసులు చేస్తున్నారు. భవిష్యత్తులో దీన్ని 2వేలకు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. లివింగ్ ల్యాబ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఇండియాలో అతిపెద్ద ఓపెన్ టెస్ట్‌బెడ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

జపాన్ కేస్‌స్టడీగా
- గణేశ్ శ్రీనివాసన్, మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ పార్ట్‌నర్

క్వాంటమ్ కంప్యూటర్ తయారీలో జపాన్ అనుసరించిన విధానాలు ఏపీకి కేస్‌స్టడీగా ఉపయోగపడతాయి. ఆ విధానాలు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో దోహదపడతాయి. కొన్నేళ్ల కిందట జపాన్.. ఐబీఎంతో కలిసి పనిచేసి, ప్రపంచంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌ను అక్కడే ఏర్పాటు చేసింది. ఐబీఎం తొమ్మిదేళ్ల కిందట క్వాంటమ్ క్యూబిట్ సిస్టమ్‌లు క్లౌడ్‌లో ఉంచి, ఎవరైనా ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించింది. వాటిని ఉపయోగించుకున్న రెండో అతి పెద్ద దేశం భారత్.

భారత్ టెక్ రాజధానిగా ఏపీ

సీఐఐ భాగస్వామ్య సదస్సులో మంత్రి లోకేశ్



ఈనాడు, విశాఖపట్నం: 'రాష్ట్రం కీలక మలుపులో ఉంది. 2029కి ఏపీని ఇన్నోవేషన్ రాష్ట్రంగా మార్చి.. 20 వేలకు పైగా స్టార్టప్‌లు, 10 ప్రధాన రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయనున్నాం. దేశానికి టెక్ రాజధానిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం' అని మంత్రి లోకేశ్ చెప్పారు. భాగస్వామ్య సదస్సు సందర్భంగా 'ఆర్టీఐహెచ్ - వన్ ఫ్యామిలీ, వన్ ఆంత్రప్రెన్యూర్ - ఇన్నోవేషన్, ఇంక్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఏపీ' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థ

'రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతకు కార్యరూపం ఇచ్చే సంస్థగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్టీఐహెచ్) పనిచేస్తుంది. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారుల ఆవిష్కరణలను కలిపే వేదిక ఇది. దీని ద్వారా సెంట్రలైజ్డ్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహిస్తాం' అని లోకేశ్ తెలిపారు.

■ 'కో-ఇన్నోవేటర్, స్టార్టప్‌లకు ప్రభుత్వం తొలి వినియోగదారుడిగా ఉంటుంది. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనేది ఒక నినాదం కాదు. కొత్త అభివృద్ధి నమూనా. దీన్ని సాధించేందుకు ఏపీ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ 2024ను తెచ్చాం. విద్యార్థి దశ నుంచే వ్యాపారవేత్తగా ఎదిగేందుకు ఇందులో స్పష్టమైన మార్గాలు ఉన్నాయి' అని మంత్రి వివరించారు.

"ఆర్టీఐహెచ్ ద్వారా.. వాస్తవిక సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తాం. హ్యాకథాన్‌లు నిర్వహించి స్టార్టప్‌ల అమలు, స్కేల్ చేయగలిగే సొల్యూషన్స్‌ను అందిస్తాం. ఇది కొత్త విధానం. ప్రజాసమస్యల పరిష్కారాలకు ఇన్నోవేషన్‌లను ప్రోత్సహిస్తాం. - లోకేశ్

ఆరు సంస్థలతో ఎంవోయూలు

మంత్రి లోకేశ్ సమక్షంలో ఆరు సంస్థలతో అధికారులు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఏపీ వాగ, స్టార్టప్ యూఏఈ, ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు వీటిలో ఉన్నాయి. కార్యక్రమంలో ఆర్టీఐహెచ్ సీఈవో ధాత్రిరెడ్డి, టాటా ఇన్నోవేషన్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవి అరోరా, బ్లాక్ బక్ కోఫౌండర్ రాజేష్ యాబాజి, ఎండియా పార్ట్‌నర్స్ ఎండీ సతీశ్ ఆంద్ర, ప్రొఫెసర్ రమేశ్ లోకనాథన్, గ్లోబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కో-ఫౌండర్ మదన్ పాడకి తదితరులు పాల్గొన్నారు.

తీరం.. ఇక పర్యాటక హారం!

పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్



ఈనాడు, విశాఖపట్నం: మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ల(ఎంఐసీఈ)కు క్యాపిటల్ ఆఫ్ ది సౌత్‌గా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. 'గ్లోబల్ కాన్ఫరెన్స్‌లకు ఏపీ తీరం అనుకూలం'పై జరిగిన ప్యానల్ సెషన్‌లో ఆయన మాట్లాడుతూ.. 'విశాఖకు ఏఐ డేటా సెంటర్లు, కొత్త ఐటీ కంపెనీలు వరస కట్టడంతో 'మైస్' పర్యాటకానికి అనుకూల వాతావరణం ఏర్పడనుంది. 2047 నాటికి ఏపీని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం' అని మంత్రి తెలిపారు.

పర్యాటకశాఖ ఎంవోయూలు

■ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ 104 సంస్థలతో రూ.17,973 కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

■ ప్రత్యక్షంగా, పరోక్షంగా 97 వేల మందికి ఉపాధి లభించనుంది.

కోటి మందికి క్రూజ్ పర్యాటకం

– జుర్గెన్ బైలాం, కార్డేలియా క్రూయిజ్ సీఈవో

'విశాఖలో కొత్తగా నిర్మించిన క్రూజ్ టెర్మినల్‌తో మా సేవలను విస్తరిస్తాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి ఈ పర్యాటకాన్ని పరిచయం చేస్తాం'.

అడవులను ఉపయోగించుకొని..

– మనోజ్‌కుమార్, కర్ణాటక అటవీశాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్

'కర్ణాటక ప్రభుత్వం జంగిల్ లాడ్జెస్, రిసార్టులు నడుపుతోంది. ఏపీలో ఆ రాష్ట్రం కంటే తీరం, అటవీ విస్తీర్ణం ఎక్కువ. ఇక్కడి వనరులను సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సృష్టించొచ్చు'.

ప్రమాణాలున్న పంటలకు హామీ



విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: వ్యవసాయంలో స్థిరమైన ఆదాయం రావాలన్నా, పంట ఉత్పత్తుల కొనుగోలుకు హామీ లభించాలన్నా.. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సాగు విధానాలు అవలంబించాలని జాతీయ, అంతర్జాతీయ నిపుణులు సూచించారు. సదస్సులో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'ఏఐ ఆధారిత సేద్యంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మార్కెట్ ధరల విషయంలో ఇబ్బందులున్నాయి' అని సూచించారు.

■ రైతులు, సాగు విస్తీర్ణానికి సంబంధించిన సమాచారాన్ని వారి అంగీకారంతో ప్రైవేటు రంగానికి అందుబాటులో ఉంచుతామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ వ్యూహాత్మక సలహాదారు రాజీవ్‌గుప్తా వివరించారు.

■ సాంకేతికత రైతులకు ఉపయోగపడేలా, వారు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలని ఆక్వా ఎక్స్ఛేంజి సీఈఓ పవన్ కొసరాజు అభిప్రాయపడ్డారు.

■ యాప్‌లు, డ్రోన్లతో పంటల సాగులో వివిధ దశల్ని ట్రాక్ చేసే అవకాశం వచ్చిందని ఏన్షియంట్ ఇండియా గ్రూప్ ఏజీ ఆస్తా లలిత్ బజాజ్ పేర్కొన్నారు.

■ డిజిటల్ టూల్స్, ఆర్థిక మద్దతు, శిక్షణతో కూడిన ఫైనాన్స్ ప్లస్ విధానం అమలు చేస్తున్నామని ఐఎఫ్‌ఏడీ కంట్రీ డైరెక్టర్ మార్క్ డిసౌజా పేర్కొన్నారు.

ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి నాణ్యమైన ఉత్పత్తులు అందించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఆ దిశగా ముందుకెళ్తున్నాం. - అచ్చెన్న

ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు

– తెలుగులో పోస్టు చేసిన జపాన్ రాయబారి

ఈనాడు, విశాఖపట్నం: జపాన్ దేశ రాయబారి ఓనో కేయిచి.. తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. ఈ అద్భుతమైన కార్యక్రమం ద్వారా జపాన్, ఏపీల వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయి. నన్ను ఆహ్వానించినందుకు మీకు కృతజ్ఞతలు' అంటూ ఎక్స్‌లో తెలుగులో పోస్టుచేశారు.

ఫెర్టిలైజర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తాం

– ఇఫ్కో ఛైర్మన్ దిలీప్‌భాయ్

ఈనాడు, విశాఖపట్నం: భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఇఫ్కో ఛైర్మన్ దిలీప్‌భాయ్ సంఘాని.. సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. బయో ఫెర్టిలైజర్, బయో స్టిమ్యులెంట్ యూనిట్ల స్థాపనకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో ఇఫ్కోతో కలిసి పనిచేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఫెర్టిలైజర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని దిలీప్ చెప్పారు.



ఆట

భాగస్వామ్య సదస్సు ప్రాంగణం ఎదుట కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న విదేశీ ప్రతినిధులు



అమరావతి, క్వాంటమ్ వ్యాలీ నమూనాలు ఏర్పాటు చేసిన ప్రాంగణంలో రద్దీ



మాట

సీఐఐ-ఏపీ భాగస్వామ్య సదస్సు రెండో రోజు బీ2బీ హాల్‌లో పారిశ్రామికవేత్తలు, యువ అధికారుల చర్చలు

అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాలకు భూమి కేటాయింపు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న మంత్రి నారాయణ, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో 'బేసిల్ ఉడ్స్' పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నాలుగెకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు విశాఖలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో 'హరేకృష్ణ మూవ్‌మెంట్' ప్రతినిధులు వంశీధరదాస, విలాస విగ్రహదాస, రఘునందన్‌దాస సంయుక్తంగా అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆ సంస్థ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. భారతీయ సంప్రదాయ విలువలతోపాటు ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను సమన్వయం చేస్తూ విద్య అందించడమే లక్ష్యంగా ఈ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.

డేటా సెంటర్లతో ఏపీలో మాకు డిమాండ్

కిర్లోస్కర్ పంప్స్ ఎండీ అలోక్ ఎస్.కిర్లోస్కర్



ఈనాడు, అమరావతి: విశాఖలో గూగుల్‌తో పాటు.. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయనుండటం, రాజధాని అమరావతి నిర్మాణం, ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం లాంటి పరిణామాలతో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత మార్కెటింగ్ అవకాశాలు ఏర్పడుతున్నాయని కిర్లోస్కర్ పంప్స్ ఎండీ అలోక్ ఎస్. కిర్లోస్కర్ తెలిపారు. "రాష్ట్రానికి ఏయే రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయో తెలిస్తే, మాకు ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతుంది. దాన్నిబట్టే భవిష్యత్తులో ఏపీలో పంప్‌ల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలా? సర్వీసు సెంటర్లు పెట్టాలా అన్నది ఆలోచిస్తాం" అని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో మాకు చాలా అనుబంధం ఉంది. పట్టిసీమ ప్రాజెక్టుతో పాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పలు సాగునీటి, తాగునీటి సరఫరా ప్రాజెక్టులకు పంప్‌లు మేమే సరఫరా చేశాం. డేటా సెంటర్లకు ప్రత్యేకమైన పంప్‌లు కావాలి. రాబోయే రోజుల్లో ఏపీలో ఆ రంగంలో మాకు చాలా అవకాశాలు వస్తాయి. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో పంప్‌ల వినియోగం పెరిగితే సర్వీసు సెంటర్లు ఏర్పాటుచేస్తాం. ప్రస్తుతం భారత్‌లో మాకు మధ్యప్రదేశ్, గుజరాత్, కోయంబత్తూరుల్లోను, అమెరికా, బ్రిటన్‌తో పాటు పలు దేశాల్లోను పంప్‌ల తయారీ పరిశ్రమలున్నాయి.

ఏపీ స్పేస్‌సిటీ నుంచి 2027 నాటికి రాకెట్

ఎథేరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ సీఈఓ మను జె.నాయర్




విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: కొత్తగా ఏర్పాటుచేస్తున్న స్పేస్‌సిటీలో 2027 నాటికి రాకెట్ తయారు చేసి ప్రయోగానికి సిద్ధం చేస్తామని ఎథేరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ సీఈఓ మను జె.నాయర్ తెలిపారు. స్పేస్ సిటీ ద్వారా ఉపగ్రహ తయారీ, అప్లికేషన్లు, రాకెట్ల తయారీకి విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్పేస్‌సిటీ శంకుస్థాపన సందర్భంగా శుక్రవారం విశాఖలో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎథేరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు.

ఆరేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడి

ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం 150 ఎకరాలు కేటాయించేందుకు అంగీకరించింది. రాకెట్ తయారీకి ఆరేళ్లలో మూడు దశల్లో రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టాలని లక్ష్యం.

■ స్పేస్‌సిటీలో తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో కారిడార్లు వస్తున్నాయి. దక్షిణ బెల్ట్‌లో స్పేస్ అప్లికేషన్లు, ఉపగ్రహాలు తయారు చేస్తారు. రౌతుసూరమాలలో రాకెట్ తయారీ జరుగుతుంది. ఒకే బెల్టులో వేర్వేరు కారిడార్లు రావడం అద్భుతమైన విషయం.



అభినందన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతానికి కృషి చేసిన మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు


ఈనాడు సినిమా

శ్రీకారానికి సన్నాహాలు



కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా పట్టాలెక్కనుంది. 'వీర సింహారెడ్డి' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో చిత్రమిది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. గత నెలలోనే ఈ సినిమాకి క్లాప్ కొట్టాల్సి ఉన్నా అనివార్య కారణాల వల్ల ఆలస్యమైన సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రం ఈ నెలాఖరున పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టుకోనుందని సమాచారం. చరిత్ర.. వర్తమానం మేళవింపుగా సాగే ఈ శక్తిమంతమైన యాక్షన్ డ్రామాలో బాలకృష్ణ రెండు విభిన్న కోణాల్లో కనిపించనున్నట్లు తెలిసింది. ఓ పాత్రలో రాజుగా అలరించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కథానాయికగా నయనతార సందడి చేయనుంది. త్వరలోనే ఆమెను అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి అవినాశ్ కొల్లా కళా దర్శకుడిగా.. అరవింద్ ఎస్ కశ్యప్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించనున్నారు.

ట్రెండీ ప్రేమకథతో..



సంగీత్ శోభన్

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' విజయాలతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన హీరో సంగీత్ శోభన్. ఇప్పుడాయన సర్వంత్ సూర్య ప్రతాప్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. దీపక్ మొగిలినేని, గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఎస్‌కేఎన్ క్లాప్ కొట్టగా.. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ స్క్రిప్ట్ అందించారు. ఇదొక సరికొత్త ట్రెండీ ప్రేమకథతో రూపొందనున్న చిత్రమని.. మరిన్ని వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి లక్ష్మీ భూపాల్ రచయితగా వ్యవహరిస్తున్నారు.

జాబిలి కొత్త చిత్రం



శ్రీదేవి

'కోర్ట్' సినిమాలో జాబిలి పాత్రలో ఒదిగిపోయి యువతను విశేషంగా ఆకట్టుకుంది శ్రీదేవి. ఇప్పుడామె మరో కొత్త సినిమా ఖరారైంది. 'జో' సినిమా ఫేమ్ విజన్ సినిమా సంస్థ నిర్మిస్తోంది. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీదేవితో పాటు తమిళ నటుడు ఏగన్, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శనివారం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది నిర్మాణ సంస్థ. తెలుగు, తమిళ భాషల్లో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతమందిస్తున్నారు. ఇంకా పేరు ఖరారు కాని ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో ప్రకటించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.


హీరోయిన్లు ఎందుకు చేయకూడదు?



కామాక్షి

"మంచి ప్రేమకథతో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ'. తర్వాత ఏం జరుగుతుందన్న ఆసక్తి రేకెత్తిస్తూ సాగుతుంది" అన్నారు కామాక్షి భాస్కర్ల. ఆమె.. అల్లరి నరేశ్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని నాని కాసరగడ్డ తెరకెక్కించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "ఇది మంచి బిగితో సాగే సస్పెన్స్ థ్రిల్లర్. నేనిందులో నరేశ్ జోడీగా ఆరాధన అనే పాత్రలో కనిపిస్తా. ఈ పాత్ర లేకపోతే ఈ కథే లేదు. ఈ సినిమా చూశాక నా పాత్ర ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది. విజయ్ సేతుపతి, శ్రీవిష్ణు, సుహాస్.. ఇలా చాలా మంది హీరోలు అన్ని రకాల పాత్రలు చేసుకుంటూ వస్తారు. కథానాయికలు కూడా అలా ఎందుకు చేయకూడదనేది ఓ సవాల్‌గా తీసుకుని.. విభిన్న రకాల పాత్రలు పోషించే ప్రయత్నం చేస్తున్నా. అలా ఈ ఏడాది సినీ ప్రయాణంలో 'విరూపాక్ష', 'పొలిమేర' చిత్రాలు నాకు మంచి పేరు తీసుకొచ్చాయి" అన్నారు.

వారణాసి విడుదల తర్వాత... దేశమంతా గర్విస్తుంది



రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘనంగా జరిగిన 'గ్లోబ్‌ట్రాటర్' వేడుకలో మహేశ్‌బాబు

- ఈ చిత్రానికి నేపథ్యం రామాయణంలోని ఓ ముఖ్య ఘట్టం
- 2027 వేసవికి విడుదల

దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళితో కలిసి చేస్తున్న 'వారణాసి' తన డ్రీమ్ ప్రాజెక్ట్ అన్నారు కథానాయకుడు మహేశ్‌బాబు. జీవితంలో ఒక్కసారే దొరికే అవకాశమిదని.. ఈ సినిమా విడుదలైన రోజు భారతదేశమంతా గర్విస్తుందని చెప్పారు. మహేశ్ - రాజమౌళి కలయికలో రూపొందుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ పతాకాలపై కె.ఎల్ నారాయణ, ఎస్.ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'వారణాసి' అనే పేరుని ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా ఘనంగా జరిగిన గ్లోబ్ ట్రాటర్ వేడుకలో టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం 2027 వేసవికి ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ.. "అందరూ ఇన్ని రోజులు అప్‌డేట్స్ ఎప్పుడని అడిగారు. మేము చూపించాం. ఎలా ఉంది. నాకైతే దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయిపోయింది. నాన్న అంటే నాకెంత ఇష్టమో అందరికీ తెలుసు. ఆయన చెప్పిన ప్రతి మాట వినేవాణ్ని.. ఒక్కటి తప్ప. ఆయన నన్నెప్పుడూ 'నువ్వు గెటప్పుల్లో బాగుంటావు.. ఓ పౌరాణిక సినిమా చేయమ'ని అడిగేవారు. ఆ మాట నేనెప్పుడూ వినలేదు. ఇవాళ నా మాటలు ఆయన వింటూ ఉంటారు. తన ఆశీస్సులు ఎప్పుడూ మనతోనే ఉంటాయి. ఇది నా కలల సినిమా. ప్రతి నటుడి జీవితంలో ఒక్కసారి మాత్రమే చేసే సినిమా, పాత్ర ఒకటుంది. నాకిది అలాంటి చిత్రమే. దీని కోసం ఎంత కష్టపడాలో అంత కష్టపడతాను. ప్రతి ఒక్కరూ గర్వపడేలా చేస్తాను. ముఖ్యంగా నన్ను నమ్మిన నా దర్శకుడు చాలా గర్వపడేలా శ్రమిస్తా. ఇది విడుదలైన రోజు దేశమంతా గర్విస్తుంది. ఇది టైటిల్ ఫస్ట్ రివీల్ మాత్రమే. ముందు ముందు ఎలా ఉంటుందన్నది మీ ఊహలకే వదిలేస్తున్నా. అందరూ నాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు చేతులెత్తి నమస్కరిస్తున్నా" అన్నారు.




ప్రియాంకచోప్రా, మహేశ్‌బాబు, రాజమౌళి, పృథ్వీరాజ్

> 'వారణాసి' టైటిల్ గ్లింప్స్‌తోనే.. ఈ చిత్ర కథా నేపథ్యాన్ని.. దాని ప్రపంచాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేశారు రాజమౌళి. త్రేతాయుగంలోని రామాయణ యుద్ధ ఘట్టాన్ని.. యుగాల వెనకటి వారణాసిని.. వర్తమానంలో భూమిని ఢీ కొట్టనున్న ఓ ఉల్క వల్ల వివిధ ఖండాల్లో జరగనున్న విధ్వంసాన్ని.. ఇలా పురాణాలు, చరిత్ర, వర్తమానాన్ని ఈ ప్రచార చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌తో అద్భుతంగా ఆవిష్కరించారు. ఆఖర్లో రుద్రుడిలా నంది వాహనంపై త్రిశూలం పట్టుకుని కదన రంగంలోకి దూసుకెళ్తున్నట్లుగా మహేశ్‌బాబు పాత్రను పరిచయం చేసిన తీరు ఆకర్షణగా నిలిచింది.

రాముడిగా మహేశ్‌ని చూసి రోమాలు నిక్కబొడుచుకున్నాయి

దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ.. "నన్ను మహేశ్‌బాబును కలిపినందుకు నిర్మాత కె.ఎల్ నారాయణకు కృతజ్ఞతలు. నేను ఓ సినిమా ప్రారంభించడానికి ముందు ప్రెస్‌మీట్ పెట్టి ఆ చిత్ర కథ చెప్పేయడం అలవాటు. కానీ, కొన్ని చిత్రాలకు అలా చెప్పడం కుదరదు. ఈ సినిమా కథను.. స్కేల్‌ను.. స్థాయిని మాటల్లో చెప్పడం సాధ్యం కాదు. అందుకే కథ చెప్పకుండానే.. ప్రేక్షకుల అంచనాల్ని కరెక్ట్‌గా సెట్ చేసేలా వీడియోను రూపొందించాం. నాకు కృష్ణగారి గొప్పదనం తెలియదు. ఎందుకంటే నేను చిన్నప్పుడు ఎన్టీఆర్ అభిమానిని. ఆయన సినిమాలే చూసేవాణ్ని. కానీ, నేను ఇండస్ట్రీకి వచ్చాక. సినిమా అంటే ఏంటో అర్థమయ్యాక కృష్ణ గొప్పదనం తెలిసింది. తెలుగు సినిమాకి ఆయన ఎన్నో కొత్త సాంకేతికతల్ని పరిచయం చేశారు. అలాంటి గొప్ప వ్యక్తి అబ్బాయి మహేశ్‌బాబుతో సినిమా చేయడం చాలా గర్వంగా ఉంది. ఈ చిత్రంతో నేను ప్రీమియం లార్జ్ స్కేల్ ఫార్మాట్ అనే కొత్త సాంకేతికతను తెలుగు సినిమాకి పరిచయం చేయబోతున్నా. దీన్ని పూర్తిగా ఐమాక్స్ వెర్షన్‌లో తెరకెక్కిస్తున్నాం. నాకు చిన్నప్పటి నుంచి రామాయణం, మహాభారతం అంటే చాలా ఇష్టం. మహాభారతం తీయడం నా డ్రీమ్ ప్రాజెక్ట్ అని చాలా సార్లు చెప్పా. దాని గురించి ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటా. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు రామాయణంలో ఒక ముఖ్యమైన ఘట్టాన్ని తెరకెక్కిస్తానని అసలు అనుకోలేదు. దీంట్లోని ఒక్కో సీన్, డైలాగ్‌ను రాస్తుంటే.. దాన్ని తెరపైకి తీసుకొస్తుంటే నేను నేలపై నడవట్లేదు గాల్లో ఉన్నానన్న అనుభూతి కలిగింది. మహేశ్‌ని తొలిరోజు రాముడి వేషంలో తీసుకొచ్చి ఫొటో షూట్ చేస్తుంటే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నిజానికి తను కొంటెగా కృష్ణుడిలా ఉంటాడు.. రాముడి లాంటి ప్రశాంతమైన పాత్రకు సరిపోతాడా? లేదా? అనే సందిగ్ధంలో ఆ ఫొటో షూట్ చేశా. కానీ, ఆ తర్వాత రాముడిగా తన ఫొటోని నా ఫోన్ వాల్‌పేపర్‌గా పెట్టుకుని.. మళ్లీ అదెవరైనా చూస్తారన్న భయంతో తీసేశాను. ఈ ఎపిసోడ్ పూర్తి చేయడం మర్చిపోలేని అనుభూతి. దాన్ని దాదాపు 60రోజులు చిత్రీకరించాం. రోజూ ఓ సవాల్‌లాగే ఉండేది. మహేశ్ అందులో మీరు ఊహించనంత అందంగా.. పరాక్రమంగా.. దయార్ద్ర హృదయంగా, కోపంగా ఉంటాడు. రాముడిగా నవరసాలు చూపించాడు" అన్నారు.



నంది బొమ్మపై కూర్చొని వేదికపైకొచ్చిన మహేశ్

లీక్ చేయాలని చూశారు..

'వారణాసి' చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను పెద్ద ఎల్ఈడీ స్క్రీన్‌పై టెస్ట్ చేద్దామని ప్రయత్నించగా. . కొందరు డ్రోన్లతో షూట్ చేసి లీక్ చేసి నెట్‌లో పెట్టారని రాజమౌళి ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ చిత్ర గ్లింప్స్ కోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ఇండియాలోనే అతి పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశాం. అది పని చేయాలంటే దాదాపు 45 జనరేటర్లు పనిచేయాలి. శనివారం ఉదయం రెండు గంటల సమయంలో దీన్ని టెస్ట్ చేద్దామని ప్రయత్నిస్తే.. కొందరు డ్రోన్‌తో ఆ వీడియోను తీసి, నెట్‌లో పెట్టారు. ఇది కోట్ల రూపాయల ఖర్చు.. ఎంతో మంది శ్రమతో ముడిపడి ఉంది. ఈసారి మేము రిస్క్ తీసుకోవడానికి ఆస్కారం లేకుండా చేశార"ని అసహనం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో టైటిల్ గ్లింప్స్ ప్రదర్శన సాంకేతిక సమస్యల వల్ల కొద్ది సేపు ఆలస్యమైన సందర్భంలోనూ అసహనం వ్యక్తం చేశారు. గ్లింప్స్ ప్రదర్శన అనంతరం భావోద్వేగానికి గురయ్యారు.

ఆ సీక్వెన్స్‌లో మహేశ్ విశ్వరూపాన్ని చూశా!

రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. "ఈ సినిమాలో 30నిమిషాల నిడివితో ఓ యాక్షన్ ఘట్టం ఉంది. దాన్ని కథ, ఆవేశం, భావోద్వేగం ఏమనాలో అర్థం కాలేదు. ఆ సీక్వెన్స్‌లో మహేశ్‌బాబు విశ్వరూపాన్ని అలా చూస్తూ ఉండిపోయాను. ఆ మర్చిపోలేని అనుభూతిని త్వరలో ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. కొన్ని చిత్రాలు దైవ నిర్ణయం. రాజమౌళి గుండెపై హనుమ ఉన్నాడు. ఏం చేయాలో కర్తవ్యం బోధిస్తున్నాడు" అన్నారు. "ఈ గ్లోబ్‌లో ఎన్నో ఖండాలు, దేశాలు.. ఎన్నెన్నో వింతలున్నాయి. వాటిలో కొన్నింటిని ఈ చిత్రం ద్వారా ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు దర్శకుడు రాజమౌళి, నిర్మాత కె.ఎల్ నారాయణ" అన్నారు సంగీత దర్శకుడు కీరవాణి. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. "కొన్నేళ్ల క్రితం నేనెంతో ఇష్టపడే దర్శకుడు రాజమౌళి నుంచి నాకు ఓ మెసేజ్ వచ్చింది. 'నా తర్వాతి సినిమాలో ఓ ప్రతినాయక పాత్ర ఉంది. నేనిప్పటి దాకా రాసిన పాత్రల్లోనే అత్యంత శక్తిమంతమైనది. నీకు చేసే ఆసక్తి ఉందా' అన్నది దాని సారాంశం. వెంటనే చేస్తానని చెప్పా. ఆ తర్వాత రెండు రోజులకే ఆయన నాకు కథ వినిపించారు. అది విన్న ఐదు నిమిషాలకే నాకు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. నన్ను నమ్మి ఇంత భావోద్వేగాలు నిండిన, శారీరకంగా సవాల్‌తో కూడిన పాత్రను నాకిచ్చినందుకు రాజమౌళికి కృతజ్ఞతలు. నిజంగా చిత్రీకరణ టార్చర్‌లా ఉంది (నవ్వుతూ)" అన్నారు. "ఈ చిత్రంతో మళ్లీ భారత సినీప్రియుల్ని తిరిగి పలకరించనున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మందాకిని పాత్ర కోసం నన్ను నమ్మి తీసుకున్నందుకు దర్శకుడు రాజమౌళికి కృతజ్ఞతలు" అంది నటి ప్రియాంక చోప్రా.

గ్లోబల్ ఆడియన్స్ భారత్ వైపు చూసేలా..

నిర్మాత కె.ఎల్ నారాయణ మాట్లాడుతూ.. "15ఏళ్ల క్రితం మా బ్యానర్‌లో మహేశ్‌బాబు - రాజమౌళితో సినిమా చేయాలని అనుకున్నాం. అది ఇంత సమయం పడుతుందని ఊహించలేదు. నాకిచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఆయనకి కృతజ్ఞతలు" అన్నారు. "ఈ చిత్రంతో ఇండియన్ సినిమాని గ్లోబల్‌కి తీసుకెళ్లడంతో పాటు గ్లోబల్ ఆడియన్స్‌ని ఇండియా వైపు చూసేలా చేస్తున్నాం" అన్నారు నిర్మాత ఎస్ ఎస్ కార్తికేయ. ఈ కార్యక్రమంలో "సంచారి" పాటతో శ్రుతిహాసన్.. పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ పాత్ర పరిచయ గీతంతో కీరవాణి చేసిన సందడి ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుక కోసం అంతర్జాతీయ, జాతీయ మీడియా కూడా తరలి రావడం విశేషం. ఈ వేడుకలో నమ్రత శిరోద్కర్, సితార, కీరవాణి, రమా రాజమౌళి, ఎస్ ఎస్ కంచి, దేవా కట్టా తదితరులు పాల్గొన్నారు.

కాంత చేసినందుకు గర్వంగా ఉంది : రానా



రానా, భాగ్యశ్రీ

"'కాంత' చిత్రానికి ప్రేక్షకుల నుంచి దక్కుతున్న ఆదరణ చాలా ఆనందాన్నిస్తోంది" అన్నారు నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి. ఇప్పుడాయన కీలక పాత్రధారిగా నటిస్తూ.. హీరో దుల్కర్ సల్మాన్‌తో కలిసి స్వయంగా నిర్మించిన చిత్రమే 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సముద్రఖని కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ. . "భిన్న జానర్లు మిళితంగా వచ్చిన తొలి చిత్రమిది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. మద్రాస్ నేపథ్యంలో జరిగే కథ కావడం.. ఎలాంటి అంచనాల్లేకుండా చూడటం వల్ల మద్రాస్ ఆడియన్స్ దీనికి ఇంకా ఎక్కువ కనెక్ట్ అయ్యారు. దుల్కర్ దీంట్లో తన కెరీర్‌లోనే అత్యుత్తమైన నటనను కనబరిచారు. మ్యూజిక్, విజువల్స్, సాంకేతిక విలువల గురించి మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దుల్కర్‌తో కలిసి ఈ సినిమా చేసినందుకు గర్వంగా ఉంది" అన్నారు. "ఈ చిత్రానికి ఇంత గొప్ప ఆదరణను నేను ఊహించలేదు. ఈ సినిమా కోసం నేను ఆర్నెలలు చెన్నైలోనే ఉన్నాను. సావిత్రి, శ్రీదేవి చేసిన చాలా చిత్రాలు చూసి నా పాత్ర కోసం సిద్ధమయ్యాను" అంది నటి భాగ్యశ్రీ బోర్సే.

కంటెంట్ బాగుంటే హిట్ చేస్తామని మరోసారి నిరూపించారు



సంజీవ్, చాందిని, విక్రాంత్, మధుర శ్రీధర్

"'సంతాన ప్రాప్తిరస్తు' మంచి కుటుంబ వినోదంతో కూడిన సినిమా అంటూ ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు వస్తుండటం సంతోషంగా ఉంద"న్నారు నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి. ఆయన, నిర్వి హరిప్రసాద్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకి సంజీవ్ రెడ్డి దర్శకుడు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవల థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విజయోత్సవాన్ని నిర్వహించింది. "సినిమాకు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూశాకా ఏడాదిన్నర పడ్డ కష్టాన్ని మర్చిపోయామ"న్నారు హీరో విక్రాంత్. "ఒక సామాజిక సమస్యలో వినోదాన్ని మిళితం చేసి అందరికీ బోధపడే రీతిలో సినిమా చేశారంటూ ప్రశంసలు వస్తున్నాయి. కొత్త తరహా కంటెంట్ చూపిస్తే తాము ఆదరిస్తామని తెలుగు ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. మాకే కాదు ఇది వేరే చిత్ర నిర్మాతలకు కూడా ప్రేరణ కలిగించే విజయం" అన్నారు దర్శకుడు సంజీవ్ రెడ్డి.


ఘంటసాల వ్యక్తిత్వాన్ని చూపే చిత్రమిది



ఆదిత్య హాసన్, రామారావు, కృష్ణచైతన్య

ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. సీహెచ్ రామారావు దర్శకుడు. ఘంటసాల పాత్రలో కృష్ణచైతన్య నటించగా, ఆయన భార్య సావిత్రి పాత్రలో మృదుల నటించారు. సీహెచ్ ఫణి నిర్మాత. ఈ సినిమా వచ్చే నెల 12 రాబోతుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సినిమా టీజర్‌ను ముఖ్య అతిథిగా హాజరైన దర్శకనిర్మాత ఆదిత్య హాసన్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ.. "గాయకుడిగా కంటే ఘంటసాల వ్యక్తిత్వం గురించి అందరికీ తెలియాలనే ఈ సినిమా తీశాన"ని అన్నారు.

తల్లిదండ్రులైన రాజ్‌కుమార్ దంపతులు



రాజ్‌కుమార్ రావ్, పత్రలేఖ


బాలీవుడ్ దంపతులు రాజ్‌కుమార్ రావ్, పత్రలేఖ తల్లిదండ్రులయ్యారు. శనివారం పత్రలేఖ పండంటి పాపకు జన్మనిచ్చింది. శనివారం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా తెలుపుతూ.. ఓ పోస్ట్ పెట్టిందీ జంట. "మా 4వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా దేవుడు మాకు ఇచ్చిన గొప్ప ఆశీర్వాదం ఇది. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి" అంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో 'తల్లిదండ్రుల క్లబ్‌లోకి స్వాగతం' అంటూ పలువురు బాలీవుడ్ సినీతారలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని రోజుల ప్రేమ ప్రయాణం తర్వాత పెద్దల సమక్షంలో 2021లో ఒక్కటయ్యారు రాజ్‌కుమార్, పత్రలేఖ. సినిమాల విషయానికొస్తే.. ఇటీవలే 'మాలిక్', 'భూల్ చుక్ మాఫ్' లాంటి చిత్రాలతో ప్రేక్షకుల్ని పలకరించారు రాజ్.

ప్రేమలో పడితే మోక్షం రాదా!



కృతి సనన్, ధనుష్

"ఇప్పటికీ దూకుడే.. ఇంకా అదే కోపం.. ఇలాంటి ప్రేమ సరియైనదేనా?" అని అడుగుతుంది బాలీవుడ్ తార కృతి సనన్. ఆమె, ధనుష్ జంటగా నటించిన చిత్రం 'తేరే ఇష్క్ మే'. ఈ ప్రేమకథా చిత్రానికి ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 28న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. ఇందులో పైలెట్, ప్రేమలో ఓడిపోయిన వ్యక్తి.. ఇలా రెండు భిన్న కోణాల్లో కనిపిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు ధనుష్. "ప్రేమలో పడితే అది మిమ్మల్ని మోక్షం వైపునకు కాదు.. చావు దిశగా నడిపిస్తుంది', 'నా ప్రేమతో నిన్ను మంచి స్వభావం ఉన్న వ్యక్తిగా మార్చగలను" లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తుంది. విషాద ప్రేమకథగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాను టీ-సిరీస్ నిర్మించింది.



శోభాయమానం.. దీపోత్సవం



జ్యోతి వెలిగిస్తున్న నారా రోహిత్, శిరీష, విప్ యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, 'ఈనాడు' యూనిట్ మేనేజర్ కిషోర్ తదితరులు

అఖండ దీపం.. అమేయ తేజం!

వైభవంగా 'ఈటీవీ' లైఫ్, 'ఈటీవీ' ఆంధ్రప్రదేశ్, 'ఈటీవీ' తెలంగాణ కార్తిక దీపోత్సవం

గన్నవరం గ్రామీణం, హనుమాన్ జంక్షన్ - న్యూస్‌టుడే: గగన విహార కేంద్రం గన్నవరం.. దీప కాంతుల ధగధగలతో మెరిసిపోయింది. ఓ వైపు వేద మంత్రాలు... మరోవైపు ఓంకార నాదాలతో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా శివ, కేశవుల ఆరాధన మార్మోగింది. 'ఈటీవీ లైఫ్', 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్', 'ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో గన్నవరం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం సాయంత్రం కార్తిక దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వందల మంది మహిళలు, యువతులు హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ తరలివచ్చారు.



హరహర మహాదేవ



అలరించిన ప్రవచనం

తొలుత వైదిక నిర్వహణకర్త బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణి కుమారశర్మ బృందం గణపతి పూజ నిర్వహించింది. అనంతరం నటుడు నారా రోహిత్, శిరీష దంపతులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు, ఆయన తల్లిదండ్రులు లక్ష్మీసామ్రాజ్యం, రామశేషగిరిరావు, సోదరుడు సతీష్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, తదితరులు జ్యోతి వెలిగించారు. కలువ పూలతో లక్ష్మీ పూజ, వేద స్వస్తి నిర్వహించారు. శాస్త్రోక్తంగా దీపారాధన చేయించి, ఆ వెలుగుల్లో లక్ష్మీదేవిని పూజించారు. ప్రవచనకర్త డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి ప్రవచనాలు ఆహుతులను భక్తి పారవశ్యంలో తరింపజేశాయి. జైశ్రీరామ్, మహాలక్ష్మి నమామ్యహం, కార్తిక దామోదర నమో నమః, తదితర నామస్మరణలతో ప్రాంగణం మార్మోగింది.



పరమేశ్వరుడి స్మరణతో..: శ్రీరామ, సీతారామాభ్యో నమః, ఓం నమఃశివాయ, శంభో శంకర, హరహర మహాదేవ అని భక్తులు తన్మయత్వంలో మునిగారు. మహిళలంతా సామూహికంగా దీపోత్సవం నిర్వహించారు. దాదాపు రెండు గంటలు సాగిన మహాక్రతువులో అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు దీపాలు వెలిగించి, పరమశివుడిని పూజించారు. కనుల పండువగా సాగిన ఈ దీపోత్సవం మహా హారతితో ముగిసింది.

కార్తిక మాసం విశిష్టత, దీపోత్సవం ప్రాముఖ్యత, శ్రీరాముడి గొప్పతనం, రామాయణం విశిష్టత గురించి ప్రవచనకర్త వేదాంతం రాజగోపాలచక్రవర్తి వివరించారు. శ్రీరాముడి పితృ వాక్య పరిపాలన, ఏకపత్నీ వ్రతం, త్యాగనిరతితో పాటు... శనివారం ఏకాదశి ప్రాముఖ్యం, ఉపవాసంతో మిగిలిన బియ్యం దానం చేయడం ద్వారా కలిగే పుణ్యం వంటి మరెన్నో ధార్మిక విషయాలను విశదీకరించారు. ప్రతి ఒక్కరూ ధర్మం కోసం, దేశం కోసం పనిచేస్తూ, కృతజ్ఞతగా ఉండాలని సూచించారు.

జ్ఞాపికల అందజేత: ఈటీవీ కార్తిక దీపోత్సవానికి సహకరించిన ప్రకటనకర్తలైన వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులకు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, 'ఈనాడు' యూనిట్ మేనేజర్ సీహెచ్.కిషోర్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. ఫస్ట్ ఆబ్జెక్ట్ సంస్థ, ఎస్.ఎల్.వి. గ్రూప్- సూర్యనారాయణరాజు, హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్- కాసర్నేని రంగబాబు, ఎన్జీ ఫీడ్స్- గూడపాటి తులసీమోహన్, ప్రైడ్ ప్రోపర్టీస్- పాలడుగు నాని, కామధేను ఫీడ్స్- రజిత, వీవీఐటీ విశ్వవిద్యాలయం- ఐ.జె.వెంకటేశ్వర్లు, పుణ్య ఛారిటీస్-జాస్తి విజయ్‌భూషణ్‌కుమార్, పూజా నువ్వుల నూనె-గోపాలకృష్ణలకు జ్ఞాపికలు అందజేశారు. ఈటీవీ డిప్యూటీ న్యూస్ కో-ఆర్డినేటర్ అమరేశ్వరరావు పర్యవేక్షించారు.



ప్రకటనకర్తలకు జ్ఞాపికలు అందించిన విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, 'ఈనాడు' యూనిట్ మేనేజర్ సీహెచ్.కిషోర్

దుర్గగుడిని శుభ్రంగా తీర్చిదిద్దుతాం

ఇంద్రకీలాద్రి: దుర్గగుడిని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గగుడి రాజగోపురం ప్రాంగణంలో దేవస్థానం సిబ్బంది, అధికారులతో శనివారం దేవస్థానం పాలకమండలి ఛైర్మన్, ఈవోలు ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవస్థానంలో పని చేసే ప్రతి ఒక్కరూ ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛందంగా కృషి చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించి దుర్గగుడి ప్రతిష్ఠ పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి సభ్యులు వెలగపూడి శంకరబాబు, శ్రీనివాసరావు, సరిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రజనీప్రియ, డీఈ రవీంద్ర పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

సీఎం దృష్టికి బెజవాడ-బందరు ఎన్‌హెచ్ వివాదం

త్వరలో డీపీఆర్‌లో మార్పులు జరిగే అవకాశం

ఈనాడు - అమరావతి: బెజవాడ-బందరు ఎన్‌హెచ్-65 డీపీఆర్ వివాదాన్ని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు. తాజాగా ఎన్‌హెచ్, మెట్రో అధికారులు.. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబుతో సమావేశమయ్యారు. విజయవాడ ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో బెంజ్ సర్కిల్ నుంచి ఓఆర్‌ఆర్ మొదలయ్యే చినఓగిరాల వరకు ఒక్క ఫ్లైవంతెన, అండర్‌పాస్ లేకుండా డీపీఆర్ తయారు చేశారనే అంశంపై ప్రజాప్రతినిధులు అధికారుల అసంతృప్తిని వివరించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్, తాడిగడప, పోరంకి, పెనమలూరు, గంగూరు, ఈడుపుగల్లు కూడళ్లలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యల గురించి వివరించారు. ఆయా ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, పై వంతెనలు లేదా బెంజ్ సర్కిల్ నుంచి అన్ని కూడళ్లు కవర్ చేస్తూ డబుల్ డెక్కర్ పై వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు అడిగినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అదే సమయంలో ఓఆర్‌ఆర్, మెట్రో వస్తున్న నేపథ్యాన్ని వివరించారు.



విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి

సాధ్యాసాధ్యాలు చూశాకే ముందుకు...: ఇరువైపులా సమస్యలు, సాధ్యాసాధ్యాలు విన్న కృష్ణబాబు విషయాన్ని సీఎం దృష్టిలో పెట్టినట్లు తెలుస్తోంది. సీఎం విషయాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నిపుణులు, ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటారని సమాచారం. కన్సల్టెన్సీ తయారు చేసిన డీపీఆర్ ప్రకారం అంచనా వ్యయం రూ.900 కోట్లు అవుతుంది. కొంత కాలం కిందట కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఈ రహదారి విస్తరణకు రూ.2,600 కోట్లు కేటాయిస్తున్నట్లు స్వయంగా ప్రకటించారు. ఈనేపథ్యంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు కోరిన మార్పులు చేసినా నిధుల సమస్య ఉండదు. దీంతో డీపీఆర్‌లో మార్పులు చేయడానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రజాప్రతినిధులు కోరినట్లు అండర్‌పాస్‌లు, ఫ్లైవంతెనలు లేదా డబుల్ డెక్కర్ ఫ్లైవంతెన నిర్మిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడూ విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట: సెలవు రోజైనా ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్‌ఈ యు. హనుమయ్య తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బిల్లులు చెల్లించాలని కోరారు. ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్ తదితరాల్లో చెల్లించవచ్చని తెలిపారు.

బుడుగులకు... బువ్వ వండేదెలా?!

- రెండో వారంలోనూ పూర్తవని బియ్యం సరఫరా
- మధ్యాహ్న భోజనానికి ఉపాధ్యాయుల అవస్థలు

> విజయవాడ తూర్పు పరిధిలో వెయ్యి మందిపైగా విద్యార్థులున్న ఓ పాఠశాలలో ఈ నెల 13 వరకు మధ్యాహ్న భోజనానికి వాడే బియ్యం సరఫరా కాలేదు. మొదటి వారంలోనే బియ్యం లేక గత నెల నిల్వ మిగిలిన మరో పాఠశాల నుంచి ఆటోల్లో తెచ్చుకున్నారు. ఆటో కిరాయి, మోత కూలీ.. ఉపాధ్యాయులే చెల్లించారు. రెండు నెలలుగా ఇవే అవస్థలు.

> మోపిదేవి మండలంలో ఓ పాఠశాలలో 300 మందిపైనే విద్యార్థులు ఉన్నారు. ఈనెల 12 దాటినా బియ్యం రాక మరో పాఠశాల నుంచి వాహనాల్లో చేతి చమురు వదిలించుకుని రప్పించుకున్నారు. ఇది ఏ ఒక్క పాఠశాల సమస్యో కాదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని పాఠశాలల్లో ఇదేతీరు.

ఈనాడు - అమరావతి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి పంపిణీ చేసే బియ్యం సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి పాఠశాలలకు ప్రతి నెలా 1, 2 తేదీల్లో రావాల్సిన బియ్యం రెండు వారాలు దాటుతున్నా సరఫరా కావడం లేదు. ఫలితంగా మధ్యాహ్నం భోజన పథకం అమలుకు అవస్థలు పడాల్సిన పరిస్థితి.



ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో బియ్యం నిల్వలు

అసలు ఎందుకిలా...?

ఉమ్మడి జిల్లాలో 2,195 పాఠశాలలకు నెలకు 445 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. గతంలో రేషన్ డీలర్లే పాఠశాలలకు బియ్యం సరఫరా చేసేవారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ తీసుకుని నేరుగా పాఠశాలలకు పంపేవారు. పాఠశాలలకు ఇచ్చిన సంచులు తిరిగివ్వడంలో జాప్యం, ఈ బియ్యానికి సైతం డీలర్లకు కమీషన్ ఇవ్వాల్సి రావడం.. ప్రస్తుతం పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేస్తున్న నేపథ్యంలో నాణ్యత తారుమారు అవుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం సరఫరా విధానం మార్చింది. ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో స్టేజ్-2 సిబ్బందికి ప్రతి నెలా మొదటి రెండు రోజుల్లో సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసింది.

అదనపు భారం...

ప్రతి పాఠశాలకు వెళ్లి బియ్యం సరఫరా చేయాల్సి రావడంతో రవాణాకు అదనంగా ఖర్చు కావడం, కొన్ని పాఠశాలలకు లారీలు కూడా వెళ్లే వీల్లేక మోసుకుని వెళ్లాల్సిన పరిస్థితులతో ఆ సిబ్బంది తమ కమీషన్ పెంచాలంటూ బియ్యం సవ్యంగా సరఫరా చేయడం లేదు. దీంతో గత రెండు నెలలుగా 13వ తేదీ దాటుతున్నా పూర్తిగా బియ్యం చేరక ఉపాధ్యాయులకు భారం తప్పట్లేదు. ఈవిషయమై విద్య, పౌర సరఫరాల శాఖల ఉన్నతాధికారులను సంప్రదించగా... సమన్వయంతో ఇబ్బందులు రాకుండా చక్కదిద్దుతామన్నారు.

వైకాపా నేత కొండారెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

ఈనాడు - అమరావతి: ఎండీఎంఏ కేసు సమగ్ర దర్యాప్తునకు విజయవాడ పోలీసులు సిద్ధమయ్యారు. మధుసూదన్‌రెడ్డి అలియాస్ మ్యాడీ అరెస్టుతో వచ్చిన కీలక సమాచారం ఆధారంగా ముందుకు పోలీసులు ముందుకు వెళ్లనున్నారు. మూలాలు విశాఖలో ఉండడం, వైకాపా విద్యార్థి నేత కొండారెడ్డి పేరు వెలుగులోకి రావడంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే వైకాపా నేతను నిందితుడిగా చేర్చారు.

నెల్లూరు కారాగారంలో లోహిత్ విచారణ...: విశాఖకు చెందిన లోహిత్ యాదవ్‌ను రెండు నెలల కిందట ఈ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి నెల్లూరు కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. లోహిత్ పుట్టినరోజున పార్టీలో వాడేందుకు ఎండీఎంఏ తీసుకెళ్తూ శ్రీవాత్సవ్, హవీలా విజయవాడలో పట్టుబడ్డారు. కొండారెడ్డి బృందంలో లోహిత్ కీలక వ్యక్తి. ఈ పార్టీకి వైకాపా నేత కూడా రావాల్సి ఉంది. విచారణలో మ్యాడీ వెల్లడించిన వివరాల ఆధారంగా నిందితులను మళ్లీ విచారించనున్నారు. ఈమేరకు లోహిత్‌ను నెల్లూరు జైలులో ఒక రోజు కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సోమవారం విచారించనున్నారు. ఇప్పటికే నిందితుడి కాల్‌డేటా విశ్లేషించారు.

విశాఖలో మూలాలు...: ఈ కేసులో డ్రగ్ వినియోగించే వారంతా విశాఖ నగరం వారే. దీంతో విశాఖలో మూలాలు వెలికి తీసేందుకు ఇంటరాగేషన్‌లో లోహిత్ యాదవ్ చెప్పే వివరాలు కీలకం కానున్నాయి. నిందితుడి కాల్‌డేటాలో పలువురి నెంబర్లు ఉన్నాయి. వీటి గుట్టు బయటకు లాగనున్నారు. ఈ విచారణ ద్వారా మరికొందరి పేర్లు వస్తాయని భావిస్తున్నారు. విశాఖలో వీరి స్నేహితులు దాదాపు 20 మంది వరకు డ్రగ్స్ వాడేవాళ్లమని అరెస్టు చేసిన సమయంలో చేసిన విచారణలో వెల్లడించాడు. విశాఖకు చెందిన మరో స్నేహితుడు స్వరూప్ రాజ్.. మ్యాడీని పరిచయం చేశాడని ఇంటరాగేషన్‌లో చెప్పాడు. దీంతో స్వరూప్‌ను కూడా నిందితుడిగా చేర్చారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా అజ్ఞాతంలోకి వెళ్లాడు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2022 Sep. Model 12 No.s Bolero Neos, 01 No. Scorpio, 02 No.s Tata Electric Cars & 01 No. Maruti Tours car for sale. M: 9293107575, 7386109141

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

WANTED DISTRIBUTORS
Milk Bread, Cream Buns, Sweet Buns, Biscuits, Plain Puffs, Cup Cakes, Instant Foods etc.
Attractive Margins upto 30%.
QUALIFICATION
Already having Line Distribution.
AREAS
West Godavari, Krishna & Guntur Districts.
MODEL DAIRY
VIJAYAWADA.
95534 65896
95421 51122

BUSINESS OFFER

IndiaStudent.Com AI-EdTech. Franchise Offer: @5L/Dist & Join Our Courses @22k, Learn, Reffer, Earn-Life time: ✆ 9908981464

Full రన్నింగ్ conditionలో ఉన్న Oil Mill అమ్మకం. కృష్ణాజిల్లా, నూజివీడు నందు ఎ.4.64 సెంట్ల భూమి Real Estateకి అనువుగా ఉండి తారురోడ్ Facingలో ఉన్న Oil Mill అమ్మకం. ✆ 81429 40999

స్త్రీ/ పు, చిన్నపెట్టుబడితో మీ ఆఫీసు/ ఇంటివద్దే గోల్డ్ జ్యువలరీ వ్యాపారంచేస్తూ ప్రతిరోజు ఫిక్స్‌డ్ సంపాదన పొందండి! ✆ 7013203996/ 7013544075.

ఇన్వెస్టర్స్‌కి వివిధ రంగాల్లో రియల్‌ఎస్టేట్, గోల్డ్‌ట్రేడింగ్, FMCG, ఫార్మ, OTT పెట్టుబడికి పూర్తి భద్రతతో ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. 7659977788.

FOR SALE

For Sale Running Briquette Plant Nr. Jangareddygudem Eluru A.P with DCM, Tractor Dryer Available: 9769071081.

కృష్ణా జిల్లా, పామర్రు, గుపార్‌సెంటర్లో హాస్పిటల్స్‌కు, ఫంక్షన్ హాల్స్‌కు అనుకూలమైన G+3 బిల్డింగ్ అమ్మకం. ✆ 94400 36242, 73374 41975.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001: 2015 Certified Co. House hold goods shifting any time any where. ✆ 97043 64389.

SOLAR PRODUCTS

రూ. 2000/-తో సోలార్ విద్యుత్ 30సం.ఫ్రీ కరెంట్. ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే. పోరంకి, ఉయ్యూరులో ఆఫీస్‌బాయ్స్ కావలెను. రేడియంట్ సోలార్ ✆ 81431 25777.

BUILDING CONSTRUCTION

Raghava Associates We Do VMC/ APCRDA/LRS /BPS Approvals, Elevations & Structural Designs, Building Contracts. ✆ 98851 12999.

BPS&LRS ద్వారా అనధికార బిల్డింగ్స్ & లేఅవుట్స్ క్రమబద్ధీకరించేందుకు సంప్రదించండి ANCISON ఇన్‌ఫ్రాటెక్ AP ఆర్కిటెక్ట్స్ & ఇంజినీర్స్. 94917 55456

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

WATER PROOFING

Tarun Slab Leakage works ★ 25y exp. ★ 5yrs warranty ★ Bathroom Leakage Grouting Epoxy works. ✆ 9494002285, 9951607504

WOOD

50 సం||ల వయస్సుగల 650 టేకుచెట్లు అమ్మకమునకు కలవు చుట్టుకొలత 4 నుండి 6 అడుగులు Contact: 98484 70700. నూజివీడు.

EDUCATION

Spot Admissions by 20/11: B.Sc AI/CSc - 5k, B.Com CA, BA Hist/ Sp Eng - 4k, PLNM Degree College, Opp: ANU, 9177408565.

TUITIONS

IIT Foundation and Maths Tution for 8th, 9th, 10th (State & CBSE) Inter (+1, +2) EAPCET B.Tech, B.Sc. ✆ 98858 83128.

HOME TUITIONS

Priya Home Tutions: 6th to 10th (State & Central) and Inter Maths. Specialization in Maths 100% Result. ✆ 93479 28272.

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG, All Objective సబ్జెక్ట్స్ ట్యూటర్స్‌కు. ✆ 92900 05677, 74165 35749.

హోమ్‌ట్యూటర్ కావలెను. (AM/PM) +2 స్టూడెంట్, అకౌంట్స్ స్ట్రీమ్, Feb26 వరకు కేసరపల్లి SLVలో exp. is not a criteria. ✆ 70136 59107 /80960 79887.

FINANCIAL SERVICES

All type of funds: Mortgage (any prop, with/ without income) Projects, subsidy, takeover, startup, Cheq fin for Busi/High Salary. Low int. Ct. 90193 88175.

మీ ఇళ్ళ బిల్డింగ్స్ కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ. 1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్ డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్ కప్ బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్ పేపర్, Anti Bird మెష్, ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గా ప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★ 25y exp 5yrs Warranty ★ SmellLess ★ Bayers Chemicals (Pest & Other Insects Control) 94940 02285, 9951607504

ప్రియాంక పెస్ట్ & వాటర్ ప్రూఫింగ్ వర్క్స్ 30 సం|| అనుభవం, 5 సం|| గ్యారెంటీ, వాసనలేని మరకలు పడని బేయర్ కెమికల్స్‌తో చెదలు నివారణ. బాత్‌రూమ్ లీకేజికి ఎపాక్సి గ్రౌటింగ్ పెట్టబడును. ✆ 93932 30136

INDUSTRY

భారీపరిశ్రమలోని ఉపయోగించిన/ పనికిరాని యంత్ర పరికరాలు కొనబడును. ఏదైనా పరిశ్రమ అమ్మాలని/ కొనాలని ఉన్నా సంప్రదించండి. amaravati.hyd26@gmail.com ✆ 94403 78266.

MACHINERY FOR SALE

అతి తక్కువ వాడిన 2021 మోడల్ 80 టన్నుల వేబ్రిడ్జి అమ్మకమునకు కలదు. ✆ 89197 42868.

PERSONAL INTEREST COURSES

MUSIC & DANCE CLASSES

Online Music Classes, Online Track (Song) recording, Our Youtube Channel: Cadence & Soul, Contact: 86883 31072.

PEOPLE CARE

OLD AGE HOME

విశ్వశాంతి గ్రూప్ VJA, వృద్ధులకు, పేషెంట్స్‌సేవకు, ఇంటి/వంట, బేబికేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 99517 51166, 95052 76677

REAL ESTATE

మంచి Investment చేయాలి అనుకుంటున్నారా! అయితే తక్కువ టైంలో ఎక్కువ returns వచ్చే మా రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ కండ్రిక వెస్ట్ బైపాస్ హైవేను అనుకుని 55 ఎకరాల Residential ప్లాట్స్ నందు invest చేసుకోగలరు. Pre Launching ఆఫర్ కలదు. ఫ్యామిలీతో సైట్ విజిట్ ఫ్రీ. ✆ 81848 96999.

గుంటూరుసిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు. 93999 55545.

గుంటూరు సిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అ/కొ. సంప్ర|| 89195 62183.

VJA వెస్ట్ బైపాస్‌కు 7KMలో, ఖమ్మం బైపాస్‌కు 2 KMలో కొత్తూరు తాడేపల్లి పైడూరుపాడు తారురోడ్డుపై W/N 1100 గజాల కమర్షియల్ స్థలము గజం 7000/- మాత్రమే ✆ 93925 61459

Developmentకి స్థలం మరియు సెకండ్ హ్యాండ్ అపార్ట్‌మెంట్స్ మరియు ఖాళీ స్థలాలు కండ్రిక బైపాస్‌కు దగ్గరగా వున్నాయి. ✆ 80089 75044.

FLAT FOR SALE

Gannavaram 3BHK Flat for sale. 85Lacs 98666 69123, 2BHK 4Flours Building for Sale. 3.5Cr (Under Construction). 76748 19123

సింగ్‌నగర్ తోటవారివీధి 9వ లైన్ శ్రీలక్ష్మీనరసింహ రెసిడెన్సీ నందు న్యూ 2 BHK ఫ్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. సంప్ర. ✆ 98662 01239.

VJA సిద్ధార్థనగర్, బ్యాంక్‌కాలనీ, మోడరన్ ఫుడ్స్ దగ్గరలో 2 BHK ఫ్లాట్ 1078 Sft E/F గ్రౌండ్ ఫ్లోర్ కబోర్డ్స్, కారు పార్కింగ్‌తో అమ్మకానికి కలదు. ✆ 94932 45833, 92464 72339.

VJA రామవరప్పాడు తూర్పు/ పడమర రోడ్లతో ఫ్లోర్‌కి ఒక్క ఫ్లాట్ చొప్పున నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలదు. ✆ 98485 98331.

APARTMENT FOR SALE



విజయవాడ చిట్టినగర్ ఏరియాలో 186 చ.గ. గల G+5 అపార్ట్‌మెంట్ లో ప్రతి ఫ్లోర్ 1350 SFT ఫుల్లీ ఫర్నీచర్, కార్ పార్కింగ్ మరియు లిఫ్ట్ సౌకర్యంతో పూర్తిగా కానీ, లేక విడివిడిగా కాని అమ్మబడును.
✆ 98660 72200

విజయవాడ ITI కాలేజ్ SBI బ్యాంక్ దగ్గర శ్రావణి గ్రూప్ హౌస్ నందు 2 BHK ఫ్లాట్ అమ్మకం. (2 వీలర్ పార్కింగ్) నో బ్రోకర్స్. ✆ 93908 70070.

పటమట, బందరురోడ్డు దగ్గర తూర్పు, ఫుల్ ఫర్నిష్డ్, టేక్ ఉడ్ వర్క్, 2 BHK (1200 Sft) ఫ్లాట్ UDS 43గ. RO వాటర్, 75ల ✆ 70938 80857.

4 BED ROOM
LUXURY FLATS
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 SQ FEET
UDS 137 YARDS
(INCLOUD 3 CAR PARKINGS)
20X15 BED ROOMS 4
10X15 & 10X8 BATH ROOMS 4
20X15 KITCHAN
20X15 DINNING HALL
20X15 DRAWING HALL
20X10 HOME THEATER
60X17 LIVING HALL
Prime Locality
Beside SIT Office
Prathuru Road, Tadepalli
CONTACT
gn-fab DOORS&WINDOWS
92464 95788 / 99

ఇబ్రహీంపట్నం, బ్రిలియంట్ స్కూల్‌రోడ్ 3BHK ఫ్లాట్స్ 2450Sft. 2&5 ఫ్లోర్లు 80ల. గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్, 2BHK ఫ్లాట్స్ 1250Sft. 1st ఫ్లోర్ 52ల. అమ్మకం ✆ 94931 21030, 79013 96499

Two BHK for sale, West Facing 1100sft at Patamata, Vijayawada, Car Parking, genuine buyers only Ph: 8179450006

2BHK Apartments For Sale in Eedupugallu With 2Lifts Near To Airport Cost 15Lakhs. ✆ 96426 61177.

New Luxury 3BHK 1800SF.t 52Sq Yds UDS E/F, 3rd Floor With Full Wood work Marvel Heights Mahanadu Road VJA. ✆ 94405 28023.

ముత్యాలంపాడు శ్రీనగర్‌కాలనీ, శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ వారి జంపాని హైట్స్‌లో న్యూ 3BHK డీలక్స్ ఫ్లాట్స్ సేల్. రెడీటు ఆక్యుపై ✆ 90520 66846, 8074815982

పోరంకి టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో కబోర్డ్ వర్క్, కార్ పార్కింగ్, CRDA అప్రూవల్‌తో 2 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 92464 75466.

4 BHK డీలక్స్ ఫ్లాట్ అమ్మకము
విజయవాడ, గురునానక్ కాలనీ NAC ఫంక్షన్ హాల్ దగ్గర, సుబ్బారావు కాలనీ, 4th క్రాస్ రోడ్డు, శ్రీ రాఘవేంద్ర ఎన్‌క్లేవ్ నందు 4 BHK డీలక్స్ ఫ్లాట్ అమ్మకమునకు కలదు
✆ 97017 88058

విజయవాడ భారతీనగర్ నందు గృహప్రవేశమునకు సిద్ధముగా 3BHK (3100 SF.t) సెంట్రల్ A/C, 3 కార్ల పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 99497 46789.

కానూరు నవతా ట్రాన్స్‌పోర్టు రోడ్డు ఈస్ట్‌ఫేస్ 3BHK సాయినగర్ క్యాపిటల్ ఎమ్‌పైర్ ఎదురుగా శ్రీ సాయి రెసిడెన్సీ నందు 2 ఫ్లోర్ 100% వాస్తు, కార్‌పార్కింగ్‌తో ప్లాట్లు అమ్మకం. 97016 99983

3 BHK PREMIUM FLATS FOR SALE
కరెన్సీనగర్, కనకదుర్గానగర్ కాలనీ, ప్రైమ్ లొకేషన్ 60 అడుగుల మెయిన్ రోడ్డు నందు ఫ్లోర్ ఒక్కటే కేవలం (5) ఐదు ఇండివిడ్యువల్ ఫ్లాట్స్ అల్టిమేట్ ఇంటీరియర్స్‌తో గృహప్రవేశనకు సిద్ధంగా ఉన్నవి.
✆ 83418 87324

నున్న విజయవాడ, 2&3 BHK Flats అమ్మకానికి కలవు 1180, 1685 Sq.ft, @ 32, 50 లక్షలు (Neg). Call: 99121 19999

విజయవాడ బందరురోడ్డు బస్‌టెర్మినల్ వద్ద వసిష్ఠ ఎన్‌క్లేవ్‌లో E/F 3BHK సూపర్ డీలక్స్ ఫ్లాట్ 2050 S.Ft కార్ పార్కింగ్ తో. ✆ 98663 09134.

2BHK 1134 Sft. E/F 2nd ఫ్లోర్ ఫ్లాట్ శ్రీరామ్ టవర్స్ సీతాపురం కాలనీ పోరంకి, విజయవాడ. ✆ 99630 52613.

ఉయ్యూరు పట్టణములో A.G.K నగర్ నందు నివాస గృహాల మధ్య ఓపెన్ ప్లాట్ అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించగలరు. ✆ 77996 17721.

చిన్నమనేని పాలీక్లినిక్ రోడ్ స్టెయిల్ యూనియన్ రోడ్ అజంతా అపార్ట్‌మెంట్ 1st ఫ్లోర్ వెస్ట్‌ఫేస్ 2 BHK ఫ్లాట్ UDS: 40 Sq.Yds. రిపేర్లు & కార్ పార్కింగ్ లేని తక్షణ గృహప్రవేశానికి సిద్ధంగా అమ్మకమునకు కలదు. ✆ 96527 77881.

FLAT FOR SALE
2620 Sq.ft 3 BHK
Ready to move
Fully Furnished (2 Floor),
Floor Wise Flat
SRI SESHADRINILAYAM
Near Sentini Hospital, VJA.
PH.9848120049

S.N.పురం (VJA) నర్రావారివీధిలో 2 BHK ఫ్లాట్ L Shape బాల్కనీ, కార్ పార్కింగ్‌తో (52 గ.లు) అమ్మకానికి కలదు. (నో బ్రోకర్స్) ✆ 94401 50109.

VJA మధురానగర్ పసుపుతోట 1st లైన్ గద్దెవారిపార్కు దగ్గర బృందావనం అపార్ట్‌మెంట్‌లో గృహప్రవేశానికి సిద్ధంగా 3BHK ఫ్లాట్స్‌అమ్మకం. 96666 54334

కాసా TVS, అశోక్‌నగర్ బందరు రోడ్డుకి ప్రక్కన నిర్మించిన 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి. ✆ 76800 70510.

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★విష్ణుప్రియ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

డబ్బులు వడ్డీలకు ఇచ్చి మోసపోకండి. 2BHK ధరకే 3BHK Flat అమ్మకం. నున్నరోడ్డులో అన్ని వసతులతో అమ్మకం. ✆ 81065 28668.

KANURU

Sri Lakshmi Nilayam, NTR Marg, Siri Nagar (Opp.Ria Orthopedic Hospital) Just 10 mins from Benz Circle 2BHK 1100 Sq.ft E/F, Car Parking Living: 950 Sq.ft, Site: 48 Sq.Yds Price: 65Lakhs WhatsApp Only: 76720 96106

3BHK - 1470Sft North, 2BHK- 1240Sft East, Ready to move at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opp. Priya Foods, Poranki, VJA. (C) 7702876445

బందరు రోడ్‌కి దగ్గరలో కానూరు రత్నదీప్ సూపర్ మార్కెట్ ప్రక్కన 2400SFt గల న్యూ 3BH డీలక్స్ ఫ్లాట్స్ గలవు. 89196 79256, 99898 55219

న్యూ 3 BHK ఫ్లాట్స్
కానూరు విజయలక్ష్మి థియేటర్ దగ్గర మైత్రి నగర్‌లో 1895 S.Ft. గల 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి.
99497 16957

3BH తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకానికి కలవు. ★ బల్లెంవారి వీధి, గౌరిశంకర్ నగర్, కానూరు 97017 98726, 89196 79256

కానూరు, మురళీనగర్, బల్లెంవారివీధిలో, E/W, న్యూ 3 BHK (1400 Sft.) ఫ్లాట్స్ కబోర్డ్స్, కారు పార్కింగ్, 58లక్షలు. ✆ 89195 70872/ 96428 47736.

TADIGADAPA

బందరు రోడ్డు సిద్ధార్థ Eng. కాలేజ ఎదురు తాడిగడప పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK (1800 S.Ft.) అమ్మకం. (ఫ్లోర్‌కి 1 ఫ్లాట్) ✆ 94400 31268

PENAMALURU

నార్త్ ఫేసింగ్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఫర్ సేల్ ఏరియా: 1082 Sq.ft పెనమలూరు బస్సు స్టాండ్- 3 కిలోమీటర్స్ near నాగేంద్ర స్వామి టెంపుల్. ✆ 9611124283.

CURRENCY NAGAR

VJA, కరెన్సీనగర్, డైమండ్ వ్యాలీ లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్లో 2&3&4 BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. ఏసీలు ఫ్రీ ఆఫర్. ✆ 86884 66789.

RAMAVARAPPADU

2BHK ఫ్లాట్ అమ్మకం 1100SFt, 2nd ఫ్లోరు లిఫ్టు కార్ పార్కింగ్ సౌ||లతో మనస్వినిహైట్స్, చిన్మయి జ్ఞాన మందిరం దగ్గర రామవరప్పాడు. ✆ 83743 34268

2BHK ఫ్లాట్స్ బల్లెం వారి St Medplus GF 800 plinth ఉత్తరం 22L SF 850 plinth West 25L. ✆ 79957 69538, 92464 93458.

GOLLAPUDI

గొల్లపూడి వస్త్రలత కాలనీ, వెస్ట్ బైపాస్ దగ్గర, గేటెడ్ కమ్యూనిటీలో 2&3 BHK ఫ్లాట్స్ జిమ్, స్విమ్మింగ్ పూల్ సౌకర్యంతో అమ్మకంనకు కలదు. ✆ 92464 72524

SATYANARAYANAPURAM

VJA, సత్యనారాయణపురం, మాచే నూతనంగా నిర్మించిన 2 BHK డీలక్స్ ఫ్లాట్స్ గృహప్రవేశానికి సిద్ధముగా కలవు. ✆ 94403 57164, 98666 01999.

HOUSE FOR SALE

VJA, బందరురోడ్డుకి దగ్గరలో అశోక్‌నగర్‌లోని కాకతీయ బజారు నందు 242 గజాలలో G+1 ఇల్లు అమ్మకం. ✆ 83416 37777, 77027 74977

బందరురోడ్, పోరంకి 150గ. నిర్మించిన బ్రాండ్‌న్యూ ఇండిపెండెంట్ G+1, గోసాల సెంటర్ దగ్గర ఇండిపెండెంట్ హౌస్ 45ల. అమ్మకం. ✆ 9394964999

VJA పెదపులిపాక రోడ్డు యనమలకుదురులో 96 గ||లలో 2B/R న్యూ G+1 బిల్డింగ్ గృహప్రవేశానికి సిద్ధంగా గలది అమ్మబడును. ✆ 92471 78887.

250గ||లలో డాబాఇల్లు 2 పోర్షన్స్ క్రింద. పైన 1 పోర్షన్ రేకులషెడ్ గజం 25వేలు మచిలీపట్నం నేషనల్ కాలేజ దగ్గర అమ్మకం ✆ 89785 42665

విజయవాడ ప్రసాదంపాడు బల్లెం వారి వీధిలో పెట్రోల్‌బంక్ దగ్గరలో 135 చ.గ.ల్లో G+2 బిల్డింగ్ ఒకొక్క ఫ్లోర్‌కి 2BHK అమ్మకం. 80740 23492.

నిడమానూరు-పోరంకి రోడ్, నిడమానూరులో (మెయిన్ రోడ్డు నుండి 2వ బిట్టు) 235 చ.గ.లలో నిర్మించిన G+2 బిల్డింగ్ (గ్రౌండ్ ఫ్లోర్ 1BHK+కార్ పార్కింగ్, 2&3 ఫ్లోర్స్ 2BHK హౌసెస్) మొత్తం వెరసి 3300 Sft అమ్మకమునకు కలదు. 98669 11199, 98668 33383.

నెలకు 20,000/-రూ|| అద్దె వచ్చు 102 గజాలు బిల్డింగ్ విజయవాడ ఖుద్దూస్‌నగర్‌లో అమ్మకమునకు కలదు సంప్ర: 80088 00875

విజయవాడ మాచవరం డౌన్ కాటూరి వారి వీధిలో 262 చ||గ||ల వెస్ట్ ఫేస్ G+1 ఇల్లు కార్ పార్కింగ్ అమ్మకానికి కలదు. ✆ 94401 77350.

పోరంకి- నిడమానూరు రోడ్డులో నారాయణపురం కాలనీ, గేటెడ్ కమ్యూనిటీలో పడమర ఫేస్‌తో ఇండివిడ్యువల్ హౌస్ అమ్మకం. ✆ 91826 60539, 95778 99899.

VJA గవర్నర్‌పేట, పాలపర్తి వారి వీధి, D.No. 27-31-3లో 156 గ|| G+3 బిల్డింగ్ 4 కార్ల పార్కింగ్ సౌకర్యంతో అమ్మకంనకు కలదు ✆9948114455

RAMAVARAPPADU

రామవరప్పాడు హైవేకి వాక్‌బుల్ డిస్టెన్స్‌లో 220 చ.గ.ల్లో గ్రౌండ్ +1st ఫ్లోరు +పెంట్‌హౌస్ గల ఇండిపెండెంట్ బిల్డింగ్ అమ్మకం. ✆ 98487 12347.

GANNAVARAM

Near Gannavaram Airport & Medha Towers, Kesarapalli, SSN Colony, Villa West Face 225 Sq.Yds 2BHK. ✆ 8885502102

LAND FOR SALE

Land for Development/ outright sale for apartments only in Kankipadu Town , Just 750 meters from RTC Bus Stand, Godavarru Main Road Area: 60 Cents/2831 Sq.Yards, Call for More Details: Mr. Srikanth Hyderabad Ph: 7661977789

14 Acres Road side Vari Polam for sale at Vinnakota of Krishna Dist. 45 lacs/ Acre. Call 94409 00565

450 ఎకరాల్లో ★ అవకాడో ★ పామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 6 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరానికి 2 లక్షలు ఆదాయం పొందండి ✆ 91335 74455

గుడివాడ మండలం కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. ✆ 93462 81147, 83676 38755.

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం 30+15 కలిపి లేక విడివిడిగా 45 ఎకరాల మంచి వ్యవసాయ పొలం NSP మేజర్ కాల్వ ఆనుకొని మొత్తం పైపులైన్లతో అమ్మబడును. ✆ 78425 99975

ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్ట్ భోగాపురం నేషనల్ హైవే ఆనుకొని 2 ఎకరాల 30 సెంట్లు అమ్మకమునకు కలదు. ✆ 63038 38351.

గుంటూరు దగ్గరలో కాటూరి మెడికల్ కాలేజ్ హాస్పిటల్ ప్రక్కన NH 16కి 450 మీ. దూరంలో 5 ఎ||ల కమర్షియల్ పొలము నీటి వసతితో అమ్మకం. 94419 41717

PLOT FOR SALE

గన్నవరంలో పాలిటెక్నిక్ నుండి హైవేకి వెళ్లే ఉత్తరం రోడ్డులో 5 ప్లాట్‌ల తరువాత 3 సెంట్స్ అమ్మకమునకు కలదు. ✆ 73829 02887, 96404 41792

హైదరాబాద్: పటాన్‌చెరు, ఇంద్రేశం, విజాన్ సొసైటీ, రామేశ్వరబండ, ఐనోలు, ఈదుల నాగులపల్లి, గౌతమినగర్, కొల్లూరులో ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర: ✆ 85558 63999.

VJA పటమటలంక SBI ప్రక్కరోడ్డు నందు 67 X 41 కొ||తో పడమర ఫేస్ 307 చ||గ||ల స్థలము అమ్మబడును. సంప్ర: 98487 14252

విజయవాడ సిటీ, బెంజిసర్కిల్ 5 మినిట్స్ జర్నీలో ★ మంచి ప్రశాంతమైన వాతావరణంలో ఈస్ట్ & వెస్ట్‌ఫేస్ రెడీటూ కన్‌స్ట్రక్షన్‌కి అనువైన 133 గజాలు ప్లాట్లు కేవలం 30 లక్షలు ఫైనల్ రేటుతో అమ్మకం. ✆ 77320 51576.

బందరురోడ్డు 6 లైన్ హైవేకి దగ్గరలో 100 Ft. ప్రా. రోడ్డుని ఆనుకొని CRDAప్లాట్ అమ్మకం. 80% బ్యాంక్‌లోన్. గజం: కేవలం 18K మాత్రమే. ✆ 94905 14626

ఇబ్రహీంపట్నం రింగ్‌కి దగ్గరలో నిమ్రా మెడికల్ కాలేజికి Oppలో హైదరాబాద్ హైవేకి 200 మీ దూరంలో VTPS ఎంప్లాయిస్ లేఅవుట్‌కి దగ్గరలో క్యాపిటల్ అమరావతికి బైక్ మీద 10 ని.ల చేరువలో (బకానిక్ వంతెన మీదుగా) వున్న 2420 చ.గ.ల స్థలం అమ్మకమునకు కలదు. ✆ 94942 01245.

VJA ఆటోనగర్ 5th రోడ్, 3వ క్రాస్‌రోడ్లో క్రాంతి ట్రాన్స్‌పోర్ట్ ప్రక్కన, ప్లాట్ నెం. 208, 1000 చ.గ. స్థలం (కొ 50x 180) అమ్మకము ✆ 93921 11319

తాడిగడప 100 అ|| రోడ్డు KMV విద్యాన్ దగ్గర 45x60 కొ||తో వెస్ట్‌ఫేస్ 300 చ||గ||ల లేఅవుట్ ప్లాటు అమ్మకం. ✆ 93966 16555.

సింగ్‌నగర్ లూనాసెంటర్‌లో తక్షణ నిర్మాణానికి అనువైన 15 40 = 66.6 గజాల నార్త్ ఫేస్ ఖాళీస్థలం అమ్మకంనకు కలదు ✆ 93949 64999.

నందిగామ ఇళ్ళ దగ్గర్లో ఓపెన్ ప్లాట్స్ గ:8 వేలు, G.కొండూరు లేఅవుట్ ప్లాట్స్ గ: 11 వేలు, విజయవాడ అంబాపురం గ: 24 వేలు మాట్లాడు కోవచ్చు. ✆ 96182 82731

Guntur Satanapally Mainroad 2000 yds P/yd: 38000/- & Vijayawada H/W, Opp. Kamineni Hospital 2900 yds P/yd: 49,000/-. ✆ 98490 55557

మచిలీపట్నం ఆటోనగర్ ప్రక్కన పోతేపల్లిలో మెయిన్‌రోడ్ ప్రక్కన రైల్వేగేటుకు దగ్గరలో తూర్పు ఉత్తరం ఫేసింగ్‌తో 440చ||గ|| స్థలం అమ్మబడును. ✆ 90301 62444

VJA పోరంకి 40 అ. రోడ్స్ CRDA గేటెడ్ కమ్యూనిటీలో 174, 220, 330, 500గ. ప్లాట్లు చ.గ. 28,500/- స్పాట్ Reg. బ్యాంక్ లోన్‌తో ✆ 98498 65959

అమరావతి రాజధానిలో 200 అ. ORRకి దగ్గరగా మరియు హరివిల్లువారి అన్ని CRDA వెంచర్లలో 200, 300, 400 గ. డైరెక్ట్‌సేల్. ✆ 92464 73929

VJA హరివిల్లు క్వాలిటి డెవలప్‌మెంట్స్ గల అప్రూవ్డ్ ప్లాట్స్ మచిలీపట్నం, గన్నవరం, అంబాపురం, పరిటాలలో ప్లాట్స్ కంపెనీ సేల్ ✆ 95427 56666.

హరివిల్లు వారి మెగా గేటెడ్ కమ్యూనిటీ గండిగుంట, గన్నవరం, ఆగిరిపల్లి, పరిటాల, మచిలీపట్నం వెంచర్‌లలో కంపెనీ డైరెక్ట్ సేల్. ✆ 70368 25555.

విజయవాడ- అంబాపురం జగన్నాథ ఇండస్ట్రీస్ ప్రక్కన R.S. No.104/2 నందు తూర్పు ఫేస్ 336 చ||గ||ల స్థలం అమ్మకం. సంప్ర. ✆ 79894 66969.

విజయవాడ గుణదల VMC లేఅవుట్‌నందు, ప్లాట్ నెం.254, తూర్పు ఫేస్, 40 అ||రోడ్డు, 120 చ||గ|| ప్లాటు అమ్మబడును. ★ చ||గ|| 35,000/- ✆ 94406 61789

కంకిపాడు- ఉయ్యూరు CRDA గ || 10,000,Non- CRDA గ|| 5700/- కంచికచర్లలో గ|| 4500, 6499, CRDA 9499/- ✆ 72073 17577.

4999 to 8999/- CRDA, బైపాస్‌కి 2KM గన్నవరం, కంకిపాడు, మల్లవల్లి, నందిగామ, నున్న కేసరపల్లి, తాడేపల్లిలో 2/3 BH విల్లాస్. ✆8374936634

133.33 Sq.Yds కేవలం 1,00,000/- మాత్రమే వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133445755.

గచ్చిబౌలి, కొండాపూర్, నల్లగండ్ల, తెల్లాపూర్ & మోకిలా, తుక్కుగూడ పరిసర ప్రాంతాలలో ప్లాట్స్ అమ్మదలచిన, కొనదలచిన సంప్రదించండి. 9963077477.

VJA, పెనమలూరు CRDA LP No.104/25 ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 94404 83810.

బందరురోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్‌సైడ్ కంకిపాడు దగ్గరలో 810 చ||గ|| ప్లాట్ మొత్తం, లేక సగం కానీ అమ్మకం. ✆ 98483 43355.

గుంటూరు-విజయవాడ హైవేలో కాజా టోల్‌గేట్ దగ్గర CRDA అప్రూవల్ ప్లాట్లు కలవు. చ.గ. రూ. 19,999/- లకే బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 93944 44477.

G.కొండూరు మండలము ఆతుకూరు గ్రామం అంగన్‌వాడి కేంద్రము ప్రక్కలైను, P.No.6, 200 చ||గ|| స్థలము అమ్మబడును. ✆: 70131 99856, 98666 82037.

గుడవల్లిలో పడమర ఫేస్ స్థలం అమ్మకం CRDA అప్రూవ్ రావ్‌పిన్ వేణు వెంచర్‌లో 278 చ||గ|| స్థలం ఏలూరు రోడ్‌కి 300మీ|| దూరంలో రేటు 15 వేలు గజం. ✆ 98661 93232.

కేసరపల్లి - మేధా IT పార్క్ సమీపంలో 2100 చ||గ|| లేఅవుట్ స్థలం అమ్మకం. 60 అ|| రోడ్, IT కంపెనీలు, కమర్షియల్‌కు, ఆఫీస్‌లకు అనుకూలమైనది.
✆ 70366 62888
✆ 89780 66103

తాడిగడప LV ప్రసాద్ హాస్పిటల్ వెనుక గేట్ ప్రక్కన టీచర్స్ కాలనీలో 215 చ||గ|| E/F ప్లాట్ అమ్మకము. వెంటనే ఇల్లు కట్టుకోవచ్చు. ✆ 99518 35086.

వణుకూరులో 200 గజాలు 12000 గజం & ఉప్పులూరులో 8000 గజం లేఅవుట్ ప్లాట్లు కలవు గజం 6500 నాన్ లేఅవుట్ ప్లాట్లు కలవు. 9908166858

VJA రామవరప్పాడు LP No. 62/2024, గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్‌రిజి. ✆ 95531 29369, 97054 33765

అమరావతి ప్రతిపాదిత ఔటర్ రింగ్‌రోడ్‌కు చాలా దగ్గర గల 2 ప్లాట్లు 160 చ||గ||లు పరిటాల హైవే దగ్గర 350 చ||గ||లు పెరికెలపాడు, MIC కాలేజ్ సమీపంలో గల ప్లాట్స్ అమ్మబడును. (డైరెక్ట్) ✆ 76719 95087

మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ దగ్గర్లో శ్రీఆదిత్య టౌన్‌షిప్‌లో, N/E కార్నర్ UDA లేఅవుట్ 368 గ.ప్లాట్ అమ్మబడును. సగం కూడా ఓకే. ✆ 95818 26633.

ఎవర్‌గ్రీన్ ఎస్టేట్స్ వారి గేటెడ్ కమ్యూనిటీ, (54 ఎ.) అన్నిరకాల కనెక్టివిటీస్, CRDA &RERA ప్లాట్స్, VJA-Hyd 6 లైన్, ORR దగ్గర. ✆ 94904 03378

గన్నవరంలోనే 400, 700 గ|| 16999, అంపాపురం హైవే 11999 మల్లవల్లి దగ్గర 4500, 2/3 BHK 3999/- విల్లాస్ ✆ 93985 76997.

PENAMALURU

పునాదిపాడు సాయిచలపతి-2 ఉడా లేఔట్ 240 గ|| వెస్ట్ కార్నర్, కంకిపాడు బస్టాండ్ రోడ్ సాయి బాబా ఆలయం దగ్గరలో 248 గ|| ఈస్ట్ 123 గ|| వెస్ట్ ప్లాట్స్ అమ్మకం. ✆ 79957 78744

RAMAVARAPPADU

VJA రామవరప్పాడులో 350 ఎకరాల మెగా గేటెడ్ కమ్యూనిటీలో INT. స్కూలు, స్టార్ హోటల్ LP నెంబర్ గల ప్లాట్స్ అమ్మకం. ✆ 70937 56789.

GANNAVARAM

గన్నవరం ఎయిర్‌పోర్ట్ 9KM రైల్వేస్టేషన్ 6 KM పరిధి, పోలవరం కాల్వ ప్రక్కన, 100 అ. రోడ్డుతో, 10, 12,15 సెం. ప్లాట్లు. సెం: 2.5ల ✆ 99636 43786.

NH-5 టోల్‌గేట్ దగ్గరలో గన్నవరంకి 4km దూరంలో పొట్టిపాడు గ్రామంలో అమృతగార్డెన్స్ నందు 234 గజముల లేఅవుట్ ప్లాట్ అమ్మకం. ✆ 88856 12593

TADEPALLI

1000 sq.yds road facing approved layout near to mayuri tech park chinakakani for sale. Contact: 9014458976

GOLLAPUDI

విజయవాడ గొల్లపూడిలో కొత్త బైపాస్ వద్ద C కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ ప్రక్క రోడ్డులో 200, 400గ. లేఔట్ ప్లాట్లు. గజం: 25000లకే. ✆ 92907 63488

COMMERCIAL SPACE FOR SALE

Above 10,000 S.Ft. Plus House Built in 428 Sq. Y in Commercial Area Close to Bundar Rd & Pantakaluva Rd, P&T Colony-3 Suitable for Commercial Purpose. ✆ 94915 44908

తాడేపల్లి - గుంటూరు నేషనల్ హైవే ఫేసింగ్ 2500 చ.గ.ల్లో 85000 S.Ft. గల G+5 న్యూ కమర్షియల్ కాంప్లెక్స్ అమ్మకం. నో బ్రోకర్స్. ✆ 93962 03890

LEASE/ RENT

లీజు/ అద్దెకు
విజయవాడ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలని, NH అనుకొని Hotel Novotel సర్వీస్ రోడ్‌లో ICICI బ్యాంక్ ప్రక్కన D.No: 54-15-9 సత్యరాజ్ కాంప్లెక్స్ నందు 1800 చ||అ|| అన్ని సౌకర్యాలతో వ్యాపార సంస్థలకు, ప్రత్యేకంగా హాస్పిటల్స్‌కు అనువుగా ఉన్నది.
✆ 98482 78888
90520 22862

మచిలీపట్నం ముస్తాఖాన్‌పేటలో న్యూ ఇండిపెండెంట్ బిల్డింగ్ G/F 2BHK CCTV, Wifiతో అద్దె: 9000. ✆ 94412 50042, 98491 67170.

AGRICULTURE LANDS

విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామ పరిధిలో మంచినీరు సౌకర్యం కలిగి, పామాయిల్ తోటకు అనుకూలంగా ఉన్న 23 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకమును కలదు. ✆ 70717 27777.

TO LET

TO-LET 1st Floor, Flat No. A2, 3 BHK, 3 Bath, Car Parking, Ramakrishna Towers, Prakasam Road, Vishnuvardhana Rao Street, Suryaraopet, Vijayawada. Mobile: 98488 85657.

అద్దె కొరకు
విజయవాడ, ఇస్లాంపేట, డ్రైయిన్ వీధి, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ దగ్గర, డోర్ నెం. 9-62-9 మొదటి అంతస్తు హౌస్ మరియు ఆఫీసు కొరకు అద్దెకు ఇవ్వబడును.
(30 Feets x 15 Feets, 4 Rooms, Bathroom Facility and Front Balcony)
✆ 98485 98338

Individual house for rent 2bhk, 1 Bhk Penthouse for Bachelor Marutinagar, Eluru Road Vijayawada. ✆ 7799342228

HOUSE FOR RENT
6000 to 7000 sft.
(G+1) built up area in 800 square yards site with 400 square yards vacant area in Seetharamapuram, Barrister street, Opp. BJP Office for rent. Only for Hospital (Independent Consultancy Doctors)
Please Contact
8297149714
9848177638

2BHK Independent House 2nd floor for rent. Near Nalanda School, Beside Trendset Mall, Benzcircle, VJA. ✆ 99497 76210.

గాయత్రినగర్‌లో 3BHK పుల్లీ renovated ఫ్లాట్ 2nd ఫ్లోర్ E/F రెసిడెన్సీ/ ఆఫీసులకు అద్దెకు కలదు. ✆ 98854 42812/ 93921 06328.

COMMERCIAL

HYD హైవే 1-3/18-49 1stఫ్లోర్ తుళ్ళురువారి వీధి విద్యాధరపురములో 4200 S.Ft గల 4 పోర్షన్స్ బ్యాంకులకు కమర్షియల్స్‌కు అద్దెకు ✆ 99514 98811

గవర్నర్‌పేట గోపాలరెడ్డిరోడ్ 27-11-18, G/Fలో 2500 S.Ft ఆఫీసులకు, బ్యాంకులకు, గోడౌన్స్‌కు, స్టాక్ పాయింట్స్‌కు అద్దెకు కలవు ✆ 99514 98811.

కరీంనగర్ నడిబొడ్డున గత 30 సం|| నుండి శ్రీ బాలాజీ మెస్ (ఆంధ్ర మీల్స్) నడుచుచున్నది లీజ్ పీరియడ్ అయిపోయినందున ఈనెల ఖాళీ అవుతుంది. ఆసక్తి గలవారు ఈక్రింది Noకి సంప్రదించగలరు: 9866022250

VJA సత్యనారాయణపురం బాబురావుమేడ సెంటర్ సమీపంలో G+3, VSR నెక్సస్ కమర్షియల్ బిల్డింగ్ ఆఫీస్, బ్యాంక్స్, స్కూల్, కాలేజీలకు అద్దెకు కలదు. ✆ 98481 34240.

గాంధీనగర్ డి-మార్ట్ ప్రక్కన అద్దెకు (27 54) 1,458 Sft; ఆఫీస్, C&F, డిస్ట్రిబ్యూటర్స్, ప్రింటింగ్ ప్రెస్ , గోడౌనులకు అనుకూలం ✆ 98487 74420

42000 Sq.Ft Godown available for Rent in Telaprolu, 10 kms from Vijayawada Airport Rs: 12 Per Sq.Ft. ✆ 63013 39091.

Commercial Space for rent Governorpet, Opp Buckinghampet Post Office, Rajagopalachari Street, 1st Floor, 2200 S.Ft., 2nd Floor 2000 S.Ft., Suitable for Banks/ Corporate Office, Car parking available. Contact No. 98480 87357.

TO.LET
విద్యా సంస్థలకు, ఆఫీసులకు
12000 వేలు చ||అ కమర్షియల్ స్పేసు అద్దెకు ఇవ్వబడును.
దాసరి కమర్షియల్ కాంప్లెక్స్
జె.పి.రోడ్, భీమవరం-2
94408 70986
94403 56099

Salon Fully Made Up Ready To Occupy in Moghalrajpuram, Vijayawada. ✆ 90004 29220.

1,650 Sft Space (2Nos) For Shops / Office / Medical Agencies / Banks. Near Andhra Hospital Gollapudi ✆ 98491 00767.

Mahanadu-Ballemvari Road Junction 3Floors Complex Each 2300 Sq.Ft Stilt Parking Space for 9 cars, Suits for Hospital, Banks, Office etc. ✆ 95337 76699.

VJA గాంధీనగర్ స్వామివీధి, రాజ్‌యువరాజు థియేటర్ దగ్గర 1,500 S.ft & 800 S.ft గ్రౌండ్‌ఫ్లోర్ C&F గోడౌన్/షాప్స్‌కు అద్దెకు కలవు. ✆92464 72524.

బందరురోడ్‌కి 200 మీ.దూరంలో ఈడుపుగల్లు సెంటర్లో ఇండస్ట్రియల్ పవర్ 70 HP గల 3000 to 10000 Sft. షెడ్లు అద్దెకు. ✆ 97911 93789

మంగళగిరి (OPP) జనసేన ఆఫీసు హైవే ఫేసింగ్‌తో 4 ఫ్లోర్లు ఒక్కొక్క ఫ్లోరు 2000SFt E/F సెల్లార్ పార్కింగ్‌తో కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు. ✆ 98485 20402.

విజయవాడ రాయనపాడులో RCC బిల్డింగ్ G+1 3000 + 3000SFT 60KV కరెంట్ గూడ్స్ లిఫ్ట్, 40అడుగుల రోడ్డుతో అద్దెకు కలదు ✆ 9346477774

VJA ఆటోనగర్ 100 ఫీట్‌రోడ్డు కనకదుర్గ ఫైనాన్స్‌ఎదురుగా (G+1) బిల్డింగ్ 13,000 Sft. లోడింగు, అన్‌లోడింగ్ వీలుగా గోడౌన్ అద్దెకు . ✆ 84312 51822.

విజయవాడ గురునానక్‌కాలనీలో స్టార్‌బక్స్‌కి ఎదురుగా SBHకాలనీలో (ప్లాట్ నెం. 22) 3,000 చ.అ.లు విస్తీర్ణం ఉన్నబిల్డింగ్ ఆఫీసులకు/ బ్యాంకులకు కమర్షియల్‌గా అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి. ✆ 9848121859.

పటమట వినాయక టెంపుల్ స్ట్రీట్‌నందు 1000 Sft. మరియు 20,000 Sft Rent/ Leaseకి ఇవ్వబడును. Ph No. 88977 46847.

WANTED

సూర్యారావుపేట పరిధిలో హాస్టల్ కొరకు బిల్డింగ్ కావలెను ఇవ్వదలచినవారు సంప్రదించగలరు ✆ 78428 40344

SECOND SALE

20 అ||ల పాత షిప్పింగ్ కంటైనర్లు- 3 Nos ఆఫీస్ / గోడౌన్‌లకు అనువైనవి మంచి కండిషన్‌తో విజయవాడలో అమ్మకం. ✆ 94850 59999.

JOBS

విజయవాడ MRF షోరూమ్ నందు పనిచేయుటకు అనుభవం గల మేనేజర్ మరియు అకౌంటెంట్ కావలెను. సంప్రదించండి. సెల్: 98666 99991.

విజయవాడలోని ప్రముఖ పౌల్ట్రీ సంస్థలో పనిచేయుటకు మైక్రో బయాలజీ (పౌల్ట్రీ రంగంలో) చేసిన మైక్రో బయాలజిస్ట్ కావలెను. Qly: M.Sc., మైక్రో బయాలజీ, Exp. కనీసం 3 సం|| అనుభవం. ఈ క్రింద తెలిపిన వాట్సప్ నెంబర్‌కు అప్‌డేటెడ్ బయోడేటా పంపగలరు. 94908 42889.

హోల్‌సేల్ బట్టల షాపులో Tally బిల్లింగ్‌కు జీతం: 15K & లైన్ ట్రావెలింగ్ సేల్స్‌మెన్ జీతం: 30K కావలెను. సంప్ర: బీసెంట్ రోడ్డు, LIC ఆఫీస్ దగ్గర, VJA. ✆ 90307 81287

VJA ప్రముఖ కంపెనీలో సిస్టమ్ వర్క్‌లో అనుభవం గల ఆఫీస్ సూపర్‌వైజర్, Sr. సివిల్ ఇంజనీర్, Sr. మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. ✆ 94948 88106.

సోలార్ కంపెనీలో పనిచేయుటకు విజయవాడ & గుంటూరు పరిధిలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & టెక్నీషియన్స్ కావలెను. పెట్రోల్ అలవెన్స్+ ఇన్సెంటివ్స్ కలవు. టూవీలర్ ఉండవలెను ✆ 7793933878

Teachers for 6 to 10th Telugu, Hindi, English & Social, Study Hours, Spoken English, Computer faculty, Art Craft & Drawing Teachers. ✆ 8074528582.

Wanted Female Telecallers qualification any degree age limit: 25 to 45 years. Salary 10,000/- to 12000/- Working Location Master Minds College, Vijayawada. Contact Cell: 89781 80832.

Wanted Service Field Executive Qly: Inter & above, EXP: 1Year+, Location at Arugolanu, ✆ 90103 90009. Hanuman Junction.

Urgent Requirement QC In-Charge, QC Technicians, Operations Manager, Site Supervisors for concrete Batching Units in Amaravati. Coordinate with MNC Clients for Prestigious projects.Sal: Industry Standards Q:Graduation, Diploma in Civil. ✆ 91601 10560.

Required Telecaller & Marketing Executive. Exp. 0-2 Yrs. Loc: Vijayawada. Qul: Any Degree. ✆ 91103 23437, 70755 91661.

Crown Technology : Required persons M/F. Any Degree, B.Tech, Ai, AutoCAD, HR, QC, Sal 20-30k (Hyd). ✆ 95738 84429, 93467 98460

WANTED PRINCIPAL IDPS Defence Academy, Bapatla. Must have Defence Academy Experience Fluent in English & Telugu, Strong Knowledge of NDA, Indian Airforce, Navy & Army. ✆ 96033 10994.

Hardware and Network Engineers - Should Have Knowledge in Printer Installations and Network Sharing, Preferred Bank AMC Engineers. Con: 92464 75192, 90320 41574. mail: klcps2@gmail.com

Leading Animal Health Care product manufacturer & Exporter looking for 1) Sr. Executive Accounts payables, Qual: MBA Finance or B.Com Exp. 4 to 5 Yrs in Mfg Industry 2) Sr. Executive HR for payroll and statutory exp. 4 to 5 Yrs in Mfg Industry. Contact: 74168 28666.

MORE CLASSIFIEDS ON PAGES 12

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? కొండపల్లి పంచాయతీ రోడ్డులో చెత్త తరలించే వాహనాలు రావడం లేదు. సిబ్బందిని ప్రశ్నిస్తే ఆరు పంపుల కూడలి వద్దకు వెళ్లి పడేయాలని చెబుతున్నారు. - బాజీ, స్థానికుడు

✔ ఆ రహదారి నుంచే చెత్త తరలించే వాహనాలు వస్తుంటాయి. చెత్తను సేకరించాలని సిబ్బందికి సూచిస్తాం. - శ్రీను, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు - న్యూస్‌టుడే, కొండపల్లి



? స్థానిక బీసీ బాలికల వసతి గృహం సమీపంలో కాలువలో మురుగు నిలిచి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం.
- పి.రవికుమార్, గ్రామస్థుడు

✔ సమస్య తెలిసింది. సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణ చేపడతాం.
- బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

స్పందనకు వందనం



◆ ఆత్కూరు గ్రామంలో హిందూ శ్మశాన వాటికలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై కర్మకాండలకు నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను ఈ నెల 7వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా కార్యదర్శి శ్యామ్ స్పందించారు. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించారు.

◆ పట్టణంలోని 13వ వార్డులోని మురుగు కాలువలో, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని స్థానికుడు ప్రకాశరావు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారులు స్పందించారు. కార్మికులను పంపి వ్యర్థాలు తీయించారు.
- న్యూస్‌టుడే, జి.కొండూరు, తిరువూరు టౌన్

బాలికల విద్యకు ప్రోత్సాహం

కొండపల్లి, న్యూస్‌టుడే: బాలిక విద్యను ప్రభుత్వం ఎంతోగానో ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొండపల్లి బాలికోన్నత పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అవసరమైన వసతుల గురించి ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. అసంపూర్తిగా ఉన్న సౌకర్యాలతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యధిక మంది బాలికలు కలిగిన పాఠశాలకు వసతుల కల్పన విషయంలో ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పురపాలిక అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు వసతుల విషయమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ చిట్టిబాబు, జనసేన నాయకులు రామ్మోహనరావు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు కృషి

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని నూజివీడు రోడ్‌లో గల నూతన ప్రాంగణంలో ఆ బ్యాంకు జనరల్ మేనేజర్లు సీవీఎస్ భాస్కర్, ఎంవీ తిలక్‌లు శనివారం ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు నూతన ప్రాంగణానికి మార్చినట్లు పేర్కొన్నారు. బ్రాంచ్ మేనేజర్ సుధీర్ బాబు, స్థానికులు రాయల బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో 2025 ఏడాదికి గాను ఈ పంట నమోదు చేసుకున్న రైతుల ముసాయిదా జాబితాను ఈ నెల 14 నుంచి 17 వరకు రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు మండల వ్యవసాయాధికారి సూరిబాబు శనివారం తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పూత ఆలస్యం.. రైతు నైరాశ్యం

అధిక వర్షాల దెబ్బతో ఇబ్బందులు

మైలవరం, న్యూస్‌టుడే: అధిక వర్షాలు మామిడి పూతల్ని దెబ్బతీశాయి. ముందస్తుగా పూతలొచ్చే తోటల్లోనూ, ఇప్పటికే పిందె దశకు రావాల్సి ఉన్నా, అరకొరగా కన్పిస్తున్నాయి. సగానికి పైగా తోటల్లో కనీసం చూద్దామంటే మొగ్గలు కూడా కనిపించడం లేదు. అసలే మామిడితో నష్టాల బాట పడుతున్న రైతులకు, ఆదిలోనే పూతల ఆలస్యం నైరాశ్యాన్ని నింపుతోంది.

నామమాత్రమే.. పిందెలు..

నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల్లోనే మామిడి అధికంగా సాగవుతోంది. సుమారు 20 వేల ఎకరాలకు పైగా సాగవుతుండగా, అందులో రెడ్డిగూడెం మండలంలో ప్రతి ఏటా ముందస్తుగా కాయలు మార్కెట్‌కు వస్తాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా అక్కడ సైతం ఇంకా పిందె కట్టుకు నోచడంలేదు. అక్కడక్కడా తోటల్లోనే పిందెలున్నాయని రైతులు చెబుతున్నారు. మిగతా రెండు మండలాల్లో నామమాత్రంగా పూతలున్నాయి.



పలచగా పూతలొచ్చిన మామిడి చెట్లు

తేమ శాతం అధికమై..

సాధారణంగా అక్టోబరు నుంచే పూతలు మొదలయ్యే తోటల్లోనూ ఆలస్యమయ్యాయి. రెండు నెలల పాటు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలతోనే తేమశాతం అధికమై పూతల ఆలస్యానికి కారణమని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాంతో ఇప్పటికీ పావలా వంతు తోటల్లోనూ పూర్తిస్థాయిలో పూతల్లేవని చెబుతున్నారు. రెడ్డిగూడెంలో మండలంలోని పలు మెరక ప్రాంతాల్లో చిన్న పరిమాణంలో పిందెకట్టు కన్పిస్తోందని అంటున్నారు.

మూడు దఫాలుగా పిచికారీ

తోటల్లో పూతల కోసం ఇప్పటికే రైతులు మూణ్నాలుగా సార్లు రసాయన మందులను పిచికారీ చేశారు. అందుకు ఎకరానికి సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అయినా ఆశించిన స్థాయిలో పూతల్లేవని, ప్రస్తుతం మంచు పడుతున్న నేపథ్యంలో తేమ మరింత పెరుగుతుందని కలవరపడుతున్నారు. అదే జరిగితే పూతంతా బూజు పడుతుందని, కాయగా మారే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నరుకుళ్లపాడు, అన్నేరావుపేట పంచాయతీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ జె.సుశీలాదేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటుచేసే కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్మకాలు చేసి లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు ఉయ్యూరు సుబ్బారెడ్డి, నరుకుళ్లపాడు సర్పంచి ఎన్.అప్పిరెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు నేరుగా అమ్ముకోవచ్చు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ప్రారంభించనున్నట్లు ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు పత్తిని మార్కెట్ యార్డ్‌లో నేరుగా అమ్ముకోవచ్చని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరు పీఏసీఎస్‌లో సభ్యుడైన కర్నాటి రామిరెడ్డి అనారోగ్యంతో చనిపోగా సహకార సంఘం నుంచి వసూలైన రూ.10వేలను మట్టి ఖర్చుల కోసం అతని కుటుంబ సభ్యులకు శనివారం అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు వై.కృష్ణారావు తెలిపారు. సీఈవో జి.జమలారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సీఐఐ సదస్సు దోహదం

గంపలగూడెం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో జరుగుతున్న సదస్సులో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూస్‌టుడేతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పడానికి విశాఖ సదస్సు నిదర్శనమన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

ఆలయంలో విశేష పూజలు

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలస్వామి ఆలయంలో శనివారం అర్చకులు డి. వేణుగోపాలకృష్ణమాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం దేవతామూర్తులు మూలవిరాట్‌లను పంచామృతాభిషేకాలు పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



ఆదర్శప్రాయుడు బిర్సా ముండా

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమర యోధుడు ఆదివాసీల ఆరాధ్య దైవం బిర్సా ముండా జయంతిని చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన త్యాగాన్ని, ధైర్య సాహసాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం ఎ రమాదేవి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, వాసు, కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జి.కొండూరులో.. బిర్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఊటుకూరు, పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు సిద్దార్థ విద్యాలయంలో ప్రిన్సిపల్ సి.హెచ్. కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బిర్సా చిత్రపటానికి నివాళులర్పించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో టి.సరస్వతి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు బిర్సా ముండా చిత్రపటానికి నివా



గంపలగూడెంలో మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: సైబర్, డిజిటల్ అరెస్టు మోసాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడా అప్రమత్తంగా ఉండాలని తిరువూరు ఎస్సై కె. సత్యనారాయణ సూచించారు. తిరువూరు మండలం ముష్టికుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై శనివారం అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు హెల్ప్‌లైన్ నంబరు 1930కు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. బాలికలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్సై ఎ.సీతామహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు: ముష్టికుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ...

చరవాణికి బానిస కావద్దు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: చరవాణికి బానిసలై విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని ట్రైనీ ఎస్సై ఉమామహేశ్వర రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వికాస్ టెక్నో పాఠశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాల నివారణ గురించి వివరించారు. వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ నరెడ్ల వేణు కుమార్, ప్రిన్సిపల్ గౌస్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి చెన్నకేశవ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో శనివారం స్థానిక లిటిల్ స్టార్ పాఠశాలలో జరిగిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జీవితంలో సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో పి.వి.ఎస్ మణికంఠ (9వ), ఈ లోషిత (8వ), ఎస్ రేణుశ్రీ 8వ తరగతుల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ వై నరసింహారావు, ప్రిన్సిపల్ కె సరోజ కుమారి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కే పర్వీన్ సుల్తానా, జి కళ్యాణి, జి కృష్ణారావు, ఆర్ రాధ పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపల్ కె సరోజ కుమారి, ఉపాధ్యాయులు

శ్రీనివాసా.. పాహిమాం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను ప్రధానార్చకులు శ్యామ్‌సుందరశ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శోభాయమానంగా అలంకరించారు. వివిధ గ్రామాల భక్తులు దర్శించుకుని పాల పొంగళ్లతో మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు.



మెట్టగుట్టలో పూజలందుకున్న శ్రీనివాసస్వామి

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మూలపాడు ఎస్సీ శ్మశాన వాటిక అభివృద్ధికి చకచకా చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ డీఈ వెంకన్న తెలిపారు. ఆయన ఏఈ సాంబశివరావుతో కలిసి శనివారం మూలపాడు శ్మశానవాటికను పరిశీలించారు. అనంతరం వాటిక అభివృద్ధి కమిటీతో మాట్లాడారు. నాలుగు నిధులతో పాటు దాతల సహకారంతో శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించేందుకు అంచనాలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధిహామీ నిధులతో శ్మశానవాటికను మెరక చేయడంతో పాటు ప్రహరీ, రెండు గదులు నిర్మిస్తామన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో బోరు పంపు, స్నానాలు చేయడానికి పంపుల ఏర్పాటుకు అంచనాలు వేస్తామన్నారు. మిగిలిన పనులు కలెక్టరు ప్రత్యేక అభివృద్ధి గ్రాంటు నుంచి మంజూరు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శ్మశాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చింతపల్లి దాస్, సభ్యులు రమేష్, ఇస్సాక్ పాల్గొన్నారు.



శ్మశానవాటికను పరిశీలిస్తున్న డీఈ వెంకన్న, ఏఈ సాంబశివరావులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పోరాటాల ద్వారానే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలవాల సుందరయ్య అన్నారు. శుక్రవారం విస్సన్నపేట యూటీఎఫ్ కార్యాలయంలో విస్సన్నపేట మండల శాఖ కౌన్సిల్ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు బాబు, ప్రధాన కార్యదర్శి ఆకుల మురళి, గౌరవ అధ్యక్షుడు బి.వి. రామారావు, సహాధ్యక్షులుగా ఈ. నాగేశ్వరరావు, ఎస్.ఆనంద, కోశాధికారి కె.రాజశేఖర్, జిల్లా కౌన్సిలర్లుగా పి.రామకృష్ణారెడ్డి, కట్టా రవిబాబు, కె. వైకుంఠరావు ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, ఏలూరు జిల్లా కార్యదర్శి పి. వీరకోటి, నాయకులు కె రంగా, వి వెంకటేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుందరయ్య

అన్నదాతలూ..సందేహాలు తీర్చుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో మాధురి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల విషయంలో సందేహాలుంటే సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. అనంతరం బైపాస్ రోడ్డులో రిలయన్స్ పెట్రోల్ బంకులోని భద్రతా ప్రమాణాలు, ఇంధన కొలత, నాణ్యత, ధరల ప్రదర్శన, బిల్లు చెల్లింపుల విధానాలను పరిశీలించారు. తదుపరి శ్రీ వేంకటేశ్వర పిక్చర్ ప్యాలస్‌ను తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు ఆమె వెంట ఉన్నారు.

నెమలి కృష్ణాలయానికి విరాళం

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన కె.నగేష్, రాధ దంపతులు శనివారం రూ.50,121 విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. తమ విరాళాన్ని ఆలయంలోని గోవుల గ్రాసం కోసం వినియోగించాలని కోరినట్లు చెప్పారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టును దర్శించుకున్న దాతలకు ఆలయ అధికారులు ప్రసాదాలు, చిత్రపటం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న సహాయ కమిషనర్ సంధ్య

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: కళాశాల స్థాయిలోనే ఇంటర్న్‌షిప్ ద్వారా ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా ఇన్‌ఛార్జి డీఐఈవో ఎస్.సరళ కుమారి పేర్కొన్నారు. కళాశాలలో వృత్తివిద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు పలు గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ శిక్షణను శనివారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వ్యవహారాలు, కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి హైమావతి, ఒకేషనల్ సిబ్బంది రాధాకృష్ణ, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఇన్‌ఛార్జి డీఐఈవో సరళ కుమారి

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడుల సాధనకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గడిచిన 18 నెలల్లో సుమారు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనకు కృషి చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇళ్ల రవి, కళాశాల దాత హనిమిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు. జాబ్‌మేళాలో 157 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మరో 48 మంది తదుపరి ముఖాముఖీలకు ఎంపికైనట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇరుముడి ప్రియనే.. శరణం అయ్యప్ప

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రాఘవాపురం పద్దమ్మతల్లి దేవాలయంలో శనివారం అయ్యప్పస్వామి దీక్షాధారులు ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. [illegible] 44 మంది దీక్షాదారులు స్వామిని దర్శించుకునేందుకు బస్సులో తరలివెళ్లారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆలయంలో ఇరుముడి కట్టించుకుంటున్న దీక్షాదారులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించారు. శివహరి ప్రసాద్, ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు డివిజన్ అభివృద్ధి అధికారిణి ఏ వెంకటరమణ రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో వ్యక్తిగత పరిశుభ్రత-సమాజ పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించారు. ఎంపీడీవో టి. కె.వి.రమణ, హెచ్ఎం ధర్మశీల పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమందలలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, పోలిశెట్టిపాడులో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, సర్పంచి బి.చిట్టిబాబు, రామచంద్రాపురంలో తెదేపా మండల మాజీ అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి ఆయా గ్రామాల్లో సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీలు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛ కార్యక్రమాలపై ప్రతిజ్ఞ, ప్రదర్శనలు చేశారు.

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని వినగడపలో శనివారం ఎంపీడీవో టి.సరస్వతి ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివ రామాంజనేయులు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని సంస్థ ఆధ్వర్యంలో డీఏవీ పాఠశాలలో నిర్వహించారు.



మైలవరం: అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



గంపలగూడెం: వినగడపలో అధికారులు విద్యార్థుల ప్రదర్శన



రెడ్డిగూడెం: సూచనలిస్తున్న వెంకటరమణ

పుస్తక పఠనం ఎంతో మేలు

మైలవరం, న్యూస్‌టుడే: పుస్తకాలను చదవడం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చని ఎంఈఓ ఎల్.బాలు సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు.



గంపలగూడెంలో కథలు రాస్తున్న చిన్నారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో శనివారం పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. గంపలగూడెంలో విద్యార్థులకు కథలు, చేతిరాత పోటీలు పెట్టారు. ఎంఈవో నరసింహారావు గ్రంథాలయ నిర్వాహకులు వి.జ్యోత్స్న, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: జ్ఞాన సముపార్జనకు ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి విజయకృష్ణ సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన చేపట్టారు.

బడి పిల్లలూ జరభద్రం!



ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులు

నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ప్రధాన కూడళ్లు, రహదారుల్లో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ సరిగా లేకపోవడంతో వేగంగా వెళ్లే వాహనాల మధ్య బడిపిల్లలు రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆ సమయంలో అటు వాహనదారులు.. ఇటు బడిపిల్లలు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ట్రాఫిక్ పోలీసులు పాఠశాలలు వదిలే సమయంలో ట్రాఫిక్ నియంత్రణ చేస్తే బడిపిల్లలు సజావుగా ఇంటికి చేరుకోవచ్చు. నగరంలో మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో నాలుగు వైపుల నుంచి వాహనాలు రద్దీ ఉన్న సమయంలో పాఠశాల విద్యార్థులు రహదారి దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. -ఈనాడు, అమరావతి

కార్తికం.. శివోహం



సత్యనారాయణపురం విజ్ఞాన్ విహార్ పాఠశాలలో శతసహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక దీపోత్సవంలో.. శివలింగాకారంలో దీపాల వెలుగులు. - ఈనాడు, అమరావతి

రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్‌గా రామచంద్రరాజు

గాంధీనగర్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా గుంటూరు నగరానికి చెందిన పి.రామచంద్రరాజు ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విద్యార్థి సంఘ నాయకుడిగా కళాశాల స్థాయి నుంచే ఆయన సామాజిక సేవలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు పొందారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిర్ ఠాగూర్ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శిగా, భారతీయ విద్యా భవన్స్ గుంటూరు కేంద్ర సెక్రటరీగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. రెడ్ క్రాస్ గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులుగా రెండు దశాబ్దాల పాటు సేవలు అందించారు. 2016 నుంచి జిల్లా వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘాలను ఏకం చేద్దాం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : బీసీల్లో యాదవ, గౌడ తర్వాత సింహభాగం అగ్నికుల క్షత్రియులదేనని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పేర్కొన్నారు. ఆయా సంఘాలు, గ్రూపులను ఏకతాటిపై తీసుకువచ్చి రాష్ట్ర స్థాయిలో బలమైన సంఘాన్ని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. శనివారం మహాత్మా గాంధీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాలులో అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రాందాస్.. సంఘం బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు. అప్పుడే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను డిమాండ్ చేసి తీసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. పాపారావు మాట్లాడుతూ.. అన్ని సంఘాలను కలిపి ఒకటిగా చేయాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఇదే ప్రతి ఒక్కరి ఎజెండా కావాలని సూచించారు. తమ కులంలో రాష్ట్ర స్థాయిలో అనేక మంది నాయకులు, మేధావులు ఉన్నారని.. వారంతా సంఘం బలోపేతానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. అందరం కలిసి ఒక వేదికగా ఏర్పడాల్సిన అవసరం ఉందని వివరించారు. యువతకు ప్రాధాన్యం ఇద్దామని సభను కోరారు. పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ఒకే సంఘంగా ఏర్పడి కుల రక్షణకు పోరాటం చేద్దామని ఏకగ్రీవంగా ఆమోదించారు. అన్బుమణి రాందాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు బర్రె ప్రసాద్, కొక్కిలిగడ్డ సుబ్బారావు, అవనిగడ్డ నాగయ్య, కోదండ కృష్ణ, నాయక్ సాంబశివరావు, సీఆర్ రాజన్, పీతా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు, వేదికపై ప్రసాద్, సుబ్బారావు, నాగయ్య, కోదండ కృష్ణ తదితరులు

నందిగామకు శాశ్వత తాగునీటి పథకం

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామకు ఆసియా మౌలిక వసతుల అభివృద్ధి బ్యాంకు నిధులు రూ.106 కోట్లతో శాశ్వత తాగునీటి పథకం నిర్మిస్తున్నామని ప్రజారోగ్యశాఖ చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకరరావు తెలిపారు. శనివారం ఆయన, సీఈ ఎ.సుధాకర్, ఎస్ఈ డి.శ్రీనివాసరావు, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి చందర్లపాడు మండలం గుడిమెట్ల వద్ద కృష్ణానది ఒడ్డున నిర్మించే ఇంటెక్ వెల్ నిర్మాణ పనులు, అనాసాగరం వద్ద ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యను కలిసి దీనిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి టెండర్లు ఖరారు చేశారని, వచ్చేనెలలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇది అమల్లోకి వస్తే నందిగామకు 30 ఏళ్ల వరకు నీటి కొరత రాదన్నారు. నిత్యం ఒక్కొక్కరికి 135 లీటర్ల నీటిని ఇస్తామని చెప్పారు. ప్రజారోగ్య శాఖ డీఈ కృష్ణబాబు, మున్సిపల్ కమిషనర్ లోవరాజు, ఏఈ ఫణి శ్రీనివాస్, తెదేపా నాయకులు ఏచూరి రాము, అమ్మినేని జ్వాలా ప్రసాద్, కత్రోజు శ్రీనివాసాచారి, భాజపా నాయకుడు తొర్లికొండ సీతారామయ్య పాల్గొన్నారు.



కృష్ణానది వద్ద చర్చిస్తున్న చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, సీఈ సుధాకర్, ఎస్ఈ శ్రీనివాసరావు

చీఫ్ జస్టిస్‌కు స్వాగతం పలికిన జేసీ, సీపీ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ కుటుంబ సభ్యులతో కలిసి పుట్టపర్తి పర్యటన ముగించుకుని నగరంలోని నోవాటెల్ హోటల్‌కు వచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ అధికారులు గౌరవ వందనం చేశారు.



జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేసీ ఇలక్కియా తదితరులు

ఆకాశవాణి సంగీత సమ్మేళనం నేడు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 16న ఆకాశవాణి సంగీత సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆకాశవాణి డీడీజీ, కార్యాలయాధిపతి సోమేశ్వరరావు తెలిపారు. శనివారం లబ్బీపేటలోని ఆకాశవాణి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 1952వ సంవత్సరం నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ప్రముఖ సంగీత విద్వాంసులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 67వ సంగీత సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఎం.సుధాకర్‌మోహన్, కార్యక్రమ అనుసంధానకర్త చూండూరు మాణిక్యరావు పాల్గొన్నారు.

విదేశీయుల గోప్యతకు భంగం కలగకుండా నిఘా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విదేశీయుల భద్రత దృష్ట్యా వారి గోప్యతకు భంగం కలగకుండా పటిష్ఠ నిఘా ఉంచాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు పేర్కొన్నారు. శనివారం తన ఇమ్మిగ్రేషన్ వీసా ఫారినర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ (ఐ.వి.ఎఫ్.ఆర్.టి.)పై పోలీసు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విదేశీ పర్యాటకుల రాకపోకలు, వారి కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఇకపై ప్రతి నెలా మూడో శనివారం దీనిపై సమీక్షిస్తామని తెలిపారు. జిల్లా పర్యటన నిమిత్తం వచ్చే విదేశీయులు ఏ హోటల్స్‌లో ఉంటున్నారో తెలుసుకోవాలని చెప్పారు. వారి వివరాలను ఆయా హోటళ్ల నిర్వాహకులు పోర్టల్‌లో నమోదు చేసేలా చూడాలన్నారు. విద్యార్థుల వివరాలను సదరు విద్యాసంస్థల ప్రతినిధులు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే విదేశీయుల గోప్యతకు భంగం కలగకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, రూరల్ డీసీపీ బి.లక్ష్మీనారాయణ, ఏసీపీలు దుర్గారావు, స్రవంతి రాయ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ రాజశేఖరబాబు

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం శనివారం మహాత్మాగాంధీరోడ్డులోని కేడీసీసీ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్స్ కాబ్) ఛైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ ఛైర్మన్, కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో సమావేశమయ్యారు. సహకార సొసైటీల బలోపేతంపై చర్చించారు. రాష్ట్రంలోని సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయనకు వివరించారు. ప్రస్తుతం సీఎంఏ నిబంధనల ప్రకారం రూ.40 లక్షల క్రెడిట్ లిమిట్‌ను మరింతగా పెంచితే వ్యవస్థ బలపడుతుందని వివరించారు. రైతుల పంట రుణాలపై నాబార్డు నుంచి వచ్చే పరిమితిని తగ్గించకుండా దాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యుత్తమ పనితీరుతో గుర్తింపు పొందిన కరీంనగర్ డీసీసీబీని సందర్శించాలని నెట్టెంను ఆహ్వానించారు. రెండు సంస్థల మధ్య సహకార రంగం అభివృద్ధికి సంబంధించిన అనుభవాలు, ఉత్తమ పద్ధతుల మార్పిడి, పరస్పర సహకారంపై చర్చిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌రావుకు జ్ఞాపిక ఇస్తున్న రఘురాం, శ్యామ్‌మనోహర్

అంతరిక్ష రంగంపై ఆసక్తి కనబరచాలి



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త శేషగిరిరావు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : భారత్ అంతరిక్ష రంగంలో దూసుకుపోతున్న తరుణంలో యువత ఈ రంగంలోకి రావడానికి ఆసక్తి కనబరచాలని ప్రముఖ శాస్త్రవేత్త, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ వి. శేషగిరిరావు అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష రంగంపై ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపగ్రహ సేవలు లేని భూగోళాన్ని ఊహించలేమని, ప్రస్తుతం 12 వేల ఉప గ్రహాలు వివిధ రకాల సేవలు అందిస్తుండగా, వచ్చే నాలుగేళ్లలో ఈ సంఖ్య 68 వేలకు చేరుతుందని వెల్లడించారు. ఫొటోగ్రఫీ నిమిత్తం సుదూర గ్రహాలకు ఇప్పటికే రెండు నానో శాటిలైట్లు (ఇంటర్ ప్లానెటరీ) వెళ్లాయని, శాటిలైట్ డేటా సెంటర్లు రాబోతున్నాయని, కొన్ని దేశాలు చంద్రునిపై జీపీఎస్ దిశగా అడుగులు వేస్తున్నాయని చెప్పారు. శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ (సిస్టం రిలయబిలిటీ) పి. సునీల్ మాట్లాడుతూ స్పేస్ టూరిజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చంద్రయాన్ 4, 5 దశలు, గగనయాన్, ఆదిత్య మిషన్‌లతో పాటు చంద్ర మండల యాత్ర, అంతరిక్ష కేంద్రం ఏర్పాటు ప్రణాళికలతో భారత దేశం అంతరిక్ష రంగంలో అగ్రగామిగా ఉందని వెల్లడించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ మేకా రమేశ్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేశ్ సి.జంపాల, భౌతిక శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలను సత్కరించారు.

బీసీలకు రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : బీసీల రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యంగా పని చేస్తామని యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.హనుమంతరావు అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అత్యధిక శాతం బీసీలు ఉన్నా.. కొన్ని కులాలకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటి వరకు రాజకీయ ప్రాధాన్యత లేని ప్రతి కులానికీ ప్రాధాన్యత కల్పించడం, బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ ఐక్యవేదిక నాయకులు ఇంటూరి బాబ్జి మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం సాధిస్తేనే హక్కులు సాధించుకోగలుగుతామని చెప్పారు. దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగిడి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి లలిత్ ప్రజాపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, మణికంఠ, రామ్‌ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న హనుమంతరావు, బాబ్జి, సాంబశివరావు, రామకృష్ణ తదితరులు

నితీశ్‌కుమార్ ముందు చూపుతోనే బిహార్‌లో క్లీన్ స్వీప్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ముందు చూపుతోనే బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేసిందని తమిళనాడు పీఎంకే పార్టీ అధినేత, మాజీ కేంద్ర మంత్రి అన్బుమణి రాందాస్ పేర్కొన్నారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో 2023 సంవత్సరంలోనే నితీశ్‌కుమార్ జనగణన పూర్తి చేసి రాష్ట్రంలో స్థితిగతులను అంచనా వేశారని తెలిపారు. ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి కింద రూ.2 లక్షలు ఇచ్చి ప్రజలకు చేరువయ్యారన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ జనగణనలో విఫలమయ్యారని పేర్కొన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో ఏపీ, తెలంగాణలతో పాటు తమిళనాడుకు లాభమని చెప్పారు. డీఎంకే అధికారంలోకి రాక ముందు తమిళనాడు అప్పులు రూ.4 లక్షల కోట్లు ఉందని.. నాలుగున్నరేళ్లలో అది రూ.9 లక్షల కోట్లకు పైగా అయ్యిందన్నారు. తమిళనాడులో మద్యం అమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువన్నారు. రిజర్వేషన్ల సమస్యపై తమిళనాడులో జైల్‌భరో కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విజయ్ టి.వి.కె. పార్టీపై మాట్లాడుతూ.. వేచి చూద్దామని, ప్రస్తుతం ఆ పార్టీ హనీమూన్ పిరియడ్‌లో ఉందన్నారు. తాను ఏపీలో అగ్నికుల, వన్నీయకుల క్షత్రియులకు ప్రత్యేక రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి మాట్లాడతానని పేర్కొన్నారు. సమావేశంలో అన్బుమణి రాందాస్ సతీమణి సౌమ్య అన్బుమణి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్బుమణి రాందాస్

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -111 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 625 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

'క్రీడల్లో నకిలీ వయసు ధ్రువపత్రాలను అరికట్టాలి'

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడల్లో నకిలీ వయసు ధ్రువపత్రాలను అరికట్టాలని శాయ్ విశ్రాంత కబడ్డీ కోచ్ పోతినేని పద్మజా బాల ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలోని కబడ్డీ మైదానంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లుగా జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌ల్లో పాల్గొనే రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ క్రీడాకారులు నకిలీ పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర కబడ్డీ సంఘం వీరిని ప్రోత్సహిస్తే ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కబడ్డీలో మొదటి సారిగా యూత్ గేమ్స్ నిర్వహించగా.. రాష్ట్రం నుంచి ముగ్గురు క్రీడాకారులు భారత కబడ్డీ జట్టు శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారని, ముగ్గురు క్రీడాకారులు నకిలీ పుట్టిన తేదీ ధ్రువపత్రాలతో యూత్ (అండర్-18) విభాగంలో పాల్గొనడం విచారకరమన్నారు. ఈ విషయంపై తగిన ఆధారాలతో శాప్ అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. ఆ ఆధారాలను మీడియా ముందు ప్రదర్శించారు. అవనిగడ్డలో జరిగిన ఎస్సీ మైనర్ బాలిక గ్యాంగ్ రేప్‌లో నేరం ఆరోపించబడిన కొండలరావు అనే క్రీడాకారుడు జాతీయ జూనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని.. రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం మన క్రీడల దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. సమస్య పరిష్కరించాల్సిందిగా శాప్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వీటిపై చర్యలు తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె చెప్పారు.

☛ ఈ ఆరోపణలపై శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు స్పందిస్తూ తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చానని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



ఫిర్యాదు పత్రాలు చూపిస్తున్న పద్మజా బాల

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన విజయవాడ, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కటికెల ఏసు (22) పదో తరగతి వరకు చదువుకున్నాడు. కాంక్రీట్ పనులు చేస్తుంటాడు. 15 రోజుల క్రితం పనుల నిమిత్తం విజయవాడకు వచ్చాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి, స్వరాజ్య మైదానంలో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ వారి భవన నిర్మాణ పనుల్లో చేరినట్లు చెప్పారు. అద్దాల రాజేష్ ద్వారా ఆ కంపెనీ పనుల్లో చేరాడు. శనివారం తెల్లవారుజామున భవనం శ్లాబ్‌పై ఫ్లోరింగ్ పని చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చుట్టుపక్కల వారు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మణికంఠ అనే యువకుడు ఏసు తల్లిదండ్రులకు ఫోన్ చేసి వివరాలు చెప్పారు. హుటాహుటిన వారు విజయవాడకు వచ్చారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తండ్రి శ్రీను.. కన్నీరుమున్నీరయ్యారు. మంచి ఉద్యోగంలో చేరాడని ఆనందపడ్డామని, ఇంతలోనే ఈ ఘోరం జరిగిపోయిందని విలపించారు. సూర్యారావుపేట పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు కస్టడీలో అద్వైక కేసు నిందితులు

లెక్క చూపని డబ్బుపై ఆరా తీసిన సిట్ అధికారులు

విజయవాడ (పటమట), న్యూస్‌టుడే : అద్వైక ట్రేడింగ్ మార్కెటింగ్ కంపెనీ మోసం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితులైన తాడేపల్లి ఆదిత్య, అతడి భార్య సుజాత, ఏజెంట్ బాలకృష్ణమూర్తిని పోలీసులు శనివారం కస్టడీకి తీసుకున్నారు. మాచవరం పోలీస్ స్టేషన్‌లో వారిని విచారణ చేస్తున్నారు. అద్వైక కంపెనీలో పెట్టుబడి పెట్టిన 1150 మంది డిపాజిటర్లు సుమారు రూ.135 కోట్లు నష్టపోయారు. ఈ నగదును ఎటు దారి మళ్లించారనే కోణంలో విచారణ సాగింది. తన దగ్గర రూపాయి కూడా లేదని.. సేకరించిన నగదు మొత్తాన్ని ఏజంట్లు, డిపాజిటర్లకే చెల్లించినట్లు ఆదిత్య పోలీసుల విచారణలో తెలిపినట్లు సమాచారం. ఈ నెల 18 వరకు ఈ ముగ్గురు పోలీసుల అదుపులో ఉంటారు. వారి నుంచి కీలక విషయాలు రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. బంగారంతో పరారీ

పటమట, న్యూస్‌టుడే : యువతిని పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి ఆమె వద్ద బంగారం, నగదు తీసుకుని పరారైన వ్యక్తిని కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళానికి చెందిన ఓ యువతి అదే ప్రాంతానికి చెందిన వేముల దుర్గారావును ప్రేమించింది. తల్లిదండ్రులు వివాహానికి ఒప్పుకోక పోవడంతో ఇద్దరూ కలిసి శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరారు. ఈ నెల 14న రాత్రి విజయవాడ పీఎన్ బస్‌స్టేషన్‌లో బస్సు ఆగిన సమయంలో యువతి మరుగుదొడ్డికి వెళ్లగా.. బ్యాగ్ తీసుకుని దుర్గారావు పరారయ్యాడు. బ్యాగ్‌లో సుమారు 70 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు ఉంది. మోసపోయానని గ్రహించిన యువతి ఏడుస్తూ బస్టాండ్‌లో కూర్చుంది. కృష్ణలంక ఎస్సై గిరిధర్ బాబు, కానిస్టేబుల్ నరేష్ ఆమెను గమనించారు. ఆమె వద్దకు వెళ్లి అడుగగా తొలుత జరిగిన విషయం చెప్పలేదు. ఆమెను సముదాయించడంతో విషయం చెప్పింది. సీసీ కెమెరాల ఆధారంగా దుర్గారావు సమీపంలోని లాడ్జికి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకుని బంగారం, నగదు స్వాధీనం చేసుకుని కృష్ణలంక స్టేషన్‌కు తరలించారు. యువతి తల్లిదండ్రులకు సమాచారం అందించి.. వారు వచ్చాక ఆమెకు కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు.



అరుదైన పుస్తకం.. ఆదివారమే లభ్యం

మీ చిన్నారులకు రంగు రంగుల బొమ్మల పుస్తకాలు కారు చౌకగా కావాలా? మీ బామ్మ, తాతలకు పౌరాణిక పుస్తకాలు... మీ అబ్బాయికి పోటీ పరీక్షలకు.. మీ శ్రీమతికి వంటల పుస్తకాలు... ఇలా ఏవీ కావాలన్నా దొరుకుతాయి. ఇది ఎక్కడో కాదు.. ప్రతి ఆదివారం విజయవాడలో నిర్వహించే సండే మార్కెట్‌కు వస్తే సరి. సాధారణంగా ఆదివారం చాలా వరకు దుకాణాలు మూసివేస్తారు. కానీ గాంధీనగర్‌లో ఒక చోట మాత్రం సందడిగా ఉంటుంది. పిల్లలు, పెద్దలు, విద్యార్థులకు అందరికీ ఉపయోగపడే.. అరుదైన పుస్తకాలు గుట్టలుగా పోసి అమ్ముతారు. ఐలాపురం హోటల్ పరిసరాల్లోని ఫుట్‌పాత్‌లపై దొరుకుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై.. రాత్రి 9 వరకు అమ్మకాలు కొనసాగుతాయి.

అన్ని వర్గాల వారికీ.. ఆధ్యాత్మికం, పోటీ పరీక్షలు, వివిధ తరగతుల పాఠ్య పుస్తకాలు, ఇంజినీరింగ్, వైద్య విద్య, పిల్లల పుస్తకాలు, కథలు, నవలలు.. ఇలా అన్ని వర్గాల వారికి ఉంటాయి. పాతవే కదా అని కొట్టిపారేయకండి. ఎక్కడా దొరకనివి ఇక్కడే లభిస్తాయి. బేరమాడితే సగం కన్నా తక్కువ ధరకే వచ్చేస్తాయి. కావాల్సిన వారు.. దూరాభారమైనా విజయవాడ వచ్చి కొనుక్కుంటారు. పాత పాఠ్యాంశాలకు సంబంధించినవీ ఉంటాయి. పరుల సంఖ్యలో తీసుకువెళ్లేవారు ఉన్నారు. పిల్లలు, విద్యార్థులు, యువత.. ఎక్కువ మంది ఇక్కడే కొంటుంటారు.

– గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సరదాగా రోజంతా.. తిరిగేద్దాం జగమంతా..

★ గిరుల మధ్యలో వందల కి.మీల రైడింగ్ ★ దూరప్రయాణాలకు యువత ఆసక్తి

"నగర జీవనంలో చదువులు, ఉద్యోగాలతో ఉక్కిరిబిక్కిరయ్యే యువత.. వారాంతాల్లో తమ నిత్య జీవితాలకు దూరంగా వెళ్లిపోతున్నారు. పచ్చని చెట్లు, కొండలతో నిండి ఉండే అటవీ ప్రాంతాల్లోకి సుదీర్ఘ ప్రయాణాలు చేస్తున్నారు. చరవాణి సిగ్నళ్లు కూడా లేని ప్రాంతాల్లో.. పక్షుల కిలకిలరావాలు.. సెలయేళ్లు, జలపాతాలు, చల్లని గాలుల మధ్యలో.. గడిపి ప్రశాంతంగా తిరిగొస్తున్నారు. అదీ కూడా ఒక బృందంగా ఏర్పడి.. ద్విచక్రవాహనాలపై.. ఈ ప్రయాణాలు చేస్తున్నారు."

విజయవాడ నుంచి 240 కిలోమీటర్ల దూరంలోని మారేడుమిల్లికి వెళ్లి అక్కడి నుంచి అరకు వరకు ద్విచక్రవాహనాలపై సరదాగా వెళ్లొస్తున్నారు.. ఈ మొత్తం ప్రయాణం 500 కిలోమీటర్లు ఉంటుంది. నెలకోసారి ఇలాంటి ప్రయాణం చేసినా చాలు. నగర జీవనంలో ఉండే ఒత్తిడి మొత్తం ఎగిరిపోతోందని.. ఈ బృందాల్లోని సభ్యులు చెబుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని.. అంతా కలుస్తున్నారు. వీళ్లందరినీ జాగ్రత్తగా సుదూర ప్రయాణాలకు తీసుకెళ్లే బాధ్యతను.. విజయవాడ అడ్వెంచర్స్ క్లబ్(వీఏసీ), మరికొన్ని బైక్ క్లబ్‌ల నిర్వాహకులు తీసుకుంటున్నారు.

మధ్యలో ఏ సమస్య వచ్చినా..

ద్విచక్రవాహనాలపై సుదూర ప్రయాణాలు కావడంతో.. ముందుగానే వాహనాలను పక్కాగా సిద్ధం చేస్తున్నారు. ప్రయాణం మధ్యలో సమస్యలు వచ్చినా అక్కడికక్కడే మరమ్మతులు చేసుకునేలా.. అత్యవసర కిట్ పట్టుకెళ్తున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లేటప్పుడు అతి వేగం లేకుండా, పక్కా జాగ్రత్తలు, రహదారి నిబంధనలు పాటిస్తూ.. వెళ్లేలా వీరికి దిశానిర్దేశం చేసే అనుభవజ్ఞులైన సభ్యులు వీరి గ్రూపులో కనీసం ఒకరిద్దరు ఉంటారు. యువత కావడంతో.. వారిని చాలా జాగ్రత్తగా గైడ్ చేస్తూ తీసుకెళుతుంటామని.. వీఏసీ నిర్వాహకులు రఘునాథ్ రెడ్డి యునాది చెప్తున్నారు. ప్రస్తుతం కార్లలో కూడా బృందాలుగా విజయవాడ నుంచి సుదూరంలో ఉండే అటవీ ప్రాంతాలకు వెళ్లొస్తున్నారు.



రంపచోడవరం జలపాతాలు, కొండల వద్ద...

250కి.మి అడవుల్లో నుంచే..

విజయవాడలో తెల్లవారుజామున 5 గంటలకే బయలుదేరుతారు.. దారిమధ్యలో రంపచోడవరం నుంచి అరకు వరకూ మొత్తం కొండలు, అటవీ ప్రాంతం మీదుగానే దారి ఉంటుంది. ఎటుచూసినా.. కొండలు, చెట్లు, జలపాతాలే..అడవుల్లోనే ఆరు బయట రాత్రి బస, మారేడుమిల్లిలో జలపాతాలు, పచ్చని చెట్ల మధ్య గడుపుతూ.. అక్కడి నుంచి సమీపంలోనే ఉండే గుడిసె హిల్‌స్టేషన్‌లో కొంత సమయం గడపొచ్చు. అరకు నుంచి తిరిగి వచ్చేటప్పుడు విశాఖ వెళ్లి.. జాతీయ రహదారి మీదుగా విజయవాడకు చేరుకుంటారు.

– ఈనాడు, అమరావతి

కానూరు, పోరంకి, న్యూస్‌టుడే



ఎల్బ్రస్ ఎక్కా.. ఎవరెస్టు ఎక్కేస్తా..

పోరంకికి చెందిన అనుమోలు ప్రభాకర రావు 66 సంవత్సరాల 2 నెలల 5 రోజుల వయసులో రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి, చరిత్ర సృష్టించారు. దేశం నుంచి అతిపెద్ద వయసులో ఈ పర్వతాన్ని అధిరోహించిన వ్యక్తిగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించారు. ప్రపంచంలో ఎత్తైన ఏడు శిఖరాలను అధిరోహించాలనే ఆయన సంకల్పాన్ని ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారు. ఆఫ్రికా దేశంలోని టాంజానియా వద్ద 5,895 మీటర్ల ఎత్తులోని మౌంట్ కిలిమంజారో అయినా, రష్యాలోని 5,642 మీటర్ల ఎత్తులోని మౌంట్ ఎల్బ్రస్ అయినా, హిమాలయా పర్వత శ్రేణుల్లోని 5,324 మీటర్ల ఎత్తైన మౌంట్ ఎవరెస్టు బేస్ క్యాంపు అయినా తేలిగ్గానే అధిరోహించారు. ప్రతికూల వాతావరణం, ప్రాణాపాయ స్థితులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగారు.

2001 నుంచి.. ప్రభాకరరావు 2001 నుంచి పర్వతారోహణపై దృష్టి సారించారు. నిత్యం ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. ఉదయం సైకిల్‌పై విజయవాడ నగరం మొత్తం చుట్టివస్తారు. కృష్ణానదిలో గంటసేపు ఈత కొడతారు. మానసికంగా బలంగా ఉండేందుకు యోగాసనాలు వేస్తారు. 2027 నాటికి ఎవరెస్టు శిఖరం అధిరోహణే తన లక్ష్యమని అనుమోలు వివరించారు.

'కూత'కూ ఉందో లెక్క..

ఆ ప్రాంతంలో కూత వినిపిస్తేనే సమయం ఎంత అయ్యిందో తెలుస్తుంది. ఆ సమయానికి అనుగుణంగా దైనందిన కార్యకలాపాలను స్థానికులు చేసుకుంటారు. అలనాటి జ్ఞాపకాలను నేను మధురానుభూతిని పంచుతున్నాయి. ఇంతకీ విషయం ఏంటంటే.. 1968లో జనసంచారం అంతంతమాత్రంగానే ఉండేది. ఆ ప్రాంతంలో పాలఫ్యాక్టరీ(విజయ డెయిరీ) నూతన భవన నిర్మాణం చేసి ప్రారంభించారు. దానికి ఎదురుగా రీమేసూరిపేట కొండ ప్రాంతంలో పాకలు, రేకుల షెడ్లు, అక్కడక్కడ భవనాలు ఉండేవి. ఫ్యాక్టరీలో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు వాటిల్లో నివసించే వారు. సమయం ఎంత అయ్యిందో తెలుసుకోవాలంటే పాల ఫ్యాక్టరీ సైరన్ పైనే ఆధారపడి తమ కార్యకలాపాలు సాగించేవారు. ఉదయం 8, మధ్యాహ్నం 1, 2 గంటలకు, సాయంత్రం 4, అర్ధరాత్రి 12 గంటలకు సైరన్ మోగుతుంది. ఆ సైరన్ 3 మార్లు వెంట వెంటనే మోగితే ఒకరు చనిపోయినట్లు నిర్ధారణకు వచ్చేవారు. ఫ్యాక్టరీలో కొండ ప్రాంతంలో నివసించే ప్రజలు ఎవరు చనిపోయినా అందరికీ తెలిసేలా ఫ్యాక్టరీ వద్దకు పరుగులు తీసేవారు. ఈ సైరన్ ఇప్పటికీ మోగుతుందని స్థానికులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, చిట్టినగర్



విజయవాడ: చిట్టినగర్ సమీపంలోని పాలఫ్యాక్టరీ

ముత్యాలమ్మ చెట్టుకు మూడు వందల ఏళ్లు!

కంచికచర్ల మండలం గండేపల్లి పేరెత్తగానే వెంటనే గుర్తుకు వచ్చేది గ్రామంలో ఉన్న భారీ రావి వృక్షం. ఇప్పటి తరానికి ఈ చెట్టు గురించి పూర్తిగా తెలియకపోవచ్చు. దీని వయసు 300 ఏళ్లకు పైగా ఉంటుందని అని స్థానికులు తెలిపారు. ఈ రావి చెట్టును స్థానికులు ముత్యాలమ్మ చెట్టుగా పిలుస్తారు. ఈ వృక్షం సుమారు 20 సెంట్ల స్థలంలో శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. దీని కింద ముత్యాలమ్మ విగ్రహం ఉండడంతో నిత్యం ఇక్కడ పూజలు నిర్వహిస్తుంటారు. చెట్టు పూర్వ వైభవాన్ని కాపాడడంతో పాటు అమ్మవారి పూజలు నిమిత్తం స్థానిక సెంటిని కర్మాగారం సుమారు రూ.15 లక్షలు వెచ్చించి చుట్టూ ఇనుప గ్రిల్స్, గేట్లు, నాప బండలు, ప్రహరీ ఏర్పాటు చేసింది. అభివృద్ధి పనుల్లో భాగంగా కిందకు వాలి ఉన్న కొమ్మలను సైతం తొలగించకుండా వాటికి రక్షణగా ఏర్పాట్లు చేస్తూ పనులు నిర్వహించారు. తరతరాలుగా తమ గ్రామ దేవత కొలువై ఉన్న ప్రాంతంగా ఈ చెట్టును కాపాడుకుంటున్నామని స్థానికులు తెలిపారు.

– గండేపల్లి(కంచికచర్ల), న్యూస్‌టుడే



దాచుకున్నారు కానీ.. తీసుకోరేం మరి?

పదేళ్లుగా ఖాతాల్లో పేరుకున్న నగదు రూ.258.96 కోట్లు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

చదువుకునే రోజుల్లో బ్యాంకు ఖాతా తెరచి అందులో కొంత నగదు దాచుకుని మరిచిపోయిన వారు కొందరైతే.. వ్యాపార, వర్తక అవసరాలకు రెండు లేదా మూడు ఖాతాలు ప్రారంభించి పట్టించుకోనివారు మరికొందరు. ఇలా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 11.10 లక్షలకు పైగా ఖాతాలు పదేళ్లకు పైనుంచి ఎలాంటి లావాదేవీలు చేయకుండా నిస్తేజంగా ఉన్నట్టు ఆర్‌బీఐ గుర్తించింది. వీటికి సంబంధించి కృష్ణా జిల్లాలో రూ.113.48 కోట్లు, ఎన్టీఆర్ జిల్లాలో రూ.145.48 కోట్ల నగదు ఆయా బ్యాంకుల్లో పేరుకుపోయింది. ఈ సొమ్మును ఖాతాదారులకు తిరిగి ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధమయ్యాయి.

అవగాహన కల్పిస్తున్న బ్యాంకర్లు

ఖాతాల్లో నగదు మరచిపోయిన ఖాతాదారులకు బ్యాంకుల అధికారులు ఫోన్ చేయడం, మెసేజ్‌లు పంపించడం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది, పోస్టు ద్వారా సమాచారం చేరవేస్తూ డబ్బులు తీసుకెళ్లమంటున్నారు. జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో అన్ని బ్యాంకులు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్(డీఈఏఎఫ్)పై ఖాతాదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. వ్యక్తి



గత ఖాతాలే కాదు కొన్ని ప్రభుత్వ శాఖల ఖాతాల్లో రూ. లక్షల్లో నగదు పేరుకుపోయింది. బ్యాంకు అధికారులు తెలియజేస్తే ఆయా శాఖల అధికారులు నోరెళ్లబెడుతున్నారు. ఇటీవల కృష్ణా జిల్లా గృహ నిర్మాణ శాఖ ఖాతాలో రూ.30 లక్షలు వెనక్కి ఇచ్చారు.

డిసెంబరు నాటికి..

ఖాతాదారులు గతంలో ఏ అవసరాల కోసం ఖాతా ప్రారంభించారో దానికి సంబంధించిన పత్రాలు పట్టుకెళ్లి అవే ఆధారాలు చూపించి బ్యాంకుల డబ్బులు వెనక్కి ఇస్తున్నాయి. కొన్ని ఖాతాల్లో రూ.10-20 లక్షల్లో నగదు ఉంటే.. ఇంకొన్ని శూన్యంగా ఉన్నాయి. డిసెంబరు నాటికి ఈ ఖాతాలను పరిష్కరించాలని ఆర్‌బీఐ నిర్దేశించింది.

చనిపోయిన ఖాతాదారుల వారసుల డబ్బుల పంపకం విషయంలో విభేదాలు వస్తే చట్టపరంగా ఉంటుంది. ఖాతాదారుడు చనిపోతే మరణ ధ్రువపత్రంతో పాటు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేయాలి. డబ్బులు తీసుకునేవారి నుంచి కేవైసీ చేయించుకుని వారి ఆధార్, పాన్, ఓటర్ ఐడీ నకలు తీసుకుంటున్నారు.

మంచి అవకాశం

'ఈ ఖాతాల్ని 2025 ఆగస్టు 31కి ముందు పదేళ్లకు పైగా లావాదేవీలు జరపనివి. ఖాతాదారులు సొమ్ము పొందేందుకు ఇదే మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి' అని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లు రవీంద్రరెడ్డి, కె.ప్రియాంకలు కోరారు.

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో.. (రూ.కోట్లలో)

ఖాతా	ఎన్ని	నగదు
వ్యక్తిగత	10,69,699	193.91
వర్తక, వ్యాపార సంస్థలు	30,374	52.33
ప్రభుత్వ శాఖలు	10,383	12.72



ఈలలు.. కేకలు.. తెరమరుగు

ఈనాడు, అమరావతి

ఒకప్పుడు వెలుగులీనిన వెండితెర.. వెలవెలబోతోంది. సినీనటుల కటౌట్లతో కళకళలాడిన థియేటర్లు కల్యాణ మండపాలుగా మారిపోతున్నాయి. సినిమా వస్తే తోరణాలతో అలంకరించి హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టే స్థాయి నుంచి పాడుపడిన గోదాముల్లా తయారయ్యాయి. పెరిగిన నిర్వహణ భారం.. సామాజిక మాధ్యమాల ప్రభావం.. ఓటీటీల రాకతో గడ్డుకాలం వచ్చింది.

232 నుంచి 70కి..

సినీ పరిశ్రమలో ఎందరో మహానుభావులకు కృష్ణా పురిటిగడ్డ. అంతటి ఘన చరిత్ర ఉన్న ఈ ప్రాంతంలో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. 1990లో ఉమ్మడి జిల్లాలో 232 థియేటర్లు ఉండగా.. ఒక్క విజయవాడలోనే 52 ఉండేవి. 2010 నుంచి థియేటర్లు మూతపడటం మొదలైంది. 15 ఏళ్లలో 70కి పడిపోయింది. విజయవాడలో ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లు మినహాయించి 28 ఉన్నాయి. పంచాయతీ యూనిట్‌గా ఉండే సీక్లాస్ థియేటర్లు సైతం 100 నుంచి 8కి పడిపోయాయి. అవి కూడా భారంగా నడుస్తున్నాయి.

నిర్వహణ భారంతో..

ప్రస్తుతం ఓటీటీలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో థియేటర్‌కు వెళ్లడం, పెట్రోల్, పార్కింగ్, ఇంటర్వెల్ ఖర్చులను ప్రేక్షకులు వృథాగా భావిస్తున్నారు. ఓటీటీలో సమయం దొరికినప్పుడు సినిమా చూడొచ్చన్న భావన పెరిగింది. దీంతో థియేటర్లకు వెళ్లడం తగ్గించారు. పండగల సమయాల్లో తప్ప మిగిలిన సమయాల్లో సినిమాహాలు నిర్వహణ భారంగా మారింది. విద్యుత్తు ఛార్జీలు, ఇతర ఖర్చులు కలిపి నెలకు రూ.2 లక్షల వరకు అవుతోంది. దీంతో ఇక్కట్లు పడుతున్నారు.

ఏఐ ఉందిగా.. భయం లేదుగా..!

డిజిటల్ అరెస్టుల కట్టడికి ప్రత్యేక వ్యవస్థ రూపకల్పన

"దేశంలో డిజిటల్ అరెస్టు మోసాలు ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా సొమ్మును బాధితులు పోగొట్టుకున్నారు. మోసగాళ్లు డీఆర్ఐ, పోలీసు, సీబీఐ, తదితర ఏజెన్సీల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నారు." – ఈనాడు, అమరావతి

స్పందించిన సుప్రీంకోర్టు

ఇటీవల ఈ మోసాలపై సుప్రీంకోర్టు ధర్మాసనం సుమోటోగా తీసుకున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఇటువంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలనీ, ఉక్కు చేతులతో అడ్డుకట్ట వేయాలని అభిప్రాయపడింది. డిజిటల్ అరెస్టు కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఏఐ సాయంతో వీటికి చెక్ చెప్పేందుకు నడుం బిగించారు.



ఆ సమయం కీలకం..

మోసగాళ్లు చెప్పిన ఖాతాలకు నగదు బదిలీ చేసేందుకు బాధితులు బ్యాంకులకు వెళ్తున్నారు. దీంతో అక్కడే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు ఐటీ నిపుణులతో సాంకేతికతను అభివృద్ధి చేయిస్తున్నారు. ఇది చివరి దశకు చేరుకుంది. రెండు నెలల్లో ఇది పూర్తిగా వినియోగంలోకి వస్తుందని అంచనా. మోసగాళ్లు డబ్బులు బదిలీ చేసేందుకు తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. బ్యాంకులకు వెళ్లిన సమయం చాలా కీలకం. కొద్దిగా విచక్షణతో ఆలోచించేలా ఈ వ్యవస్థ తోడ్పడనుంది.

ఆందోళన పసిగట్టేలా..

* నగదు బదిలీ చేసేందుకు వచ్చే వారిని ఇప్పటి వరకు బ్యాంకులో సిబ్బంది అడుగుతున్నారు.
* ఇతర రాష్ట్రాలకు పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసే వారిని గుర్తించి ప్రశ్నిస్తున్నారు.
* ఎవరికి పంపిస్తున్నారు? ఎందుకు బదిలీ చేస్తున్నారు? అని ఒకటికి రెండుసార్లు మాట్లాడి వివరాలు ఆరా తీస్తున్నారు.
* ఇది అన్ని వేళలా సాధ్యం కాని పరిస్థితి.
* దీనికి బదులుగా బ్యాంకులో ప్రత్యేక ఫోన్ ఏర్పాటు చేసి.. ప్రతి ఒక్కరూ దాని వద్దకు వెళ్తే.. ఏఐ సాయంతో రూపొందించిన బాట్‌బాట్ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబడుతుంది.
* నగదు పంపాల్సిన బ్రాంచి ఐఎఫ్ఎస్‌సీ కోడ్.. ఏ అవసరం కోసం పంపుతున్నారు? మిమ్మల్ని ఎవరైనా ఒత్తిడి చేస్తున్నారా? ఏదైనా ఆపదలో ఉన్నారా? అని అడుగుతుంది.
* బాధితుడి భావోద్వేగాలను పసిగట్టేలా ప్రోగ్రామింగ్ రూపొందిస్తున్నారు. ప్రశ్నలు పూర్తయ్యాక సమాధానాలను బట్టి స్కోర్ ఇస్తుంది.
* దాని ఆధారంగా అవసరమైతే ఆ వ్యక్తిని కౌన్సెలింగ్ చేసి.. నిజంగా డిజిటల్ అరెస్టు బారిన పడితే లావాదేవీ జరగకుండా చూస్తారు.
* తద్వారా నగదు బదిలీ ఆగే అవకాశం ఉంటుంది.



అక్కన్న మాదన్న గుహలు.. అరుదైన చరితకు నెలవులు

ఇంద్రకీలాద్రి దిగువన కనకదుర్గానగర్ సమీపంలోని అక్కన్న, మాదన్న గుహలు.. చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతంలో 'ఉత్పత్తి పిడుగు' అనే శాసనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూర్వం గోల్కొండ తానీషా పాలనలో మంత్రులుగా ఉన్న అక్కన్న, మాదన్న ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఈ గుహలను విడిదిగా చేసుకున్నారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇంద్రకీలాద్రిపై అర్జునుడి తపస్సును భగ్నం చేసేందుకు కిరాతకుడు రూపంలో శివుడు వచ్చిన క్రమంలో వారి మధ్య జరిగిన వివాదాన్ని 'కిరాతార్జునీయం' పేరుతో శాసన రూపంలో నిక్షిప్తం చేశారు. విష్ణుకుండినులు, శాతవాహన మహారాజులు సైతం వీటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 8వ శతాబ్దానికి చెందిన లిపితో 'ఉత్పత్తి పిడుగు' అనే శాసనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పక్కన గుహలను తొలచడానికి వాడిన ఉలిని బిగించిన గద లాంటి పరికరం ఉందని పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి తెలిపారు. ఉత్పత్తి పిడుగు అంటే కొండల్ని తొలిచే ఒక శిల్పుల సంస్థ అని పేర్కొన్నారు.



'ఉత్పత్తి పిడుగు' శాసనం

- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

ఇనుముడించిన కళ

బందరు రోడ్డు పోలీసు కంట్రోల్‌రూం కూడలి వద్ద గతంలో ఏర్పాటు చేసిన స్క్రాప్ పార్కుకు నూతన సొబగులు అద్దారు. ఇనుప వ్యర్థాలతో తయారు చేసిన తూనీగ, డైనోసార్, లేళ్లు, కొంగల బొమ్మలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. పండిట్ నెహ్రూ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు ఈ స్క్రాప్ పార్కు దగ్గరగా ఉండడంతో అందరూ చూసి సెల్ఫీలు తీసుకుంటున్నారు.

-ఈనాడు, అమరావతి



తూనీగ



జింక, కొంగ



డైనోసార్

అంజికి ప్రేమతో..

ప్రస్తుత ఆధునిక సమాజంలో కుటుంబ సభ్యులను కోల్పోతేనే కొన్నేళ్లకు మర్చిపోతున్నారు. కానీ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురం గ్రామానికి చెందిన సుంకర జ్ఞానప్రకాశరావు కుటుంబం మాత్రం పెంపుడు కుక్క మరణించి ఏళ్లు గడుస్తున్నా కూడా మరవకుండా ఏటా దాని వర్ధంతి నిర్వహిస్తున్నారు. అంజి అనే పేరు గల శునకాన్ని వీరు ఎంతో ఇష్టంగా, కన్నబిడ్డ మాదిరిగా పెంచుకున్నారు. తమ కుటుంబంలో ఓ సభ్యుడిగా భావించి అల్లారు ముద్దుగా పోషించారు. ఎనిమిదేళ్ల కిందట అది చనిపోయింది. దానిపై ఉన్న మమకారంతో క్రమం తప్పకుండా ఏటా వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పైగా దాని జ్ఞాపకాలు పదిలం చేసుకుంటూ కాంస్య విగ్రహం తయారు చేయించుకుని మరీ తన ఇంటి ప్రాంగణంలో ప్రతిష్ఠ చేసుకున్నారు. మనుషులకే చనిపోయిన తర్వాత రెండేళ్లకు వర్ధంతి నిర్వహించడం అరుదుగా మారిపోతున్న ప్రస్తుత ఆధునిక కాలంలో ఓ శునకానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి, బంధువులకు, గ్రామస్థులకు ఏటా విందు ఏర్పాటు చేయడం అరుదుగానే భావించాలి.

– హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే



వయసు 50.. పతకాలు 200

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది.. గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టించగలరనడానికి ఉదాహరణగా గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని మత్తి అరుణ నిలిచారు. పెడన మండలం చెన్నూరు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సమయంలో ఆమె ప్రారంభించిన కబడ్డీ కూత.. చెన్నైలో ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించిన ఆసియా మాస్టర్ అథ్లెటిక్ పోటీల వరకు అనేక పతకాల మోత మోగించింది.

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

అరుణ వయసు 50 ఏళ్లు దాటినా ఇప్పటికీ వివిధ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధిస్తూ.. విద్యార్థులను సైతం వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. 2002లో చల్లపల్లి మండలం కొత్త మాజేరులో వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆమె.. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ వచ్చారు. ప్రస్తుతం గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. అరుణ శిక్షణలో అనేక మంది విద్యార్థులు కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ తదితర విభాగాల్లో రాష్ట్రస్థాయిలో, సైకిల్ పోలో, టెన్నిస్‌బాల్ క్రికెట్, ఫెన్సింగ్ క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. ఎక్కడ పనిచేస్తే అక్కడ ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయించారు.



అరుణ

వివిధ దేశాల క్రీడాకారులతో కలిసి.. కబడ్డీతో పాటు పరుగు, లాంగ్‌జంప్, హైజంప్‌లో కూడా అరుణ ప్రావీణ్యం సాధించి అనేక పతకాలు సాధించింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన జాతీయస్థాయి వెటరన్ అథ్లెటిక్ పోటీల్లో పరుగు, లాంగ్ జంప్, హైజంప్‌లో 50ప్లస్ విభాగంలో పోటీపడి బంగారు పతకాలు సాధించారు. తాజాగా చెన్నైలో నిర్వహించిన 23వ ఆసియా మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దేశం తరపున వివిధ క్రీడాకారులతో కలిసి పాల్గొన్నారు.



ఆసియా మాస్టర్ అథ్లెటిక్ పరుగు పోటీలో పాల్గొన్న అరుణ (2వ నంబర్)

పసిడి @150

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాల క్రీడాకారులతో కలిసి 100 మీటర్ల పరుగు పోటీలో తలపడ్డారు. ఇప్పటి వరకు 200కు పైగా పతకాలు సాధించగా వాటిలో బంగారు పతకాలు 150కి పైగా ఉన్నాయంటే ఆమె ప్రతిభ, క్రీడలపై ఉన్న ఆసక్తి అర్థం చేసుకోవచ్చు. 'శరీరం సహకరించినంత వరకు క్రీడలను వదిలేదిలేదని, తాను తీర్చిదిద్దిన విద్యార్థులు ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు వివిధ హోదాల్లో స్థిరపడటం గొప్ప సంతృప్తినిస్తోంది'అని అరుణ తెలిపారు.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

అతిపెద్ద జనాభా ఉన్న భారత్‌లో ఆహార పంటలే ముఖ్య పంటలు. వరి, గోధుమ ఉత్పత్తిలో ప్రపంచంలోనే దేశం ప్రధాన వాటాదారుగా ఉంది. వరితోపాటు సజ్జలు, కొర్రలు, రాగులు తదితర పోషకాహార పంటల సాగులోనూ భారత్ మొదటి స్థానంలో ఉంది. ఆహార ధాన్యాల విషయంలో స్వయంసమృద్ధి సాధించడంతోపాటు ఎగుమతుల రూపంలో ఇతర దేశాల ఆకలినీ తీరుస్తోంది. భిన్న వాతావరణ పరిస్థితులు, ప్రాంతాల వారీగా వివిధ ఆహారపు అలవాట్లు ఉన్న దేశంలో ముఖ్య ఆహార పంటలు, వాటి సాగు అనుకూలతలు, నేలల రకాలు, ఉత్పత్తి పరిమాణాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సంబంధిత పరిశోధనా కేంద్రాల గురించి తెలుసుకోవాలి.



ఆకలిని గెలిచి.. అన్నపూర్ణగా నిలిచి!

ఆహార పంటలు

దేశవ్యాప్తంగా మూడు పంటకాలాల్లో రెండు రకాల పంటలు పండుతాయి. అవి ఆహార పంటలు, వాణిజ్య/ఆహారేతర పంటలు. స్వాతంత్ర్యానికి పూర్వం భారత్ ఆహారధాన్యాల కోసం ఇతర దేశాలపై ఆధారపడే స్థితి ఉండేది. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలు, పంచవర్ష ప్రణాళికల కారణంగా ఆకలి బాధలను దాటుకుని ఎగుమతి చేసే స్థాయికి అభివృద్ధి చెందింది. అన్నపూర్ణగా నిలిచింది. 1951లో దేశ జనాభా 36 కోట్లు, సాగు యోగ్య భూమి 13 కోట్ల హెక్టార్లు ఉండగా, నేడు (2025 నాటికి) 146 కోట్ల జనాభా, సాగు యోగ్య భూమి సుమారు 11 కోట్ల హెక్టార్లుగా ఉంది. పారిశ్రామిక అవసరాలు, నివాస ప్రాంతాలు, రవాణా మార్గాల కోసం వ్యవసాయ భూములు తగ్గుతున్నాయి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలకు భిన్న ఆహారపు అలవాట్లు ఉన్నాయి. అందుకు అనుగుణంగా వివిధ రకాల ఆహార పంటలను పండిస్తున్నారు. ప్రధాన ఆహారపు పంటలు వరి, గోధుమ, మొక్కజొన్న. వీటితో పాటు సిరిధాన్యాలుగా వ్యవహరించే జొన్న, రాగి, సజ్జ, కొర్రలు, సామలు, ఊదలు, అరికెలు, అండుకొర్రలు పండిస్తున్నారు. సిరిధాన్యాలనే ముతక ధాన్యాలు/ పోషక ధాన్యాలనీ అంటారు.

వరి



వరి పంట సమృద్ధిగా, విశేషంగా పండాలంటే అనువైన శీతోష్ణస్థితి చాలా అవసరం. ప్రధానంగా అధిక ఉష్ణోగ్రత, ఎక్కువ వర్షపాతం అవసరం. వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కాలువలు మొదలైన నీటిపారుదల పద్ధతులు, వసతులు కల్పిస్తే వరి బాగా పండుతుంది. దేశంలో అధిక శాతం జనాభా ఆహారపంట వరి. దేశవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. వరి ప్రధానంగా ఖరీఫ్ పంట. పంట కాలం 120 రోజులు. వర్షపాతం 150 - 200 సెం.మీ.లు, ఉష్ణోగ్రత సగటున 25 డిగ్రీలు అవసరం. రేగడి, ఒండ్రు, ఇసుక పొర నేలలు అనుకూలం.

* వరి ఉత్పత్తిలో భారత్ గతంలో చైనా తర్వాత రెండో స్థానంలో ఉండేది. ప్రస్తుతం (2024-25) 150 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో మొదటి స్థానంలోకి వచ్చింది. ఇదే సమయంలో చైనాలో 145.28 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగింది.

జొన్న



దీన్ని వర్షాధార పంటగా చెప్పొచ్చు. వర్షపాతం 50 సెం.మీ.ల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ, సగటు ఉష్ణోగ్రత 25-35 డిగ్రీలు కావాలి. దక్కన్ పీఠభూమిలోని ప్రజల ప్రధాన ఆహార పంట. జొన్న ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో 5వ స్థానంలో ఉంది. పంటకాలం నాలుగున్నర నెలలు.

సజ్జ



వర్షపాతం తక్కువ ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా పండిస్తారు. 30-50 సెం.మీల కన్నా తక్కువ వర్షపాతం ఉన్నా సరిపోతుంది. ఉష్ణోగ్రత 42 డిగ్రీల వరకు తట్టుకుంటుంది. సజ్జ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. నిస్సార, తేలికపాటి, నల్లరేగడి నేలలు, మెట్ట ప్రాంతాల్లోని ఎర్రనేలలు ఈ పంటకు అనుకూలం. ఇది ఖరీఫ్ పంట, పంట కాలం నాలుగున్నర నెలలు.

బార్లీ



ఎక్కువగా ఉత్తర భారత్‌లో, ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్‌లో పండుతుంది. గోధుమ కన్నా తక్కువ నీటివసతులున్న ప్రాంతాల్లో పండిస్తారు. వర్షపాతం 50-70 సెం.మీ., ఉష్ణోగ్రత 10-15 డిగ్రీల వరకు అవసరం. ఇది భారతదేశ శీతాకాల పంట (రబీ). తక్కువ ఉష్ణోగ్రత, తక్కువ తేమ ఈ పంటకు అనుకూలం. పంట కాలం ఐదు నెలలు.

రాగులు



వీటిలో పోషక విలువలు చాలా ఎక్కువ. ఎర్రనేలలు, తేలిక రకం నల్లనేలలు, ఇసుక నేలల్లో పండిస్తారు. నీటిపారుదల ఉన్న మాగాణి నేలల్లోనూ పండిస్తారు. 2024-25కి 180 లక్షల టన్నుల ఉత్పత్తితో భారత్ ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. ప్రధానంగా కర్ణాటక, తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో రాగులు పండిస్తారు. ఇది ఖరీఫ్ పంట. పంట కాలం మూడున్నర నెలలు.

ఓట్స్



ఈ పంటకు వర్షపాతం 80-100 సెం.మీ. వరకు, ఉష్ణోగ్రత 15-25 డిగ్రీల వరకు అవసరం. సాగుకు సారవంతమైన నేలలు కావాలి, ఉష్ణ ప్రాంతాలు అనుకూలం.

గోధుమ



ఇది సమశీతోష్ణ ప్రాంతపు పంట. రబీలో ఉత్తర భారతదేశ ప్రధాన పంట. సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీలు, వర్షపాతం 50-75 సెం.మీ. అవసరం. పంటకాలం ఐదు నెలలు. ప్రపంచ గోధుమ ఉత్పత్తిలో భారత్ 2024-25కి రెండో స్థానం(117.5 మి.మెట్రిక్ టన్నులు)లో ఉండగా, చైనా మొదటి స్థానం (140 మి.మెట్రిక్ టన్నులు)లో ఉంది.

మొక్కజొన్న



ఇది పేదల ఆహార పంట. ప్రధానంగా ఖరీఫ్‌లో సాగవుతుంది. పంట కాలం నాలుగు నెలలు. వర్షపాతం 50-100 సెం.మీ., ఉష్ణోగ్రత 18-27 డిగ్రీల వరకు అవసరం. ఇసుక రేగడి నేలలు అనుకూలం. నేల ఎంత మెత్తగా ఉంటే పంట దిగుబడి అంత ఎక్కువగా ఉంటుంది. 2024-25లో దేశంలో మొక్కజొన్న ఉత్పత్తి 423 లక్షల మెట్రిక్ టన్నులు.


కొర్రలు



ఇవి జొన్నల మాదిరిగా ఉండి, గింజలు చిన్న పరిమాణంలో ఉంటాయి. వర్షాకాలంలో సాగు ప్రారంభిస్తారు. జొన్నలకన్నా తక్కువ వర్షపాతం సరిపోతుంది. 2024లో ప్రపంచ కొర్రల ఉత్పత్తిలో 15 మిలియన్ టన్నులతో భారత్ మొదటి స్థానంలో ఉంది (నైజీరియా, చైనాలు 2, 3 స్థానాల్లో ఉన్నాయి).

ముఖ్యాంశాలు

* ప్రస్తుతం దేశంలో సాగులో ఉన్న భూమి - 11 కోట్ల హెక్టార్లు. * సిరిధాన్యాలనే ముతక ధాన్యాలు, పోషక ధాన్యాలు అని కూడా అంటారు.
* ప్రపంచ వరి ఉత్పత్తిలో భారత్ స్థానం - ప్రథమ స్థానం. * ప్రపంచ గోధుమ ఉత్పత్తిలో భారత్ స్థానం - ద్వితీయ స్థానం. * పేదల ఆహార పంట - మొక్కజొన్న. * జొన్న ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ స్థానం - 5వ స్థానం. * ప్రపంచ సజ్జల ఉత్పత్తిలో భారత్ స్థానం - మొదటి స్థానం. * రాగులు ఎక్కువగా పండించే రాష్ట్రం - కర్ణాటక. * బార్లీ పంట ఎక్కువగా పండించే రాష్ట్రం - ఉత్తర్‌ప్రదేశ్. * కేంద్ర వరి పరిశోధనా కేంద్రం ఉన్న ప్రాంతం - కటక్ (ఒడిశా) * హరియాణాలోని కర్నాల్ ప్రాంతంలో ఉన్న పరిశోధనా కేంద్రం గోధుమ, బార్లీలకు సంబంధించింది. * అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం - 2023.





రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

కరెంట్ అఫైర్స్ - మాదిరి ప్రశ్నలు



■ అంతర్జాతీయ టీ–20 క్రికెట్ పోటీల్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయుడిగా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు? (64 మ్యాచుల్లో ఈ ఘనత సాధించాడు.) జ: అర్ష్‌దీప్ సింగ్

■ అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? జ: సెప్టెంబరు 18 (ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2019లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది 'ఎఛీవింగ్ ఈక్వల్ పే ఫర్ వర్క్ ఆఫ్ ఈక్వల్ వాల్యూ టూ ఎన్స్యూర్ ఉమెన్స్ ఎకనామిక్ ఎంపవర్‌మెంట్, సోషల్ జస్టిస్, అండ్ ఓవరాల్ ఎకనామిక్ గ్రోత్' అనేది 2025 థీమ్.)

■ ఎంఎస్ఎంఈలకు ఆర్థిక ప్రాప్యతను పెంచడం, భారతదేశ డిజిటల్ చెల్లింపుల పర్యావరణ వ్యవస్థను విస్తరించడం ద్వారా ఆన్‌లైన్ చెల్లింపు అగ్రిగేటర్‌గా వ్యవహరించడానికి ఇటీవల ఏ సంస్థకు ఆర్‌బీఐ తుది అనుమతిని ఇచ్చింది? జ: ఫోన్ పే

■ నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన ఏ హిందీ చిత్రం 2026 ఆస్కార్ అవార్డులకు ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో భారత్ తరపున అధికారిక ఎంట్రీగా ఎంపికైంది? జ: 'హోమ్ బౌండ్'

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?




☛ ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ ఉద్యోగాలు (103)
చివరి తేదీ: 17 నవంబరు, 2025

☛ ఎన్ఈఈపీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు
చివరితేదీ: 17 నవంబరు, 2025

క్యాంపస్ కొలువు సాధనకో వ్యూహం! - జాబ్ స్కిల్స్



క్యాంపస్ ఇంటర్వ్యూలకు వందలు, వేలల్లో విద్యార్థులు హాజరవుతుంటే ఎంపికయ్యేవారు మాత్రం పదుల సంఖ్యలోనే ఉంటున్నారు. ఆ కొద్దిమంది విజేతల్లో ఒకరుగా నిలవాలంటే ముందుగా సొంత బలాలు బలహీనతలను తెలుసుకోవాలి. అందుబాటులో ఉన్న అవకాశాలను అంచనా వేసుకోవాలి. దాంతోపాటు ఉద్యోగానికి తామే తగిన అభ్యర్థి అని ఇంటర్వ్యూ చేసే సంస్థకు నిరూపించుకోవాలి. దాని కోసం మంచి వ్యూహాన్ని అనుసరించాలి. గతంలో ఎంపికైనవారి అనుభవాలను సేకరించుకోవాలి. వాటి ఆధారంగా తమ నైపుణ్యాలకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. అలాంటి స్కిల్స్‌ను పెంపొందించుకునే విధానాలనూ తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.




జీవితకాలంలో నీరు తాగదు ఆ జీవి!

విసర్జక వ్యవస్థ

జనరల్ స్టడీస్ - బయాలజీ

ప్రతి జీవిలో జరిగే జీవక్రియల ఫలితంగా ఏర్పడే వ్యర్థ పదార్థాలను, అదనపు నీటిని బయటకు పంపే ప్రక్రియలో పాల్గొనే అవయవాల సమూహమే విసర్జక వ్యవస్థ. ఇది విష పదార్థాల నుంచి జీవి శరీరాన్ని కాపాడుతూ, అంతర్గతంగా రసాయన సమతౌల్యతకు సాయపడుతుంది. మొక్కలు బాష్పోత్సేకం ద్వారా విసర్జన నిర్వహిస్తాయి. ఆకులు రాలడం, బెరడు ఊడిపోవడం అందులో భాగాలే. జంతువులు, మొక్కలు తదితర జీవుల్లో ఆ వ్యవస్థ నిర్మాణం, పనితీరు గురించి పోటీ పరీక్షలు రాసే వారికి కనీస పరిజ్ఞానం ఉండాలి. మానవ విసర్జక వ్యవస్థలోని ప్రధాన అవయవాలు, వాటి క్రియలు, అవి విఫలమైతే ఏర్పడే పరిణామాలు, డయాలసిస్ మొదలైన కృత్రిమ విసర్జక విధానాలపై అవగాహన కలిగి ఉండాలి.

1. మూత్రపిండాలకు సంబంధించి, కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండాల్లోని పుటాకార నొక్కును 'హైలస్' అంటారు.
   బి) ఇవి ముదురు ఎరుపు వర్ణంలో ఉంటాయి.
   సి) వెన్నెముకకు ఇరువైపులా ఉండే నిర్మాణాలు.
   డి) ఇవి చిక్కుడుగింజ ఆకారంలో ఉంటాయి.
   1) ఎ, బి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
2. బొమన్స్ గుళిక వద్ద ఉండే కణాలేవి?



   1) పొడోసైట్స్ 2) ఎడిపోసైట్స్
   3) మోనోసైట్స్ 4) 1, 2
3. మొదటి విసర్జక అవయవం?
   1) నెఫ్రాన్ 2) మాల్పీజియన్ గుళిక
   3) జ్వాలాకణం 4) మెటా నెఫ్రీడియం
4. కింది వాటిలో చేపల విసర్జక పదార్థం?
   1) యూరియా 2) అమ్మోనియా
   3) యూరిక్ ఆమ్లం 4) 1, 3
5. కింది వాటిని జతపరచండి.

జీవులు	విసర్జక అవయవాలు
1) ప్లనేరియా	ఎ) స్పర్శశృంగాలు/హరిత గ్రంథులు
2) వానపాము	బి) జ్వాలాకణం
3) బొద్దింక	సి) మాల్పీజియన్ నాళిక
4) రొయ్య	డి) వృక్కనాళిక

   1) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ 2) 1-బి, 2-డి, 3-ఎ, 4-సి
   3) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి 4) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
6. మూత్రపిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం?
   1) న్యూరాన్ 2) హెన్లీశిక్యం
   3) నెఫ్రాన్ 4) వాసారెక్టా
7. కింది వాటిలో అసత్య వాక్యాన్ని ఎన్నుకోండి.
   1) మానవ మూత్రపిండం 10-12 సెం.మీ.; పొడవు, 5-7 సెం.మీ. వెడల్పు; 2-3 సెం.మీ. మందంతో ఉంటుంది.
   2) రెండు మూత్రపిండాల సరాసరి బరువు 170 గ్రాములు.
   3) మూత్రపిండం పుటాకారతలంలో 'హైలమ్' అనే నొక్కు ఉంటుంది.
   4) మాల్పీజియన్ దేహంలో బొమన్స్ గుళిక, రక్తకేశనాళిక గుచ్ఛం ఉంటాయి.
8. కింది వాటిని వరసలో అమర్చండి.
   ఎ) నాళికాస్రావం
   బి) వరణాత్మక పునఃశోషణ సి) గుచ్ఛగాలనం
   1) ఎ, సి, బి 2) ఎ, బి, సి
   3) సి, ఎ, బి 4) సి, బి, ఎ
9. ఆరోగ్యవంతమైన మానవుడి గుచ్ఛగాలన రేటు?
   1) 125 మి.లీ./ని. 2) 300 మి.లీ./ని.
   3) 15 మి.లీ./ని. 4) 10 మి.లీ./ని.
10. మూత్రపిండ విధుల నియంత్రణలో ప్రముఖపాత్ర పోషించేవి ఏవి?
   1) అధోపర్యంకం 2) జక్స్‌టా గ్లామెరులార్
   3) గుండె 4) పైవన్నీ
11. మూత్రపిండాల మాదిరి వ్యర్థాలను బయటకు పంపే ఇతర అవయవాలు ఏవి?
   1) ఊపిరితిత్తులు 2) కాలేయం
   3) చర్మం 4) పైవన్నీ
12. కింది వాటిలో కాలేయంలో తయారయ్యే వ్యర్థాల్లో కానిది?



   1) బైలురూబిన్ 2) బైలువర్డిన్
   3) లాక్టిక్ ఆమ్లం 4) కొవ్వులు
13. మూత్రపిండాల్లో రక్తకేశనాళిక గుచ్ఛపు వాపు రావడాన్ని ఏమంటారు?
   1) గ్లామెర్యులా నెఫ్రైటిస్ 2) వృక్క కాలిక్యులి
   3) యూరేమియా 4) హెమటూరియా
14. కింది వాటిలో అత్యంత విషపదార్థం ఏది?
   1) యూరిక్ ఆమ్లం 2) అమ్మోనియా
   3) యూరియా 4) పైవన్నీ
15. కింది వాటిలో సరైన వాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రాన్ని విసర్జించే ప్రక్రియను 'మిక్చురిషన్' అంటారు.
   బి) మూత్రం లేత పసుపువర్ణంలో ఉంటుంది.
   సి) సరాసరి రోజుకు 25-30 గ్రా. యూరియా విసర్జితమవుతుంది.
   డి) మూత్రంలో గ్లూకోజ్, కీటోన్ దేహాలు ఉండటం డయాబెటిస్ మెల్లిటస్‌ను తెలుపుతుంది.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) బి, సి, డి
16. వాదన–ఎ: మొక్కల్లో విసర్జనకు ప్రత్యేకమైన నిర్మాణం ఉండదు.
   వాదన–బి: మొక్కల్లో విసర్జక పదార్థాలు ఏర్పడతాయి. అవి ప్రత్యేక పద్ధతుల ద్వారా విసర్జితమవుతాయి.
   1) ఎ సత్యం, బి అసత్యం. 2) ఎ, బి అసత్యం.
   3) ఎ, బి సత్యం.
   4) ఎ అసత్యం, బి సత్యం.
17. తన జీవితకాలంలో నీటిని తీసుకోని జీవి ఏది?



   1) కాంగ్రూన్ ఎలుక 2) లెపిస్మా
   3) యాడర్ స్నేక్ 4) ఒంటె
18. కింది వాటిలో మూత్రపిండం అధ్యయనం?
   1) నెఫ్రాలజీ 2) న్యూరాలజీ
   3) హెమటాలజీ 4) హెపటాలజీ
19. కింది వాటిలో మొక్కల్లో విసర్జక పద్ధతులు?
   1) బిందుస్రావం 2) బాష్పోత్సేకం
   3) వినిమయం 4) పైవన్నీ
20. ప్రపంచంలో అధిక బిందుస్రావాన్ని ప్రదర్శించే మొక్క ఏది?
   1) డ్రాసిరా 2) ట్రోపియోలం
   3) మోన్‌స్టెరా 4) లెమ్నా
21. షోరియా రోబస్టా నుంచి వచ్చే రెసిన్ ఏమిటి?
   1) రోసిన్ 2) టర్పెంటిన్
   3) పైన్ 4) డమర్
22. కింది వాటిలో తోళ్ల శుద్ధిలో ఉపయోగించేది?
   1) టానిన్లు 2) లేటెక్స్
   3) జిగుర్లు 4) రెసిన్
23. కింది వాటిని జతపరచండి.

ఆల్కలాయిడ్	మొక్క పేరు
1) మార్ఫిన్	ఎ) రావుల్ఫియా సర్పెంటైనా
2) క్వినైన్	బి) ఎరిత్రోజైలాన్ కోకా
3) రిసర్పిన్	సి) నక్స్‌వామిక
4) బ్రూసిన్	డి) సింకోనా అఫిసినాలిస్
5) కొకైన్	ఇ) పెపావరం సోమ్నిఫెరం

   1) 1-ఇ, 2-డి, 3-ఎ, 4-బి, 5-సి
   2) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి, 5-ఇ
   3) 1-ఇ, 2-డి, 3-బి, 4-సి, 5-ఎ
   4) 1-ఇ, 2-డి, 3-ఎ, 4-సి, 5-బి
24. ల్యుకేమియాను తగ్గించే ఆల్కలాయిడ్ ఏది?
   1) విన్‌క్రిస్టిన్ 2) కొకైన్
   3) డిజిటాలిస్ 4) బ్రూసిన్
25. టానింగ్ ప్రక్రియలో ఉపయోగించేవి?
   1) జిగుర్లు 2) లేటెక్స్
   3) టానిన్స్ 4) ఆల్కలాయిడ్
26. కిందివాటిలో నత్రజని సంబంధిత వ్యర్థపదార్థాలు?
   1) ఆల్కలాయిడ్స్ 2) లేటెక్స్
   3) టానిన్స్ 4) రెసిన్
27. కింది వాటిని జతపరచండి.

జాబితా–1	జాబితా–2
1) యూరియోటెలిక్	ఎ) క్రస్టేషియా
2) యూరికోటెలిక్	బి) కీటకాలు
3) గ్వానోటెలిక్	సి) సాలెపురుగు
4) అమ్మోనోటెలిక్	డి) క్షీరదాలు

   1) 1-డి, 2-ఎ, 3-సి, 4-బి 2) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-డి, 2-ఎ, 3-బి, 4-సి
28. కింది వాటిలో సత్యవాక్యాన్ని ఎన్నుకోండి.
   ఎ) మూత్రపిండం శరీరంలో నీటిని సంతులనం చేసే అవయవం.
   బి) ఎడమ మూత్రపిండం, కుడి మూత్రపిండం కంటే పెద్దది.
   సి) 40 ఏళ్ల తర్వాత ప్రతి పదేళ్లకు 10 శాతం క్రియాత్మక వృక్క ప్రమాణాలు తగ్గుతాయి.
   డి) బొమన్స్ గుళిక, గ్లోమరులాస్.. సముద్ర చేపలో, ఎడారి ఉభయజీవుల్లో ఉండవు.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి
29. హెన్లీ శిక్యాన్ని ఆవరించిన పరినాళిక, కేశనాళిక వ్లక్షాన్ని ఏమంటారు?
   1) బొమన్స్ గుళిక 2) గ్లోమరూలస్
   3) వాసారెక్టా 4) 1, 2
30. కింది వాటిలో దేని విచ్ఛిన్నం వల్ల యూరోక్రోమ్ ఏర్పడుతుంది?
   1) తెల్లరక్తకణాలు 2) రక్తఫలకికలు
   3) హిమోగ్లోబిన్ 4) కాలేయం
31. స్త్రీలలో కింది ఏ మూత్ర పరీక్ష ద్వారా గర్భధారణను నిర్ధారించవచ్చు?
   1) కాడవర్ పరీక్ష 2) పీసీఆర్ పరీక్ష
   3) గ్రావిడెక్స్ పరీక్ష 4) పెరిటోనియల్ పరీక్ష
32. డయాలసిస్‌కు అనువైన భాగం ఏది?
   1) ఫిస్టులా 2) ఒవేరియన్
   3) శరీరంలో ఏదైనా సిర 4) 1, 3
33. మొదటిసారిగా ప్రపంచంలో మూత్రపిండ పరీక్ష జరిపిన వ్యక్తి?
   1) డా.బీమాంట్ 2) చార్లెస్ ఆఫ్ నగేల్
   3) ఎడ్వర్డ్ జిర్న్ 4) క్రిస్టియన్ బెర్నార్డ్
34. కృత్రిమ మూత్రపిండాన్ని కనుక్కున్న శాస్త్రవేత్త?
   1) ఎడ్వర్డ్ జిర్న్ 2) జేమ్స్ హర్డీ
   3) క్రిస్టియన్ బెర్నార్డ్ 4) విలియం కోల్ఫ్
35. డయాలసిస్‌కు ఎన్ని గంటల సమయం పడుతుంది?
   1) 2 - 6 గం.
   2) 5 - 7 గం.
   3) 7 గం.
   4) 1 - 2 గం.



రచయిత: వట్టిగొనళ్ల పద్మనాభం

సమాధానాలు

1-4, 2-1, 3-3, 4-2, 5-1, 6-3, 7-2, 8-4, 9-1, 10-4, 11-4, 12-3, 13-1, 14-2, 15-1, 16-3, 17-2, 18-1, 19-4, 20-2, 21-4, 22-1, 23-4, 24-1, 25-3, 26-1, 27-1, 28-1, 29-3, 30-3, 31-3, 32-1, 33-2, 34-4, 35-1.

సత్యసాయి సన్నిధిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. అనంతరం సీజేఐ దంపతులను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ సన్మానించారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో తిరుపతి నుంచి పుట్టపర్తి చేరుకున్న సీజేఐకి.. అనంతపురం జిల్లా జడ్జి భీమారావు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీష్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో విజయవాడ బయలుదేరారు.



సత్యసాయి మహా సమాధి వద్ద సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ దంపతులు. చిత్రంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, అనంతపురం జిల్లా జడ్జి భీమారావు తదితరులు


విజయవాడలో సీజేఐకి ఘన స్వాగతం



సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌కు విజయవాడ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

గన్నవరం (గ్రామీణం), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటనలో భాగంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ శనివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. పుట్టపర్తి నుంచి నేరుగా ఇక్కడకు చేరుకున్న ఆయనకు హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ రమేష్, ఏపీ అడ్వొకేట్ జనరల్ డి.శ్రీనివాస్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సుబ్బోద్, హైకోర్టు సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.సత్యానందరావు, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహనరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో సీజేఐ విజయవాడ బయలుదేరి వెళ్లారు.

రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా తెలుగు వ్యక్తి



ఓ.శ్రీనివాస్

ఈనాడు, దిల్లీ: రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1989 బ్యాచ్ రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి ఓరుగంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదులు, పింఛన్లు, పింఛనుదారుల సంక్షేమ విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు దిల్లీ నుంచి స్వరాష్ట్ర క్యాడర్‌కు తిప్పి పంపిన మరుసటి రోజే సీఎస్‌గా నియమిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన ఈ నెల 17న బాధ్యతలు స్వీకరించనున్నారు. తండ్రి జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమంలో చీఫ్ ఎంటమాలజిస్ట్‌గా అరకు లోయలో పనిచేస్తున్నప్పుడు ఈయన అక్కడే 1966 సెప్టెంబరు 1న జన్మించారు. పుష్కరకాలంపాటు అరకులోయ, తెలంగాణలోని దుమ్ముగూడెంలో పెరిగారు. భద్రాచలం పంచాయతీస్కూల్లో చదివారు. ఓయూలో 1987లో కెమికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, 1989లో ఎంటెక్ పూర్తిచేశారు. తర్వాత ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన 2026 సెప్టెంబరు వరకు రాజస్థాన్ సీఎస్‌గా కొనసాగుతారు. తనకు అరకులోయలోని కోయ గిరిజనులతో మరువలేని జ్ఞాపకాలున్నట్లు ఇటీవల ఆయన రాసిన 'టువర్డ్స్ ఏ న్యూ ఇండియా' పుస్తకంలో పేర్కొన్నారు. ఈయన జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కూడా. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు మనుమరాలిని శ్రీనివాస్ వివాహం చేసుకున్నారు.

చంద్రబాబు సేవలకు సెల్యూట్ అంటూ వ్యాఖ్యలు

విశాఖపట్నంలో సెప్టెంబరులో జరిగిన 28వ నేషనల్ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌లో ఓరుగంటి శ్రీనివాస్ సీఎం చంద్రబాబు సేవలపై చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. "90వ దశకం నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కి మీరు ఇచ్చిన ప్రాధాన్యం ప్రభుత్వ సంస్థల పనితీరును మార్చి కోట్లమందికి ప్రయోజనం చేకూరింది. నేను అండర్ సెక్రటరీగా చేరినప్పుడు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు నేను 37 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకోబోతున్న తరుణంలోనూ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. మీరు దేశానికి చేసిన సేవలకు మేం చేస్తున్న సెల్యూట్‌ను స్వీకరించండి" అని చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామారావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న కార్యనిర్వాహక అధికారి ఏకే ఫరిడా, పక్కన శ్రీహరిరావు, రామచంద్రరాజు

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఛైర్మన్‌గా వైడీ రామారావు

ఈనాడు, అమరావతి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఛైర్మన్‌గా కాకినాడకు చెందిన వైడీ రామారావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రామచంద్రరాజు (గుంటూరు), కోశాధికారిగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు (తిరుపతి) ఎన్నికయ్యారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గ ఎన్నికలను శనివారం నిర్వహించారు. 22 జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు.. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రెడ్‌క్రాస్ ముఖ్య కార్యదర్శి, కార్యనిర్వాహక అధికారి ఏకే ఫరిడా తెలిపారు. నూతన సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. వీరు మూడేళ్లు పదవిలో కొనసాగనున్నారు. దేశంలోనే అత్యుత్తమ సేవలు అందించి ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని రామారావు తెలిపారు.

వోల్ట్‌సన్ ల్యాబ్స్‌కు 37 ఎకరాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లా నాయుడుపేట మల్టీపర్పస్ సెజ్‌లో సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రభుత్వం శనివారం 37 ఎకరాలు కేటాయించింది. ఆ సంస్థ ఇక్కడ రూ.1,743 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. 415 మందికి ఉపాధి కల్పించనుంది. ఎకరా రూ.60 లక్షల ధరతో ఈ భూమి కేటాయించారు. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (4.0) 2024-29 కింద పలు రాయితీలూ ఇవ్వనున్నట్లు పేర్కొంది.

శ్రీవారిని దర్శించుకున్న క్రికెటర్ శ్రీచరణి



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని భారత మహిళా క్రికెటర్ శ్రీచరణి శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రపంచకప్ గెలవడంతో కాలినడకన తిరుమల చేరుకుని మొక్కులు చెల్లించుకున్నానని చెప్పారు.





విత్తనాలు, ఎరువులు చల్లే 'కృషి బాట్' వ్యవసాయ రోబో ★ వక్క, వేరుసెనగను ఒలిచే, పొలంలో కలుపుతీసే యంత్రం

వ్యవసాయ క్షేత్రంలోకి రోబో!

- బెంగళూరులో ఆకట్టుకుంటున్న ఆధునిక యంత్రాల ప్రదర్శన

బెంగళూరు(శివాజీనగర), న్యూస్‌టుడే: బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం(జీకేవీకే)లో నిర్వహిస్తున్న వ్యవసాయ మేళాలో ఆధునిక యంత్ర ఉపకరణాలు రైతులోకాన్ని ఆలోజింప చేస్తున్నాయి. 'కృషి బాట్' సంస్థ తయారు చేసిన వ్యవసాయ రోబో విత్తనాలు చల్లడం, ఎరువులు వేయడం వంటి పనులు చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు వైభవ్ ఠాకర్ తెలిపారు. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, మొక్కజొన్న సాగుకు ఈ యంత్రాన్ని రిమోట్ కంట్రోల్ సహాయంతో ఉపయోగించుకోవచ్చు. అంతర్ పంటల సాగుకు, ఎరువులు చల్లేందుకు ఈ రోబోను సిద్ధం చేశామని వైభవ్ వివరించారు. ఈ యంత్రం పని తీరును శనివారం రైతుల ముందు ప్రదర్శించారు. ఈ పరికరానికి మేధో హక్కులు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. ఒడిశాలోని గిరిజన ప్రాంతాల్లో రాగి సాగును ఈ యంత్రంతో ప్రయోగాత్మకంగా చేపట్టామన్నారు. సంప్రదాయ పద్ధతిలో రాగుల్ని పొలంలో చల్లుకునేందుకు 15 కిలోలు అవసరం కాగా, తమ వ్యవసాయ రోబోతో మూడు కిలోలు సరిపోతాయని చెప్పారు. ముగ్గురు, నలుగురు కూలీలు చేయాల్సిన పనిని ఇది తక్కువ సమయంలో చేస్తుందని వైభవ్ తెలిపారు.

అణుశక్తిని ప్రజాహితానికే ఉపయోగిస్తామని చెప్పా

ఐరాస సమావేశం గురించి ఎంపీ పురందేశ్వరి



ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, దేవీచౌక్: అణుశక్తిని భారత్ ప్రజాహితానికి మాత్రమే ఉపయోగిస్తుందని ఐరాస జనరల్ అసెంబ్లీలో స్పష్టంగా చెప్పినట్లు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బార్బడోస్‌లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటేరియన్ సదస్సు, ఐరాస సమావేశాలకు దేశం తరపున వెళ్లిన ప్రతినిధి బృందానికి నాయకత్వ బాధ్యతలు చేపట్టడం అరుదైన గౌరవమని ఆమె పేర్కొన్నారు. అందుకు ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. గూగుల్ భారీ పెట్టుబడితో విశాఖకు వచ్చినందున పెట్టుబడులకు పునాది పడినట్లేనన్నారు. వైకాపా పాలనలో పెట్టుబడి పెట్టిన వాళ్లంతా వెనక్కి వెళ్లిపోతే, ఇప్పుడు అనేక మంది ముందుకొస్తున్నారని పురందేశ్వరి గుర్తుచేశారు.

విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు ప్రారంభం



సింగపూర్ వెళ్లే ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు



జెండా ఊపి సింగపూర్ విమానాన్ని ప్రారంభిస్తూ..

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ-సింగపూర్ ఇండిగో విమాన సర్వీసును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఉదయం ప్రారంభించారు. తొలుత సింగపూర్ నుంచి వచ్చిన ప్రయాణికులకు స్వాగతం పలికిన వెంకట్రావు.. అక్కడకు వెళ్లే ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ఇండిగో సంస్థ ప్రతినిధులతో కలిసి అందజేశారు. వారంలో మూడు రోజులు ఈ విమానం నడుస్తుందని, థాయ్‌లాండ్, శ్రీలంకలకు ప్రత్యేక సర్వీసులు నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరినట్లు చెప్పారు. 151 మంది ప్రయాణికులతో విమానం విజయవాడ చేరుకోగా.. 119 మంది ప్రయాణికులతో తిరిగి సింగపూర్ బయలుదేరింది. విమానంలో విజయవాడ వచ్చిన తెలుగుదేశం ఫోరం ప్రతినిధులు.. సింగపూర్‌కు నేరుగా సర్వీసు అందుబాటులోకి తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పాడేరులో నేడు బిర్సా ముండా జయంత్యుత్సవాల సభ

ఈనాడు, అమరావతి: పాడేరులో 'జన జాతీయ గౌరవ దివస్' పేరుతో ఈ నెల 16న భాజపా ఆధ్వర్యంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంత్యుత్సవాల సభను నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు తెలిపారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఈ సభకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్

- కూకట్‌పల్లిలో చిక్కిన నిందితుడు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్‌ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ప్రధాన నిందితుడు ఎట్టకేలకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిక్కాడు. ఐ బొమ్మ, బప్పం, ఐ విన్, బప్పం టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు రూపొందించి ఏడెనిమిదేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్‌సిరీస్‌లకు వేదికగా మార్చిన ఇమ్మడి రవి(40)ని శనివారం కూకట్‌పల్లిలో అరెస్ట్ చేశారు. ఇతడు నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లను గుర్తించినట్లు సమాచారం. నిందితుడిని బషీర్‌బాగ్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)కు తరలించి కీలక సమాచారం సేకరించారు. అనంతరం నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

సర్వర్లను హ్యాక్ చేసి..

ఏపీలోని విశాఖపట్నం నివాసి ఇమ్మడి రవి ఉన్నత విద్యావంతుడు. సాంకేతిక అంశాలపై మంచి పట్టు సంపాదించాడు. ప్రపంచంలో ఎలాంటి సర్వర్ అయినా, ఎంత భద్రత ఉన్నా హ్యాక్ చేయటంలో దిట్ట. పైరసీవైపు మళ్లిన అతడు కొత్త సినిమాలు భద్రపరిచే క్లౌడ్‌ఫ్లేర్, ఓటీటీ వేదికల సర్వర్లను తేలికగా హ్యాక్ చేసి హెచ్‌డీ క్వాలిటీతో సినిమాలు, వెబ్‌సిరీస్‌లను డౌన్‌లోడ్ చేసేవాడు. వాటిని కరేబియన్ దీవులు కేంద్రంగా ఉన్న సర్వర్లలో నిక్షిప్తం చేసి వెబ్‌సైట్ల ద్వారా ఉచితంగా వీక్షించే అవకాశం కల్పించాడు. తెలుగు సినిమాలు, వెబ్‌సిరీస్‌లతోపాటు కన్నడ, తమిళం, హిందీ, మలయాళం తదితర భాషలకు సంబంధించి తెలుగు డబ్బింగ్‌తో విడుదలైన వాటిని ఐ బొమ్మ, బప్పంలో ఉంచాడు. తానెవరో తెలియకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. 'నా వద్ద కోట్ల మంది డేటా ఉంది. ఈ వెబ్‌సైట్ మీద ఫోకస్ చేయటం ఆపండి' అంటూ గతంలో అతడు పోలీసులకు సవాల్ విసిరినట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ ఆ మధ్య చక్కర్లు కొట్టింది.



పోలీసుల అదుపులో ఇమ్మడి రవి(మధ్యలో వ్యక్తి)

ఆమ్‌స్టర్‌డామ్ నుంచి వచ్చి చిక్కి..

ఈ ఏడాది విడుదలైన పలు తెలుగు సినిమాలు పైరసీ బారిన పడడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విభాగంలోని యాంటీ వీడియో పైరసీ సెల్ ఆగస్టు 30న నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐబొమ్మ వంటి 65 మిర్రర్ వెబ్‌సైట్లు వేదికగా పలు సినిమాలు పైరసీ జరుగుతున్నట్టు పేర్కొంది. ఈ వెబ్‌సైట్లను ప్రతి నెలా 37 లక్షల మంది చూస్తున్నట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సర్వర్లను హ్యాక్ చేసి డౌన్‌లోడ్ చేసుకున్న సినిమాలను పైరసీ ముఠాలకు విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను సెప్టెంబరు 29న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి ఐ బొమ్మ సూత్రధారి కోసం వేట ప్రారంభించారు. సెప్టెంబరు 30 వరకు కూకట్‌పల్లిలోని తన నివాసంలోనే ఉన్న రవి అక్టోబరు 1న ఇక్కడి నుంచి మాయమయ్యాడు. అతడి కదలికలపై గురిపెట్టిన పోలీసులు కీలక సమాచారం సేకరించారు. అక్టోబరు 3న నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో పాగా వేసినట్టు అంచనాకు వచ్చారు. పోలీసులకు పట్టుబడకుండా ఫ్రాన్స్, కరేబియన్ దీవులు, నెదర్లాండ్స్ తదితర ప్రాంతాల్లో ఉన్నట్టు ఐపీ అడ్రస్‌లతో ఏమార్చుతూ వచ్చాడు. తనను పోలీసులు పసిగట్టలేరనే ధీమాతో ఆమ్‌స్టర్‌డ్యామ్ నుంచి కూకట్‌పల్లికి చేరాడు. అతడి కదలికలను గమనిస్తూ వచ్చిన పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు.

ఘర్షణలో మహిళను తాకడం ఆత్మగౌరవానికి భంగం కలిగించినట్లు కాదు

- ఉద్దేశపూర్వకంగా తాకినప్పుడే నేరం
- స్పష్టం చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: ఘర్షణ సమయంలో అనుకోకుండా మహిళను తాకడం, తోసివేయడం.. ఆమె ఆత్మగౌరవానికి భంగం కలిగించడానికి చేసిన చర్యగా పేర్కొనలేమని హైకోర్టు స్పష్టీకరించింది. ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో తాకితేనే నేరంగా పరిగణించాల్సి వస్తుందని పేర్కొంది. ఓ కేసులో నలుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఒంగోలు అదనపు సహాయ సెషన్స్ కోర్టు 2006లో ఇచ్చిన తీర్పును సమర్థించింది. పోలీసుల అప్పీల్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ★ ఉమ్మడి ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలి వద్ద 2005 జూన్ 16న డి.శామ్యూల్ మరో ముగ్గురు మద్యం మత్తులో వాహనాల రాకపోకలకు అవరోధం కలిగిస్తున్నారని పోలీసుస్టేషన్‌కు సమాచారం అందింది. ఎస్‌హెచ్‌వో సూచన మేరకు అదే గ్రామానికి చెందిన హోంగార్డ్ షేక్ మస్తాన్‌వలి ఘటన స్థలానికి వెళ్లారు. మత్తులో ఉన్న నలుగురు.. వలితో దురుసుగా ప్రవర్తించారు. పరిస్థితిని శాంతింపజేసేందుకు సమీపంలో ఉన్న వలి తల్లి అక్కడికి వచ్చారు. ఓ నిందితుడు ఆమె చేయి పట్టుకొని లాగారు. దీంతో గాజులు పగిలాయి. జాకెట్ చిరిగింది. ప్రభుత్వ ఉద్యోగి విధులకు అవరోధం కలిగించారని, మహిళ ఆత్మగౌరవానికి భంగం కలిగించారని పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన ఒంగోలు కోర్టు.. నలుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది.

అకస్మాత్తుగా జరిగింది..: ఒంగోలు కోర్టు తీర్పును సవాలు చేస్తూ పోలీసులు 2009లో హైకోర్టులో అప్పీల్ వేశారు. ఇటీవల తుది విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఘటన అకస్మాత్తుగా జరిగిందని, ఎవరికీ గాయాలు కాలేదని గుర్తుచేశారు. ఘర్షణలో మహిళను తాకడం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లు కాదన్నారు. నిందితుడి ప్రమేయంపై న్యాయస్థానానికి చిన్న సందేహం ఉన్నా.. శిక్ష విధించలేమన్నారు. సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని నిర్దోషులుగా ప్రకటిస్తూ దిగువ కోర్టు తీర్పు ఇచ్చాక.. అందులో అప్పీల్ కోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అప్పీల్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించారు.

ధర్మవరానికి మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్

- రూ.38 కోట్లతో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది నేతన్నలకు ఉపాధి

ఈనాడు, అమరావతి: కంచిపట్టు నేతకు ప్రసిద్ధి చెందిన ధర్మవరం నేతన్నల చిరకాల వాంఛ నెరవేరే దిశగా అడుగులు పడుతున్నాయి. 2009 నుంచి ఊరిస్తూ వస్తున్న మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను కూటమి ప్రభుత్వం త్వరలో సాకారం చేయనుంది. రూ.38 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా ఆమోదం తెలపగా.. సాంకేతిక కమిటీ సమీక్ష పూర్తయింది. వారం, పది రోజుల్లో మరో సమావేశం జరగనుంది. తదనంతరం శాంక్షన్ ఆర్డర్‌ను విడుదల చేయనున్నారు. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడమే కాకుండా ధర్మవరంలో 9.84 ఎకరాల్ని కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుతో చేనేత రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన 25 వేల మందికి ఉపాధి లభించనుంది.

90% రాయితీతో పరికరాలు: క్లస్టర్ ఏర్పాటులో భాగంగా 90 శాతం రాయితీతో నేతన్నలకు మగ్గాలు, ఎలక్ట్రానిక్ జకార్డ్‌లు, ఇతర 12 రకాల నేత పరికరాలను అందిస్తారు. ఇప్పటికే దీనిపై సర్వే చేపట్టిన అధికారులు.. 5,800 మందికి వివిధ పరికరాలు అవసరమని గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు.


5 దశల్లో ప్రాజెక్టు నిర్మాణం...

★ మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ 5 దశల్లో నిర్మాణం జరగనుంది. ★ తొలి దశలో ఎంపిక చేసిన చేనేత లబ్ధిదారులకు మగ్గం, ఇతర పరికరాలు అందిస్తారు. వర్క్‌షెడ్లను కొన్నింటిని నిర్మిస్తారు. ★ రెండో దశలో మరికొందరికి పరికరాలు, సామూహిక వర్క్‌షెడ్లు, డిజైన్ స్టూడియో, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, డిస్‌ప్లే కమ్ షోరూం, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ హాళ్లు, వేర్ హౌస్‌లను అందుబాటులోకి తెస్తారు. ★ మూడో దశలో మార్కెటింగ్ డెవలప్‌మెంట్ సెంటర్, బ్రాండింగ్ కోసం పబ్లిసిటీ సెంటర్ ఏర్పాటు ★ నాలుగో దశలో విలువ జోడింపు కేంద్రం★ ఐదో దశలో డై హౌసెస్ నిర్మాణం.



హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను నిర్మించనున్న ప్రాంతం

వినమ్రతే సోపానం



వ్యాపారం అంటే ఆలోచనలు, విలువలు. విలువలు పాటించాలంటే వ్యక్తిగత క్రమశిక్షణ అవసరం. వ్యక్తిగా మనం ఎలా ఉన్నామనే దాన్ని అందరూ గమనిస్తారు. ఎవరితో మాట్లాడినా ఎంతో వినమ్రంగా ఉండాలి.

తితిదే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌ది హత్యే

(మొదటి పేజీ తరువాయి)

రైల్వేస్టేషన్‌కు సతీష్‌కుమార్ చేరుకున్నారు. తన బైక్‌ను పార్కింగ్‌లో పెట్టి రైల్వేస్టేషన్ లోపలికి వెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సతీష్‌కుమార్ వెళ్లాల్సిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి 01.01 నిమిషాలకు గుంతకల్లు నుంచి బయలుదేరింది. అంటే అంతకు గంట ముందే సతీష్‌కుమార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే ఆయన రైలు ఎక్కుతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో సరిగా రికార్డు కాలేదని పోలీసులు చెబుతున్నారు. సతీష్ ప్రయాణించిన ఏ1 బోగీలో ప్రయాణికులతో పాటు టీటీఈ శోభనాద్రిని పోలీసులు విచారించారు. అర్ధరాత్రి 2 గంటలకు నిద్రపోవాల్సిన సమయంలో సతీష్‌కుమార్ డోర్ వద్దకు ఎందుకు వచ్చారనే కోణంలో ఆరా తీశారు. గుంతకల్లు తర్వాత రైలు గుత్తి రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఆ రెండు స్టేషన్లలో ఎవరెవరు రైలు లోకి ఎక్కారు? ఎవరెవరు దిగారు? అనే కోణంలో పరిశీలిస్తున్నారు. దీంతోపాటు కోమలి నుంచి చివరి స్టేషన్ తిరుపతి వరకు రైలు ఎన్నిచోట్ల ఆగింది? అక్కడ ఎవరెవరు దిగిపోయారనే దానిపైనా ఆరా తీస్తున్నారు. ఈ వివరాలు తెలిస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

బ్యాగు ఎందుకు సీటు మారింది?

రిజర్వేషన్ వివరాల మేరకు ఏ1 బోగీలో 29వ సీటును సతీష్‌కు కేటాయించారు. శుక్రవారం ఉదయం 6.23 గంటలకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ తిరుపతి చేరుకుంది. ఏ1 కోచ్ అటెండర్ ఆన్ని రాజేష్ రతన్.. సీటు నం.11లోని సతీష్ బ్యాగును గుర్తించి పోలీసులకు అప్పగించారు. 29వ సీటులో ఉండాల్సిన సతీష్ బ్యాగు.. 11వ నంబరు సీటు వద్దకు ఎలా వెళ్లిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. రైలెక్కిన తర్వాత సతీష్ తన సీటును మార్చుకున్నారా? లేకపోతే ఇంకేమైనా జరిగిందా? అనే కోణంలో తోటి ప్రయాణికుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై కోచ్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ అప్పారావును కూడా ప్రశ్నించారు




ఘటనాస్థలం వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న పోలీసులు ★ ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్

సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో ఏం తేలింది?

సతీష్‌కుమార్ మృతదేహం ఘటనా స్థలంలో రైలు పట్టాల నుంచి 60 అడుగుల దూరంలో పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అసలు ఏం జరిగి ఉంటుందో మరింత స్పష్టంగా తెలుసుకునేందుకు శనివారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. సతీష్ బరువుతో సమానమైన రెండు మనిషి బొమ్మలు తయారు చేసి.. అదే మార్గంలో వేగంగా వెళ్తున్న రైలు నుంచి కిందకు తోసేశారు. అందులో ఒక బొమ్మ రైలు ట్రాక్ నుంచి 12 అడుగులు దూరంలో పడగా, మరొక బొమ్మ కేవలం 2 అడుగుల దూరంలోనే పడింది. దీన్ని బట్టి సతీష్ రైలు నుంచి దూకినా సరే.. ట్రాక్ నుంచి 60 అడుగుల దూరంలో పడే అవకాశమే లేదని పోలీసులు అంచనాకొచ్చారు. ఎవరైనా ఆయన్ను తోసేశారా? లేదంటే వేరే చోట నుంచి ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా? అన్నది తేలాల్సి ఉంది.

పరకామణి కేసులోని ప్రత్యర్థులే చంపారనుకుంటున్నాం

“మా అన్న సతీష్‌కుమార్ తితిదే మాజీ ఏవీఎస్‌వోగా ఉన్న సమయంలో పరకామణిలో జరిగిన చోరీ ఘటనపై ఫిర్యాదు చేశారు. తర్వాత ఆ కేసును రాజీ చేయించుకున్నారు. ఇప్పుడు ఆ కేసులో సీఐడీ విచారణకు హాజరవుతున్నారు. పరకామణి కేసులో ప్రత్యర్థులుగా ఉన్నవారు తనను ఏదైనా చేస్తారని భయపడేవాడు. ఆ కేసులో విచారణకు హాజరయ్యేందుకు గుంతకల్లు నుంచి తిరుపతికి రైలులో బయలుదేరిన వ్యక్తి జూటూరు, కోమలి రైల్వేస్టేషన్ల మధ్యలో విగతజీవిగా కనిపించాడు. పరకామణి కేసులోని ప్రత్యర్థులే మా అన్నను చంపి ఉంటారని అనుకుంటున్నాం” అని సతీష్‌కుమార్ సోదరుడు శ్రీహరి గుత్తి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి అనంతపురం చేరుకున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ జిల్లా పోలీసులతో సమావేశమయ్యారు. సతీష్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం చేసిన వైద్యుల బృందంతో శనివారం ఉదయం మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ జగదీశ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి డ్రోన్లతో పహారా

- వైకాపా హయాంలో లక్షల చెట్లు నరికేశారు
- అధికారుల సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో లక్షల ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తరలించారని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పారు. మన రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా అయిన ఎర్రచందనం దుంగలు దేశంలో ఎక్కడ దొరికినా అవి మనకే చెందేలా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక ఆదేశాలు ఇప్పించినట్లు గుర్తుచేశారు. ఎర్రచందనం పరిరక్షణ, అక్రమ రవాణా నిరోధంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. “2015లో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవడానికి అప్పటి తెదేపా ప్రభుత్వం కృషి చేసింది. అప్పట్లో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. అటవీ, పోలీసు శాఖల సమన్వయంతో థర్మల్ డ్రోన్లు ఏర్పాటు చేసి నిఘా పెంచాలి. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. అధునాతన బారికేడ్లను చెక్‌పోస్టుల వద్ద అమర్చాలి. బేస్ క్యాంపులు, వాచ్ టవర్లతో గస్తీ ముమ్మరం చేయాలి. ఇంటి దొంగల్ని పట్టుకోవడానికి ప్రత్యేక ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేయాలి. శేషాచలం అడవుల్ని ఆనుకొని ఉన్న గ్రామాల్లో వన సంరక్షణ సమితి వాలంటీర్లతో సదస్సులు నిర్వహించాలి” అని పవన్‌కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

గో మాంసం రవాణా వెనుక ఎవరున్నా వదలొద్దు

ఈనాడు, అమరావతి: విశాఖలో గో మాంసాన్ని నిల్వ చేసిన ముఠాల మూలాలు గుర్తించాలని, గో మాంసం నిల్వలు, రవాణా వెనుక ఎవరున్నా ఉపేక్షించవద్దని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఆయన శనివారం విశాఖ పోలీసు కమిషనర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విశాఖ మిత్రా కోల్డ్ స్టోరేజిలో నిల్వ ఉంచిన 1.89 లక్షల కేజీల గో మాంసాన్ని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకుని కేసును పోలీసు శాఖకు అప్పగించినట్లు కమిషనర్ తెలియజేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని వివరించారు.

తితిదేకు విద్యుత్తు బస్సు విరాళం



తితిదే డిప్యూటీ ఈవో లోకనాథానికి బస్సు తాళం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుమల, న్యూస్‌టుడే: పుణెకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన విద్యుత్తు బస్సును తితిదేకు విరాళంగా అందించింది. శనివారం సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదుట బస్సు తాళాన్ని డిప్యూటీ ఈవో లోకనాథానికి అందించారు.

18న తితిదే పాలకమండలి సమావేశం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే పాలకమండలి అత్యవసర సమావేశం ఈ నెల 18న జరగనుంది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన స్థానిక అన్నమయ్య భవనంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో కొన్ని ముఖ్యమైన అంశాల్లో సీఎం చంద్రబాబు సూచనల మేరకు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

‘పరకామణి’ కేసులో పోలీసుల రక్షణ కోరిన పాత్రికేయుడు శ్రీనివాసులు



అలిపిరి సీఐకి వినతిపత్రం ఇస్తున్న మాచర్ల శ్రీనివాసులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుమల పరకామణి కేసు ఫిర్యాదుదారుడు, తితిదే పూర్వ ఏవీఎస్‌వో, జీఆర్పీ సీఐ సతీష్‌కుమార్ రైల్లో ప్రయాణిస్తూ మృతి చెందారు. అది హత్యగా పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసు అధికారికే ఇలా జరిగితే.. తమ పరిస్థితి ఏమిటని ఆ కేసుతో సంబంధం ఉన్నవారు భయాందోళనకు గురవుతున్నారు. పరకామణి కేసు నమోదు, ఆర్థిక దోపిడీపై హైకోర్టును ఆశ్రయించి తద్వారా ఆ కేసు విచారణ సీఐడీ చేపట్టేలా చేసిన పాత్రికేయుడు మాచర్ల శ్రీనివాసులు.. సతీష్‌కుమార్ మృతితో ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు తనకు రక్షణ కల్పించాలని శనివారం పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే తన ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.




సతీష్‌కుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ తదితరులు
గాలిలో తుపాకులు పేల్చి నివాళులర్పిస్తున్న పోలీసులు

ముగిసిన సతీష్‌కుమార్ అంత్యక్రియలు

- కన్నీటి సంద్రమైన పత్తికొండ

ఈనాడు, కర్నూలు, పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: హత్యకు గురైన సీఐ సతీష్‌కుమార్(39) అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో కర్నూలు జిల్లాలోని పత్తికొండలో శనివారం నిర్వహించారు. కడసారి చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. సతీష్‌కుమార్ మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి మృతదేహం వద్ద కుమార్తె తార మౌనంగా రోదిస్తున్న తీరు పలువురిని ఆవేదనకు గురిచేసింది. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక ఆయన సతీమణి మమత తీవ్రంగా విలపించారు. పత్తికొండలోని కర్నూలు రోడ్డు వద్దనున్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

కఠినశిక్ష పడేలా చూడాలి

పరిటాల రవి హత్య కేసులో నిందితులను అంతమొందించినట్లే పరకామణిలో చోరీ కేసు సాక్షులను భయకంపితులను చేసే లక్ష్యంతో సీఐ సతీష్‌కుమార్‌ను హత్య చేశారనిపిస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు కేసును సవాలుగా తీసుకుని సూత్రధారులు, పాత్రధారులను అరెస్టు చేయాలి. కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి. సతీష్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలి.

– కేఈ శ్యామ్‌కుమార్, పత్తికొండ ఎమ్మెల్యే

నిజాలు చెబుతాడన్న భయంతోనే..

సతీష్‌కుమార్‌కు ఎవరితోనూ విభేదాలు లేవు. అతను నాకు వరుసకు అల్లుడవుతాడు. ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతడు నిజాలు చెబుతాడన్న భయంతోనే హత్య చేశారు. పరకామణి కేసులో తనకు ప్రాణహాని ఉందని కొందరు సన్నిహితుల వద్ద సతీష్‌కుమార్ వాపోయారు. అంతలోనే ఇలా చనిపోయారు.

– తుగ్గలి నాగేంద్ర, శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సతీష్ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాలని చూస్తున్న భూమన

వర్ల రామయ్య

ఈనాడు, అమరావతి: పరకామణి చోరీ కేసులో ఫిర్యాదుదారు సతీష్‌కుమార్‌ది ముమ్మాటికీ హత్యేనని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరకామణి చోరీ కేసు నిందితుడు రవికుమార్, అప్పటి తితిదే ఈవో ధర్మారెడ్డి, ఈ కేసును గతంలో దర్యాప్తు చేసిన పోలీసుల ప్రాణాలకూ ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సతీష్ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాలని వైకాపా నేత భూమన కరుణాకర్‌రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. ‘సతీష్‌ది ఆత్మహత్య అంటూ అందరి కంటే ముందే భూమన ఎలా స్పందించారు? అది ఆత్మహత్యేనని ఆయన ఎలా చెబుతారు’ అని ప్రశ్నించారు.

ఆత్మహత్యేనంటూ పోస్టు ఎలా పెట్టారు?: విజయకుమార్

పరకామణి చోరీ కేసులో ఫిర్యాదుదారు సతీష్‌కుమార్ హత్య జరిగిన వెంటనే.. దాన్ని ఆత్మహత్యగా పేర్కొంటూ వైకాపా ఎక్స్ ఖాతాలో ఎలా పోస్టు చేశారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ ప్రశ్నించారు. అప్పటికి పోలీసులు ఘటనా స్థలానికి కూడా చేరుకోలేదని పేర్కొన్నారు. వైకాపా నేత కరుణాకర్‌రెడ్డి విలేకరుల సమావేశం పలు అనుమానాలకు తావిస్తోందని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేస్తాం

స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి. చిత్రంలో మిహిలా జొరిచ్యో, షారన్ బ్యూటుయో, ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో లక్ష మంది మహిళలను వివిధ రంగాల్లో వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో లింగ సమానత్వ స్పందన, సమగ్ర భవిష్యత్తు నిర్మాణం అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ ఇన్నోవేషన్ పాలసీలపై మహిళలు అవగాహనతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలతో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే 24 గంటల్లోనే అరెస్టు చేసి బుద్ధి చెబుతున్నామని హెచ్చరించారు. క్రియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షారన్ బ్యూటుయో, నార్త్ మాసిడోనియాకి చెందిన మిహిలా, సీఐఐ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొమ్ముకోనాం వేట.. కాసుల పంట



కాకినాడ సముద్ర తీరంలో మత్స్యకారుల వలలకు శనివారం మూడు భారీ కొమ్ము కోనాం చేపలు చిక్కాయి. ఈటె లాంటి ముక్కుతో దూకుడుగా ఉండే ఈ చేపలకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉంటుంది. దాదాపు 120 నుంచి 160 కిలోల వరకు బరువున్న వీటిని స్థానిక కుంభాభిషేకం రేవులో విక్రయానికి ఉంచగా సగటున ఒక్కోటి రూ.25 వేల ధర పలికాయి. చాలా రోజులకు భారీ చేపలు దొరకడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

జల చిలుక



రామచిలుకను పోలిన రంగు, ముక్కుతో ఉన్న ఈ అరుదైన చేప పేరు ప్యారెట్ ఫిష్. చిలుక చేప అని కూడా అంటుంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి మత్స్యకారులు రెండు రోజుల క్రితం సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చిక్కింది. దీని గురించి రాజోలు మత్స్యశాఖ అధికారి సీహెచ్ గోపాలకృష్ణ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ జాతి చేపలు రాళ్లు, పగడపు దిబ్బలు ఉన్న తీర ప్రాంతాల్లో సంచరిస్తాయన్నారు. దంతాలు బలంగా ఉండటంతో రాళ్లను కొరికి బొరియలు చేసుకుని అందులో జీవిస్తాయని చెప్పారు. ఆల్గేను ఆహారంగా తీసుకుంటాయని.. వీటిలో కొన్ని రకాలు ఇతర జీవుల నుంచి రక్షణ కోసం బుడగల్లాంటి పొరలను ఏర్పాటు చేసుకుని నిద్రిస్తాయని వివరించారు. ఎనిమిది వందల గ్రాములు ఉన్న ఈ చేపను ఓ వ్యక్తి రూ.500కు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

– న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

బ్రాండిక్స్‌తో నిజమైన మహిళా సాధికారత

- ప్రపంచస్థాయి వస్త్రాల తయారీపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రశంస



బ్రాండిక్స్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్. చిత్రంలో మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే విజయకుమార్, బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి తదితరులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్రాండిక్స్ ద్వారా నిజమైన మహిళా సాధికారత సాధించారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లోని బ్రాండిక్స్ అపెరల్ సిటీని శనివారం ఆయన సందర్శించారు. పీయూష్ గోయల్‌తో పాటు రాష్ట్ర మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు ఉన్నారు. మహిళలతో మాట్లాడి వారు తయారు చేస్తున్న దుస్తులు, వారికి అందిస్తున్న శిక్షణ గురించి కేంద్రమంత్రి తెలుసుకున్నారు. ప్రపంచ స్థాయి వస్త్రాలను గ్రామీణ మహిళలు తయారు చేయడం దేశానికే ఆదర్శమన్నారు. 7వ తరగతి విద్యార్హతతో 22 వేల మంది మహిళలకు అంతర్జాతీయ సౌకర్యాల మధ్య ఉపాధి కల్పిస్తున్నట్లు కేంద్రమంత్రికి బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి వివరించారు. ఇక్కడ తయారయ్యే దుస్తులను పలు దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు, అమెరికా విధించిన అదనపు సుంకాల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బ్రాండిక్స్ దుస్తుల్లో 80 శాతం అమెరికాకే ఎగుమతి అవుతాయని, ప్రస్తుతం వర్క్ ఆర్డర్లు లేవని తెలిపారు. రాయితీలు, మినహాయింపులను ఇవ్వడంతోపాటు పాటు దేశీయ మార్కెట్‌లో 49 శాతం వస్త్రాలను విక్రయించుకోవడానికి అనుమతించాలని కోరారు. అవసరమైన చేయూతను అందిస్తామని పీయూష్ గోయల్ హామీ ఇచ్చారు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో ఎంఆర్ఐ, క్యాథ్‌ల్యాబ్ యూనిట్ల ప్రారంభం

విశాఖపట్నం (పెందుర్తి), న్యూస్‌టుడే: విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ, క్యాథ్‌ల్యాబ్ యూనిట్లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం ప్రారంభించారు. ఇక్కడ తయారవుతున్న వైద్య ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని ప్రశంసించారు. పీయూష్ గోయల్ సమక్షంలో పలు సంస్థలతో ఏఎంటీజెడ్ (ఆంధ్ర మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్) భాగస్వామ్య అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంది. సీఈవో జితేంద్ర శర్మ.. ఇప్పటి వరకు మెడ్‌టెక్ జోన్ సాధించిన ఘనతను కేంద్ర మంత్రికి వివరించారు. ఆయన వెంట రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేశ్ ఉన్నారు. అంతకుముందు పీయూష్ గోయల్‌కు హెలిప్యాడ్ వద్ద పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్వాగతం పలికారు.



తిమ్మక్క విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఉపకులపతి ఆచార్య సురేశ్ తదితరులు

వృక్షమాత తిమ్మక్కకు నివాళులు

బెంగళూరు(సదాశివనగర), న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో శుక్రవారం కన్నుమూసిన వృక్షమాత సాలుమరద తిమ్మక్కకు బెంగళూరులో శనివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆమెకు తుది నివాళులు అర్పించారు. కుర్చీలో కూర్చున్నట్లున్న తిమ్మక్క విగ్రహాన్ని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రత్యేకంగా చేయించి శనివారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎస్వీ సురేశ్‌తో పాటు ఇతర ఆచార్యులు, రైతులు, వృక్ష ప్రేమికులు ఆ విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు.

భక్తుల సౌకర్యార్థం ‘సాయి 100’ యాప్



పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శత జయంతి వేడుకల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ‘సాయి 100’ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిపాలనా విభాగం రూపొందించిన యాప్‌లో వేడుకలకు సంబంధించిన రోజువారీ కార్యక్రమాలు, వసతి సదుపాయాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, అత్యవసర సేవలు, ఆహార పంపిణీ, తాగునీటి కేంద్రాలు తదితరాల సమాచారం తెలుసుకోవచ్చు. కమాండ్ కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేశామన్నారు. అదనపు సమాచారం, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబరు 18002335598లో సంప్రదించొచ్చన్నారు.



సత్యసాయి మహా సమాధికి పూలమాల వేస్తున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్. చిత్రంలో భాజపా నేత విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

సత్యసాయి సేవలు వెలకట్టలేనివి: పీయూష్ గోయల్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మానవాళిని ఆధ్యాత్మికత, ప్రేమ తత్వంతో సేవా మార్గం వైపు నడిపించిన సత్యసాయి కోట్లమంది భక్తుల హృదయాల్లో కొలువై ఉన్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శనివారం ఆయన పుట్టపర్తిలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. ఆయనను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సత్కరించారు.

లారీ అతివేగం వెయిట్ లిఫ్టర్ ప్రాణం తీసింది



సత్యజ్యోతి

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రానికి పతకం తేవాలని బయలుదేరిన యువ క్రీడాకారిణిని రోడ్డు ప్రమాదం పొట్టనపెట్టుకుంది. విజయనగరంలో శనివారం సాయంత్రం లారీ ఢీకొనడంతో వెయిట్ లిఫ్టర్ టి.సత్యజ్యోతి(24) మృతి చెందారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ టోర్నమెంటులో పాల్గొనేందుకు తన సోదరి సరోజిని గాయత్రితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవింగ్ చేస్తున్న సరోజిని గాయత్రి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెనుక కూర్చున్న సత్యజ్యోతి తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోయాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. విజయనగరానికి చెందిన భాస్కరరావు, యశోదమ్మ దంపతుల నలుగురు సంతానంలో సత్యజ్యోతి చివరి అమ్మాయి. జాతీయ వెయిట్ లిఫ్టర్‌గా రాణించి క్రీడా కోటాలో ఏడాదిన్నర క్రితం రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా కొలువు పొందారు. సత్యజ్యోతి తల్లి మూడేళ్ల కిందట మృతిచెందారు. తండ్రి అనారోగ్యంతో చనిపోయి నెల కూడా కాలేదు. ఈ ఘటన నుంచి తేరుకోకముందే ఆమె మృతి చెందడం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. టోర్నమెంట్‌లో జిల్లా తరఫున ఈ నెల 16న ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. లారీ అతివేగం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందని రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

షార్ప్‌నర్ బ్లేడుతో విద్యార్థి గొంతు కోసిన సహచరులు

చింతలపూడి, న్యూస్‌టుడే: స్వల్ప ఘర్షణ కారణంగా తోటి విద్యార్థులు బాలుడి గొంతు కోసిన ఘటన ఏలూరు జిల్లా చింతలపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం.. టి.నర్సాపురం మండలానికి చెందిన విద్యార్థి స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. అదే తరగతి విద్యార్థులు కొందరు అతనితో ఇటీవల గొడవ పడ్డారు. శుక్రవారం రాత్రి విద్యార్థులంతా వారి గదుల్లో నిద్రించిన తర్వాత పెన్సిల్ చెక్కే రెండు షార్ప్‌నర్ బ్లేడ్ల సహాయంతో సహచరులు సదరు విద్యార్థి గొంతు కింద కోశారు. నిద్ర మత్తులో ఉన్న ఆ విద్యార్థికి ఈ విషయం తెలియలేదు. శనివారం తెల్లవారుజామున ఆ బాలుడి మెడ కింద రక్తస్రావం కావడం చూసి తోటి విద్యార్థులు కాపలాదారుకు తెలియజేశారు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడి గొంతు భాగంలో ఐదు కుట్లు వేశారు. ప్రాణాపాయం లేదని తెలిపారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ విద్యార్థిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మదనపల్లె కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితుల అరెస్ట్

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు వివరాలను శనివారం డీఎస్పీ మహేంద్ర విలేకరులకు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన యమున ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో గమనించి అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్యలు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స గురించి తెలిపారు. ఈ నెల 9న మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చట్టవిరుద్ధంగా యమునకు కిడ్నీ మార్పిడి చికిత్స చేశారు. మరుసటి రోజు ఆమె మృతిచెందారు. ఈ ఘటనపై యమున తల్లి సూరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మందిని నిందితులుగా గుర్తించగా ఆరుగురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు గ్లోబల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి యజమాని కె.ఆంజనేయులు, మదనపల్లె ప్రభుత్వాసుపత్రి డయాలసిస్ మేనేజరు బాలరంగడు, కదిరి ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ మేనేజరు మెహరాజ్, పిల్లి పద్మ, సత్య, సూరిబాబులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

EENADU Vol: 52, Issue: 96 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in


సంధ్య

యూపీఎస్సీ... కల నెరవేరింది!

చదువుకున్నది చాలావరకూ ప్రభుత్వ సంస్థల్లోనే! అయితేనేం పెద్ద కలల్ని కనడానికి అదేమీ అడ్డుగా భావించలేదామె. అందరూ నడిచే దారిలో కాకుండా తనకంటూ ప్రత్యేకత ఉండాలనుకున్నారు. కాబట్టే, జియాలజీని ఎంచుకున్నారు. వైఫల్యాలను దాటి తాజాగా యూపీఎస్సీ (కంబైన్డ్ జియో సైంటిస్ట్)లో ర్యాంకునీ సాధించారు తొప్పెట్ల సంధ్య.

మాది సిద్దిపేట జిల్లాలోని వట్టిపల్లి. అమ్మానాన్నలు లక్ష్మీ, సత్యనారాయణలు కూలీ పనులు చేయడంతోపాటు మాకున్న కొద్దిపాటి పొలంలో పంటలు పండించేవారు. నిరుపేద కుటుంబమైనా పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలి అనుకున్నారు. మాకెప్పుడూ 'చదువే సంపద' అని చెప్పేవారు. పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ గురుకులంలో పూర్తిచేశా. మొదట్నుంచీ అందరూ ఎంచుకునే కోర్సులు కాకుండా కొత్తగా ప్రయత్నించాలి అనుకునేదాన్ని. కాబట్టే పుదుచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి జియాలజీలో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో చేరా. మంచి స్కోరుతో పూర్తిచేశా కూడా. కానీ నా లక్ష్యం యూపీఎస్సీ. అందుకే ఎంఎస్సీ చివరి ఏడాదిలోనే ప్రయత్నించా. కానీ వరుసగా రెండు వైఫల్యాలు. తరవాత గేట్, సీఎస్ఐఆర్- నెట్‌ల్లో అర్హత సాధించినా యూపీఎస్సీ సాధించాలన్న కోరిక బలంగా నాటుకు పోయింది. అందుకే మరోసారి ప్రయత్నించాలనుకున్నా.

అలాగని ఇంటి ఆర్థిక పరిస్థితి రీత్యా అమ్మానాన్నల్ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. ఇంతలో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కి అర్హత సాధించడం కలిసొచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ అవకాశంతోపాటు ప్రతి నెలా ఫెలోషిప్ వచ్చేది. దాంతో కావాల్సిన పుస్తకాలు సమకూర్చుకుని ఇంట్లోనే సిద్ధమయ్యా. ఈసారి అఖిల భారత స్థాయిలో 29వ ర్యాంకు సాధించా. తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు బాగా చదివేదాన్ని. మాదిరి పరీక్షలు చాలా రాశా. దాంతో ఈసారి సాధించగలనన్న ధీమా ఏర్పడింది. ముఖాముఖీనీ ధైర్యంగా ఎదుర్కొన్నా. ఏకాగ్రతతో చదివా, ఆత్మవిశ్వాసాన్నీ సడలనీయలేదు. ఇవే నా విజయానికి సాయపడ్డాయి.

– పులి అనిల్ రెడ్డి, సంగారెడ్డి



పెళ్లంటే... రూ. లక్షల కోట్ల ఖర్చేనా?!

ఎక్కడైనా అంగరంగ వైభవంగా వివాహ వేడుక జరుగుతుంటే చూసేవాళ్లకి కన్నుల పండుగే. ఎందుకంటే ఈనాటి పెళ్లి... ఓ మెగా బడ్జెట్‌తో కూడిన గ్రాండ్ ఈవెంట్. ఎన్నో ఏళ్ల కష్టం... కోట్ల రూపాయల వ్యయం... అంతకుమించిన గొప్ప ప్రణాళిక. అందుకే... అమ్మాయిలూ, ఒక్క క్షణం ఆలోచించండి!

45 రోజులు...46 లక్షల పెళ్లిళ్లు... రూ.6.5 లక్షల కోట్ల వ్యయం... కోటికి పైగా ఉద్యోగాలు... ఈ నవంబరు, డిసెంబర్ నెలల్లో మనదేశంలో జరగబోయే పెళ్లిళ్లకు సంబంధించి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఏఐటీ) దేశంలోని 75 నగరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన తాజా నివేదిక. ఏటికేడు ఈ ఖర్చు పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. అందుకే అసలు పెళ్లంటే... ఏమిటంటే..!

పెళ్లి వేడుక... చూడ్డానికి అద్భుతంగానే ఉంటుంది. ఖరీదైన ఫంక్షన్ హాలు, మిరుమిట్లుగొలిపే దీపకాంతులు, కృత్రిమ లేదా అక్కడక్కడా తాజా పూల అలంకరణలు, భారీ థీమ్ డెకరేషన్లు, చుట్టుముట్టిన ఫొటోగ్రాఫర్లు... వీటి మధ్య పెళ్లి చూసేదెవరు?

వీడియోలో హాజరుకోసం క్యూలో నిలబడి మొక్కుబడి అక్షింతలు కానిచ్చేసి, క్యాటరింగ్ కౌంటర్లలో కంటికి నచ్చినవి వడ్డించుకుని తెలిసినవాళ్లు కనిపిస్తే హాయ్ అనేసి... ఓ పనైపోయింది అనుకుంటూ వెళ్లిపోయే అతిథులూ!

పోనీ, ఆ పెళ్లి తాలూకూ అందమైన జ్ఞాపకాలు చేసుకునేవాళ్లకిగానీ చేసినవాళ్లకైనా ఉంటున్నాయా... కష్టమే. పసుపు కొట్టడంతో మొదలుపెట్టి రిసెప్షన్ వరకూ ఎన్ని ఈవెంట్లనీ... ఒక్కోదానికీ ఒక్కో బరువైన కాస్ట్యూమ్, వాటికి సరితూగే భారీ నగలతో అలసిపోయి, కమ్ముకొచ్చే నిద్రని బలవంతంగా ఆపుతూ, దట్టంగా పట్టించిన మేకప్ ముఖాలతో ఫొటోల కోసం కృత్రిమ నవ్వులొలికిస్తూ... 'హమ్మయ్య పెళ్లయ్యింది' అనుకునే వధూవరులు. ఈ హంగూఆర్భాటాలకోసం ఏళ్ల కష్టాన్ని మంచినీళ్లలా ఖర్చుపెట్టినా సంతృప్తి కానరాని తమ పిల్లల్ని బుజ్జగిస్తూ, అతిథిమర్యాదల్లో మునిగితేలే తల్లిదండ్రులూ!

ఎట్టకేలకు పెళ్లి సంబరాలన్నీ సమాప్తం... వీడియోలూ ఫొటోలన్నీ హార్డ్‌డిస్క్‌కే పరిమితం. ఆల్బమ్ చేయించుకునే తీరికలేని రొటీన్ బిజీ జీవితం. అంతేనా... అంత కష్టపడీ అంతంత ఖర్చుపెట్టీ పెళ్లి చేసుకున్న జంట ఏడాదిపాటు కలిసుంటే... మరో వేడుక చేసుకోవాల్సిందే. లేకున్నా బే ఫికర్! డివోర్స్ సెలబ్రేషన్స్‌నీ హ్యాపీగా చేసుకుంటోందీ తరం. ముమ్ముందు ఇలా చేసుకునేవాళ్ల సంఖ్య పెరిగినా ఆశ్చర్యం లేదు.

అది మాత్రం నిజం!

మెగా పెళ్లిళ్ల పుణ్యమాని దేశీయ దుస్తులకీ ఆభరణాలకీ మార్కెట్ పెరుగుతోంది. 'వోకల్ ఫర్ లోకల్‌'కి ప్రాధాన్యం ఇవ్వడంతో ఎందరికో ఉపాధీ దొరుకుతోందన్నది మాత్రం నిజం. అది ఈనాటి పెళ్లిళ్లలో చెప్పుకోదగ్గ గొప్ప శుభవార్త.

మరి నిజంగా ఇదేనా పెళ్లంటే... పందిళ్లు, సందళ్లు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలతో కూడిన ఓ మధురమైన వేడుక. జీవితాంతం గుర్తుండే అందమైన జ్ఞాపకం. అవునుమరి, గతంలోనూ పెళ్లిళ్లు జరిగాయి. కానీ వాటిల్లో అడుగడుగునా ఆనందం... ఆహ్లాదం. ఇంటికి వేసే సున్నాలూ రంగుల వాసనలతో మామిడాకుల తోరణాలు, కొబ్బరాకుల పందిళ్లలోని పచ్చదనపు పరిమళం జత కలిసిన ఆహ్లాదం! పెళ్లి పనుల సాయం కోసం వచ్చిపోయే చుట్టపక్కాలూ అంతా కలిసి ఎక్కడెక్కడి కబుర్లనో చెప్పుకొంటూ ఆప్యాయంగా వండి వార్చే నవకాయ పిండివంటలూ మండువా లోగిళ్లలో కొలువుదీరిన పెద్దవాళ్ల ముచ్చట్లూ బంధువుల పరాచికాలూ స్నేహితుల సరాగాల మధ్య జరిగిన ఆనాటి పెళ్లిళ్లలో... ఎటు చూసినా సందడే. అది కదా వేడుకలో కనిపించే అసలైన అందం, ఇంటిల్లిపాదితో పాటు ఊరంతా పంచుకునే గొప్ప ఆనందం!

అమ్మాయి జ్ఞాపకాల్ని తలచుకుంటూ ఏమాత్రం తీరిక చిక్కినా ఆ పెళ్లి ఆల్బమ్‌ని తిరగేసే అమ్మానాన్నలూ, వాళ్లని గుర్తుచేసుకుంటూనే కొత్తకాపురంలో సర్దుకుపోవడానికి ప్రయత్నించే అమ్మాయిలూ... ఈలోగా పండుగలూ వ్రతాలతో సాగే రాకపోకలూ చూస్తుండగానే ఏడాది ఇట్టే గడిచిపోతుంది... దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ చిలిపి తగాదాల్ని ఆహ్వానిస్తూ ముందుకెళ్లిపోతుండా జంట. పెళ్లి ఎంత గొప్పగా జరిగిందన్నది కాదు, ఎంత హాయిగా చేసుకున్నాం... ఒకరికొకరమై ఎంత అన్యోన్యంగా ఉంటున్నాం అన్నదే ముఖ్యం. అదే పెళ్లిలోని అర్థం... పరమార్థం!

ఇది తెలుసుకుని జీవితాంతం సాగితే... పెళ్లి ఖర్చు రూ. లక్షలు, కోట్లు అయినా ఎవరికీ బాధనిపించదు. అందుకే అమ్మలూ, అమ్మాయిలూ... పెళ్లి వేడుకని ఆడంబరంగానే కాదు... అనుబంధం, ఆప్యాయతలకీ అద్దంపట్టేలా చేయండి... చేసుకోండి!

పాప చర్మం పొడిబారుతోంది!

? శీతకాలం వచ్చిందంటే చాలు... మా పాప చర్మం పొలుసు ఊడినట్లు వచ్చేస్తోంది. తేమ కోసం రోజూ ఉదయం, సాయంత్రం కొబ్బరి నూనె రాస్తున్నా. అయినా సరే ఫలితం కనిపించడం లేదు. చూడ్డానికీ ఇబ్బందిగా ఉంది. ఏం చేస్తే చర్మం మృదువుగా, తేమగా కనిపిస్తుంది.

– హసిత, వైజాగ్

మీ పాప చర్మం మరీ అంత ఎక్కువ పొడిబారిపోతుందంటే ఏదైనా జెనిటిక్ సమస్య అయ్యిఉండొచ్చు. ఎందుకంటే ఎటోపిక్ డెర్మటైటిస్, ఇక్తియోసస్ అనే రకరకాల వ్యాధుల కారణంగా చర్మం ఎక్కువ పొడిబారుతుంటుంది. ఇలాంటి వారికి శీతకాలంలో స్కిన్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అవి ఏంటంటే... స్నానానికి ముందు సన్‌ఫ్లవర్ లేదా నువ్వుల నూనెలను ఒంటికి పట్టించి కొద్దిసేపు మర్దన చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో మాత్రమే స్నానం చేయించాలి. సబ్బుని వీలైనంత తక్కువగా వాడాలి. వీటితోపాటు సమయం కూడా ముఖ్యమే. కనీసం నాలుగైదు నిమిషాలైనా ఒంటిమీద నీళ్లు పోయాల్సి ఉంటుంది. స్నానానంతరం చర్మం తడారకుండా మాయిశ్చరైజర్ రాయాలి. సెరమైడ్స్, గ్లిజరిన్, షియా బటర్, మ్యాంగో బటర్ కాంబినేషన్‌లో ఉండే వాటిని ఎంచుకోవాలి. ఇవి పాప చర్మాన్ని మృదువుగా చేస్తాయి. ఈ జాగ్రత్తలు పాటిస్తే కొంతవరకూ ఫలితం ఉంటుంది. వీలైనంత త్వరగా డెర్మటాలజిస్ట్‌ని సంప్రదించండి. చలికాలంలో స్కిన్ ఎందుకు ఇలా పొడిబారుతుందో టెస్టులు చేయించాలి. అవసరమైతే జెనిటిక్ ఇన్వెస్టిగేషన్లు కూడా చేయించాల్సి ఉంటుంది.

డియర్ వసుంధర


డా. పి.ఎల్.చంద్రావతి
డెర్మటాలజిస్ట్



బంగారం - వెండి
15న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,260	1,15,500	1,59,505
విజయవాడ	1,23,440	1,14,650	1,59,700
ప్రొద్దుటూరు	1,24,400	1,14,450	1,59,300
రాజమహేంద్రవరం	1,25,080	1,14,650	1,75,000
విశాఖపట్నం	1,24,620	1,14,650	1,65,000
తమిళనాడు	-----	1,15,500	1,75,000

బామ్మ చిట్కా



స్టవ్, వంటగట్టు, వెనక గోడలు... జిడ్డుమయం. రోజూ శుభ్రం చేసుకోలేదంటే చూడటానికీ ఇబ్బంది, ఆరోగ్యానికీ చేటే. కానీ దాన్ని వదలగొట్టడం అంత సులువా? అందుకే ఏవేవో సబ్బులు, లిక్విడ్‌లు వాడుతుంటాం. వీటిల్లోని రసాయనాలతో ప్రమాదాలు జరగొచ్చు. చేతులకీ హానే. కాబట్టి, చేటు చేయని ఈ లిక్విడ్ ప్రయత్నించి చూడండి. ఇంట్లోనే సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. 200 మి.లీ. నీటిని స్టవ్ మీద వేడి చేయండి. మరుగుతున్న నీటిలో రెండు స్పూన్ల ఫేస్ పౌడర్, రెండు కర్పూరం బిళ్లల పొడి, నాలుగు లవంగాలు వేయండి. కాసేపు మరిగాక దించి, చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని ఏదైనా స్ప్రే బాటిల్‌లో పోసుకుని, దీంతో శుభ్రం చేసుకోండి. త్వరగా జిడ్డూ వదులుతుంది, రసాయనాల ఘాటూ ఉండదు. ప్రయత్నించి చూడండి.

ఈ స్నానం... ఒత్తిడి మాయం!

కాస్త చెమట పోసినా... అలసటగా ఉన్నా 'వేడి నీళ్లతో స్నానం చేసి రా... బడలిక పోతుంది' అని ఇంట్లోవాళ్లకి చెబుతుంటాం. మనమూ అనుసరిస్తుంటాం కూడా. ఈసారి ఒత్తిడిగా అనిపించినప్పుడూ స్నానానికే ఓటేయండి. అయితే చిన్న మార్పు చేయాలి. అదేమిటంటే...



ఎంత చీకటంటే భయమైనా... రాత్రుళ్లు నిద్ర పట్టాలంటే గది చీకటిగా మార్చుకోక తప్పదు. అప్పుడే నిద్రని దరిచేర్చే మెలటోనిన్ విడుదలవుతుంది. ఒత్తిడి, ఆందోళన ఉక్కిరిబిక్కిరి చేస్తున్నప్పుడూ ఇలా చీకటిని ఆశ్రయించొచ్చు. బాత్రూమ్ ఏమాత్రం చీకటిగా ఉన్నా... అది పగలైనా రాత్రైనా లైటు తప్పక వేసుకుంటాం కదా! ఈసారి వెలుగు లేకుండా స్నానం చేయండి. దీన్నే 'డార్క్ షవరింగ్' అంటూ సోషల్‌మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే చీకట్లో స్నానం చేయడం. మరీ భయమనిస్తే తక్కువ వెలుగునిచ్చే క్యాండిల్‌ని వెలిగించుకోవచ్చు. చుట్టూ ఏమున్నాయన్న స్పష్టత ఉండదు కాబట్టి, ట్యాప్‌లు, సబ్బు అన్నింటినీ తడిమి చూసుకోవాల్సిందే. దృష్టంతా స్నానం మీదే ఉంటుంది. ఇక వేరే ఆలోచనలకు తావేది? అంటే మైండ్‌ఫుల్‌గా స్నానం చేస్తామన్నమాట. ఈక్రమంలో ఒత్తిడి దూరమవుతుందట. ఈ మాత్రానికి వెలుతురు లేకుండా చేయడం ఎందుకంటే... వెలుతురు మెదడుని అలర్ట్‌గా ఉంచుతుంది. చీకటి మెదడుకి విశ్రాంతి సంకేతాన్ని ఇస్తుంది. దీంతో సహజంగానే రిలాక్స్ అవుతాం. నీళ్ల చప్పుడు... అవి మేనికి తాకడం, సబ్బు నుంచొచ్చే సువాసన... ఇవన్నీ థెరపీలా పనిచేస్తాయి. కాబట్టే, ప్రశాంతత దరి చేరుతుంది. ఇది మంచి నిద్రకీ సాయపడుతుందట. అందుకే దీన్ని వీలైనంతవరకూ సాయంత్రం లేదా రాత్రుళ్లు ప్రయత్నించమంటారు. అయితే ముందే తగినంత వేడితో నీళ్ల పట్టుకోవాలి. దెబ్బ తగిలే అవకాశాల్లేకుండా చూసుకోవాలి. అలాగే ఒత్తిడంతా మాయం, విశ్రాంతిగా ఉందని టీవీ, మొబైల్ పట్టుకుని కూర్చోవద్దు. నిద్రకు ఉపకరించేలా పుస్తకం చదవడం, కబుర్లు చెప్పుకోవడం, మంద్రమైన సంగీతం వినడం వంటివి చేస్తే మేలు. ప్రయత్నిస్తారా మరి?

ఈ సైనికురాలు... ఐరన్‌మ్యాన్!

సైన్యంలో పనిచేయడమే ఓ సాహసం. అయితే ఆమె దానికే పరిమితం కాలేదు. మరిన్ని సవాళ్లను ఛేదించాలనుకున్నారు. అందులో భాగంగానే తాజాగా ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయథ్లాన్ ప్రయత్నించారు. ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ పతకాన్నీ సాధించారు... లెఫ్టినెంట్ కల్నల్ ఫరా దీబా.



పట్టుదల, క్రమశిక్షణతో ఎలాంటి సవాళ్లైనా దాటొచ్చు అంటారు ఫరా. భారత సైన్యానికి చెందిన ఈ లెఫ్టినెంట్ కల్నల్... అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బోటనీలో ఎంఎస్సీ, దూరవిద్య ద్వారా సోషల్ వర్క్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ప్రస్తుతం యూపీ గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఈమెది ప్రయాగ్‌రాజ్. సాహసాలంటే ఇష్టం. మారథాన్‌లలోనూ పాల్గొంటుంటారు. తాజాగా గోవాలోని మిరామర్ బీచ్‌లో నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 పోటీలో పాల్గొన్నారు. దీన్ని సహనం, దృఢత్వానికి పరీక్షగా చెబుతారు. ఈ పోటీలో మూడు విభాగాలుంటాయి. 1.9 కి.మీ. ఈత, 90కి.మీ. సైక్లింగ్, చివరగా 21.1 కి.మీ. పరుగు... ఎక్కడా విరామం అనేదే ఉండదు. దేశ, విదేశాల నుంచి 1300 మంది పాల్గొన్నారు. ఈ మొత్తాన్నీ 8 గంటల్లో పూర్తిచేశారు ఫరా. అంతేకాదు, ఐరన్‌మ్యాన్ టైటిల్‌నీ అందుకున్నారు.

ఈటీవీ భారత్

'సముద్ర జలాల్లో ఈత, కొండ ప్రాంతాల్లో సైక్లింగ్ ఎండ వేడిలో పరుగు... అంత సులువేమీ కాదు. వేసిన ప్రతి అడుగూ నా సహనానికీ, ప్యాషన్‌కీ చిహ్నాలే. ఎందుకంటే ఇక నా వల్ల కాదు అని చాలాసార్లే అనిపించింది. ప్రతిసారీ నేను చేయగలను అంటూ నన్ను నేను ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగా. అందుకే ఫినిష్ లైన్ దాటాక నన్ను నేను భుజం తట్టుకున్నా. ఇది నాకు మర్చిపోలేని అనుభవం' అనే ఫరా ప్రతి మహిళా దేన్నైనా సాధించొచ్చు అంటారు. 'కెరియర్‌లో సాగుతున్నా.. ఏదో ఒక క్రీడని తప్పకుండా జీవితంలో భాగం చేసుకోండి. ఇది మీ శరీరాన్నే కాదు... మనసునీ ఆరోగ్యంగా ఉంచుతుంద'న్న సలహానీ ఇస్తున్న కల్నల్ ఫరా... ఈ తరానికి స్ఫూర్తిదాయకమే కదూ!



"విజయవంతమైన ప్రతి స్టార్టప్ వెనక అంతులేని ధైర్యం, దృఢమైన సంకల్పం, గొప్ప నైపుణ్యాలతోపాటు కఠిన సవాళ్లూ నిద్రలేని రాత్రులూ కచ్చితంగా ఉంటాయి. వాటికీ సిద్ధపడినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలం.

– నేహా సింగ్, సీఈఓ, సహ–వ్యవస్థాపకులు, ట్రాక్సన్

పోస్ట్‌పార్టమ్ డిప్రెషనా... బయటపడండిలా!

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ గతేడాది విడుదల చేసిన నివేదిక ప్రకారం... దాదాపు 19-22శాతం మంది బాలింతలు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ బారిన పడుతున్నారట. మారుతున్న జీవనశైలి, కొరవడుతున్న సామాజిక మద్దతు... వంటివి దీనికి ప్రధాన కారణాలు. మరి దీన్నుంచి బయటపడాలంటే...



అధ్యయనాల ప్రకారం శారీరకంగా, మానసికంగా మహిళలు బాగా బలహీనమయ్యే దశ ఇది. ఒత్తిడీ, ఆందోళనా మానసికంగా దెబ్బతీస్తుంటే... హార్మోన్లలో మార్పులు మరోవైపు శారీరక సమస్యలకు కారణం అవుతాయి. ఇవన్నీ సరిపోవన్నట్లు ఇరుగు పొరుగు మాటలతో పరిస్థితులు మరింత దారుణంగా తయారవుతాయి. అందుకే ఈ సమయంలో డిప్రెషన్ లక్షణాలు కనపడినా, వాటిని అధిగమించలేం అన్న ఆలోచన వచ్చినా... వెంటనే నిపుణుల్ని సంప్రదించమంటున్నారు. వాళ్ల సలహా తీసుకోమంటున్నారు. లేదంటే క్రమేణా ఈ లక్షణాలు ఎక్కువై మానసిక సంతులనను దెబ్బతీస్తాయట.

- గలగలా తాము ఏం అనుకుంటున్నారో... చెప్పే మహిళలు కూడా ఈ దశలో మౌనంగా ఉండిపోతారట. అలా కాకుండా మనసులో ఉన్న కష్టమైనా, నష్టమైనా పంచుకోవాలని చెబుతున్నారు.
- బయటికి చెబితే ఎదుటివాళ్లు జడ్జ్ చేస్తారని అనుకుంటే.. సంబంధిత గ్రూపులూ, కమ్యూనిటీలూ ఇప్పుడు చాలానే సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయి. వాటిలో చేరితే సరి. అందులో మీలానే బాధపడుతున్న తల్లులూ, పరిష్కారం చూపించే నిపుణులు చాలామందే ఉంటారు. వాళ్లంతా మీ దశను దాటేందుకు సహాయం చేస్తారు.
- 'పాలిచ్చే తల్లి మధ్యాహ్నం నిద్రపోకూడదు' 'అవి తినకూడదు, ఇవి తినకూడదు' అంటూ ఎన్ని నిబంధనలో. వీటికి శాస్త్రీయంగా ఎలాంటి ఆధారాలూ లేవు. బిడ్డ నిద్రపోయేటప్పుడే అది ఏ సమయం అయినా మీరూ విశ్రాంతి తీసుకోండి. అవసరమైతే బిడ్డను పెద్దవాళ్లకు అప్పగించి రిలాక్స్ అవ్వడానికి ప్రయత్నించండి. నిద్రలేమి కూడా డిప్రెషన్‌కు కారణమే.
- శరీరం ఇంకా హీలింగ్ ప్రక్రియలోనే ఉంటుంది. మీపై ఆ ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అలసట ఉన్నా... చిన్న చిన్న వ్యాయామాలు చేసేందుకు ప్రయత్నించండి. ఈ సమయంలో ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేస్తే మీ పరిస్థితి నుంచి ఉపశమనం దొరుకుతుంది.
- అత్యంత వేగంగా ఆలోచనలు పరుగెత్తే దశ ఇది. అన్నీ ప్రతికూల ఆలోచనలే. పిల్లాడికి ఫలానాది పెట్టొచ్చా, పెట్టకూడదా? ఏం పెడితే ఏం అవుతుందో? ఏది మంచిదో?... వంటివే ఎక్కువ. వీటిని నియంత్రించాలంటే ఏ పని చేసినా మైండ్‌ఫుల్‌గా... ఆలోచనలన్నీ పక్కనపెట్టి చేయాలట. ఆహారమైనా, ఉత్పత్తి అయినా మీకు సరైన అవగాహన వచ్చాకే ఇవ్వమంటున్నారు.
- ఈ దశలో చాలామంది ఒక గది, ఇంటికే పరిమితం అయిపోతారు. వీలైనంత వరకూ బయటికి వెళ్లడానికి ప్రయత్నించండి. ప్రకృతిలో సేదతీరండి. ఇది ప్రశాంతతను ఇచ్చి, మానసిక సమస్యల్ని దూరం చేస్తుంది.

వీటన్నింటితోపాటు సమతుల పోషకాహారం తప్పనిసరి. పథ్యం పేరుతో హద్దులు పెట్టుకోకుండా... వీలైనంత వరకూ అన్నీ తినేందుకే ప్రయత్నించండి. అప్పుడే మీ స్థితి మెరుగుపడుతుంది. శారీరక, మానసిక సమస్యల నుంచి బయపడొచ్చు. పాటిస్తారుగా మరి!

వాళ్ల ఆరోగ్యమే లక్ష్యంగా..!

'పాలిస్తున్న పోశ్చర్ సరైనదేనా, డిష్‌వాషర్ లేకుండా పాల బాటిల్ ఎలా శుభ్రం అవుతుంది. వేడి నీళ్లలో వేయొచ్చా. ఇంత బరువైన బాటిల్‌ని ఈ చిన్ని చేతులు ఎలా పట్టుకోగలవు? గోరువెచ్చని నీళ్లలోనే పాలపిండి కలపాలి అంటున్నారు... అంటే ఏ మేరకు వేడి ఉండాలి.' ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ... కొత్తగా అమ్మ అయిన వాళ్లకి ఎన్ని ప్రశ్నలో. ఆ చిన్న ప్రాణానికి ఏ హానీ జరగకూడదని ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. మీరూ ఆ కోవకు చెందిన అమ్మేనా... అయితే ఈ ఉపకరణాలు మీకోసమే...

కిడ్స్ కార్నర్

పట్టుకోవాల్సిన పని లేదు...

పిల్లలకు పాలివ్వడం ఓ ప్రత్యేక అనుభూతి. చనుబాలు ఎక్కువ, తక్కువ కాకుండా పెద్దవాళ్లు చెప్పిన జాగ్రత్తలన్నీ పాటిస్తాం కదా! మరి బాటిల్‌తో పాలిచ్చినప్పుడో... ధార ఏ కాస్త ఎక్కువైనా ఉక్కిరిబిక్కిరి అవుతారు పిల్లలు. ముక్కుల్లోంచి పాలు వచ్చేస్తాయి. ఇది కొన్నిసార్లు ప్రాణాపాయానికీ దారితీస్తుంది.





అందుకే ఈ 'సెల్ఫ్ ఫీడింగ్ బేబీ బాటిల్'ను వాడి చూడండి. నిపల్‌కు ఓ ట్యూబ్ అమర్చి ఉంటుంది. బాటిల్‌లో పాలు నింపాక, నిపల్‌కి ఉండే మూత తీసి, పాపాయి నోట్లో పెడితే చాలు. పాలు తాగేస్తారు.

ఎక్కడైనా గోరువెచ్చగా...



ఎక్స్‌ప్రెస్ చేసి పెట్టిన పాలైనా... నీళ్లలో ఫార్ములా కలపాలన్నా సరైన ఉష్ణోగ్రత అవసరం. ఇంటి దగ్గర ఉంటే పర్వాలేదు. కానీ బయటికి వెళ్లేటప్పుడు ఇబ్బందులు తప్పవు. వీటి నుంచి బయటపడటానికే ఈ 'పోర్టబుల్ రీచార్జబుల్ బేబీ వార్మర్'. దీంట్లో ఆరు రకాల ఉష్ణోగ్రతలు అందుబాటులో ఉన్నాయి. బాటిల్‌లో పాలు పోసి, పాలిచ్చే సమయాన్ని బట్టి... మనకు నచ్చిన ఉష్ణోగ్రతను ఎంపిక చేసుకుంటే చాలు. పాపాయి పాలు తాగేటప్పటికి వాళ్లకి అవసరమైన వేడితో పాలు తయారైపోతాయి.



శుభ్రం సులువిక...

పాల బాటిల్ కడగడం ఎంత పెద్ద టాస్కో తల్లులకే తెలుసు. డిష్‌వాషర్ వాడకూడదు. పీచు పెట్టి తోమకూడదు. వేడి నీటిల్లోనూ వేయకూడదు. అయినా నిపల్ నుంచీ ప్రతి భాగమూ శుభ్రం అవ్వాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. ఈ సమస్యల్ని దూరం చేయడానికి వచ్చిందే ఈ 'సిలికాన్ బేబీ బాటిల్ బ్రష్ సెట్' దీనిలో మూడు రకాల సౌలభ్యాలు ఉన్నాయి. ఒకటి 360 యాంగిల్‌లో తిరిగే లార్జ్ బ్రష్... బాటిల్ లోపల చుట్టూ తిరుగుతూ... అన్ని మూలలా శుభ్రం చేస్తుంది. ఇంకోటి ఒక ఇనుప పుల్ల... నిపల్ కప్పునకు, బాటిల్ అడుగు భాగంలోనూ చిన్నచిన్న రంధ్రాలు ఉంటాయి. వాటిని తోమడానికి ఇది ఉపయోగపడుతుంది. నిపల్ బ్రష్... నిపల్ చివరి వరకూ వెళ్లి శుభ్రం చేస్తుంది. నచ్చితే ఆన్‌లైన్ వేదికల్లో వెదికేయండి మరి.



వ్యాపార కుటుంబాల్లో వారసత్వ ప్రణాళిక ఏదీ?

● సంపద పెరుగుతున్నా కనిపించని భవిష్యత్ సన్నద్ధత
● ఆసియా దేశాల్లో ఆందోళనకర పరిస్థితి



ఈనాడు, హైదరాబాద్: ఆసియా దేశాల్లో ధనిక వ్యాపార కుటుంబాల సంపద ఏటా పెరుగుతోంది. పాతికేళ్ల క్రితం ప్రపంచ వ్యాప్తంగా ఆసియా దేశాలకు చెందిన ధనిక కుటుంబాల సంపద 6 శాతం మాత్రమే. కానీ ఇప్పుడు మూడు 21 శాతం కనిపిస్తోంది. 2019 నుంచి 2024 మధ్యకాలంలో కేవలం సింగపూర్ ఒక్క దేశమే 765 బిలియన్ డాలర్ల (సుమారు రూ.67.32 లక్షల కోట్లు) సంపద పోగు చేసింది. హాంగ్‌కాంగ్ 975 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.85.80 లక్షల కోట్లు) సంపద ఆర్జించింది. ఆసియా దేశాల్లో ప్రైవేటు సంపద 2029 నాటికి 99 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.8,712 లక్షల కోట్లు)కు చేరుకుంటుందని అంచనా. కానీ ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. ఆసియా దేశాల్లోని ధనికులకు సరైన వారసత్వ ప్రణాళిక లేకపోవడం!

సగం కుటుంబాలు దృష్టి పెట్టడం లేదు..

మొదటి తరం ధనిక కుటుంబాల్లో దాదాపు సగం వరకూ ఎటువంటి వారసత్వ ప్రణాళిక లేదు. ఎంతో తప్పనిసరి అయితే తప్పించి ఈ అంశంపై ఎవరూ దృష్టి సారించడం లేదు. దాదాపు 37 శాతం మంది ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అయినప్పుడు మాత్రమే వారసత్వ ప్రణాళికపై దృష్టి సారిస్తున్నారు. ఇంకా 43 శాతం మంది వ్యాపార అవసరాలు తలెత్తినప్పుడు తమ తర్వాత ఎవరు.. అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. యూబీఎస్ ప్రైవేట్ బ్యాంక్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ), నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సంయుక్తంగా రూపొందించిన నివేదిక ఈ విషయాలను వెల్లడించింది. వారసత్వ ప్రణాళికను నిర్లక్ష్యం చేయడం వల్ల కేవలం కుటుంబ భవిష్యత్తు ప్రమాదంలో పడిపోవటమే కాకుండా, మరెన్నో విధాలుగా నష్టం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం

ఆసియా దేశాల్లో ఎన్నో కార్పొరేట్ దిగ్గజ సంస్థలు ఆయా సంస్థల వ్యవస్థాపకులతోనే పెనవేసుకుపోయి ఉన్నాయి. లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఈ సంస్థల్లో పనిచేస్తున్నారు. ఆయా దేశాల్లోని కొన్ని ప్రాంతాలు, ప్రజల ఆర్థిక స్థితిగతులు ఈ సంస్థలతో ముడిపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు వారసత్వ ప్రణాళిక, తగిన సన్నద్ధత లేనప్పుడు కుటుంబ కలహాలు, న్యాయవివాదాలు తలెత్తుతున్నాయి. దానివల్ల ఆయా సంస్థల భవిష్యత్తు ప్రభావితం అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో వేగంగా, ఎంతో అధిక వృద్ధి నమోదు చేస్తున్న ప్రాంతం ఆసియా ఖండమే. అందువల్ల ఆసియా దేశాల్లోని ధనిక కుటుంబాలకు చెందిన వ్యాపార సామ్రాజ్యాల్లో ఏమాత్రం ఇబ్బందులు తలెత్తినా దాని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కనిపిస్తోంది. దాదాపు 228 మంది ధనికుల వివరాలు తీసుకొని విశ్లేషించి ఈ నివేదికను తయారు చేశారు.

అలా చేయకుంటే సంపద వేగంగా తగ్గొచ్చు

కుటుంబ వ్యాపార సామ్రాజ్యాలను నెలకొల్పిన వారిలో 91 శాతం మంది తమ వ్యాపార సంస్థల నిర్వహణ బాధ్యతలను తమ కుటుంబ సభ్యులే నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నారు. తమ వారసులకు తమ వ్యాపారాలు నిర్వహించాలనే ఆసక్తి లేదని 28 శాతం మంది స్పష్టం చేశారు. తాము ఎంపిక చేసిన వారసులు తమ వ్యాపార సంస్థ బాధ్యతలు చేపట్టడానికి ఇంకా తయారు కాలేదని 24 శాతం మంది చెప్పారు. వ్యాపార సామ్రాజ్యాలను నెలకొల్పిన వారిలో మూడో వంతు మందికి పైగా అన్ని నిర్ణయాలు తామే తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. తమ తర్వాత ఎవరు బాధ్యతలు చేపట్టాలనే విషయాన్ని 28% మంది గోప్యంగా ఉంచుతున్నారు. జీవిత కాలం పాటు క్రమేపీ ఎంతో సంపద కూడబెట్టిన ధనికులు సరైన వారసత్వ ప్రణాళికను సిద్ధం చేయకపోతే ఎంతో వేగంగా ఆ సంపద తరిగిపోతుందని నివేదిక అభిప్రాయపడింది.

ఈనాడు బిజినెస్ వారాంతం

రత్నాభరణాల ఎగుమతుల్లో 31 శాతం క్షీణత



అమెరికా టారిఫ్‌లు, పండగల సందర్భంగా ముందే కొనుగోళ్ల నేపథ్యంలో భారత్ నుంచి రత్నాభరణాల ఎగుమతులు అక్టోబరు నెలలో 31 శాతం తగ్గాయి. వీటి విలువ రూ.19,172.89 కోట్లుగా ఉంది. 2024లో ఈ రంగం మొత్తం ఎగుమతులు రూ.26,237.1 కోట్లుగా ఉన్నాయని రత్నాభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) తెలిపింది. సాధారణంగా పండగల సీజన్‌లో ఎగుమతులు పెరుగుతాయని, కానీ, అందుకు భిన్నంగా ఈసారి ఉందని పేర్కొంది. జీజేఈపీసీ ఛైర్మన్ కిరిట్ భన్సాలీ మాట్లాడుతూ.. అమెరికా కొత్త టారిఫ్‌లను అమలు చేయకముందే పండగల కొనుగోళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఫలితంగా అక్టోబరులో ఎగుమతులు క్షీణించాయని విశ్లేషించారు. బంగారం, వెండి ధరల్లో అస్థిరతలూ ఎగుమతులు తగ్గేందుకు కారణమైనట్లు పేర్కొన్నారు. నవంబరులో చైనా మార్కెట్లు క్రమంగా కోలుకోవడంతోపాటు, క్రిస్మస్ గిరాకీ కారణంగా ఎగుమతులు పెరగొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

● అక్టోబరులో కట్ అండ్ పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు 26.97 శాతం తగ్గి, రూ.9,071.41 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో వీటి విలువ రూ.11,806.45 కోట్లుగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి.

● ల్యాబ్ గ్రోన్ వజ్రాల ఎగుమతులూ 34.90 శాతం క్షీణించి, రూ.834.45 కోట్లకు చేరాయి. ● బంగారు ఆభరణాల ఎగుమతులు గతేడాది అక్టోబరులో రూ.9,975.17 కోట్లు ఉండగా, ఈసారి 28.4 శాతం క్షీణించి, రూ.7,520.34 కోట్లకు పరిమితమయ్యాయి.

● రంగురాళ్ల ఎగుమతులు రూ.2,173.08 కోట్లుగా ఉన్నాయి.

● వెండిపైనా ఈ ప్రభావం పడింది. వెండి ఆభరణాల ఎగుమతులు 16 శాతం తగ్గి, రూ.1,072.81 కోట్లకు చేరాయని గణాంకాలు వెల్లడించాయి.

సీమెన్స్ లాభం రూ.485 కోట్లు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో సీమెన్స్ రూ.485 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.523 కోట్లతో పోలిస్తే ఇది 7 శాతం తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.4,457 కోట్ల నుంచి 16 శాతం పెరిగి రూ.5,171 కోట్లకు చేరింది. కంపెనీ ఆర్థిక సంవత్సరాన్ని అక్టోబరు-సెప్టెంబరు నుంచి ఏప్రిల్-మార్చికి మార్చేందుకు 2025 ఆగస్టు 8న బోర్డు ఆమోదం తెలిపింది. 2024లో ఆస్తి విక్రయం ద్వారా రూ.69 కోట్ల ఏక కాల లాభం రావడంతో 2025 జులై-సెప్టెంబరు త్రైమాసికంలో నికర లాభం తగ్గినట్లు కనిపిస్తోందని కంపెనీ తెలిపింది. 'సమీక్షా త్రైమాసికంలో బలమైన పని తీరును నమోదు చేశాం. ఆదాయం బాగా పెరిగింది. మొబిలిటీ, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారాలు మంచి పని తీరు ప్రదర్శించడం కలిసొచ్చింద'ని కంపెనీ ఎండీ, సీఈఓ సునీల్ మాథుర్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని 2024 అక్టోబరు 1 నుంచి 2026 మార్చి 31 వరకు (18 నెలలు) కొనసాగించనున్నారు. ఆ తర్వాత నుంచి ఇది ఏప్రిల్-మార్చిగా ఉండనుంది.

కోడి గుడ్డు

16న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	610
వరంగల్	612
విజయవాడ	625
తూ/ప గోదావరి	620
విశాఖపట్నం	605
చిత్తూరు	653

సరికొత్తగా టాటా సియారా



ముంబయి: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తన ఎస్‌యూవీ సియారాను సరికొత్తగా శనివారం ఆవిష్కరించింది. కొత్త సియారా తన వారసత్వాన్ని, విలక్షణమైన డిజైన్‌ను నిలుపుకోవడంతో పాటు స్వేచ్ఛ, వ్యక్తిత్వం, అన్వేషణ స్ఫూర్తిని కలిగి ఉందని టీఎంపీవీ తెలిపింది. ఈ మోడల్ హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్ వంటి మధ్య తరహా స్పోర్ట్ వినియోగ వాహనాలతో పోటీ పడబోతోంది. కొత్త సియారాను అధికారికంగా ఈ నెల 25న విడుదల చేయబోతున్నట్లు టాటా మోటార్స్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ డిజైన్ హెడ్ మార్టిన్ ఉహ్లారిక్ పేర్కొన్నారు. టాటా సియారాను తొలిసారిగా 1991లో పరిచయం చేశారు.

39,506 గ్రాండ్ విటారా కార్ల రీకాల్

దిల్లీ: ఇంధన ఇండికేటర్ భాగంలో లోపం ఉండటంతో దానిని మార్చి కొత్తది వేసేందుకు 39,506 గ్రాండ్ విటారా కార్లను మారుతీ సుజుకీ వెనక్కి (రీకాల్) రప్పిస్తోంది. ఇవన్నీ 2024 డిసెంబరు 9 నుంచి 2025 ఏప్రిల్ 29 మధ్య తయారైన కార్లు అని ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. ఈ వాహనాల్లోని స్పీడోమీటర్‌లో ఇంధనం ఎంత ఉందో తెలియజేసే ఇండికేటర్, వార్నింగ్ లైట్ ఇంధన పరిమాణాన్ని సరిగ్గా తెలియజేయడం లేదని కంపెనీ గుర్తించింది. ఇలాంటి లోపం ఉందో? లేదో పరిశీలించి, ఒకవేళ ఉంటే దాని స్థానంలో ఉచితంగా వేరే భాగాన్ని వేసి ఇస్తామంటూ ఈ వాహనాల యజమానులకు తమ అధీకృత డీలర్ల నుంచి సమాచారం వస్తుందని మారుతీ సుజుకీ ఇండియా తెలిపింది.

ఆసియా పసిఫిక్ ప్రాంతానికి మరో 19,560 విమానాలు అవసరం

రాబోయే 20 ఏళ్లపై ఎయిర్‌బస్



బ్యాంకాక్: రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,520 కొత్త విమానాలు అవసరం పడుతుండగా.. వీటిల్లో 19,560 వరకు ఆసియా పసిఫిక్ ప్రాంతానికే కావాల్సి ఉంటుందని ఎయిర్‌బస్ అంచనా వేసింది. అంటే కొత్త విమానాల కోసం ఈ ప్రాంతం నుంచే 46 శాతం వరకు గిరాకీ ఉందన్నమాట. ముఖ్యంగా ఈ అధిక గిరాకీలో చైనా, భారత్‌దే కీలక పాత్ర అని ఎయిర్‌బస్ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లే తెలిపారు. విమాన ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో.. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వార్షికంగా ప్రయాణికుల సంఖ్యలో 4.4 శాతం పెరుగుదల ఉండే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా సగటు పెరుగుదల అయిన 3.6 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువ. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన విపణుల్లో భారత్ కూడా ఒకటి.

ప్రయాణికుల రద్దీ పెరుగుదలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే భారత్‌కు చెందిన విమానయాన సంస్థలు భారీ సంఖ్యలో కొత్త విమానాలకు ఆర్డరు ఇచ్చిన సంగతి తెలిసిందే. రాబోయే 20 ఏళ్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి సుమారు 3,500 వరకు పెద్ద విమానాలు (వైడ్ బాడీ), 16,100 వరకు చిన్న విమానాలు (న్యారో బాడీ) అవసరం అవుతాయని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో విమాన ప్రయాణికుల రద్దీ పెరగడంలో భారత్, చైనా కీలక పాత్ర పోషిస్తున్నాయని అసోసియేషన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ ఎయిర్‌లైన్స్ (ఏఏపీఏ) తెలిపింది. వచ్చే ఏడాది కూడా విమాన ప్రయాణికుల రద్దీలో వృద్ధి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు పుంజుకుంటుండటం, ప్రయాణికుల-సరకు రవాణాపరంగా గిరాకీ పెరుగుతుండటం ఇందుకు కారణమని ఏఏపీఏ డైరెక్టర్ జనరల్ సుభాష్ మేనన్ తెలిపారు. ఎయిరిండియా సహా 18 విమానయాన సంస్థలకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తోంది.

ఉత్తమ హెచ్‌ఆర్ సారథుల్లో రిలయన్స్ ఇరా బింద్రా



దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ మానవ వనరుల విభాగ సారథుల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఇరా బింద్రా చోటు దక్కించుకున్నారు. 2025 సంవత్సరానికి గాను 40 మంది ఉత్తమ మానవ వనరుల విభాగ ముఖ్య అధికారుల (సీహెచ్‌ఆర్‌ఓ) పేర్లతో ఓ జాబితాను ఎన్2గ్రోత్ విడుదల చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో సీహెచ్‌ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఇరా బింద్రాకు ఇందులో 28వ ర్యాంకు లభించింది. ఈ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ సంస్థ రిలయన్స్ కాగా.. ఇందులో భారత్ నుంచి చోటు సంపాదించిన మొట్ట మొదటి మహిళ బింద్రానే. అలాగే వయాల్టో పార్ట్‌నర్స్, అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్, జేపీమోర్గాన్ ఛేజ్, కేటర్‌పిల్లర్, మూడీస్, వాల్‌మార్ట్ లాంటి ప్రముఖ కంపెనీలకు చెందిన సీహెచ్‌ఆర్‌ఓల పేర్లూ ఇందులో ఉన్నాయి. హెచ్‌ఆర్ విభాగంలో బింద్రాకు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. ఎగ్జిక్యూటివ్ సెర్చ్, లీడర్‌షిప్ అడ్వయిజరీ సంస్థ అయిన ఎన్2 గ్రోత్ 2015 నుంచి ఫోర్బ్స్‌లో ఉత్తమ సీహెచ్‌ఆర్‌ఓల జాబితాను ఇవ్వడం ప్రారంభించింది.

నవీ ముంబయి నుంచి హైదరాబాద్‌కు ఇండిగో సర్వీసులు

ముంబయి: కొత్తగా నిర్మితమైన నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి డిసెంబరు 25న దేశీయ విమాన సేవలను 10 నగరాలకు ప్రారంభించనున్నట్లు ఇండిగో ప్రకటించింది. ఈ విమానాశ్రయం నుంచి మరిన్ని గమ్యస్థానాలకు సేవలను మొదలుపెట్టగలమనీ తెలిపారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, దిల్లీ, అహ్మదాబాద్, నార్త్ గోవా(మోపా), జయపుర, నాగ్‌పుర్, కొచ్చిన్, మంగళూరు, లఖ్‌నవూలకు వచ్చే నెల నుంచి విమానాలను మొదలుపెట్టనున్నట్లు వివరించింది. గత నెల 8న ఈ కొత్త విమానాశ్రయాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించిన సంగతి తెలిసిందే.

ఐసీఎల్ ఫిన్‌కార్ప్ ఎన్‌సీడీ 17 నుంచి

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఐసీఎల్ ఫిన్‌కార్ప్ సెక్యూర్డ్ రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీ)ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ నెల 17 నుంచి 28 వరకూ ఇవి అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఎన్‌సీడీ ముఖ విలువ రూ.1,000, కనీసం రూ.10,000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. 13, 24, 36, 60, 70 నెలల వ్యవధితో ఇవి లభిస్తాయి. వార్షిక సగటు క్యుములేటివ్ వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుందని తెలిపింది. ఎన్‌సీడీల నుంచి వచ్చిన మొత్తాన్ని దేశమంతా సేవలను విస్తరించేందుకు వినియోగించనున్నట్లు సంస్థ ఛైర్మన్, ఎండీ కేజీ అనిల్ కుమార్ తెలిపారు.

సింథటిక్ గ్యాస్ ఉత్పత్తిలోకి ఎన్‌టీపీసీ!

బొగ్గును గ్యాస్‌గా మార్చే (గ్యాసిఫికేషన్) వ్యాపారంలోకి అడుగుపెట్టే యోచనలో ప్రభుత్వరంగ ఇంధన దిగ్గజ సంస్థ ఎన్‌టీపీసీ ఉన్నట్లు తెలుస్తోంది. సింథటిక్ గ్యాస్‌గా పేర్కొనే దీన్ని, రాబోయే 3-4 ఏళ్లలో ఏటా 5-10 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు



సంబంధించిన సాంకేతిక సంప్రదింపుల కోసం టెండర్ ప్రక్రియను ఈ ఆర్థిక సంవత్సరంలోనే నిర్వహించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు కోసం స్థలాన్వేషణలోనూ ఎన్‌టీపీసీ ఉందని ఆ వర్గాలు తెలిపాయి. విద్యుదుత్పత్తి కోసం తన సొంత గనుల నుంచి వెలికితీసిన బొగ్గునే ఎన్‌టీపీసీ వాడుతోంది. ఇప్పుడు ఈ బొగ్గును సింథటిక్ గ్యాస్ ఉత్పత్తికీ వాడాలని భావిస్తున్నట్లు సమాచారం. బొగ్గును గ్యాస్‌గా మార్చే ప్రాజెక్టులకు రూ.8,500 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను అందించే ప్రణాళికకు 2024లో కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇలా ఉత్పత్తి చేసిన గ్యాస్‌ను ఎరువులు, పెట్రో రసాయనాల ప్రాజెక్టులకు వాడతారు. 2030 కల్లా బొగ్గు నుంచి 100 మిలియన్ టన్నుల గ్యాస్ ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

ఏ-1 లిమిటెడ్ బోనస్ షేర్లు

దిల్లీ: బోనస్ షేర్ల జారీకి తమ బోర్డు శనివారం ఆమోదం తెలిపినట్లు ఏ-1 లిమిటెడ్ ప్రకటించింది. 3:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల ఇష్యూకు అనుమతి ఇచ్చినట్లు తెలిపింది. 10:1 నిష్పత్తిలో షేర్లను విభజించడానికి కూడా ఆమోదం లభించిందని పేర్కొంది. అంటే ఒక ఈక్విటీ షేరుకు మూడు బోనస్ షేర్లను, రూ.10 విలువ గల 1 ఈక్విటీ షేరును రూ.1 విలువ గల 10 ఈక్విటీ షేర్లుగా విభజించడం చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రతిపాదనతో ప్రస్తుతం రూ.20 కోట్లగా ఉన్న అథరైజ్డ్ షేర్ క్యాపిటల్ రూ.46 కోట్లకు పెరగనుందని చెప్పింది. సంస్థ షేర్లు శుక్రవారం బీఎస్‌ఈలో రూ.1,729.35 వద్ద ముగిశాయి.

2025లో పెద్ద ఐపీఓలదే హవా



ఈనాడు వాణిజ్య విభాగం: ఈ ఏడాది భారీ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ల హవా నడుస్తోంది. సాధారణంగా పెద్ద పబ్లిక్ ఇష్యూలు, మదుపర్ల సహనాన్ని పరీక్షిస్తాయని పేరుంది. కానీ ఈ ఏడాది మాత్రం ప్రాథమిక మార్కెట్‌లో పెద్ద కంపెనీలు కాసుల పంట కురిపించాయి. ఈ ఏడాది వచ్చిన పెద్ద ఐపీఓలకు మదుపర్ల నుంచి మంచి స్పందన లభించింది. సంస్థాగతంగా నగదు లభ్యత కూడా ఇందుకు దోహదపడింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.5,000 కోట్లు దాటిన ఐపీఓలకు సగటున 17.7 రెట్ల స్పందన లభించింది. 2021 తర్వాత ఇదే అత్యధికం. సాధారణంగా పెద్ద ఐపీఓలకు 8-10 రెట్ల స్పందన లభిస్తుంది. 2025లో వచ్చిన 6 పెద్ద ఐపీఓల్లో నాలుగింటికి మదుపర్ల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా (38.17 రెట్లు), లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ (28.35 రెట్లు), గ్రో (17.6 రెట్లు చొప్పున)లకు స్పందన దక్కింది. హెక్సావేర్ టెక్నాలజీస్ (2.27 రెట్లు), టాటా క్యాపిటల్ (1.96 రెట్లు) స్పందన సంపాదించాయి.

● పెద్ద ఐపీఓలకు వచ్చిన స్పందనలో దాదాపు 75-80 శాతం సంస్థాగత మదుపర్ల నుంచే వచ్చిందని కేజ్రీవాల్ రీసెర్చ్ విశ్లేషకులు అరుణ్ కేజ్రీవాల్ తెలిపారు. కార్పొరేట్ ట్రెజరీలు, బ్యాంక్ ట్రెజరీలు కూడా క్రియాశీలంగా ఉన్నాయన్నారు.

● 2025లో ఇప్పటివరకు 84 ఐపీఓలు రూ.1.29 లక్షల కోట్లు సమీకరించాయి. ఇందులో 6 పెద్ద ఐపీఓలు రూ.62,000 కోట్లు దక్కించుకున్నాయి.

● ఇంతకు ముందు 2021లో నైకాకు 81 రెట్ల స్పందన లభించింది. పేటీఎం, సోనా బీఎల్‌డబ్ల్యూ మాత్రం 2 రెట్ల మార్కును అందుకోవడానికి ఇబ్బందులు పడ్డాయి. 2022లో ఎల్‌ఐసీ కూడా 2.65 రెట్లు, డెలివరీ 1.33 రెట్ల స్పందన మాత్రమే దక్కించుకున్నాయి. 2023లో మెగా ఇష్యూలు రాలేదు. 2024లో మాత్రం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ (49.97 రెట్లు), విశాల్ మెగామార్ట్ (20.47 రెట్లు) దుమ్మురేపాయి.

గొడ్డు మాంసం, కాఫీ, పండ్లపై సుంకాల తొలగింపు

కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేసిన ట్రంప్



వాషింగ్టన్: గొడ్డు మాంసం, కాఫీ, ఉష్ణమండల పండ్లు వంటి విస్తృత శ్రేణి వస్తువులపై సుంకాలను తొలగించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదు చేసిన వినియోగదారుల ఒత్తిడికి ప్రతిస్పందనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఆఫ్-ఇయర్ ఎన్నికలలో ఓటర్లు ఆర్థిక ఆందోళనలను తమ ప్రధాన సమస్యగా పేర్కొన్న తర్వాత ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ఫలితంగా వర్జీనియా, న్యూజెర్సీలలో జరిగిన ఎన్నికల్లో డెమొక్రాట్లకు విజయాలు లభించాయి. ఏప్రిల్‌లో చాలా దేశాలపై ట్రంప్ సుంకాలను విధించారు. అవి వినియోగదారుల ధరలను పెంచవని ఆయన చాలాకాలంగా చెబుతున్నారు. అయితే రికార్డు స్థాయిలో గొడ్డు మాంసం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అందుకే వాటిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ప్రధానంగా గొడ్డు మాంసం ఎగుమతిదారు అయిన బ్రెజిల్‌పై ట్రంప్ సుంకాలు విధించడం ఇందుకు కారణమైంది. ఈ కార్యనిర్వాహక ఉత్తర్వు టీ, పండ్ల రసం, సుగంధ ద్రవ్యాలు, అరటి పండ్లు, నారింజ, టమోటాలు, కొన్ని ఎరువులపై కూడా సుంకాలను తొలగించనుంది.

విఝింజమ్ పోర్టులో క్రేన్ల నిర్వహణలో మహిళలు



తిరువనంతపురం: తన విఝింజమ్ పోర్టులో భారీ ఆటోమేటెడ్ కాంటిలివర్ రైల్ మౌంటెడ్ గాంట్రీ (సీఆర్ఎంజీ) క్రేన్స్‌ను ఇక్కడి మహిళలు నిర్వహిస్తున్నారని అదానీ సంస్థ తెలిపింది. పురుషులు చేసే పనిని ఇప్పుడు 9 మంది మహిళలు చేస్తున్నారని వెల్లడించింది. అయితే దేశంలోని పూర్తి ఆటోమేటెడ్ సీఆర్ఎంజీలు కలిగిన మొదటి పోర్టు ఇదేనని, అలాగే ఇక్కడ మహిళలు క్రేన్స్‌ను నడపడం కూడా ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఈ తొమ్మిది మంది మహిళలతో కలిపి మొత్తం 20 మంది క్రేన్స్‌ను నిర్వహిస్తున్నారని చెప్పారు. త్వరలో మరో మహిళ జతకానున్నట్లు చెప్పారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు, రాత్రి 8 నుంచి పగలు 8 వరకు.. ఇలా రెండు షిఫ్టుల్లో ఈ 20 మంది ఈ క్రేన్స్‌ను నిర్వహిస్తారని చెప్పుకొచ్చారు.

ఆ విమానాశ్రయాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు!

వినియోగంలో లేని వాటిలో కార్యకలాపాలకు చర్యలు



గతంలోనే నిర్మించినా, విమానాల రాకపోకలు సాగకుండా నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు ఊపిరులూదాలని కేంద్రం భావిస్తోంది. చిన్న పట్టణాలు-మెట్రో నగరాల అనుసంధానానికి అమలు చేస్తున్న 'ఉడాన్' పథకం కిందకు వీటిని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు వార్తా సంస్థ 'బ్లూమ్‌బర్గ్' తెలిపింది. ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన చర్చల దశలోనే ఉన్నట్లు వివరించింది. ఎంపిక చేసిన ఇలాంటి విమానాశ్రయాలకు, చౌక ధరల్లో విమాన సర్వీసులు నడిపిన పక్షంలో.. నెలవారీ సబ్సిడీ చెల్లింపులను విమానయాన కంపెనీలకు అందించాలనీ యోచిస్తున్నారు. అందువల్ల విమానయాన సంస్థలకు కూడా ఆర్థిక భారం లేకుండా ఉంటుంది. ఈ విమాన సర్వీసుల్లో విక్రయించిన సీట్ల ఆధారంగానూ సబ్సిడీ చెల్లింపులు చేయాలన్నది ప్రతిపాదన. ఈ విషయంపై విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించలేదు.

● 2016లో ఆవిష్కరించిన ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకం కింద దేశంలో 649 విమాన మార్గాలు ప్రారంభం కావడంతో పాటు, ప్రాథమిక మౌలిక వసతులున్న 93 విమానాశ్రయాల్లో కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయి. కొత్త విమానాశ్రయాల వినియోగం పెరిగేందుకూ, నవీకరించిన ఈ పథకం కింద కృషి చేయనున్నారు. దేశంలోని 140 విమానాశ్రయాల్లో కనీసం 12 విమానాశ్రయాలకు గత డిసెంబరు-మార్చి మధ్య ప్రయాణికులే లేరు. ఇటువంటి వాటిని చైతన్యవంతం చేయడం కోసమే కేంద్రం ఈ అడుగులు వేస్తోందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

బ్యాంకు రుణాల వృద్ధికి పండగ జోష్

2025-26కు అంచనాలు పెంచిన ఇక్రా



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) బ్యాంకుల రుణాల వృద్ధి అంచనాను 10.7-11.5 శాతానికి రేటింగ్ సంస్థ ఇక్రా పెంచింది. ఇంతకుముందు 10.5 శాతం వృద్ధిని అంచనా వేసింది. పండగ గిరాకీ, జీఎస్‌టీ సంస్కరణలు, నిధుల లభ్యత పెంచేందుకు ఆర్‌బీఐ చేపట్టిన చర్యలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకుల రుణాల వృద్ధి అంచనాను పెంచినట్లు తెలిపింది. అయితే బ్యాంకింగ్ వ్యవస్థలో గత కొన్నేళ్లుగా స్థిరంగా తగ్గుతూ వస్తున్న స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.3 శాతం వరకు పెరుగుతుందని పేర్కొంది. భారీ మొత్తంలో మూలధన నిధుల అవసరం ఉండకపోవచ్చని భావిస్తూ.. బ్యాంకింగ్ వ్యవస్థకు 'స్థిరత్వం'తో కూడిన అంచనాను కొనసాగిస్తున్నట్లు తెలిపింది.

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు (ఎన్‌బీఎఫ్‌సీలు) రుణాలిచ్చే విషయంలో అప్రమత్తతతో ఉండాలని ఇక్రా హెచ్చరించింది. కార్పొరేట్ రుణాల విభాగంలో గిరాకీ ఇప్పటివరకైతే ఆశించిన స్థాయిలోనైతే పుంజుకోలేదని పేర్కొంది. బ్యాంకుల రుణాల వృద్ధిలో రిటైల్, సూక్ష్మ, చిన్న మధ్యతరహా విభాగాలు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో రూ.10.1 లక్షల కోట్ల మేర రుణాల మంజూరులో పెరుగుదల కనిపించింది. పండగ సీజను గిరాకీ, జీఎస్‌టీ రేట్ల కోత కారణంగా రెండో అర్ధభాగంలో రూ.9.4-10.9 లక్షల కోట్ల మేర రుణాల్లో వృద్ధి ఉండొచ్చని భావిస్తున్నామ'ని ఇక్రా అంచనా వేసింది. నికర వడ్డీ మార్జిన్ పుంజుకుంటుంటంతో కీలక వడ్డీ ఆదాయానికి కలిసి రావొచ్చని వివరించింది.

నైపుణ్య నియామకాలకే పెద్దపీట

● 59% కంపెనీలు ఇదే బాటలో..
● ఎక్వివ్ స్కిల్ ఫస్ట్ హైరింగ్ నివేదిక



ముంబయి: సంప్రదాయ రెజ్యూమె ఆధారిత నియామకాల నుంచి చాలా కంపెనీలు నైపుణ్య నియామకాల విధానంలోకి మారుతున్నాయని ఏఐ ఆధారిత నైపుణ్య మదింపు ప్లాట్‌ఫామ్ ఎక్విప్ తన స్కిల్-ఫస్ట్ హైరింగ్ నివేదికలో వెల్లడించింది. గత ఏడాదితో పోలిస్తే కంపెనీలు ఏఐ సాధనాలను ఉపయోగించి నైపుణ్యాలను మదింపు చేయడం 29 శాతం పెరిగిందని పేర్కొంది. ప్రస్తుతం 59 శాతం కంపెనీలు స్కిల్-ఫస్ట్ విధానానికి మారాయని తెలిపింది. 2022తో పోలిస్తే 78 శాతం వృద్ధి కనిపించిందని వెల్లడించింది. 'స్కిల్-ఫస్ట్ నియామక విధానానికి మారడంతో సంస్థలు ప్రతిభావంతులను గుర్తించి నియమించుకుంటున్నాయి. రియల్-వరల్డ్ స్కిల్ వ్యాలిడేషన్‌తో పాటు ఏఐ మదింపు ద్వారా మెరిట్ ఆధారిత నియామకాలు చేసుకుంటున్నాయి. వేగంగా నియామకాలు, బృంద నిర్మాణానికి ఈ విధానం దోహదం చేస్తోంద'ని ఎక్విప్ వ్యవస్థాపకులు, సీఈఓ జయంత్ నీలకంఠ వెల్లడించారు. 1,700 మందికి పైగా రిక్రూటర్లు, నియామక మేనేజర్లతో పాటు 600 సంస్థల్లో 2,50,000 మంది అభ్యర్థుల మదింపు ద్వారా ఎక్విప్ ఈ నివేదికను రూపొందించింది. స్కిల్-ఫస్ట్ హైరింగ్‌తో అనుచిత నియామకాల రేటు 50 శాతానికి తగ్గిపోయిందని నివేదిక తెలిపింది.

aha@eenadu.in

ఆహా!

ఈనాడు .. ఏమి రుచి

ఆదివారం నవంబరు 16, 2025



మాధుర్యానికి మరో పేరు సీతాఫలం. ఆ తియ్యటి పండుతో బర్ఫీ, బాసుంది, ఖీర్, శ్రీఖండ్, బైట్స్, స్క్వేర్స్, మఫిన్స్, పుడ్డింగ్ ఫిర్నీ, స్మూథీ, మిల్క్‌షేక్.. ఇలా ఏది చేసినా అద్భుతమే. కస్టర్డ్ యాపిల్‌తో మీ కోసం ఇంకొన్ని స్పెషల్ రెసిపీలు..

'తియ్యటి ఫలం తిందామా!

కలాకండ్



కావలసినవి: పంచదార, ఖోయా - కప్పు చొప్పున, ఛేనా - 2 కప్పులు, సీతాఫలాల గుజ్జు - ముప్పావు కప్పు, నెయ్యి - స్పూన్, పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు - 3 స్పూన్ల చొప్పున, యాలకుల పొడి - పావు స్పూన్

తయారీ: ప్యాన్‌లో నెయ్యి వేడిచేసి.. బాదం, పిస్తా, జీడిపప్పులను సన్న సెగ మీద వేయించాలి. అందులో ఛేనా, ఖోయా, పంచదారలు వేసి పంచదార కరిగే వరకూ వేయించాలి. నాలుగు నిమిషాల తర్వాత.. సీతాఫలాల గుజ్జు, యాలకుల పొడి, సగం డ్రైఫ్రూట్స్ పలుకులను జోడించాలి. కొన్ని క్షణాల పాటు కలియతిప్పి.. సెగ తీసేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక పళ్లెంలో సమంగా సర్ది.. మిగిలిన పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులను పైన చల్లి.. ముక్కలుగా కోసుకోవాలి. ఇక తియ్యతియ్యటి 'సీతాఫల్ కలాకండ్' ఎప్పుడెప్పుడు తిందామా అనిపిస్తుంది.

కేక్



కావలసినవి: పాలు - ఒకటిన్నర కప్పు, వైట్ వెనిగర్ - స్పూన్, నూనె - 2 టేబుల్ స్పూన్లు, సీతాఫలాల గుజ్జు, పంచదార పొడి, మైదాపిండి - కప్పు చొప్పున, మిల్క్ పౌడర్ - రెండున్నర టేబుల్ స్పూన్లు, బేకింగ్ సోడా - అర స్పూన్, బేకింగ్ పౌడర్ - స్పూన్, టూటీ ఫ్రూటీ - ఒకటిన్నర స్పూన్లు

తయారీ: పావు కప్పు పంచదారలో కొన్ని నీళ్లు పోసి వేడిచేసి సిరప్ చేసి పక్కనుంచాలి. పాలలో వెనిగర్ కలిపి పది నిమిషాలుంచాలి. ఆ పాలను మిక్సీజార్లో వేసి.. పంచదార పొడి, సీతాఫలాల గుజ్జు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసి.. మిల్క్ పౌడర్, జల్లించిన మైదా, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్ జతచేసి ఉండలు కట్టకుండా కలపాలి. ఈ పిండిని ఆరంగుళాల కేక్ టిన్‌లో వేసి.. రెండు మూడుసార్లు కదిలించి సమంగా సర్దుకునేలా చేయాలి. పైన టూటీ ఫ్రూటీ చల్లాలి. ఓవెన్‌ను 180 డిగ్రీల సెల్సియస్ వద్ద ప్రీహీట్ చేసి 20 నుంచి 25 నిమిషాలు బేక్ చేస్తే.. అదిరిపోయే 'సీతాఫల్ కేక్' ఆస్వాదించడమే ఆలస్యం.

రబ్డీ



కావలసినవి: చిక్కటి పాలు - లీటర్, సీతాఫలాలు - 3, పంచదార - ముప్పావు కప్పు, యాలకుల పొడి - పావు చెంచా, కుంకుమ పువ్వు - కొద్దిగా, బాదం, పిస్తా పలుకులు - రెండు స్పూన్ చొప్పున

తయారీ: సీతాఫలాల తొక్కను, విత్తనాలనూ తొలగించి గుజ్జును తీసి పక్కనుంచాలి. పాలను సన్న సెగ మీదుంచి కలియతిప్పుతూ మరిగించాలి. అందులో పంచదార, యాలకుల పొడి, కుంకుమ పువ్వు, సీతాఫలాల గుజ్జు, బాదం, పిస్తా పలుకులు జోడించాలి. అడుగంటకుండా కలుపుతూనే ఉండి.. చిక్కగా అయ్యాక సెగ తీసేయాలి. చల్లారాక.. ఒక గంట రిఫ్రిజిరేటర్‌లో ఉంచారంటే.. అందరికీ నచ్చేసే సూపర్ టేస్టీ 'సీతాఫల్ రబ్డీ' రెడీ.

కుల్ఫీ

కావలసినవి: సీతాఫలాలు - 4, చిక్కటి పాలు - లీటర్, పంచదార - పావు కప్పు, మొక్కజొన్న పిండి - 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - పావు చెంచా

తయారీ: సీతాఫలాల తొక్క తీసేసి స్ట్రెయినర్‌లో వేసి విస్కర్ సాయంతో గుజ్జు తీసి పక్కనుంచాలి. మొక్కజొన్న పిండిలో కొన్ని పాలు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. మిగిలిన పాలను సన్న సెగ మీదుంచి.. మధ్యమధ్యలో కలియతిప్పుతూ మరిగించాలి. అందులో పంచదార, యాలకుల పొడి, మొక్కజొన్న పిండి కలిపిన పాలు జోడించి కలియబెడుతూ.. దగ్గరగా అయ్యాక సెగ తీసేయాలి. చల్లారిన తర్వాత సీతాఫలాల గుజ్జు జతచేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కుల్ఫీ అచ్చుల్లో పోసి.. మూత పెట్టేయాలి. మూతకు ఉన్న రంధ్రాల్లోంచి ఐస్‌క్రీమ్ స్టిక్స్‌ను గుచ్చి ఆరు గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. అంతే.. నోరూరించే 'సీతాఫల్ కుల్ఫీ' తయారైపోతుంది.



హల్వా

కావలసినవి: సీతాఫలాలు - 3, పాలు - పావు లీటర్, నెయ్యి, ఉప్మా రవ్వ - 120 గ్రాముల చొప్పున, పంచదారపొడి - 50 గ్రా, బాదం, జీడిపప్పులు - 10 చొప్పున, కిస్‌మిస్ - 20, జాజికాయ పొడి - చిటికెడు

తయారీ: సీతాఫలాల పై తొక్క, లోపలి గింజలు తీసేసి గుజ్జును సిద్ధంగా ఉంచుకోవాలి. ప్యాన్‌లో కాస్త నెయ్యి వేసి.. మొదట బాదంపప్పులు.. అవి కాస్త వేగాక జీడిపప్పులు తర్వాత కిస్‌మిస్‌లను వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇప్పుడు మిగిలిన నెయ్యి కూడా వేసి.. రవ్వను సన్న సెగ మీద వేయించాలి. మంచి వాసన వస్తుండగా పంచదార పొడి, పాలు జతచేసి కలియతిప్పుతుండాలి. చిక్కగా అయ్యాక.. జాజికాయ పొడి, వేయించిన బాదం, జీడిపప్పులు, కిస్‌మిస్, సీతాఫలాల గుజ్జు చేర్చి కలియబెడుతూ ఒక నిమిషం తర్వాత దించేస్తే.. 'కసర్డ్ యాపిల్ హల్వా' సిద్ధమైపోతుంది. ఇక తిని ఆనందించడమే తరువాయి.



చిత్రమైన కమ్మరట్టు

ఇవి ఎంతమాత్రం అట్టులా లేకపోయినా.. కమ్మరట్టు అంటారెందుకో! రుచికి తియ్యగా చాక్లెట్లలా ఉంటాయి. వీటిని ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు. ఇంతకూ కమ్మరట్టు ఎలా చేయాలో చూద్దామా..!



పాకపుంట

కావలసినవి: తురిమిన బెల్లం - రెండు కప్పులు, కొబ్బరి తురుము - అర కప్పు, పల్లీలు, నువ్వుల పొడర్లు - రెండు స్పూన్ల చొప్పున, నెయ్యి - నాలుగు స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూన్

తయారీ: బెల్లంలో ముప్పావు కప్పు నీళ్లు పోసి కలియతిప్పుతూ వేడిచేయాలి. బెల్లం పూర్తిగా కరిగాక.. దించేసి వడకట్టి పక్కనుంచాలి. ప్యాన్‌లో నెయ్యి వేడిచేసి కొబ్బరితురుము, పల్లీలు, నువ్వుల పొడులు, వడకట్టిన బెల్లం నీళ్లు పోసి, సన్నసెగ మీదుంచి.. మధ్యమధ్యలో కలియబెడుతుండాలి. పది నిమిషాలయ్యాక.. యాలకుల పొడి జోడించాలి. పాకం గట్టిపడిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారాక చేతులకు కాస్త నెయ్యి రాసుకుని.. ఈ మిశ్రమంతో గుండ్రంగా, చతురస్రంలా, బలపాల్లా.. ఇలా మీకు నచ్చిన ఆకృతులు చేసుకోవాలి. అంతే.. తియ్యనైన 'కమ్మరట్టు' సిద్ధం. నచ్చితే ఒకసారి చేసి చూడండి. **- నాయిని అనూష**



మనలో చాలామందికి హోటల్ ఫుడ్ బాగా నచ్చుతుంది. పాలక్ పనీర్, కాజూ మసాలా వంటివి ఇంట్లో చేస్తే ఏమంత ప్రత్యేకంగా అనిపించవు కదూ! ఈసారి కాజూ మసాలా ఇలా చేసి చూడండి.. రెస్టారెంట్ స్టయిల్లో వారెవా అనిపించడం ఖాయం...

వారెవా కాజూ మసాలా!

షెఫ్ స్పెషల్

కావలసినవి: ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు - రెండు కప్పుల చొప్పున, నూనె - 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, టొమాటోలు - నాలుగు, దాల్చినచెక్క - అంగుళం ముక్క, బిర్యానీ ఆకు - ఒకటి, యాలకులు - రెండు, లవంగాలు - నాలుగు, పచ్చిమిర్చి - రెండు, అల్లం వెల్లుల్లి ముద్ద - ఒకటిన్నర చెంచా, ధనియాలు, జీలకర్ర పొడులు, కారం - చెంచా చొప్పున, గరం మసాలా, పసుపు - అర చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు - గుప్పెడు

తయారీ: సగం జీడిపప్పు, ఉల్లిపాయ ముక్కలను ఉడికించి, గ్రైండ్ చేసి పక్కనుంచాలి. పచ్చిమిర్చి, టొమాటోలను సన్నగా తరగాలి. కడాయిలో నూనె వేడిచేసి.. మిగిలిన జీడిపప్పును వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. దాల్చినచెక్క, బిర్యానీ ఆకు, యాలకులు, లవంగాలు వేయాలి. అవి వేగాక.. మిగిలిన ఉల్లి తరుగును లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేగనివ్వాలి. అందులో టొమాటో, పచ్చిమిర్చి తరుగు, అల్లం వెల్లుల్లి ముద్ద, పసుపు, ధనియాలు, జీలకర్ర పొడులు, గరం మసాలా, కారం, ఉప్పు జోడించాలి. నాలుగు నిమిషాలు వేయించి.. గ్రైండ్ చేసిన ఉల్లి-జీడిపప్పు పేస్టు, కొన్ని నీళ్లు చేర్చి ఉడికించాలి. ఆరేడు నిమిషాల తర్వాత వేయించిన జీడిపప్పు జతచేయాలి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి.. దించేయండి. హోటల్ స్టయిల్ కాజూ మసాలా ఆస్వాదించండి.

వాళ్ల దహీ వడ.. ఇలా ఉంటుంది!

పొరుగు రుచి

పెరుగు ఆవడలు మనకేం కొత్త కాదు. కానీ వీటిని మధ్యప్రదేశ్ వాళ్లయితే ఇంకొంచెం ప్రత్యేకంగా చేస్తారు.

దహీ వడ కోసం... మినపప్పు - ఒక కప్పు; ఉప్పు - రుచికి తగినంత; నూనె - వేయించడానికి సరిపడా, పెరుగు - రెండున్నర కప్పులు; దానిమ్మ గింజలు - 2 స్పూన్లు; సన్న కారప్పూస - గుప్పెడు; పంచదార - 3 స్పూన్లు; కారం, వేయించిన జీలకర్ర, ధనియాల పొడులు - స్పూన్ చొప్పున; కొత్తిమీర తరుగు - చారెడు; పుదీనా చట్నీ, పండుమిర్చి చట్నీ - ఒకటిన్నర స్పూన్ల చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే... మినపప్పును నాలుగైదు గంటలు నానబెట్టి ఆ నీళ్ల తీసేసి, ఉప్పు వేసి మెత్తగా రుబ్బాలి. ఈ పిండితో వడలు చేసి కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. వాటిని కొంతసేపు నీళ్లలో వేయాలి. మెత్తబడ్డాక పెరుగులోకి తీయాలి. అందులో పుదీనా, పండుమిర్చి చట్నీలు, దానిమ్మ గింజలు, సన్న కారప్పూస, పంచదార, కారం, జీలకర్ర, ధనియాల పొడులు, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. అంతే.. మధ్యప్రదేశ్ వారి నోరూరించే 'దహీ వడ' తిని ఆనందించడమే తరువాయి.



బరువు తగ్గేందుకు బ్రోకలీ తినండి!

ఆహారం ఆరోగ్యం



క్యాలీఫ్లవర్‌తో పోలిస్తే బ్రోకలీ కొంచెం ఖరీదు ఎక్కువే. అందుకు తగ్గట్టు పోషకాలూ అధికమే. అందుకే దీన్ని ఏదో రూపంలో తరచూ తినమంటున్నారు వైద్య నిపుణులు. బ్రోకలీని మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎన్ని లాభాలున్నాయో చూడండి...

బ్రోకలీలో ఎ, బి6, బి9, సి, ఇ, కె విటమిన్లు, పీచు, రిబోఫ్లేవిన్, థియామిన్, పొటాషియం, జింక్, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, భాస్వరం, సెలీనియం విస్తారంగా ఉన్నాయి. ● ఇందులో యాంటీఆక్సిడెంట్స్ ఉండటం వల్ల జలుబూ జ్వరం వంటి సాధారణ అనారోగ్యాలను అరికడుతుంది. ● రక్తపోటు, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటాయి. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. ● జీర్ణప్రక్రియ సాఫీగా ఉంటుంది. వేళకు ఆకలి వేస్తుంది. ● రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ● మెదడు చురుగ్గా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ● రక్తంలో చక్కెర అదుపులో ఉంటుంది. ● ఎముకలు దృఢంగా ఉంటాయి. ● కంటిచూపు మెరుగుపడుతుంది. ● ఊబకాయం రాదు. బరువు తగ్గాలనుకునేవారు తరచూ బ్రోకలీని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ● చర్మాన్ని సంరక్షిస్తుంది. ● క్యాన్సర్‌ను సైతం నిరోధిస్తుంది. ● బ్రోకలీతో కూర, ఫ్రై, ఛాట్, సూప్, పాస్తా, సలాడ్, ఆమ్లెట్, పరోటా, పకోడీ వంటివెన్నో చేసుకోవచ్చు.

కోకుమ్ పానీయం ఇలా!

మార్కెట్‌లో దొరికే కూల్‌డ్రింక్స్‌కు బదులు ఇంట్లోనే ఆరోగ్యకరమైన పానీయాలు చేసుకోవడం మంచిది కదా! అందులో భాగంగా ఈసారి మనం కోకుమ్ జ్యూస్ చేసుకుందామా... ఈ కాన్‌సన్‌ట్రేట్ కోసం... డ్రై కోకుమ్ ఫ్రూట్ - కప్పు, పంచదార - 2 కప్పులు, యాలకులు - అర డజన్, వేయించిన జీలకర్ర పొడి - స్పూన్, ఉప్పు - చిటికెడు తీసుకోవాలి. ఎలా చేయాలంటే... యాలకులను పొడి చేయాలి. ఎండు కోకుమ్ పండ్లను నానబెట్టి.. విత్తనాలను తీసేయాలి. వాటికి కొన్ని నీళ్లు చేర్చి మెత్తగా గ్రైండ్ చేసి.. వడకట్టాలి. పంచదారలో 2 కప్పుల నీళ్లు పోసి వేడి చేయాలి. అందులో వడకట్టిన కోకుమ్ జ్యూస్, జీలకర్ర, యాలకుల పొడర్లు, ఉప్పు జతచేసి.. మధ్యమధ్యలో కలియతిప్పుతూ సన్న సెగ మీదుంచాలి. సగం నీళ్లు ఆవిరై పోయాక దించేయాలి. పూర్తిగా చల్లారాక.. తడి లేని, గాలి చొరబడని సీసాలో పోసి.. రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో టేబుల్‌స్పూన్ కోకుమ్ చిక్కటి పానీయం కలిపితే సరిపోతుంది.



నూనె ఎంత తగ్గిస్తే అంత మంచిది. ముఖ్యంగా మధుమేహం వంటి సమస్యలుంటే ఆయిల్ ఫుడ్‌కు మరింత దూరంగా ఉండాలి. ఈ నేపథ్యంలో ఈసారి మనం నూనె ఉపయోగించకుండా బ్రెడ్ స్నాక్స్ ఎలా చేయాలో చూద్దాం.

ఈ చిరుతిండికి నూనె అక్కర్లేదు

ఈ చిరుతిండి కోసం... బ్రెడ్ స్లైసులు - 6, ఉప్మారవ్వ - అర కప్పు, పెరుగు - ముప్పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, ఉల్లిపాయ - 1, టొమాటో గుజ్జు, క్యారెట్ తురుము, సన్నగా తరిగిన బీన్స్ - టేబుల్ స్పూన్ చొప్పున, తురిమిన కీరదోస - 2 టేబుల్ స్పూన్లు, చిల్లీ ఫ్లేక్స్ - 2 స్పూన్లు, ధనియాల పొడి - స్పూన్, నూరిన పుదీనా, నెయ్యి - అర స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే... ఉల్లిపాయను చీలికలుగా కోయాలి. బ్రెడ్ స్లైసులను పొడుగ్గా మూడు లేదా నాలుగు ముక్కలు చేయాలి. ఒక పాత్రలో రవ్వ, పెరుగు, కొన్ని నీళ్లు, ఉప్పు, టొమాటో గుజ్జు, ఉల్లి, బీన్స్ ముక్కలు, క్యారెట్, కీరదోస, పుదీనా, చిల్లీ ఫ్లేక్స్, ధనియాల పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమం మరీ గట్టిగా లేదా మరీ జారుగా ఉండకూడదు. ఇందులో ముంచి తీసిన బ్రెడ్ ముక్కలను- కుంచెతో రెండు మూడు చుక్కల నెయ్యి రాసిన పెనం మీద వేయాలి. మూత పెట్టి రెండు నిమిషాలుంచాలి. మూత తీసి తిరగేసి అటు కూడా కాలనివ్వాలి. అంతే.. నూనె లేకుండానే రుచికరమైన బ్రెడ్ స్నాక్స్ తయారైపోతాయి.



వారంలో రెండు సార్లయినా పప్పు చేస్తాం. ఇంట్లో కూరగాయలు లేకుంటే అదే ఆదుకుంటుంది మనల్ని. కానీ పప్పు ఉడకటానికి చాలా టైం పడుతుంది. అంత సమయం, శ్రమ లేకుండా వేగంగా పప్పు చేసేయాలంటే... దాల్ ప్రీమిక్స్ చేసి సిద్ధంగా ఉంచండి. అప్పుడిక తాలింపు వేస్తే సరిపోతుంది...

దాల్ ప్రీమిక్స్ చేద్దాం



దాల్ ప్రీమిక్స్ కోసం... కందిపప్పు - ఒక కప్పు, ధనియాలు, కొబ్బరిపొడి, పుట్నాలపప్పు - 4 స్పూన్ల చొప్పున, ఆవాలు, మెంతులు, పసుపు - స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, ఎండుమిర్చి - 25, గింజలు, పెంకు లేని చింతపండు - నిమ్మకాయంత, కరివేపాకు - 10 రెబ్బలు, ఇంగువ - అర స్పూన్ తీసుకోవాలి. ఎలా చేయాలంటే... కందిపప్పును దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. అదే కడాయిలో ఆవాలు, మెంతులు, ధనియాలు, పుట్నాలపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, చింతపండు, కొబ్బరిపొడి.. ఇలా అన్నిటినీ విడివిడిగా వేయించాలి. చల్లారాక.. ముందుగా ఎండుమిర్చిని గ్రైండ్ చేయాలి. అందులో కందిపప్పు, మెంతులు, ధనియాలు, పుట్నాలపప్పు జతచేసి మరోసారి గ్రైండ్ చేయాలి. తర్వాత ఇంగువ, పసుపు, ఉప్పు, చింతపండు చేర్చి మళ్లీ మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమంలో ఆవాలు, కరివేపాకు, కొబ్బరిపొడి చేర్చాలి. అంతే.. దాల్ ప్రీమిక్స్ సిద్ధమైపోతుంది. దీన్ని గాలి చొరబడని సీసా లేదా జిప్ లాక్ కవర్లో భద్రం చేస్తే మూడు నెలలు నిలవుంటుంది.

భళారే బొప్పాయి పచ్చడి!

కూరలెన్ని ఉన్నా పచ్చడి పేరు చెబితే చాలు ప్రాణం లేచివస్తుంది. అందునా ఎప్పుడూ తినేది కాకుండా కొంచెం వెరైటీ చట్నీ అంటే ఎప్పుడెప్పుడు తిందామా అని జిహ్వ తహతహలాడుతుంది. ఈసారి మీ కోసం బొప్పాయి పచ్చడి!

కావలసినవి: పచ్చి బొప్పాయి తురుము - 2 కప్పులు, నూనె - టేబుల్ స్పూన్, ఉల్లిపాయ - 1, పచ్చిమిర్చి - 6, ఆవాలు, మెంతులు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, వెల్లుల్లి తరుగు, బెల్లంపొడి, నిమ్మరసం - స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, కరివేపాకు - 3 రెబ్బలు, ఎండుమిర్చి - 2, ఇంగువ - పావు స్పూన్, కారం, పసుపు, అల్లం ముద్ద, మిరియాల పొడి - అర స్పూన్ చొప్పున

తయారీ: ఉల్లిపాయను సన్నగా తరగాలి. కడాయిలో నూనె వేడిచేసి.. ఆవాలు, మెంతులు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి, ఇంగువ, వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, అల్లం ముద్ద, మిరియాల పొడి, ఉప్పు ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగిన తర్వాత.. బొప్పాయి తురుము జతచేసి మధ్యమధ్యలో కలియతిప్పుతూ సన్న సెగ మీదుంచాలి. పది నిమిషాల తర్వాత.. బెల్లంపొడి, నిమ్మరసం, కారం జోడించి.. కొన్ని క్షణాలుంచి దించేయాలి. అంతే.. ప్రత్యేకమైన రుచితో ఆకట్టుకునే బొప్పాయి పచ్చడి రెడీ అయిపోతుంది. తీపి నచ్చనివాళ్లు బెల్లం వేయనవసరం లేదు.



చిత్రంగా..

టొమాటోల సొగసు

ఎర్రెర్రని టొమాటోలతో కూర, పచ్చడి ఏం చేసినా సూపరే. వాటికి కాబేజ్, క్యాలీఫ్లవర్, బంగాళదుంపల్లాంటివి చేర్చామంటే రుచి రెట్టింపైపోతుంది. సొగసైన టొమాటోలకు చేప, చిలుక లాంటి రూపాలిచ్చి.. మరింత సౌందర్యాన్ని చేకూర్చారు. భలే ముద్దొస్తున్నాయి కదూ!



భారత రాజ్యాంగ స్వరూపం

నాలుగో దశ (1909-1935)


మార్లే


మింటో

దేశ ప్రజలు, పాలకులు, పాలనా యంత్రాంగం పాటించాల్సిన సర్వోన్నత చట్టమే రాజ్యాంగం. ప్రతి పౌరుడు, ప్రభుత్వాలు దీన్ని తప్పనిసరిగా అనుసరించాలి. రాజ్యాంగం అనేది లేకపోతే పాలన గాడితప్పుతుంది. అరాచక శక్తులు పెట్రేగిపోతాయి. భారత రాజ్యాంగ పరిణామక్రమం బ్రిటిష్ కాలం నుంచే ప్రారంభమైంది. ఈ క్రమాన్ని బి.సి. రావత్ ఆరు దశలుగా వర్గీకరించారు. మొదటి (1600-1773) దశలో వ్యాపారం నిమిత్తం వచ్చిన ఆంగ్లేయులు పలు యుద్ధాలు గెలిచి సామ్రాజ్య స్థాపనకు నాంది పలికారు. రెండో (1773-1858) దశలో పలు ముఖ్య చట్టాలను రూపొందించారు. మూడో (1858-1909) దశలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై, రాణి ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది. ఈ కాలంలో కౌన్సిల్ చట్టాలు చేశారు.

ఆదాయంపై అధికారం వారికి.. బాధ్యతలు భారతీయులకు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

భారత కౌన్సిల్ చట్టం/మింటో - మార్లే సంస్కరణలు: 1909

1892 కౌన్సిల్ చట్టంలోని లోపాలను సవరించి, పరిష్కరించడం, దేశంలో తీవ్రవాద జాతీయవాదంతో ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కోవడం, మితవాదులను సంతృప్తిపరచడం అనే లక్ష్యాలతో 1909లో చేసినవే మింటో-మార్లే సంస్కరణలు. నాటి భారత వైస్రాయ్ మింటో, భారత రాజ్య కార్యదర్శి మార్లే పేర్లతో ఈ చట్టాన్ని రూపొందించడంతో దీనికి మింటో-మార్లే సంస్కరణలు అనే పేరు వచ్చింది.

ముఖ్యాంశాలు:

కేంద్ర, రాష్ట్ర శాసనమండలిలో సభ్యుల సంఖ్యను పెంచారు.

- కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌గా మార్చారు.
- గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను 8కి పెంచి, ఒక భారతీయుడికి అవకాశం కల్పించారు. కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన మొదటి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా. ఈయన్ను న్యాయ సభ్యుడిగా నియమించారు.
- వైస్రాయ్ కార్యనిర్వాహక కౌన్సిల్‌లోని సభ్యుల సంఖ్యను శాసన ప్రక్రియ కోసం 16 నుంచి 60కి పెంచారు. అదేవిధంగా మద్రాస్, బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, బిహార్, ఒరిస్సా రాష్ట్రాల శాసనమండలిలో సభ్యత్వ సంఖ్యను 50కి పెంచారు. పంజాబ్, అస్సాం, బర్మాలో 30కి పెంచారు.
- భారతదేశంలో మతప్రాతిపదికన ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. భారత్‌లో మత ప్రాతిపదికన నియోజకవర్గాల పితామహుడిగా 'లార్డ్ మింటో'ను పేర్కొంటారు.
- ఈ చట్టం మతప్రాతిపదికన భారత్-పాకిస్థాన్ అనే రెండు దేశాలు ఏర్పడటానికి పునాది వేసింది.
- శాసనసభలో బడ్జెట్‌తో సహా అన్ని అంశాలపై ప్రశ్నించే అవకాశాన్ని, తీర్మానాలు ప్రవేశపెట్టే అవకాశాన్ని భారతీయులకు కల్పించారు.
- ప్రెసిడెన్సీ కార్పొరేషన్‌లకు, విశ్వవిద్యాలయాలకు, భూస్వాములకు, వ్యాపార సంస్థలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించారు.
- కేంద్ర, రాష్ట్ర శాసనమండలిలో పోటీ చేసే అభ్యర్థులకు కచ్చితమైన అర్హతలు నిర్ణయించారు.

భారత ప్రభుత్వ చట్టం - 1919

భారతదేశంలో క్రమంగా బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తమ ఆశయమని మొదటిసారిగా బ్రిటిష్ ప్రభుత్వం 1917 ఆగస్టు 20న ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఏర్పడిన చట్టమే భారత ప్రభుత్వ చట్టం-1919. ఇది 1921 నుంచి అమల్లోకి వచ్చింది. భారత రాజ్య కార్యదర్శి మాంటేగ్, వైస్రాయ్ చెమ్స్‌ఫర్డ్ ఈ చట్టాన్ని రూపొందించడంతో దీన్ని మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం అని కూడా అంటారు.

ముఖ్యాంశాలు:

కేంద్ర శాసనసభలో మొదటిసారిగా ద్విసభా విధానాన్ని ప్రవేశపెట్టారు. అవి...

కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్: 60 మంది సభ్యులు ఉన్న ఈ సభను ఎగువ సభ అంటారు. వీరిలో 34 మంది ఎన్నికైనవారు. 26 మంది గవర్నర్ జనరల్ నామినేట్ చేసినవారు ఉండేవారు. సభ పదవీకాలం అయిదేళ్లు. దీని మొదటి అధ్యక్షుడు ఫ్రెడరిక్ వైట్.

లెజిస్లేటివ్ కౌన్సిల్: ఈ సభలో మొత్తం సభ్యులు 143 (స్పీకర్ కాకుండా). దీన్ని దిగువ సభగా పిలుస్తారు. పదవీకాలం మూడేళ్లు. ఈ సభ తొలి అధ్యక్షుడు విఠల్‌భాయ్ పటేల్. ఉపాధ్యక్షుడు సచ్చిదానంద సిన్హా.

- ఈ రెండు సభలను పదవీకాలం పూర్తికాక ముందే రద్దు చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది.
- రాష్ట్రాల్లో శాసనసభ్యుల సంఖ్యను పెంచారు.
- రాష్ట్రాల్లో ద్వంద్వ ప్రభుత్వాలను (డయార్కి) ప్రవేశపెట్టారు. డయార్కి అనేది గ్రీకు పదం. డయార్కి అంటే ఇంగ్లిష్‌లో డబుల్ గవర్నమెంట్ అని అర్థం. దీని ప్రకారం ప్రభుత్వ పాలనా అంశాలను రెండు జాబితాలుగా వర్గీకరించారు.


రిజర్వ్‌డ్ జాబితా (28 అంశాలు): ప్రాముఖ్యం కలిగిన అధికారాలు, ఆదాయం కలిగిన భూమిశిస్తు, శాంతిభద్రతలు, న్యాయం లాంటి అంశాలు.


- గవర్నర్ ద్వారా నియమితులయ్యే బ్రిటిష్ మంత్రులకు (అధికారులకు) ఈ జాబితాపై అధికారాలు కల్పించారు. వీరు శాసనసభకు ఎలాంటి బాధ్యత వహించరు.

ట్రాన్స్‌ఫర్డ్ జాబితా (22 అంశాలు): అధికారాలు లేని, ప్రాముఖ్యం లేకుండా కేవలం బాధ్యతలు మాత్రమే కలిగి ఉండే శాఖలను ఈ జాబితాలో చేర్చారు.

ఉదా: స్థానిక స్వపరిపాలన, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, వ్యవసాయం.

- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న పాలనాంశాలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితాగా పేర్కొంటారు. కేంద్ర జాబితాలో 47 అంశాలను, రాష్ట్ర జాబితాలో 51 అంశాలను చేర్చారు.
- ఈ చట్టం భారతీయులకు ప్రత్యక్షంగా పరిపాలనలో పాలుపంచుకునే అవకాశం కల్పించింది.
- ఈ చట్టం పరిమితమైన ప్రత్యక్ష ఎన్నికల పద్ధతిని భారతదేశంలో ప్రవేశపెట్టింది.
- సిక్కులు, క్రైస్తవులు, ఆంగ్లో-ఇండియన్స్, యూరోపియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించడం ద్వారా మతపరమైన ప్రాతినిధ్యం విస్తృతమైంది.
- ఈ చట్టం ఆస్తి పన్ను చెల్లింపు, విద్యా ప్రాతిపదికపై పరిమిత ఓటుహక్కును, మహిళలకు ఓటుహక్కును కల్పించింది.
- లండన్‌లో భారత వ్యవహారాలను ముఖ్యంగా రెవెన్యూ పరిపాలన మొదలైన అంశాలను పర్యవేక్షించడానికి భారత హై కమిషనర్ అనే పదవిని సృష్టించారు. లండన్‌లో భారత హై కమిషనర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.


మాంటేగ్


చెమ్స్‌ఫర్డ్

- ప్రభుత్వ ఆదాయ వ్యయాలను తనిఖీ చేయడానికి ఆడిటర్ జనరల్ పదవిని ఏర్పాటు చేశారు.
- ఈ చట్టం మొదటిసారిగా కేంద్ర బడ్జెట్ నుంచి రాష్ట్ర బడ్జెట్‌ను వేరు చేసింది. తమ బడ్జెట్‌ని తామే రూపొందించుకునే అధికారాన్ని ప్రావిన్షియల్ శాసనసభలకు కల్పించింది.
- గవర్నర్ జనరల్ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ముగ్గురు భారతీయులకు అవకాశం కల్పించారు.
- సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను వేరు చేశారు.
- ఈ చట్టం కేవలం భారతదేశంలో 2.6% ప్రజలకు మాత్రమే ఓటుహక్కు కల్పించింది.
- ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ - PAC)ని 1921లో ఏర్పాటు చేసింది.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య; అంతర్ రాష్ట్రాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించే అధికారం వైస్రాయ్‌కి ఇచ్చారు.
- భారత ప్రభుత్వ పనితీరుని పరిశీలించి, దాని పని విధానం గురించి చట్టం అమల్లోకి వచ్చిన 10 ఏళ్లలో ఒక ప్రత్యేక కమిషన్ (స్టాట్యూటరీ కమిషన్) ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

వ్యాఖ్యానాలు – విమర్శలు:

1919 చట్టాన్ని బాలగంగాధర్ తిలక్ 'సూర్యుడు లేని ఉదయం'గా వర్ణించారు.

- 'నేరమే అధికారమై నేరం చేస్తుంటే చూస్తూ ఊరుకున్న ప్రతి ఒక్కడూ నేరస్థుడే' అని గాంధీజీ పేర్కొన్నారు.
- భారతదేశంలో ద్వంద్వ పాలన అనేది దాదాపు దూషించే మాటగా మారిందని సర్ బట్లర్ అనే రచయిత అభిప్రాయపడ్డారు.

గమనిక: అక్‌వర్త్ కమిటీ సూచనల ప్రకారం సాధారణ బడ్జెట్ నుంచి రైల్వే బడ్జెట్‌ను వేరుచేశారు. 2017లో వివేక్ దెబ్రాయ్ కమిటీ సూచనలను అనుసరించి మళ్లీ సాధారణ బడ్జెట్‌లో విలీనం చేశారు.


రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day 832

Abscond

Telugu meaning: పరారీ, పారిపోవడం

English meaning: The word absconded (అబ్‌స్కాన్డ్) is a verb that means to run away secretly, especially to avoid arrest or punishment.

Synonyms: Flee, Escape; *Antonyms:* Stay, Remain

Usage: 1. The thief absconded with a huge sum of money before the police arrived.

2. After the scandal, the manager absconded from the city to avoid questioning.

నోటిఫికేషన్స్

కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో ఉద్యోగాలు

కేంద్ర ప్రభుత్వంలోని విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే స్వయంప్రతిపత్తి సంస్థలైన కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయడానికి రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ 2025ను విడుదల చేశాయి. మొత్తం పోస్టుల సంఖ్య 14,967.

సీనియర్ కన్సల్టెంట్ పోస్టులు

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐ) సీనియర్ కన్సల్టెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2025 నవంబరు 28.

టీఎస్ఎల్‌పీఆర్‌బీ- ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో ఉద్యోగాలు

తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) 2025 సంవత్సరానికి సంబంధించి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (టీజీఎఫ్ఎస్ఎల్)లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 60. దరఖాస్తు ఫీజు రూ.2,000. అర్హులైన అభ్యర్థులు 2025 నవంబరు 27 నుంచి డిసెంబరు 15 మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (నవంబరు 16) చివరి తేదీ

- ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 ఏసీఐఓ ఉద్యోగాలు. బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.
- బెల్‌లో 38 ఇంజినీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ పోస్టులు. డిప్లొమా, పదో తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఎన్ఎస్ఐసీలో 70 మేనేజీరియల్ పోస్టులు. సీఏ, సీఎంఏ, ఎల్ఎల్‌బీ, ఇంజినీరింగ్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- డీఐబీఈఆర్‌లో 18 అప్రెంటిస్ పోస్టులు. ఐటీఐ/డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ పత్రికా దినోత్సవం


నవంబరు 16
చరిత్రలో ఈనాడు

ప్రజలకు సమాచారాన్ని చేరవేసే మాధ్యమాలే పత్రికలు. కేవలం వార్తలను తెలపడమే కాక విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తాయి. మన దేశంలో పత్రికలకు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటంలో, ఉద్యమకారులను సంఘటితం చేయడంలో ఇవి ముఖ్య భూమిక పోషించాయి. ప్రస్తుత టెలివిజన్, సోషల్ మీడియా యుగంలో పత్రికలు ప్రజలకు నిజమైన వార్తలను అందిస్తూ విశ్వసనీయతను మెరుగుపరచుకుంటూనే ఉన్నాయి. మన దేశంలోని స్వేచ్ఛాయుత, బాధ్యతాయుత పత్రికలను గౌరవించుకునే ఉద్దేశంతో ఏటా నవంబరు 16న 'జాతీయ పత్రికా దినోత్సవం'గా (National Press Day) నిర్వహిస్తారు. ఉన్నత పాత్రికేయ ప్రమాణాలను కాపాడటం; జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి, వారిని గౌరవించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

పత్రికల ప్రాముఖ్యం

ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా పత్రికలను పేర్కొంటారు. కచ్చితమైన సమాచారాన్ని నిర్భయంగా అందించడం వీటి విధి. దృఢమైన ప్రజాస్వామ్యానికి న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు, పత్రికా రంగాన్ని నాలుగు స్తంభాలుగా పరిగణిస్తారు. ఒక దేశంలో పత్రికలకు ఉన్న స్వేచ్ఛను బట్టి అందులోని పౌరుల స్థితిగతులను తెలుసుకోవచ్చు. పత్రికలు ప్రజాస్వామ్యానికి కాపలాదారుగా వ్యవహరిస్తాయి. వీటిలో ఏ ఒక్కటి బలహీనంగా ఉన్నా.. ఆ ప్రభావం ప్రజలపై ఉంటుంది.

చారిత్రక నేపథ్యం:

భారత్‌లో 1956లో మొదటిసారి వార్తాపత్రికలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన సంస్థ లేదా కమిటీని ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. 1966లో జస్టిస్ జె.ఆర్.ముధోల్కర్ నేతృత్వంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ఏర్పడింది. అదే ఏడాది నవంబరు 16 నుంచి ఇది పని చేయడం ప్రారంభించింది. ఏటా ఇదే తేదీన 'జాతీయ పత్రికా దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు.

వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌ను రూపొందించేది ఎవరు? ఇందులో భారత్ స్థానం ఎంత? ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) విధులు తదితర ముఖ్య సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

గజనీ మహమ్మద్ దండయాత్రలు

మహమ్మద్ ప్రవక్త తన బోధనల ద్వారా అరబ్బుల్లో చైతన్యం తెచ్చారు. అదే ఇస్లాం మతంగా రూపొందింది. తురుష్కులూ ఇస్లాంను అనుసరించారు. దీంతో అరబ్బులు, తురుష్కులు ఇస్లాం మత వ్యాప్తి కోసం ఇతర దేశాలపై దండయాత్రలు చేశారు. వీరు గజనీ మహమ్మద్ నేతృత్వంలో భారత్‌పైనా అనేక యుద్ధాలు చేశారు. సింధ్ ఆక్రమణతో దేశంలో వీరి పాలన ప్రారంభమైంది.



క్రీ.శ. 1000లో భారతదేశంలోని రాజకీయ పరిస్థితులు

గజనీ మహమ్మద్ భారతదేశంపై దండెత్తే నాటికి దేశం అనేక చిన్న రాజ్యాలుగా విడిపోయి ఉంది.

- అరబ్ దేశానికి ముల్తాన్, హింద్ షాహీ సరిహద్దు రాజ్యాలు. ముల్తాన్ పాలకుడు ఫతేదావూద్.
- షాహీ రాజ్యం పంజాబ్‌లో జీలం నది వరకు విస్తరించింది.


దండయాత్రలు

క్రీ.శ. 1000లో కైబర్ కనుమలోని కొన్ని కోటలు, పట్టణాలను ఆక్రమించాడు.

- క్రీ.శ. 1001లో భారత్‌లోకి ప్రవేశించి పెషావర్ పాలకుడైన జయపాలుడ్ని ఓడించి, బందీగా చేసుకున్నాడు.
- క్రీ.శ. 1015, 1021లో కశ్మీర్‌పై దాడులు చేశాడు.

గజనీ మహమ్మద్ లక్ష్యాలు, దండయాత్ర ఫలితాలు, గజనీ మహమ్మద్ ఘనత మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Renowned environmentalist and Padma Shri awardee Saalumarada Thimmakka passed away at the age of 114 on 14 November 2025 in Bengaluru. Born on June 30, 1911, in Gubbi taluk of Tumakuru district, Thimmakka rose to national prominence for her decades-long commitment to greening rural Karnataka.

- She gained national and international recognition for planting 385 banyan trees along a 4.5-km stretch between Hulikal and Kudur in the Ramanagara district.

The National Democratic Alliance (NDA) has won the Bihar elections, announced on 14 November 2025. NDA's total vote share stood at 46.7%, while the INDIA bloc was 37.5%. ✦ As per the Election Commision of India, the NDA won with a three-fourth majority, securing 202 seats of the 243-member Assembly (BJP 89, JD(U) 85, LJP (RV) 19, HAM (S) 5 and RLM 4).

The Ministry of Defence has inked an agreement with Bharat Dynamics Limited (BDL) for the procurement of INVAR Anti-Tank Missiles worth over Rs.2,095 crore to enhance the lethality of T-90 tanks. It is also aimed at developing niche technologies by domestic industries, in line with the vision of achieving Aatmanirbharta in defence.

India and Nepal on 13 November 2025 inked a deal to establish a direct rail connectivity along the Jogbani-Biratnagar rail link for containerised and bulk cargo, facilitating transport from the ports of Kolkata and Visakhapatnam to the Nepal Customs Yard cargo station located in Morang District, near Biratnagar.

For more Current Affairs: Scan QR code

Railway Exams
Reasoning

Statements & Conclusions

Directions (Qs. 1 - 12): *In the question given below, a statement is given, followed by two conclusions. Read the information and answer the question.*

1. Statement: The government has started a new vaccination drive for all adults.
Conclusions: I. The government wants to protect citizens from infectious diseases.
II. The government aims to stop all medical research on vaccines.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

2. Statement: All cats are animals.
Conclusions: I. All animals are cats.
II. Some animals are cats.
A) Only conclusion I follows
B) Only conclusion II follows
C) Both I and II follow
D) Neither I nor II follows

3. Statement: The city has introduced a new rule making helmets mandatory for two-wheeler riders.
Conclusions:
I. The rule is intended to ensure road safety.
II. The rule aims to increase traffic fines.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

4. Statement: No book is a pen.
Conclusions: I. No pen is a book.
II. Some pens are not books.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

5. Statement: The tourism department launched a campaign to promote eco-tourism in forest areas.
Conclusions: I. The department is encouraging environmentally responsible tourism.
II. The department wants to increase deforestation for tourism.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

6. Statement: Some cars are buses. Some buses are cars. Conclusions:
I. Some cars are trains.
II. Some trains are buses.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

7. Statement: A city has implemented an odd-even car rule to control air pollution.
Conclusions: I. The city is trying to reduce vehicular emissions.
II. The city wants to ban private vehicles permanently.
A) Only Conclusion I follows
B) Only Conclusion II follows
C) Either conclusion I or II follows
D) Neither conclusion I nor II follows

8. Statement: Politics is one of the most commonly debated topics in Indian media.
Conclusions:
I. Every Indian loves politics.
II. A majority of the Indian audience likes to discuss political issues.
A) Only conclusion I follows
B) Only conclusion II follows
C) Either I or II follows
D) Neither I nor II follows

9. Statement: Many young professionals are choosing to work remotely these days.
Conclusions: I. Remote work offers flexibility to employees.
II. Every professional prefers to work remotely.
A) Only I follows B) Only II follows
C) Both I and II follow
D) Neither follows

10. Statement: The government has increased the tax on luxury cars.
Conclusions: I. People will stop buying luxury cars.
II. The government wants to discourage the purchase of luxury cars.
A) Only I follows B) Only II follows
C) Neither follows D) Both follow

11. Statement: Most schools now use smart classrooms to improve learning outcomes.
Conclusions: I. Technology has become an integral part of modern education.
II. Students cannot learn without smart classrooms.
A) Neither follows B) Only II follows
C) Both follow D) Only I follows

12. Statement: Online shopping has seen massive growth in recent years.
Conclusions: I. People prefer convenience in shopping.
II. Offline stores are closing down everywhere.
A) Only II follows
B) Only I follows
C) Both follow
D) Neither follows

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

బిహార్‌లో హామీల అమలు సాధ్యమేనా?



● ముందున్న సవాళ్లేంటి..

ఈటీవీ భారత్: ఎన్నికలంటేనే హామీలు. ఏ పార్టీ ఏ వరాలు ఇస్తుందో అని ఓటర్లు ఆసక్తిగా గమనిస్తుంటారు. వాటిని బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకుంటారు. తాజాగా ఫలితాలు వెల్లడైన బిహార్‌లోనూ ఈ హామీల హడావుడి కనిపించింది. రెండు కూటములు పోటాపోటీ వరాలు కురిపించినప్పటికీ ఎన్డీయేకే పట్టం కట్టారు ఓటర్లు. కానీ ఈ హామీలు నెరవేర్చడం సాధ్యమేనా... ఎన్నో ఏళ్లుగా ఉన్న నిరుద్యోగ సమస్యను ఎలా పరిష్కరిస్తారు.. అసలు ఎన్డీయే ముందున్న సవాళ్లు, కర్తవ్యాలేంటి... అన్నవి చర్చనీయాంశాలయ్యాయి.

ఎన్డీయే మ్యానిఫెస్టో చూస్తే రాష్ట్రంలోని యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రతి జిల్లాలో మెగా నైపుణ్య కేంద్రాల ఏర్పాటు, కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య, ఏడాదికి రూ.లక్ష వరకు సంపాదించేలా కోటి మంది మహిళలను లఖపతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యాలు ఉన్నాయి. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం, ఈబీసీలకు రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇస్తామని ఎన్డీయే హామీలిచ్చింది.

✦ ముందుగా కోటి ఉద్యోగాల సంగతి చూస్తే నిజానికి ఇన్నేళ్ల నిరుద్యోగ సమస్య పరిష్కారం అన్నంత ఈజీ కాదు. అయితే బిహార్ ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఫలితాలకు సంబంధించిన నిర్ణయాత్మక అంశాల్లో తప్పనిసరిగా నిరుద్యోగ అంశం ఉంటుంది. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా ఇంతే. ఓటు బ్యాంకుపై ఇది ఎంత ప్రభావం చూపుతుందన్న విశ్లేషణలూ తరచూ వినిపిస్తూనే ఉంటాయి. అయితే ఈసారి ఇవి ఇంకాస్త ఎక్కువ జరిగాయి. ఇంతగా ప్రభావం చూపించడానికి కారణాలున్నాయి. లెక్కల పరంగా మాట్లాడితే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం.. బిహార్‌లోని పట్టణాల్లో నిరుద్యోగ రేటు 9.6% ఉన్నట్లు తేలింది. ఇవి ఈ ఏడాది జులై నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో తేలిన లెక్కలు. జాతీయ సగటుతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువ. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 4.3% మేర నిరుద్యోగం ఉందని ఇదే సర్వే లెక్కలు చెబుతున్నాయి. ఇప్పుడు అందరి ప్రశ్న ఒకటే. ఆ స్థాయిలో ఉద్యోగాలు ఎలా సృష్టిస్తారని. ఆ మధ్య ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ అధికారులకు సంబంధించి 930 పోస్టులు పడితే దాదాపు పది లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే అక్కడ పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. బిహార్ జనాభాతో పోల్చితే అక్కడ ఉన్న ఐటీఐల సంఖ్య చాలా తక్కువ. ప్రభుత్వ రంగంలో 150 వరకు ప్రైవేటుతో కలిపితే 1,350 వరకే ఐటీఐలు ఉన్నాయి.

✦ బిహార్‌ను కార్మికుల సరఫరా రాష్ట్రంగా పిలుస్తారు. అంటే ఇక్కడి నుంచే దేశం నలు మూలలకు కార్మికులు వెళ్లి పనులు చేస్తుంటారు. వాళ్లకు సొంత రాష్ట్రంలో ఉపాధి లేక ఇలా వేరే రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. తక్కువ కూలీ తీసుకోవడం, ఎక్కువ పని చేయడం లాంటి వాటివల్ల బిహార్ కూలీలకు మార్కెట్‌లో డిమాండు పెరుగుతూనే ఉంది. కానీ బిహార్‌లో అసలు ఎందుకు ఉపాధి దొరకడం లేదని. అందుకు ఒకే ఒక కారణం పారిశ్రామికీకరణ లేకపోవడం. ఎక్కడైతే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయో అక్కడ స్థానికంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. కానీ బిహార్ ఈ విషయంలో వెనకబడుతోంది. ఈ నేపథ్యంలోనే రానున్న ఐదేళ్లలో రూ.50లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేలా పారిశ్రామిక హబ్‌లు ఏర్పాటు చేస్తామన్న హామీ అమలు కీలకం అవుతుంది. ఎన్డీయే ఇచ్చిన మాట మేరకు ఆ పని గనక చేయగలిగితే రానున్న ఐదేళ్లలో ఆ రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతుంది. లేదంటే మాత్రం విమర్శలు మూట గట్టుకోవాల్సిందే.

✦ బిహార్‌లో ఎన్డీయే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలంటే ఏటా రూ.37వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. అంటే అదనంగా ఇంత బడ్జెట్‌ను ప్రత్యేకంగా కేటాయించాల్సి వస్తుంది. ఒకప్పుడు మిల్లులకు హబ్‌గా ఉండేవి బిహార్‌లోని పలు ప్రాంతాలు. కానీ ప్రస్తుతం ఆ మిల్లుల పరిస్థితి దారుణంగా ఉంది. కొత్త కార్మికులు ఎవరూ చేరడం లేదు. పాతవారికి జీతాలు ఇవ్వలేని దుస్థితి. అందుకే ఇక్కడి వారంతా పొరుగు రాష్ట్రాలకు వెళ్లి ఉపాధి వెతుక్కుంటున్నారు. ఆ సమస్యకూ ఓ పరిష్కారం చూపాలి.

✦ ప్రస్తుతం పీఎం కిసాన్ కింద రైతులకు ఏడాదికి రూ.6వేలు ఇస్తుండగా దానికి మరో రూ.3 వేలు కలిపి ఇస్తామని ఎన్డీయే హామీ ఇచ్చింది. ఈ హామీ నెరవేర్చాలంటే అదనంగా ఏటా రూ.22వేల కోట్ల మేర ఖర్చవుతుందని అంచనా. 125 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ ఓ రకంగా విజయాన్ని అందించింది. ఇది అమలు చేయడానికి ఆర్థిక ఒత్తిడి ఎదుర్కోక తప్పదు. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ పథకం అమలుకు ఏటా రూ.3,800 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మహిళల పరిస్థితి ఏమిటి?

మహిళల పురోగతిపైనా ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టింది ఎన్డీయే. కనీసం కోటి మంది మహిళలను లక్షాధికారులను చేస్తామంటూ లఖ్‌పతి దీదీ పేరిట ప్రత్యేకంగా పథకం ప్రవేశ పెడతామని హామీ ఇచ్చింది. ఈ విషయంలో ఎలాంటి వ్యూహం అనుసరిస్తారన్నదీ తేలాల్సి ఉంది. నిజానికి ఈ సారి ఈ స్థాయిలో ఆధిక్యం రావడానికి మహిళా ఓటర్లే కారణమన్న విశ్లేషణలు ఇప్పటికే వినిపిస్తున్నాయి.



దిల్లీలోని పార్లమెంటు ఆవరణలో గిరిజన నేత బిర్సా ముండా విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు, ఎంపీ బాంసురీ స్వరాజ్


ఫేక్ బ్యాంకుతో రూ.60 కోట్ల మోసం



ఈటీవీ భారత్: హరియాణాలోని నాలుగు జిల్లాల్లో ఫేక్ బ్యాంకు శాఖలు సృష్టించి ప్రజలను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కుంభకోణం బయటపడింది. 'పీఎన్ఎల్' (ప్రైవేట్ నిధి లిమిటెడ్) పేరుతో బోగస్ బ్యాంకు పెట్టిన నిందితులు ప్రజల డిపాజిట్లకు 26 నెలల్లో రెట్టింపు మొత్తం ఇస్తామంటూ పలువురిని మోసగించారు. ఈ కేసులో ఇప్పటికే సమీర్, తాహిర్, సోనులను అరెస్టు చేసిన కర్నాల్ పోలీసులు కురుక్షేత్ర జిల్లాలోని ధోల్ గ్రామానికి చెందిన కమల్ శర్మను అంబాలాలో అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వీరి మాటలు నమ్మి ఖాతాలు తెరిచిన 32 మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు విచారణ ప్రారంభించినట్లు స్టేషన్ అధికారి శ్రీ భగవాన్ తెలిపారు. రూ.20 లక్షల మేర నిల్వ ఉన్న నిందితుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశామన్నారు.

భద్రతా మండలిలో పారదర్శకత పెరగాలి

● ఐరాసలో భారత్ ప్రతినిధి పర్వతనేని హరీశ్



ఐరాస: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సీ) అనుబంధ సంస్థల పనితీరులో మరింత పారదర్శకత రావాలని భారత్ పిలుపునిచ్చింది. వ్యక్తులను, సంస్థలను అధికారికంగా నియమించాలనే అభ్యర్థనలను తిరస్కరించే నిర్ణయాల్లో గోప్యత పాటించడాన్ని విమర్శించింది. ఐక్యరాజ్యసమితి (ఐరాస)లో యూఎన్ఎస్‌సీ పనితీరుపై జరిగిన బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. "అంతర్జాతీయ శాంతి భద్రతలకు బాధ్యత వహించే ప్రధాన సంస్థ భద్రతా మండలి. ప్రపంచం పలు సంక్షోభాలు, సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు ఈ సంస్థలో కేవలం 15 దేశాలకే సభ్యత్వాన్ని పరిమితం చేశారు. భద్రతా మండలి పనితీరు విశ్వసనీయత, సామర్థ్యం, పారదర్శకత కోసం పనిచేసే అనుబంధ సంస్థల్లో మరింత పారదర్శకత, జవాబుదారితనం రావాలి. సంస్థల ప్రతిపాదనలను, తిరస్కరించే నిర్ణయాలను బహిరంగంగా వెల్లడించకపోవడంతో దాని పారదర్శకత కోల్పోతుంది. భద్రతా మండలిని సంస్కరించాల్సిన అవసరముంది. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా దానిని పునర్నిర్మించాలి. అందులోని శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను విస్తరించాలి" అని హరీశ్ ఉద్ఘాటించారు.

గాజాపై అమెరికా తీర్మానం ఆమోదం కోసం ట్రంప్ ఒత్తిడి

ఇజ్రాయెల్- హమాస్ కాల్పుల విరమణపై రష్యా తన ప్రతిపాదనలను ఐరాసకు పంపగా, గాజా కోసం అమెరికా రచించిన ప్రణాళికపై ఏకాభిప్రాయం రావాలని అధ్యక్షుడు ట్రంప్ ఐరాసపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. భద్రతామండలిలో అమెరికా సహా 8 దేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని త్వరగా ఆమోదించాలని గాజా కోరగా.. వచ్చే వారంలో రష్యా ప్రతిపాదనలపై, అమెరికా ముసాయిదాపై ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రణాళిక పశ్చిమాసియాలో శాంతికి సరైన మార్గం అవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొనియాడారు. ఇది శాశ్వత కాల్పుల విరమణకు దారి తీస్తుందన్నారు. ట్రంప్ రచించిన 20 సూత్రాల ప్రణాళిక శాంతిని నెలకొల్పుతుందని అభిప్రాయపడ్డారు.

త్వరలో అన్ని జిల్లా ఆస్పత్రుల్లోనూ అమృత్ ఫార్మసీలు

● వీటితో గత పదేళ్లుగా ప్రజలకు రూ.8,500 కోట్లు ఆదా: నడ్డా

దిల్లీ: దేశంలోని అమృత్ ఫార్మసీలు ఇంతవరకు రూ.17,000 కోట్ల విలువైన ఔషధాలను 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకు విక్రయించాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా శనివారం దిల్లీలో వెల్లడించారు. దీనివల్ల 6.85 కోట్ల మంది రోగులకు రూ.8,500 కోట్ల మేర డబ్బు ఆదా అయ్యిందని తెలిపారు. 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటు ధరలపై ప్రాణ రక్షక ఔషధాలు, పరికరాలు అందించడానికి జన ఔషధి, అమృత్ పథకాలను ప్రకటించిందని నడ్డా తెలిపారు. దిల్లీలోని ఎయిమ్స్‌లో 2015లో మొట్టమొదటి అమృత్ దుకాణం ప్రారంభమైంది. ప్రస్తుతం 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 255 అమృత్ ఫార్మసీలు ఉన్నాయి. భవిష్యత్తులో వీటి సంఖ్యను 500లకు పెంచాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. అమృత్ పథకం ప్రారంభమై పదేళ్లు అవుతున్న సందర్భంగా దిల్లీలోని భారత్ మండపంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. దేశంలో మరో 10 అమృత్ ఫార్మసీలను ప్రారంభిస్తున్నట్లు నడ్డా ఈ సందర్భంగా ప్రకటించారు.

96 లక్షల మంది ఫాలోవర్లున్నా చిత్తుగా ఓడిపోయిన యూట్యూబర్



మనీశ్ కశ్యప్

ఇంటర్నెట్ డెస్క్: బిహార్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రముఖ యూట్యూబర్ మనీశ్ కశ్యప్ ఘోర పరాజయం పాలయ్యారు. చన్‌పటియా నియోజకవర్గంలో జన్‌సురాజ్ అభ్యర్థిగా పోటీ చేసిన మనీశ్ 50 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. సోషల్ మీడియాలో పాపులారిటీ, 96 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నప్పటికీ ఆయన ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ రంజన్.. భాజపా అభ్యర్థి ఉమాకాంత్ సింగ్‌పై 37,000 ఓట్ల తేడాతో గెలుపొందారు. వలస కూలీలపై తమిళనాడులోని ప్రజలు దాడులు చేసి చంపుతున్నారంటూ మనీశ్ రూపొందించిన పలు వీడియోలు 2023లో కలకలం సృష్టించడంతో తమిళనాడు, బిహార్ పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో అవి నకిలీ వీడియోలని తేలడంతో వలస కూలీలపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో అప్పట్లో తమిళనాడు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. 2024లో మనీశ్ భాజపాలో చేరారు. అనంతరం జన్ సురాజ్ పార్టీలో చేరి.. చన్‌పటియా నియోజకవర్గం నుంచి 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు.

వీధి రౌడీలకు సింగమైనా.. ఎన్నికల్లో తుస్



శివదీప్ వామనరావ్

ఇంటర్నెట్ డెస్క్: అసెంబ్లీ ఎన్నికల్లో బిహార్ సింగం ప్రభావం చూపించలేకపోయారు. పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ ఓటమి చవిచూశారు. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి అందరి దృష్టినీ ఆకర్షించిన ఆయన.. విజయాన్ని మాత్రం సొంతం చేసుకోలేకపోయారు. బిహార్ మాజీ ఐపీఎస్, పోలీసుశాఖలో 'సింగం, ఫైర్‌బ్రాండ్'గా పేరొందిన శివదీప్ వామనరావ్ లాండే (49) అరారియా, జమల్‌పూర్ స్థానాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడ్డారు. ఆయన ఎన్నికల బరిలో దిగడం అందరిలోనూ ఆసక్తి కలిగించింది. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో రెండు చోట్లా ఓటమి పాలయ్యారు.

కాంగ్రెస్‌లో అంతర్మథనం

● ఖర్గేతో రాహుల్ భేటీ

● బిహార్‌పై చర్చ

దిల్లీ: బిహార్‌లో ఘోర ఓటమిపై కాంగ్రెస్‌లో అంతర్మథనం మొదలైంది. శనివారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అగ్ర నేత రాహుల్ గాంధీ కలిశారు. ఆయనతోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కోశాధికారి అజయ్ మాకెన్, బిహార్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కృష్ణ అల్లవారు ఉన్నారు. బిహార్‌లో అత్యంత పేలవ ప్రదర్శనపై వారు చర్చించినట్లు సమాచారం. 2010 తర్వాత ఇంతటి దారుణ ఓటమి చవిచూడటం పట్ల ఆందోళన వ్యక్తమైనట్లు తెలిసింది. ఈసారి 61 సీట్లలో పోటీ చేసిన పార్టీ కేవలం 6 సీట్లలోనే గెలిచింది. 2010లో మరీ దారుణంగా 4 సీట్లే దక్కించుకుంది. ఖర్గేతో భేటీ తర్వాత మీడియాతో మాట్లాడకుండానే రాహుల్ వెళ్లిపోయారు.



గుజరాత్‌లోని డేడియాపాడాలో శనివారం నిర్వహించిన బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో గిరిజన వ్యక్తితో సంభాషిస్తున్న ప్రధాని మోదీ ✦ డేడియాపాడాలో నిర్వహించిన రోడ్‌షోలో అభివాదం ✦ నర్మదా జిల్లా దేవ్‌మోగ్రా ఆలయంలో పూజలు చేస్తున్న మోదీ

ట్రంప్ రాకపోయినా జీ20 ఆగదు

● ఏ ఒక్క దేశంపై కూటమి ఆధారపడదు: దక్షిణాఫ్రికా

ఇంటర్నెట్ డెస్క్: జొహన్నెస్‌బర్గ్‌లో జరగనున్న జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సుకు అమెరికా దూరంగా ఉండటం అంతర్జాతీయ వేదికపై గణనీయమైన ప్రభావం చూపుతుందని దక్షిణాఫ్రికా హైకమిషనర్ అనిల్ సూక్లాల్ పేర్కొన్నారు. తమ దేశం ఆతిథ్యమివ్వబోతున్న ఈ కీలక సమావేశానికి అగ్రరాజ్యం రావడం లేదన్న విషయంపై స్పందించిన ఆయన.. 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో కూటమి ఆవిర్భావంలో అమెరికా కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. "సదస్సుకు అమెరికా దూరంగా ఉండటం దురదృష్టకరం. అమెరికా లేకున్నా మిగతా జీ20 దేశాలు దక్షిణాఫ్రికా ప్రాధాన్యాలకు బలంగా మద్దతిస్తున్నాయి. ఇది ఇక ఏ ఒక్క దేశంపై ఆధారపడే వేదిక కాదు. అమెరికా హాజరు కాకపోయినా ఒక శక్తివంతమైన అంతర్జాతీయ వేదికగానే కొనసాగుతుంది. ఆఫ్రికా ఖండ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం ఇదే" అని సూక్లాల్ పేర్కొన్నారు. పేద దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యాలు నిర్ణయించామని చెప్పారు.

మాదక ద్రవ్యాల నిందితుడికి జీపీఎస్ ట్రాకర్‌తో బెయిల్

● జమ్మూలోని ఉధంపుర్ కోర్టు ఆదేశం

జమ్మూ: మాదక ద్రవ్యాల కేసులో నిందితుడైన ఓ వ్యక్తికి జమ్మూకశ్మీర్‌లోని ఉధంపుర్ కోర్టు జీపీఎస్ ట్రాకర్‌తో కూడిన బెయిల్‌ను శనివారం మంజూరు చేసింది. నిందితుడు పూంఛ్ జిల్లాలోని కర్మారకు చెందిన ముఖ్తర్ అహ్మద్‌గా అధికారులు పేర్కొన్నారు. నిందితుల కదలికలను నిరంతరం పర్యవేక్షించడానికి వీలుగా కోర్టు ఆదేశాల ప్రకారం శుక్రవారం జీపీఎస్ ట్రాకర్‌ను ముఖ్తర్ కాలికి అమర్చినట్లు వివరించారు.

దిల్లీ పేలుడుపై వాహన చోదకుల నుంచి వివరాల ఆరా

దిల్లీ: ఎర్రకోట వద్ద కారు పేలుడు ఘటనపై పూర్తి వివరాల సేకరణలో దర్యాప్తు బృందాలు నిమగ్నమయ్యాయి. ఉగ్రబాట పట్టిన వైద్యులు విధ్వంసం సృష్టించడానికి ఎరువుల్నీ కూడా కొన్న విషయం తెలిసిందే. లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తూ వీరికి ఎరువుల్ని విక్రయించిన దినేశ్ (డబ్బూ) అనే వ్యక్తినీ దర్యాప్తు అధికారులు నిర్బంధంలో తీసుకున్నారు. పేలుడులో పాల్గొన్న వైద్యుడికి ఎరువుల్ని విక్రయించింది అతడేనా, అక్రమ వ్యాపారానికి మించి మరేదైనా కార్యకలాపాల్లో పాత్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇటీవలే పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసిన విషయం కూడా అధికారుల దృష్టికి వచ్చింది. కారు పేలుడు సంభవించినప్పుడు దానికి దగ్గర్లో ఉన్న ఇతర వాహనాల డ్రైవర్లు, యజమానులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. సన్నివేశ క్రమాన్ని పునఃసృష్టించడానికి ఈ వివరాలు ఉపయోగపడతాయని దర్యాప్తు అధికారి ఒకరు తెలిపారు. పేలుడుకు సంబంధించి నేరపూరిత కుట్ర కింద సెక్షన్లు మోపుతూ మరో కేసును దిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం నమోదు చేసింది. హరియాణాలోని ఫరీదాబాద్‌లో మసీదు ఇమామ్‌ను కూడా పోలీసులు ప్రశ్నించారు.

తెరచుకున్న లాల్‌ఖిలా మెట్రో

పేలుడు ఘటన జరిగినప్పటి నుంచి భద్రత కారణాల రీత్యా మూసివేసిన లాల్‌ఖిలా మెట్రో స్టేషన్‌ను శనివారం తెరిచారు. పేలుడు జరిగినప్పుడు ఈ మెట్రో ప్రాంగణంలో ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు అక్కడి సీసీటీవీ దృశ్యాలు చెబుతున్నాయి. దాంతో ప్రయాణికులు భయపడటం, అనేక వస్తువులు దడదడలాడటం వంటివి దీనిలో ఉన్నాయి. ఎర్రకోట చుట్టూ ఉన్న భవంతులపై పేలుడు ప్రభావం ఎంత ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు ఇవి బయటపడ్డాయి. ఇంతవరకు 140 మసీదుల నిర్వాహకులు, 1,700 మంది వ్యక్తులు, 40 ఎరువుల దుకాణదారులు, 200 అతిథి గృహాలు/ హోటళ్ల నిర్వాహకులు, వాడుక కార్లను విక్రయించే 100 మంది, కశ్మీర్‌కు చెందిన 500 మందిని ప్రశ్నించినట్లు అధికారులు తెలపారు.

పశ్చిమ బెంగాల్‌లో ఎంబీబీఎస్ విద్యార్థి అరెస్టు

కోల్‌కతా: ఉగ్రవాదులతో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని లుధియానాకు చెందిన జానిసుర్ ఆలమ్‌గా గుర్తించారు. ఎర్రకోట సమీపంలోని పేలుడు ఘటనలో అతనికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి మొబైల్ ఫోన్, డిజిటల్ పరికరాలు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సిలీగుడీ కార్యాలయంలో ప్రశ్నించాక శనివారం సాయంత్రం విడిచిపెట్టారు. మళ్లీ పిలిచినప్పుడు హాజరుకావాలన్నారు. ఆలమ్‌కు ఉగ్రబంధాలు ఉన్నాయంటే కుటుంబసభ్యులు నమ్మలేకపోతున్నారు.

మతువాల కోసం సర్ నిబంధనలను సవరించండి

● అమిత్‌షాకు లేఖ రాసిన అధీర్ చౌధరి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మతువా కమ్యూనిటీ ప్రజలను ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పత్రసహిత ఆధారాలు సమర్పించకుండా మినహాయించాలని అభ్యర్థిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధరి హోం మంత్రి అమిత్‌షాకు లేఖరాశారు. బంగ్లాదేశ్ నుంచి "క్రూరమైన, కనికరం లేని హింస" కారణంగా మతువాలు భారత్‌కు వలస వచ్చారని, ఎన్నడూలేని పత్రాలను వారు సమర్పించడం అసాధారణమేనని రెండు పేజీల ఈ లేఖలో ఆయన పేర్కొన్నారు. మతువాలు దశాబ్దాలుగా ఓటువేస్తూ.. ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటున్నారని, అయినా వారికి పౌరసత్వం ఇప్పిస్తామంటూ ప్రధాన రాజకీయ పార్టీలు చేసిన హామీలన్నీ విఫలమయ్యాయని అన్నారు. పౌరసత్వ(సవరణ) చట్టం సమయంలో మతపరమైన హింసకు గురైన వారికి చేసిన మినహాయింపులను ఉటంకిస్తూ.. .. ఈసారి కూడా మతువాల కోసం నిబంధనలను సవరిస్తూ శీతాకాల సమావేశాల కంటే ముందే ఉత్తర్వులను జారీ చేయాలని లేఖలో కోరారు.



కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని ఎజ్రా స్ట్రీట్‌లోని ఓ బహుళ అంతస్తు భవనంలో మంటలు చెలరేగాయి. శనివారం ఉదయం 5:30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. అయితే, ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎలక్ట్రానిక్ వస్తువుల గిడ్డంగిలో మంటలు చెలరేగి... ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు 20 అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి. భవనం లోపల ఎవరూ చిక్కుకోలేదు. ఎలక్ట్రానిక్ వస్తువుల కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.



మానసిక రుగ్మతలకు 'ఆనంద్' చికిత్స

ఈటీవీ భారత్: దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలు ఇటీవలి కాలంలో శరవేగంగా పెరుగుతున్నాయి. ఒక్క భోపాల్ నగరంలోనే ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక రుగ్మతలతో 2.5 లక్షల మందికి పైగా ఓపీడీలో పేర్లను నమోదు చేసుకున్నారు. చేదు నిజం ఏమిటంటే.. ఇందులో 1.5 లక్షలమంది 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసువారు కావడం గమనార్హం. యువతలో పెరుగుతున్న ఈ ముప్పు నివారణకు మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 'ఆనంద్ విభాగ్' పేరిట ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ఈ కార్యక్రమ డైరెక్టరు ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలతో అనుసంధానమై విద్యార్థుల్లో నైతిక క్షీణత నివారణకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకొన్న విద్యాసంస్థల్లో 'ఆనంద్ పీరియడ్'ను ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ఈ పీరియడ్‌లో విద్యార్థులకు జీవితాన్ని ఆస్వాదించడం, ఒత్తిడి నియంత్రణపై తర్ఫీదు ఇస్తామన్నారు. రెండు దశలుగా కళాశాలల బోధన సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వీరు విద్యార్థులకు బోధిస్తారని చెప్పారు.

పాకిస్థాన్‌కు వెళ్లి తిరిగిరాని పంజాబ్ మహిళ

● ముస్లిం వ్యక్తితో పెళ్లైందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్

చండీగఢ్: గురునానక్ జయంతి సందర్భంగా పాకిస్థాన్‌కు వెళ్లిన యాత్రికుల బృందం నుంచి ఓ సిక్కు మహిళ తప్పిపోయిన కొద్ది రోజులకు ఆమెకు స్థానిక ముస్లింతో వివాహం జరిగినట్లు సామాజిక మాధ్యమంలో వార్తలు తెగ వైరల్‌గా మారాయి. ఆమె మతం కూడా మారిందంటూ పత్రాలు బయటకు వచ్చాయి. దీంతో ఈ విషయాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం పంజాబ్ పోలీసులు వెల్లడించారు. కపూర్థలాకు చెందిన సరబ్‌జీత్ కౌర్ (48) 1,900 మంది బృందంతో కలిసి గురునానక్ జయంతి వేడుకల కోసం వాఘా-అట్టారి సరిహద్దును దాటి ఈనెల 4న పాకిస్థాన్‌కు వెళ్లారు. 10 రోజుల తర్వాత గురువారం భారత్‌కు తిరిగి వచ్చిన బృందంలో ఆమె లేరు. ఆమె మతం మారిందని, నిసర్ హుసేన్ అనే పాకిస్థానీతో వివాహం జరిగిందంటూ 'నిఖానామా' (ఇస్లామిక్ వివాహ ఒప్పందం) వెలుగు చూసింది. అందులో ఆమె పెళ్లికి ముందు తన పేరును నూర్‌గా మార్చుకున్నట్లు ఉంది. ఇదివరకే విడాకులు తీసుకున్న సరబ్‌జీత్ కౌర్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె మొదటి భర్త దాదాపు 30 ఏళ్లుగా ఇంగ్లాండులో నివసిస్తున్నారు.

హర్మూజ్ జలసంధిలో చమురుట్యాంకర్ జప్తు

● నిర్ధారించిన ఇరాన్ అధికార వర్గాలు

టెహ్రాన్: పర్షియన్ గల్ఫ్, అరేబియా సముద్రం మధ్యనున్న హర్మూజ్ జలసంధి ద్వారా మార్షల్ ఐలాండ్ జెండాతో వెళ్తోన్న చమురు ట్యాంకర్‌ను జప్తు చేసినట్లు ఇరాన్ అధికార వర్గాలు వెల్లడించాయి. తమ దేశ ప్రాదేశిక జలాల్లోకి ఆ ట్యాంకర్‌ను తీసుకెళ్లినట్లు తెలిపాయి. ఇరాన్ దేశ ప్రయోజనాలు, వనరుల పరిరక్షణ నిమిత్తం కోర్టు ఆదేశాల మేరకు ఆ చమురు ట్యాంకర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు 'రివల్యూషనరీ గార్డ్'ను ఉటంకిస్తూ ఆ దేశ అధికార వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది. 30వేల టన్నుల పెట్రో రసాయనాల ఉత్పత్తులు అందులో ఉన్నట్లు తెలిపింది. సింగపూర్ దిశగా వెళ్తోన్న ఆ ట్యాంకర్‌ను హర్మూజ్ జలసంధిలో ఇరాన్ సైన్యానికి చెందిన బృందాలు అడ్డుకున్నాయి.

1,20,000 గ్లైడ్ బాంబుల తయారీలో రష్యా: ఉక్రెయిన్

ఇంటర్నెట్ డెస్క్: యుద్ధాన్ని ముగించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. 1,20,000 గ్లైడ్ బాంబులను తయారుచేయడానికి మాస్కో ప్రణాళికలు రచిస్తున్నట్లు ఉక్రెయిన్ సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి సంచలన ఆరోపణలు చేశారు. వీటిలో 500 కొత్త దీర్ఘశ్రేణి బాంబులు కూడా ఉన్నాయని.. ఈ ఏడాది చివరికి వాటి తయారీ పూర్తవుతుందన్నారు. ప్రతిసారీ రష్యా తమ గ్లైడ్ బాంబుల పరిధిని పెంచుతోందన్నారు. ఈ బాంబులతో ఉక్రెయిన్‌కు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తంచేశారు.



కైలాసాన కార్తికాన శివరూపం..

మహారాష్ట్రకు చెందిన ఈ నర్తకీమణులు భరతనాట్యంతో ప్రపంచ అత్యున్నత పర్వత శిఖరమైన ఎవరెస్టుపై నృత్యాలు సమర్పించారు. కొల్హాపూర్‌లోని 'ఉపసృష్టి' భరత నాట్య పాఠశాల నుంచి వచ్చిన మొత్తం 17 మంది బృందంతో అక్టోబరు 28న ఎవరెస్టు యాత్రను ప్రారంభించారు. మైనస్ 18 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నడుమ 17,650 అడుగుల ఎత్తున ఎముకలు కొరికే చలిలో సంప్రదాయ వస్త్రధారణతో, కాళ్లకు బూట్లు లేకుండా ఎవరెస్టు బేస్ క్యాంపులో ఈ ప్రదర్శన ఇచ్చారు. వరుసగా అయిదు రోజులపాటు విపరీతమైన మంచు, ఆక్సిజన్ కొరత, చలిగాలులను తట్టుకొని లక్ష్యాన్ని సాధించారు. నృత్య గురువు చంద్రిక సంయోగితా పాటిల్ తన శిష్యులైన దివ్యా వార్దే, మితాలీ మహారాజ్, ప్రాంజల్ దాల్వీలతో కలిసి ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. గణపతి స్తుతి, శివ శ్లోకం, శ్రీరామ స్తుతి, భజగోవిందం, మంగళం వంటి ఆధ్యాత్మిక నృత్య రీతులను వీరు ప్రదర్శించారు. శాస్త్రీయ నృత్యాన్ని ప్రపంచస్థాయికి తీసుకువెళ్లే ధ్యేయంతో కొల్హాపూర్ ప్రముఖులు వినోద్ కాంబోజ్, ఋషి కాంబోజ్ ఈ యాత్రను ఏర్పాటు చేశారు. -ఈటీవీ భారత్

ఇక్కడ నీడ అద్దెకివ్వబడును

రెండు చెట్ల నీడకు రూ.3 వేలు.. ఐదు చెట్ల నీడకు రూ.5 వేలు.. పది చెట్ల నీడకు రూ.10 వేలు.. ఏమిటిదంతా అనుకుంటున్నారా? యాత్రికుల అవసరాలను గమనించి పలువురు మామిడి తోటల యజమానులు ఇలా తమ చెట్ల పరిధిని అద్దెకిస్తూ ఏటా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలోని యాకూబ్ బాబా దర్గాకు పెద్ద సంఖ్యలో భక్తులు బంధుమిత్రులతో కలిసి వస్తుంటారు. అక్కడే విందులు, ఫంక్షన్ రోజు వేడుకలు నిర్వహించుకుంటారు. వారంతా మామిడి తోటల్లో ఇలా అద్దె చెల్లించి విడిది చేస్తుంటారు.

-ఈనాడు, హనుమకొండ; న్యూస్‌టుడే, పర్వతగిరి





కొంగ జపం.. శాస్త్రీయ విషయం

కొంగలు నీటిలో చేపల్ని వేటాడటానికి ఒంటి కాలిపై నిల్చోవడం చూస్తుంటాం. దీనినే కొంగ జపం అంటుంటారు. పక్షులు ఇలా నిల్చోవడం వెనక శాస్త్రీయ విషయం దాగి ఉందని జంతుశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా.రవీందర్‌రావు తెలిపారు. "పక్షుల కాలి అడుగు భాగంలో 'రేటా మిరాబిలే' అనే రక్తనాళాలు ఉంటాయి. వీటితో దేహమంతటికీ రక్తసరఫరా సజావుగా జరగడంతో పాటు.. శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. పక్షులు ఆహారం కోసం ఎక్కువ సేపు నీటిలో నిలబడిన సమయంలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గి జీవక్రియలు మందగిస్తాయి. దీనిని నివారించేందుకు.. కొంగలు నీళ్లలో ఉన్న సమయంలో ఒంటి కాలిపై నిల్చుంటాయి. మరో కాలిని రెక్కల కింద శరీరానికి ఆనించి ఉంచుతూ శరీర ఉష్ణోగ్రతను సమన్వయం చేసుకుంటాయి. కండరాల శక్తిని ఆదా చేసుకుంటాయి. ఇలా కాళ్లను మారుస్తూ వేటను కొనసాగిస్తాయి" అని వివరించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట చెరువు సమీపంలో తెల్లకొంగ పిట్టలు ఆహారం కోసం గుంపుగా ఒంటి కాలిపై నిలబడగా 'ఈనాడు' కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

–ఈనాడు, నల్గొండ; న్యూస్‌టుడే, కోదాడ గ్రామీణం

రూపాయికి పాపాయి.. ఈ డిజిటల్ రూపీ

ఇప్పటివరకు డిజిటల్ పేమెంట్ అంటే... ఫోన్ పే, గూగుల్ పే, నెట్ బ్యాంకింగ్! వీటికి ఇంటర్నెట్, బ్యాంకు ఖాతా, మధ్యవర్తుల అవసరం తప్పనిసరి. ఇప్పుడు వాటి అవసరం లేకుండానే.. భారతీయ రిజర్వ్ బ్యాంక్ పరిచయం చేసిన 'డిజిటల్ రూపాయి' ఆర్థిక లావాదేవీల్లో విప్లవాత్మక మార్పును తీసుకురానుంది!!

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక కొత్త దశలోకి అడుగుపెడుతోంది. మనం చేతిలో పట్టుకునే రూపాయిని ఇప్పుడు మన మొబైల్‌లో, డిజిటల్ రూపంలో చూసే రోజులు వచ్చేశాయి. అదే భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) జారీ చేసిన కేంద్ర బ్యాంక్ డిజిటల్ కరెన్సీ(సీబీడీసీ). ఇది మనం రోజూ వాడే నగదు లాగే ఉంటుంది. కానీ, ఇది పూర్తిగా డిజిటల్ రూపం. ఈ ఇ-రూపీకి రిజర్వ్ బ్యాంక్ గ్యారంటీ ఉంది. మన ఫోన్‌లోని ఇ-వాలెట్ యాప్ ద్వారా వాడొచ్చు. దీని ట్యాగ్‌లైన్..'క్యాష్ బట్ డిజిటల్'. పారదర్శకత, వేగం, భద్రతను అందిస్తుంది. భవిష్యత్తులో ఇది నిత్యజీవితంలో భాగంగా మారనుంది.



ఇ-రూపీ వాలెట్ అంటే ఏంటి?

ఇది ఒక డిజిటల్ పర్సు లాంటిది. ఇందులో డిజిటల్ రూపాయి నిల్వ ఉంటుంది. దీన్ని బ్యాంకులు, ఆర్‌బీఐ అనుమతించిన సంస్థలు అందిస్తున్నాయి. 2022 డిసెంబర్ 1న రిటైల్ పైలట్‌గా ప్రారంభమైంది. ఇ-వాలెట్ పూర్తిగా సురక్షితమైంది. వినియోగదారుడి వాలెట్‌లోని ఇ-రూపీని సురక్షితంగా ఉంచేందుకు అధునాతన సైబర్ భద్రతా విధానాలతో దీన్ని రూపొందించారు. మొబైల్ పోయినా.. అదే ఫోన్ నంబర్‌తో మరో ఫోన్‌లో వాలెట్‌ను తిరిగిపొందొచ్చు. ఇ-వాలెట్‌లో కనీస బ్యాలెన్స్ ఉంచాల్సిన పనిలేదు.



ఎలా వాడాలి?

ఇ-రూపీ వాలెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నవారు, తమ బ్యాంకు ఖాతా నుంచి నగదును వాలెట్‌కు బదిలీ చేసుకోవాలి. ఏ డినామినేషన్‌లో ఎన్ని కావాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వినియోగదారుడిదే. అంటే రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయలు, రూ. 10, 20, 50, 100, 200, 500 డినామినేషన్‌లలో డబ్బును వ్యాలెట్‌లో లోడ్ చేసుకోవచ్చు. భౌతికంగా వినియోగంలో ఉన్న అన్ని రకాల డినామినేషన్‌కు సమానమైన ఇ-రూపీలు వాలెట్‌లో అందుబాటులో ఉంటాయి. వ్యక్తుల మధ్య సీబీడీసీలు బదిలీ చేసుకోవాలనుకుంటే.. అవతలి వ్యక్తికి సైతం ఇ-రూపీ వాలెట్ ఉండాలి. అదే వర్తకులకు ఇ-రూపీలను చెల్లించాలనుకుంటే.. క్యూఆర్ కోడ్ స్కాన్ విధానంలో చేయొచ్చు.

డిజిటల్ రూపాయి అంటే?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసే డిజిటల్ రూపాయి అనేది ఎలక్ట్రానిక్ రూపంలో ఉండే కరెన్సీ. మనం వాడే భౌతిక నోట్లకు ఇది ప్రత్యామ్నాయం. వాడటానికి సౌకర్యంగా, సురక్షితంగా, బ్యాంక్ హామీతో ఉండే డిజిటల్ నగదు. మామూలు డబ్బుల మాదిరిగానే ఇదీ పనిచేస్తుంది. రిజర్వ్ బ్యాంకు చట్టం, 1934 ప్రకారం, ఇది చట్టబద్ధంగా చెల్లుబాటు అయ్యే డబ్బు.

దీని అవసరం ఏంటి?

దేశంలో డిజిటల్ లావాదేవీలు పెంచడంతోపాటు, భౌతిక కరెన్సీ నిర్వహణకు అయ్యే ఖర్చును తగ్గించుకోవడంలో భాగంగా.. ఆర్‌బీఐ డిజిటల్ రూపాయి తీసుకొచ్చింది!

ఎలా ఉంటుంది?

టోకెన్ ఆధారిత డిజిటల్ రూపాయి: ఇది కరెన్సీ నోటు వంటిదే. ఎవరి దగ్గర ఉంటే వారే యజమానులు. రిటైల్ లావాదేవీలకు ఉపయోగిస్తారు.

అకౌంట్ ఆధారిత డిజిటల్ రూపాయి: దీన్ని ఎంపిక చేసిన సంస్థలు మాత్రమే వాడటానికి అనుమతి ఉంటుంది.

ఎక్కడ నిల్వ చేసుకోవచ్చు?

ఇ-వాలెట్ ద్వారా మొబైల్‌లో నిల్వ చేయొచ్చు. దానితో ఇతరులకు పంపొచ్చు. వస్తువులు కొనుగోలు చేయొచ్చు. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సీబీడీసీ క్యూఆర్ కోడ్ లేదా యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేయొచ్చు.

ఏ బ్యాంకులు?

ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యెస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, కొటక్ మహీంద్రా బ్యాంక్, కెనరా బ్యాంక్, ఆక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పీఎన్‌బీ, ఫెడరల్ బ్యాంక్, కర్ణాటక బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లు ఈ సేవలను అందిస్తున్నాయి. వీటికి అనుబంధ ఇ-యాప్‌లను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు!

ఎవరు వాడొచ్చు

ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన బ్యాంకుల వినియోగదారులు, వ్యాపారులు వాడొచ్చు. ఆయా బ్యాంకుల ఈ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్టర్ చేసుకోవాలి. సమస్యలు వస్తే కస్టమర్ కేర్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు

డిజిటల్ రూపాయిని ఎలా సృష్టిస్తారు?

పేపర్ కరెన్సీలాగే దీన్నీ ఆర్‌బీఐ సృష్టిస్తుంది. ఎలక్ట్రానిక్ రూపంలోని ఇ-రూపీని బ్యాంకులు, ఇతర అనుమతి పొందిన ఇతర సంస్థలకు పంపుతుంది. అవి వినియోగదారులకు వాలెట్ రూపంలో అందిస్తాయి.

డిజిటల్ రూపీ వాడటానికి సేవింగ్స్ అకౌంట్ అవసరమా?

ప్రస్తుతం హ్యాండిల్ చేయడం సులభం కావడానికి సేవింగ్స్ అకౌంట్ లింక్ చేయడం తప్పనిసరి. భవిష్యత్తులో కొత్త విధానాలు రానున్నాయి. ఇ-రూపీని వాడేందుకు ఎలాంటి చార్జీలు లేవు.

ఆఫ్‌లైన్ ఫీచర్ అంటే?

ఇంటర్నెట్ లేని ప్రాంతాల్లో కూడా డబ్బు చెల్లింపులు చేయడానికి దీన్ని వాడొచ్చు. కొన్ని పద్ధతులు టెలికాం కనెక్టివిటీ మీద ఆధారపడి ఉంటే.. మరికొన్ని ఎన్ఎఫ్‌సీ టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాయి.

వడ్డీ వస్తుందా?


జేబులో ఉన్న డబ్బులాగే ఉపయోగపడే ఈ ఇ-వాలెట్‌లోని డబ్బుపైనా ఎలాంటి వడ్డీ రాదు.

ఏ దేశాల్లోనైనా ఈ వ్యవస్థ ఉందా?

బహమాస్, జమైకా, నైజీరియా.. ఈ మూడు దేశాలు పూర్తిస్థాయిలో సీబీడీసీ వ్యవస్థను అమలు చేస్తున్నాయి. భారత్, ఇండోనేషియా, చైనా దేశాల్లో ఇది పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది.


- ఈనాడు ప్రత్యేక విభాగం

సొరంగం దాటితే.. యుద్ధంలో గెలిచినట్టే!



మధ్యప్రదేశ్‌లో ఛింద్‌వాడా జిల్లా పరిధి పెంచ్ పులుల అభయారణ్యం ఉన్న దట్టమైన అడవుల్లో గల సాంఖ్ గ్రామంలో ఓ ప్రత్యేకమైన, పురాతన సంప్రదాయం ఏటా కార్తిక మాసంలో జాతరలా కొనసాగుతోంది. డోంగర్ దేవ్‌గా పిలిచే ఈ ప్రాంత శివాలయంలో పూజల అనంతరం రెండు పెద్ద బండరాళ్ల మధ్య గుహలా ఉన్న సొరంగం గుండా వెళ్లేందుకు భక్తులు ప్రయత్నిస్తారు. తొలి ప్రయత్నంలో ఇది ఎవరికైనా అసాధ్యమని అనిపిస్తుంది. మెల్లగా పాకుతూ రెండో వైపునకు చేరుకున్నవారి ముఖాలు యుద్ధంలో గెలిచినట్టుగా సంతోషంతో వెలిగిపోతాయి. ఇందుకు కారణం లేకపోలేదు. రాళ్ల నడుమ ఇరుక్కుపోకుండా బయటపడితే పాప ప్రక్షాళన జరిగినట్లుగా స్థానికుల నమ్మకం. ఏటా కార్తిక పూర్ణిమలో 15 రోజులపాటు జరిగే ఈ పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. పులుల అభయారణ్యం కావడంతో ఈ సమయంలో అటవీశాఖ సిబ్బంది కాపలాగా ఉంటారు. -ఈటీవీ భారత్

మహిళా చేతనతో అద్భుతాలు



ఆధునిక చరిత్రను స్త్రీలే లిఖిస్తారని అన్నారు గురజాడ. ఎంత ఆధునికతను సంతరించుకున్నా సమాజంలో పురుషాధిక్య భావనలు ఇంకా ఊడలు దిగే ఉన్నాయి. జాతి భవితవ్యాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దగల నిజాయతీ, సామర్థ్యం మహిళలకు ఉన్నాయి. వారిలో ఆ చేతన పెంపొందిస్తే ఎన్ని అద్భుతాలైనా సాధ్యమవుతాయి.

ఎనీ టైం గ్రంథాలయం



ఉత్తమ పుస్తకాల పఠనం జీవితాల్ని మారుస్తుందనే విషయం తెలిసినవారు.. వారు. అలానే చదవాలనే ఆకాంక్ష ఉన్నా పుస్తకాలు లభించనివారు ఎందరో. ఈ నేపథ్యంలో అవసరార్థులకు ఏ సమయంలోనైనా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సంకల్పించారు.. హైదరాబాద్ హబ్సిగూడ ప్రాంతంలోని లయన్స్ క్లబ్, సీనియర్ సిటిజన్ సభ్యులు. ఇక్కడి వార్డు కార్యాలయంలో 'ఎనీ టైం బుక్స్' సెంటర్ అని ఒక బాక్స్ ఏర్పాటు చేశారు. సొంత ఖర్చులతో కొత్త పుస్తకాలను కొనుగోలుచేసి అందులో పెట్టారు. 24 గంటలూ పుస్తకాలు అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేశారు. అవసరమైన వారు పుస్తకాలను తీసుకెళ్లవచ్చు. చదువుకున్నాక తిరిగి ఇవ్వొచ్చు. ఇంట్లో ఉన్న మంచి పుస్తకాలను తీసుకొచ్చి ఈ బాక్సులో పెట్టొచ్చు. ఇక్కడే చదువుకునే అవకాశమూ కల్పించారు.

– న్యూస్‌టుడే, హబ్సిగూడ

AADHAAR

ఆధార్ కార్డు లేదా... యాప్ ఉందిగా!



అరెరే.. హడావిడిలో ఆధార్ తీసుకురావడం మర్చిపోయానే...

మొబైల్‌ఫోన్‌లో ఫొటోలు కూడా లేవు ఇప్పుడెలా..?

ఆధార్ కార్డుతో పని ఉండి మర్చిపోయినప్పుడు చాలామంది పరిస్థితి ఇది.

ఇకపై ఇది సమస్య కాకుండా ఆధార్ యాప్ వచ్చేసింది...

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కొత్త ఆధార్ యాప్‌ను తీసుకొచ్చింది. తమ ఆధార్ వివరాలను మొబైల్‌ఫోన్‌లో సేవ్ చేసి పెట్టుకోవడం, అవసరమైన వివరాలను ఇతరులతో సులువుగా పంచుకోవడం కోసం దీన్ని తీసుకొచ్చింది. ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లేస్టోర్, ఐఫోన్ యూజర్లు యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా పేపర్ లెస్ ఎక్స్‌పీరియన్స్ పొందొచ్చు.

యూఐడీఏఐ నుంచి ఇప్పటికే ఎం-ఆధార్ పేరిట ఓ యాప్ అందుబాటులో ఉంది. దీనికి అదనంగా ఈ కొత్త 'ఆధార్' యాప్‌ను తీసుకొచ్చారు. ఎం-ఆధార్ తరహాలో దీంట్లో డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు కోసం ఆర్డర్ చేయడం, ఇ-మెయిల్, మొబైల్ నంబర్ వెరిఫికేషన్, వర్చువల్ ఐడీ జనరేషన్ వంటి ఫీచర్లు ఏవీ ఉండవు. కేవలం మీ ఆధార్ వివరాలను భద్రపరుచుకోవడం, ఇతరులతో పంచుకోవడానికి ఉద్దేశించి మాత్రమే ఈ యాప్ తీసుకొచ్చారు.

కొత్త యాప్‌లో ఏమున్నాయ్?

- ఆధార్ కార్డును ప్రతిసారీ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా.. డిజిటల్‌గా అందుబాటులో ఉంచుకోవచ్చు.
- కుటుంబసభ్యుల ఆధార్ వివరాలన్నీ ఒకే డివైజ్‌లో పొందుపరచుకోవచ్చు.
- ఫేస్ అథంటికేషన్ ఫీచర్ కూడా అందుబాటులో ఉంటుంది.
- కార్డు వివరాలను ఎవరితోనైనా షేర్ చేసుకోవాలన్నా ఈ యాప్ ద్వారా సులువుగా చేసుకోవచ్చు.
- ఆధార్‌లోని ఏయే వివరాలు పంచుకోవాలనుకుంటున్నారో వాటిని మాత్రమే ఎంపిక చేసుకునే సదుపాయం ఉంటుంది.
- ఆధార్ బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకోవచ్చు.
- మీ ఆధార్ వివరాలను చివరిసారిగా ఎక్కడ వినియోగించారనే విషయాలను తెలుసుకోవచ్చు.



ఎలా ఉపయోగించాలంటే...

- యాప్ ఓపెన్ చేశాక.. ఆధార్ కార్డు నంబరు, ముఖ చిత్రానికి లైట్ ఉన్న ప్రదేశాన్ని అడుగుతుంది.
- అనంతరం టర్మ్స్ అండ్ కండీషన్ పాలసీలు కనిపిస్తాయి వాటిని చదివి ధ్రువీకరించుకోవాలి.
- మీ ఆధార్ అనుసంధానం అయిన మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి.
- వెరిఫికేషన్ తర్వాత ఫేస్ అథంటిఫికేషన్ పూర్తి చేయాలని అడుగుతుంది.
- వివరాలన్నీ నమోదు చేశాక సెక్యూరిటీ కోసం పిన్ సెట్ చేసుకుంటే సరిపోతుంది.
- మీ ఆధార్ గురించి పూర్తి వివరాలు కనిపిస్తాయి.
- లేదంటే ఆధార్ కేంద్రానికి వెళ్లి సంబంధిత అధికారులను కలిస్తే వారు మీ నంబర్‌ను పరిశీలించి పరిష్కారం చూపిస్తారు.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఊరంతా చూడాలనుకుందో ఏమో.. ఇంతెత్తున పెరిగింది!



కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో నివాసాల మధ్య ఇలా పెరిగింది బొప్పాయి. తాటిచెట్టుని ఆదర్శంగా తీసుకున్నట్లు.. ఇప్పటికే 20 అడుగులకు పైగా పెరిగి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

– న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్



పంచగవ్య జాతీయ సదస్సుకు హాజరైన బాలకృష్ణగురుస్వామి, గొంది ఝాన్సీలక్ష్మి, డాక్టర్ వి.కృష్ణవేణి, రాజు గుప్తా, కపిల్ కుమార్, గవ్యసిద్ధాచార్య నిరంజన్ వర్మ, ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, జగద్గురు పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహారాజ్, మురళీధరరావు, డాక్టర్ ముఖేష్ మీనా, గ్రాకా

గోమాత బతికితేనే దేశం బాగుంటుంది

- గోసేవను తల్లిదండ్రుల సేవగా చూడాలి
- జగద్గురు పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహారాజ్
- తిరుపతిలో కొనసాగుతున్న 13వ పంచగవ్య వైద్య మహాసమ్మేళనం

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: 'భారత సనాతన ధర్మంలో భాగమైన గోమాత బతికితేనే దేశం బాగుంటుందన్న విషయాన్ని పాలకులు గుర్తుపెట్టుకోవాలని జగద్గురు పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహారాజ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులను ఏ విధంగా చూసుకుంటున్నామో.. గోమాతలను సైతం అలాగే చూడాలని సూచించారు. పంచగవ్య విద్యాపీఠం, పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 13వ జాతీయ పంచగవ్య వైద్య మహాసమ్మేళనానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'గోవు మన జీవన విధానమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. పంచగవ్య విద్యాపీఠంలో పీజీ, డాక్టరేట్లు చేస్తున్న వారందరూ గోసంరక్షణకు కృషి చేయాలి. గోమాత సేవతో, తద్వారా లభించే శక్తితో యావత్ భారత జాతికి మేలు జరుగుతుందనే విషయాన్ని చాటి చెప్పాలి. శ్రీకృష్ణ భగవానుడు గోసేవ చేసి ప్రపంచానికి గోవుల ప్రాధాన్యాన్ని తెలియజేశారు' అని పిపద్వారాచార్య బలరామ్ దేవాచార్య మహారాజ్ వివరించారు. ఈ సదస్సుకు అఖిల భారత గోసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, జాతీయ సమ్మేళనం సంయుక్త కార్యదర్శి గొంది ఝాన్సీలక్ష్మి, పంచగవ్య విద్యాపీఠం వీసీ కపిల్ కుమార్, గురుకులపతి గవ్యసిద్ధాచార్య నిరంజన్ వర్మ, జాతీయ సాంస్కృతిక యూనివర్సిటీ ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, హైదరాబాద్ ప్రకృతి వైద్య నిపుణులు మురళీధరరావు, తదితరులు హాజరయ్యారు.

20 ఏళ్లుగా పరిశోధనలు

గో ఆధారిత పంచగవ్య విజ్ఞానం చాలా మెరుగైంది. మహర్షులు తమ జీవితాలను పణంగా పెట్టి అనుసరించిన వైద్యవిధానాలపై విద్యాపీఠం నిర్వాహకులు సుమారు 20 ఏళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. భారతీయ వైద్యవిధానంలో కారణాలు తెలియని అనేక రుగ్మతలకు ఇది మార్గం చూపుతుంది.

– డాక్టర్ వి.కృష్ణవేణి, రాయలసీమ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్, ఏపీ

ప్రత్యేక పాలసీ ప్రకటించాలి

గోసంరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఒకే చట్టం ఉండేలా కేంద్రం ప్రత్యేక పాలసీని ప్రకటించాలి. గోవులను కాపాడేందుకు వివిధ రాష్ట్రాల్లో చట్టాలు ఉన్నాయి. కానీ, ఈ విషయం గోశాలల నిర్వాహకులకు, అధికారులకు సరిగా తెలియకపోవడం విచారకరం. దేశవ్యాప్తంగా అపహరణకు గురవుతున్న గోవుల అంశంలో విద్యాపీఠం కేంద్రంగా పోరాడుతున్నాం. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించే వారంతా ఈ ఉద్యమంలో భాగస్వాములవ్వాలి.

– రాజుగుప్తా, విద్యాపీఠం న్యాయ సలహాదారు, మహారాష్ట్ర హైకోర్టు న్యాయవాది





వివిధ ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకున్న శ్రీసిటీ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ ★ విశాఖ భాగస్వామ్య సదస్సుపై మీడియాతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, నారాయణ, లోకేశ్, టీజీ భరత్, దుర్గేష్, గుమ్మిడి సంధ్యారాణి, సీఎస్ విజయానంద్ తదితరులు

33 ఏళ్ల తర్వాతా అమరావతిలో కర్బన ఉద్గారాలు తక్కువే

- ప్రపంచానికి ఉత్తమ నగరంగా నిలుస్తుంది
- గ్రీన్‌బాండ్స్ ద్వారా పెట్టుబడులు ఆకర్షించవచ్చు
- సుస్థిర నగరాలపై సదస్సులో వక్తల అభిప్రాయం

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: ఇప్పుడే కాదు, 33 ఏళ్ల తర్వాతా జాతీయ, అంతర్జాతీయ నగరాలతో పోలిస్తే.. అమరావతిలో కర్బన ఉద్గారాలు తక్కువగా ఉంటాయని నిపుణులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇదో ఉత్తమ నగరంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. 'సుస్థిర నగరాలు, దార్శనికత నుంచి పెట్టుబడుల వరకు' అనే అంశంపై శనివారం విశాఖపట్నంలోని భాగస్వామ్య సదస్సులో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. భారతదేశంలోనే అతి పెద్ద గ్రీన్‌ఫీల్డ్ రాజధానిగా అమరావతి నిర్మితమవుతోందని, ఎక్కడ నుంచి ఎక్కడికైనా 15 నిమిషాల్లోపే చేరుకునేలా నిర్మాణాలు చేస్తున్నామని చెప్పారు. దేశంలో భవిష్యత్ నగర నిర్మాణానికి అమరావతి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అత్యవసర సేవలకు 5 నిమిషాలు, వినోద ప్రదేశాలకు 10 నిమిషాలు, పని ప్రదేశాలు, ప్రభుత్వ సేవలకు 15 నిమిషాల్లో చేరుకోవచ్చని తెలిపారు. 5వేల ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు చేస్తున్నామని, ఇండియాకు కొత్త గేట్‌వేగా మచిలీపట్నం నౌకాశ్రయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఇప్పటికే విద్య, ఆరోగ్యరంగాల్లో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని.. భాగస్వామ్య సదస్సు ద్వారా రూ.40 వేల కోట్లు పెట్టుబడులు ఆకర్షించామన్నారు. కనెక్టివిటీ, డేటా ఆధారిత పాలన, మెరుగైన ప్రజాసేవలు, సుస్థిర నగరం అనే నాలుగు స్తంభాలపై అమరావతి నిర్మితమవుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ చెప్పారు.

ఆ నగరాలతో పోలిస్తే.. కర్బన ఉద్గారాలు తక్కువే

'అమరావతిలో ప్రస్తుత జనాభా 1.79 లక్షల ప్రకారం చూస్తే.. కర్బన ఉద్గారాలు తలసరి 1.31 టన్నుల చొప్పున ఉన్నాయి. గ్రీన్‌ఫీల్డ్ రాజధాని కొనసాగిస్తే.. 2058 నాటికి అంటే 33 ఏళ్లకు కార్బన్ ఉద్గారాలు తలసరి 1.27 టన్నులకు చేరతాయి. ఇతర భారతీయ నగరాలు, ప్రపంచస్థాయి నగరాల్ని పరిశీలిస్తే.. అహ్మదాబాద్ 2.1 టన్నులు, చెన్నై 1.9 టన్నులు, హైదరాబాద్ 2.48 టన్నులు, సింగపూర్ 12.3, న్యూయార్క్ 11, లండన్ 3.2 టన్నులు, బ్యాంకాక్ 7.4 టన్నుల చొప్పున ఉంటాయి. అయితే అమరావతిలో 2058 నాటికైనా 1.27 టన్నులే ఉంటాయి. ప్రభుత్వ ప్రణాళికల కారణంగా.. అమరావతి నిజమైన గ్రీన్‌ఫీల్డ్ రెజిలియంట్ సిటీగా నిలుస్తుంది. పెట్టుబడిదారులు, బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు అమరావతి ఉత్తమ గమ్యస్థానం, ఆదర్శ నగరం అవుతుంది' అని ఐసీఎల్ఈఐ (ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంటల్ ఇనీషియేటివ్స్) దక్షిణాసియా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఇమాని కుమార్ పేర్కొన్నారు. 'అమరావతి భవిష్యత్తు తరాలకు స్థిరమైన, ఆరోగ్యకరమైన నగర జీవనాన్ని అందిస్తుంది. 40వేల హరిత ఉద్యోగాలను సృష్టిస్తుంది' అని ఇమామి కుమార్ వివరించారు.

గ్రీన్ బాండ్స్ ద్వారా అమరావతికి రుణాలు

గ్రీన్ బాండ్స్ ద్వారా అమరావతికి పెద్దఎత్తున రుణాలు లభించే అవకాశం ఉందని క్లైమేట్ బాండ్స్ ఇనీషియేటివ్ దక్షిణాసియా హెడ్ నేహా కుమార్ వివరించారు. వడోదర గ్రీన్‌బాండ్లకు 10 రెట్లు, సూరత్‌లో 7 రెట్ల చొప్పున అధికంగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. తక్కువ వడ్డీరేటుతో వారికి రుణం లభించింది' అని పేర్కొన్నారు. 'వాతావరణ మార్పుల నేపథ్యంలో వరదలు, అధిక ఉష్ణోగ్రతలు, కరవు పరిస్థితులు తలెత్తుతాయి. వాటిని తగ్గించే పరిష్కార మార్గాలు చూపాలి. కర్బన ఉద్గారాల్ని తగ్గించే ఆస్తులను సృష్టించాలి. కచ్చితమైన గణాంకాలు ఉంటే మార్కెట్‌లోని పెట్టుబడిదారుల్లో నమ్మకం కలుగుతుంది' అని సూచించారు.

మహిళలకు హరిత ఉద్యోగావకాశాలు

అమరావతిలో మహిళలకు హరిత ఉద్యోగావకాశాలు లభిస్తాయని సీఐఐకి చెందిన వెంకటగిరి చెప్పారు. శిక్షణ ఇవ్వడం ద్వారా కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ మెకానిక్స్, గ్రీన్ టెక్నీషియన్స్‌గా తీర్చిదిద్దవచ్చని సూచించారు. సీఐఐ దీనికి పూర్తిగా సహకరిస్తుందని వివరించారు. పెట్టుబడులు, నిర్మాణాలు, భారీ ప్రాజెక్టులే ముఖ్యం కాదని.. నగరంలో జీవనం ఎలా నడుస్తోందనేదీ ముఖ్యమని ఆనంద్ అయ్యర్ పేర్కొన్నారు.



ఇఫ్కో ఛైర్మన్ దిలీప్ నసుభాయ్ సంఘానీ బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



కోర్డెలియా క్రూయిజ్ ప్రతినిధులకు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్



అట్మాస్ఫియర్ కోర్ కంపెనీ దక్షిణాసియా ఎండీ సౌవాగ్య మొహాపాత్ర, గ్రూప్ ఎండీ సలీల్‌తో సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ చర్చలు

ప్రధాన పెట్టుబడిదారులు, పెట్టుబడుల విలువ, ఉపాధి వివరాలు

పెట్టుబడిదారులు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
విద్యుత్తు రంగం		
ఏబీసీ క్లీన్‌టెక్ (బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్)	1,10,250	13,500
ఎకోరెన్ ఎనర్జీ	38,250	7,000
చింతా గ్రీన్ ఎనర్జీ	30,000	6,000
రెన్యూ	25,000	10,000
హీరో ఫ్యూచర్	15,000	15,400
ఫోర్‌స్క్వేర్ గ్రీన్ ఎనర్జీ	10,205	1,750
పరిశ్రమలు, వాణిజ్యం		
ఏఎం గ్రీన్ మెటల్స్	44,000	3,000
గ్రీన్‌కో ఏఎంజీ గ్రీన్	35,000	-
వారీ గ్రూప్	20,000	2,000
ఈజోల్	19,000	1,800
ఇండియన్ బులియన్ జ్యూయలర్స్	15,000	100
ఇన్‌ఫ్రాస్ట్రక్చర్		
ఉమెండస్ టెక్నాలజీస్	92,000	52,000
జీఎంఆర్ - వీఐఏఎల్	20,000	1,80,000
కార్బొనాటిక్	19,100	8,000
క్రౌన్ ఎల్ఎన్‌జీ	10,640	-
యునైటెడ్ పెట్రో గ్రూప్	7,600	12,000
ఐటీ, ఎలక్ట్రానిక్స్		
ఇండ్‌చిప్ సెమీ కండక్టర్స్	22,976	1,241
టిల్‌మ్యాన్	15,000	100
ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్	10,603	3,000
హైపర్ నెక్ట్స్	10,000	2,000
ఈమ్యాక్	9,000	19,500
ఏపీసీఆర్‌డీఏ		
మణిపాల్ గ్రూప్	15,000	1,000
బీర్జయ గ్రూప్	8,300	-
పర్యాటకం		
స్టార్‌నెట్ హోల్డింగ్ బీవీ	1,060	1,200
ఆహారశుద్ధి		
రిలయన్స్ కన్జ్యూమర్	1,622	4,500
పురపాలక		
ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్	1,800	-
ఏసీఈ కాకినాడ హైటెక్ సిటీ	1,625	10,000

ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యం

- మంత్రులు, అధికారులు కలిసి పని చేయడంతో భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్
- 45 దేశాల్లో విశాఖ పేరు మార్మోగుతోంది
- అభినందన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాఖపట్నం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంత్రులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయడంతోనే భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్ అయిందని వెల్లడించారు. విశాఖపట్నం సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు అనంతరం మంత్రులు, అధికారులు, ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. సీఎం అందరికీ జ్ఞాపికలు అందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సీఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. బృందంగా కలిసి పని చేయడం వల్లే 45 దేశాల్లో మన భాగస్వామ్య సదస్సు, విశాఖ పేరు మార్మోగుతోంది. ఈ సదస్సులో అర్థవంతమైన, విజ్ఞానవంతమైన చర్చలు జరిగాయి. దావోస్‌లో ఒప్పందాలు బయట జరుగుతాయి. ప్రపంచం ఏ దిశగా ముందుకెళుతోంది.. భవిష్యత్తు ఏవిధంగా ఉంటుంది.. ఎదురయ్యే సవాళ్లు.. అందివచ్చే అవకాశాలపై ప్రధాన ప్రాంతంలో చర్చిస్తారు. కానీ, వినూత్న పద్ధతిలో విశాఖ సదస్సుకు మనం శ్రీకారం చుట్టాం. ఎవరికి ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే ఆ సెమినార్‌కు వెళ్లే అవకాశం కల్పించాం" అని తెలిపారు.

వెన్యూ నుంచి మెనూ వరకు..: సదస్సులో వెన్యూ నుంచి మెనూ వరకు అంతా ప్రణాళికతో నిర్వహించారని, విదేశీ ప్రతినిధులకు విమానాశ్రయంలో ఆహ్వానం పలకడం నుంచి వాళ్లను తిరిగి పంపించే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించిందని చంద్రబాబు ప్రశంసించారు. "ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నాం. మోదీ బలమైన నాయకుడు అనే భావన ప్రపంచమంతా ఉంది. దేశంలో సుస్థిర ప్రభుత్వం ఉంది. పెట్టుబడులు పెట్టొచ్చనే ధైర్యాన్ని పారిశ్రామికవేత్తల్లో అధికారులు కలిగించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పునిచ్చారు. విధ్వంస పాలనకు చరమగీతం పలికారు. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం" అని తెలిపారు.

ఏఐ వర్సిటీలో భాగస్వాములవ్వండి

- ఎల్‌జీ కెమ్ సంస్థ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

రాష్ట్రంలోని కాకినాడ, మూలపేటల్లో ఒకచోట ఎల్‌జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్‌జీ కెమ్ ప్రతినిధులకు సూచించారు. అబుధాబి తరహాలో రాష్ట్రంలోనూ ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని.. అందులో భాగస్వామి కావాలని కోరారు. భాగస్వామ్య సదస్సు రెండో రోజు ఆయన వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలతో రావాలని ఆహ్వానించారు.

- ఎల్‌జీ కెమ్ ఏర్పాటు చేసే కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సహకారం అందిస్తామని ఆ సంస్థ సస్టెయినబులిటీ స్ట్రాటజీ అధికారి యున్జోకోకు హామీ ఇచ్చారు. ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటుకు వీలుంటుందని చెప్పారు.

బయోఫెర్టిలైజర్ యూనిట్ల ఏర్పాటుకు పరిశీలించండి: రాష్ట్రంలో గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఆధారిత ఎరువుల తయారీ ప్లాంట్ల ఏర్పాటు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంపై ఇఫ్కో ఛైర్మన్ దిలీప్ సంఘానీతో చంద్రబాబు చర్చించారు. బయో ఫెర్టిలైజర్, బయో స్టిమ్యులెంట్ యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని కోరారు. ఇఫ్కోతో పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబులిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో

బీచ్ టూరిజంపై కార్డీలియా క్రూయిజ్ ఆసక్తి: ఏపీలో క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ ఎడ్వెంచర్ స్పోర్ట్స్‌పై కార్డీలియా క్రూయిజ్ సంస్థ ఆసక్తి కనబరిచింది. విశాఖ- కాకినాడ- భీమునిపట్నం పోర్టుల నుంచి క్రూయిజ్ సేవలు అందించడంపై సంస్థ సీఈఓ జుర్గెన్ బైలామ్‌తో చంద్రబాబు చర్చించారు. సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బాలాజీ, అధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి పాల్గొన్నారు.



జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మతో చర్చిస్తున్న మంత్రి లోకేశ్



ఫిన్లాండ్‌కు చెందిన ఇన్ఫినిటెడ్ ఫైబర్ సంస్థ రాష్ట్రంలో రూ.4 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి సవితల సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

ఆహా.. అరకు కాఫీ! వారెవ్వా.. మంగళగిరి శారీ!

విశాఖపట్నం నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: అరకు కాఫీ, మంగళగిరి వస్త్రాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ విస్తృత ప్రచారం కల్పించారు. అరకు కాఫీ తాగాలని ప్రతి సమావేశంలోనూ దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు పదేపదే సూచించారు. వారికి బహుమతిగానూ అరకు కాఫీ అందజేశారు. ఆక్వా ఉత్పత్తుల గురించీ సందర్భం వచ్చిన ప్రతిసారీ ప్రస్తావించారు. మంగళగిరి చేనేత వస్త్రంతో రూపొందించిన జాకెట్ ధరించిన మంత్రి లోకేశ్.. ఆ వస్త్రాలకు బ్రాండ్ అంబాసిడర్‌లా వ్యవహరించారు. మంగళగిరి చీరల విశిష్టతను చంద్రబాబు పదేపదే చెప్పడంతో.. చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలాయ్ జాకి మంగళగిరి చీరను అప్పటికప్పుడు కొన్నారు. శుక్రవారం రాత్రి గాలా డిన్నర్‌లో ఆమె ఆ చీరలో మెరిశారు. శనివారం ముగింపు సమావేశంలో సిలాయ్ జాకితో పాటు ఆస్ట్రేలియా ఇండియా సీఈఓ ఫోరం డైరెక్టర్ జోడి మెక్‌కేలకు ప్రత్యేకంగా మంగళగిరి చీరలను బహూకరించారు.



వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎండీ జెరెమి జుర్గెన్స్, ఏఐఎఫ్ఎఫ్ ఛైర్మన్ కళ్యాణ్ చౌబేలతో మంత్రి లోకేశ్ చర్చలు



ప్లీనరీ వేదికపై 'క్లైమెట్ రిస్క్స్ ఫర్ ఇండియన్ బిజినెస్'పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఫైర్‌స్టజెన్ సీఈఓ అండ్ ఫౌండర్ ఫిలిప్ ఆస్మస్ (స్విట్జర్లాండ్). చిత్రంలో అవేరా న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మోటోకార్ప్ టెక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటరమణ, జీఐజెడ్ ఇండియా-భూటాన్ కంట్రీ డైరెక్టర్ జూలీ రివైరీ, యూవీ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ పార్టనర్ సచిన్ గుప్తా, వైసీహెచ్ గ్రూప్ (సింగపూర్) సునీల్ నంబియార్

రెండు రోజుల భాగస్వామ్య సదస్సు అదిరింది

- నాడు ఎండలో అగచాట్లు.. నేడు ఆహ్లాదకరంగా ఏర్పాట్లు

ఈనాడు, విశాఖపట్నం: ఆహ్లాదకర వాతావరణంలో రెండు రోజుల భాగస్వామ్య సదస్సు ముగిసింది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన సదస్సు శుక్రవారం ఆర్భాటంగా మొదలై, శనివారం అంతే కోలాహలంగా ముగిసింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన వేలమంది ప్రతినిధులు ఈ పండుగ వాతావరణాన్ని ఆస్వాదించారు.

అత్యాధునిక వసతులతో కూడిన నగరంలా..: సదస్సును నిర్వహించిన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం అత్యాధునిక వసతులతో కూడిన ఒక నగరాన్ని తలపించింది. ప్రాంగణంలో హాళ్లన్నింటినీ లగ్జరీ ఏసీ గదుల్లా తీర్చిదిద్దారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ఐదంచెల భద్రత ఏర్పాటుచేసి క్షుణ్ణంగా తనిఖీలు చేశాక అనుమతిచ్చారు. వేదిక ప్రధానద్వారం వద్ద గుర్తింపు కార్డులను పరిశీలించి తనిఖీలు చేసి లోపలికి పంపారు. రిజిస్ట్రేషన్ వివరాలను సెల్‌ఫోన్‌లో చూపించి లోపలకు వెళ్తే, వారికి రిసెప్షన్ కౌంటర్ వద్ద గుర్తింపుకార్డులను అందజేశారు. అక్కడ నుంచి ముఖగుర్తింపు విధానం ద్వారా ప్రతినిధులు, అతిథులు సదస్సు జరిగే సమావేశ మందిరాల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. పోలీసు, అధికార యంత్రాంగం హాజరైన ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారు. బ్యాటరీ వాహనాలను అందుబాటులో ఉంచి అతిథులను సభా ప్రాంగణానికి తరలించారు. అంతటా ఐఏఎస్ అధికారులు పర్యవేక్షించారు.

వైకాపా హయాంలో అన్నింటా విఫలమే: వైకాపా హయాంలో ప్రతినిధుల రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద నిర్వాహకులకు, పాస్‌ల కోసం వచ్చినవారికి మధ్య వాగ్వాదం నెలకొంది. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి సదస్సు ప్రధాన గేటు ప్రారంభంలో ఏర్పాటుచేసిన కౌంటర్ల వద్ద పాస్‌లతో పాటు కిట్ అందజేశారు. మధ్యాహ్నం సమయంలో పాస్‌లు తీసుకున్న కొందరు డెలిగేట్లకు కిట్ బ్యాగ్‌లు ఇవ్వకపోవడంతో కౌంటర్‌లో ఉన్న సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌంటర్‌ను పీకి పందిరేశారు. కుర్చీలు, గదికి ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ సామగ్రిని ధ్వంసం చేశారు. పెట్టుబడులకు ఆహ్వానించి అందుకు తగ్గ వసతులు కల్పించడంలో నిర్వాహకులు అప్పట్లో విఫలమయ్యారు. సదస్సుకు వచ్చిన ప్రతినిధులు భోజనాల కోసం, సదస్సు జరిగే సమావేశ మందిరాల్లోకి వెళ్లడానికి ఆరుబయట ఎండలో క్యూలో నిలబడాల్సి వచ్చింది. అప్పటి ఇబ్బందుల ఫొటోలు, ఇప్పటి ఆహ్లాదకర ఏర్పాట్లతో ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.



వైకాపా హయాంలో భోజనాలకు ఎండలో బారులు తీరి ఇలా..

ఏపీలో 20కి పైగా జపాన్ కంపెనీల పెట్టుబడులు

- జపాన్ రాయబారి ఒనో కేయిచి వెల్లడి


ఈనాడు, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు 20కి పైగా జపాన్ సంస్థలు ముందుకొచ్చాయని జపాన్ రాయబారి ఒనో కేయిచ్చి పేర్కొన్నారు. 'భారత్ అభివృద్ధిలో జపాన్ కీలక భాగస్వామిగా ఉంది. సాంకేతిక, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధికి సహకరిస్తాం. ఏపీ అభివృద్ధికీ తోడ్పాటునందిస్తాం' అని చెప్పారు. పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన 'కంట్రీ సెషన్'లో ఆయన మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయి. దార్శనికతతో ఆలోచించే చంద్రబాబు ఇక్కడ ఉన్నారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు మొగ్గు చూపిస్తున్నారు' అని రుసాల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఆంటోన్ బెంజులేవా పేర్కొన్నారు. 'అనకాపల్లిలోని అమ్మోనియా పరిశ్రమలో మా సంస్థకు 18 శాతం వాటా ఉంది. దాన్ని 50 శాతం వరకు పెంచుతాం. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం' అని వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటుకు విశాఖపట్నం అనుకూల ప్రాంతమని చెప్పారు.

గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఆంధ్రప్రదేశ్

'ఏపీ.. గేట్‌వే ఆఫ్ ఇండియాగా ఉంది. పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలంగా ఉంది. వ్యవసాయ రంగం, ఉత్పత్తి కేంద్రాలు, ఏఐ వంటి రంగాలు గణనీయంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. మూడు దశాబ్దాలుగా భారత్‌కు అల్యూమినియం సరఫరా చేస్తున్నాం. పర్యావరణానికి హాని లేకుండా పరిశ్రమల స్థాపనకు సహకరిస్తాం' అని రష్యన్ సమాఖ్య పరిశ్రమలు, వాణిజ్య శాఖ డిప్యూటీ మినిస్టర్ అలెక్సీ గ్రూజ్‌దేవ్ హామీ ఇచ్చారు. భారత్, రష్యా దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరిస్తున్నాయని, ప్రపంచ పారిశ్రామికీకరణలో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. 'వ్యూహాత్మక పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యం' అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బెర్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఆండ్రీ అనిసిమోవ్ మాట్లాడుతూ.. ప్రపంచ పారిశ్రామిక యుగంలో ఇరుదేశాలు తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకుంటున్నాయన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పరిశ్రమలు..

'ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతుంది. ప్రపంచ దేశాలకు పెట్టుబడులు పెట్టేందుకు విశాఖ అనుకూలమైన ప్రాంతం. రాష్ట్రానికి పెట్టుబడులతో వస్తే.. అన్ని సౌకర్యాలను కల్పించి ప్రోత్సహిస్తాం' అని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.



'ఈజ్ ఇండియా రెడీ ఫర్ ఎజెంటిక్ ఏఐ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మేమాని, వివిధ దేశాల ప్రతినిధులు



మంత్రి లోకేశ్ సమక్షంలో ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం



మాట్లాడుతున్న శ్రీవాస్తవ. చిత్రంలో ఎంటీ కృష్ణబాబు, కార్తికేయ ఆనంద్, రాకేష్ మిశ్రా, రేవతీ రోహిణీ తదితరులు

బ్లూ ఎకానమీపై త్వరలో నూతన విధానం

- భూ వైజ్ఞానిక శాఖ సలహాదారు శ్రీవాస్తవ

ఈనాడు, విశాఖపట్నం: సముద్ర వనరుల ఆధారంగా చేపట్టే ఆర్థిక కార్యకలాపాలకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తేనుందని మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సలహాదారు శ్రీవాస్తవ తెలిపారు. ప్రస్తుతానికి నౌకా నిర్మాణాలు, మత్స్య సంబంధ ఉత్పత్తులపై ఆశించిన ప్రగతి కనిపిస్తున్నప్పటికీ సముద్ర గర్భ పరిశోధనలు, ఖనిజాల అన్వేషణలో ఇంకా సాధించాల్సి ఉందన్నారు. సముద్ర గర్భంలో చేపల వేట, బయోటెక్నాలజీ, తీర వనరులపై భారత ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. ఈ రంగంలో కొత్తగా వచ్చే అంకురాలను ప్రోత్సహించేందుకు నిధుల సహకారం అందేలా చూస్తున్నట్లు చెప్పారు. సీఐఐ సదస్సులో బ్లూ ఎకానమీపై చర్చ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ ‘ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక చేసింది. కొత్తగా మరో 3 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో ఒకటి 2026 నాటికి అందుబాటులోకి వస్తుంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్లు వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్వహణలోకి వస్తాయి. సముద్ర అలల నుంచి విద్యుత్తు ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై చర్చలు సాగుతున్నాయి. సముద్ర గర్భంలో ఖనిజాల గుర్తింపు, మత్స్య సంబంధ ఉనికిని గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం’ అని కృష్ణబాబు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు లక్ష్మణరావు, ప్రీమియర్ ఎనర్జీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రేవతీ రోహిణి, ఆల్టర్నేటివ్ ఎనర్జీ కంపెనీ సీనియర్ సలహాదారు కార్తికేయ ఆనంద్, ఎర్నెస్టు అండ్ యంగ్ సంస్థ భాగస్వామి రాకేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి వాతావరణ మార్పులే పెద్ద సవాలు

జీఐజెడ్ ఇండియా డైరెక్టర్ జూలీ రివియర్

ఈనాడు, విశాఖపట్నం: ప్రభుత్వాలు నిర్దేశించుకున్న ఆర్థికాభివృద్ధి లక్ష్యాలపై వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆ రంగం నిపుణులు, జీఐజెడ్ ఇండియా డైరెక్టర్ జూలీ రివియర్ అన్నారు. ‘సస్టెయినబులిటీ అండ్ క్లైమేట్ యాక్షన్’ అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. ‘కొన్నేళ్లుగా వాతావరణ మార్పులతో ఉత్తరాదిలో మంచు పర్వతాలు కరిగి నదులు పొంగి నష్టాలను మిగుల్చుతున్నాయి. దక్షిణాదిలో కరవు పరిస్థితులు తలెత్తి నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ మార్పులే ఇప్పుడు దేశానికి పెద్ద సవాలుగా మారాయి. వ్యవసాయరంగంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. రైతులు అప్పుల్లో మునిగిపోవడానికి ఇవే కారణం. వాతావరణ మార్పులతో కలిగే ముప్పు, వాటిని ఎదుర్కొనే విధానాలపై గ్రామీణ స్థాయిలో చైతన్యం పెరగాలి’ అని ఆమె అభిప్రాయపడ్డారు. విపత్తుల నష్టాల నుంచి బయటపడాలంటే అందుబాటు ధరల్లో బీమా పథకాలను ప్రభుత్వాలు అమలుచేయాలని యూవీ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ సచిన్ గుప్తా అన్నారు. పెట్టుబడిదారులు కూడా ఆయా దేశాల్లో వాతావరణ మార్పుల ప్రభావాలు ఎలా ఉన్నాయో చూసిన తర్వాతే ముందుకొస్తున్నారని స్విట్జర్లాండ్‌కు చెందిన ఫ్రీస్టజెన్ సీఈఓ ఫిలిప్ ఆసమస్ చెప్పారు. దేశాల ఆర్థిక గమనాలను మార్చేసే శక్తి వాతావరణానికి ఉందని.. అందుకు అనుగుణంగా వ్యాపార, వ్యవసాయ ప్రణాళికలు అమలు చేస్తేనే నష్టాల నుంచి బయటపడగలరన్నారు. విపత్తులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచే వ్యవస్థను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అధ్యయనం చేసిన పుస్తకాన్ని వేదికపై ఆవిష్కరించారు.

సరైన పాలనే.. అసలైన రాజకీయం

- బిహార్‌లో ఎన్డీయే విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు
- పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడి



విశాఖపట్నం: బిహార్‌లో ఎన్డీయే ఘనవిజయం సాధించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. సరైన పాలనే.. అసలైన రాజకీయమనే విషయం ఈ విజయంతో రుజువైందన్నారు. బిహార్‌లో ఎన్డీయే ఘనవిజయం సాధించిన తర్వాత ఎన్డీయే నాయకత్వం నుంచి వెలువడిన తొలి స్పందన ఇదే. ఈ మేరకు శనివారం చంద్రబాబు విశాఖపట్నంలో పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. “సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా సాధికారత కల్పించడమనే కొత్త నమూనాను నరేంద్ర మోదీ నాయకత్వం తీసుకొచ్చింది’ ’ అని చెప్పారు. “బిహార్‌లో ఒకప్పుడు ‘జంగిల్‌రాజ్’ రాజ్యమేలేదన్న సంగతి అందరికీ తెలుసు. నీతీశ్‌కుమార్ దానికి చరమగీతం పాడారు. నీతీశ్ చేసిన పనులు, చేస్తున్న పనులకు, మోదీ చేసిన పనులు, చేస్తున్న పనులకు ఈ ఎన్నికలతో మద్దతు లభించింది” అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రధానితో తన సంబంధాలు బలహీనపడుతున్నట్లు వచ్చిన వార్తలను చంద్రబాబు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ప్రధాని మోదీ పనితీరుపై తాను సంతోషంగా ఉన్నట్లు పేర్కొన్న చంద్రబాబు.. దేశానికి ఈ తరుణంలో మోదీ తరహా నాయకత్వం అవసరమని చెప్పారు. తాను మనస్ఫూర్తిగా ఆయన్ను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. గతంలోని ఘర్షణ ఇప్పుడు సమసిపోయినట్లేనా అన్న ప్రశ్నకు.. “ఎలాంటి సమస్యా లేదు. మేం ఆయన(మోదీ)కు చాలా సన్నిహితంగా ఉన్నాం. ఆయనతో ఏనాడూ వ్యక్తిగత సమస్యలు లేవు” అని చంద్రబాబు స్పష్టంచేశారు.

భారత స్పేస్ ఎకానమీ.. వేగంగా విస్తరిస్తోంది

- అంతరిక్ష రంగంలో అపార అవకాశాలు
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్

ఈనాడు, విశాఖపట్నం: ఉపగ్రహాల తయారీ, అధునాతన ప్రయోగవాహన సేవలు, కమ్యూనికేషన్, నేవిగేషన్, భూ పరిశీలన లాంటి రంగాల్లో భారత ఆర్థికవ్యవస్థ గణనీయమైన పురోగతి సాధిస్తోందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పేర్కొన్నారు. విశాఖలో శనివారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ‘ఇండియా స్పేస్ లీప్- నేషనల్ కేపబులిటీ టు గ్లోబల్ కాంపిటీటివ్‌నెస్’ అనే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ‘ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల ఉత్పత్తి యూనిట్లకు మొత్తం పెట్టుబడిపై 30-40% సబ్సిడీతో పాటు పారిశ్రామిక భూమిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తుంది. అంతరిక్ష రంగానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులు అరుదు కావడంతో.. ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్ల విలువ గల దేశీయ అంతరిక్ష రంగం.. 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది’ అని తెలిపారు. కార్యక్రమంలో న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ టెక్నికల్ అండ్ స్ట్రాటజీ విభాగం డైరెక్టర్ ఎ.అరుణాచలం, ఇస్రో అసోసియేట్ సైంటిఫిక్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ బిజయ్ కుమార్ బెహరా, పలువురు అంతరిక్ష శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంపెనీలకు వెంటనే అనుమతులు!

విశాఖ నుంచి ఈనాడు ప్రతినిధి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలకు ప్రోత్సాహకాలు కల్పించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను విశాఖ భాగస్వామ్య సదస్సులో టెక్ కంపెనీల ప్రతినిధులకు వివరించింది.

క్వాంటమ్ కంప్యూటింగ్ అవకాశాలు పెంచేందుకు..

- క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ అభివృద్ధి, డిజైన్ల రూపకల్పన.
- సాఫ్ట్‌వేర్, ఆర్కిటెక్చర్ అభివృద్ధి.
- క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ ఎకోసిస్టం సృష్టించడం.
- క్వాంటమ్ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ సేవలు.
- ఇన్నోవేషన్ ల్యాబ్‌లు, ఐటీ ఆఫీస్ స్పేస్ సదుపాయాలు.

రాష్ట్రంలో క్వాంటమ్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి

- మౌలిక సదుపాయాల కల్పన
- తక్కువ ఖర్చుతో తయారీకి అనువైన వాతావరణం.
- డిమాండ్‌కు అనుగుణంగా యూజ్ కేసులు రూపొందించడం.
- పెట్టుబడులకు సులువుగా నిబంధనలు.
- టెస్టింగ్, సర్టిఫికేషన్‌ను అందుబాటులోకి తేవడం.

భారత్ క్వాంటమ్ ఎకోసిస్టమ్ లక్ష్యాలు..

నేషనల్ క్వాంటమ్ మిషన్ కోసం ఐదు లక్ష్యాలను ప్రభుత్వం తన పాలసీలో నిర్దేశించింది.

- **క్వాంటమ్ సిస్టమ్స్:** రానున్న 8 ఏళ్లలో 50–1000 క్యూబిట్ సామర్థ్యం గల క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటు.
- **క్వాంటమ్ కమ్యూనికేషన్:** ఉపగ్రహ ఆధారిత సురక్షిత లింక్‌లు 2,000 కి.మీ.ల పరిధిలో అందుబాటులోకి తేవడం.
- **క్వాంటమ్ సెన్సింగ్, టైమింగ్:** ఆటో మాగ్నోమీటర్లు.. గడియారాలను ఏర్పాటు చేయడం.
- **క్వాంటమ్ మెటీరియల్స్:** సూపర్ కండక్టర్లు, అడ్వాన్స్‌డ్ సెమీకండక్టర్లు, టోపోలాజికల్ మెటీరియల్స్ అందుబాటులోకి తేవడం.
- **ఫొటోనిక్స్:** సింగిల్ ఫోటాన్, డిటెక్టర్ల అభివృద్ధి

ఈ లక్ష్యాలు సాధించేందుకు 2031 నాటికి ఉపయోగించుకునేలా నేషనల్ క్వాంటమ్ మిషన్ నుంచి రూ.6,003.65 కోట్ల కేటాయింపు. అందులో నుంచి కనీసం 8 స్టార్టప్స్‌కు నిధులను సమకూర్చడం.

- 4 థీమాటిక్ హబ్‌ల ఏర్పాటుకు రూ.1,500 కోట్ల కేటాయింపు.

స్టార్టప్.. అకడమిక్ రీసెర్చ్‌లకు ప్రోత్సాహకం

రీసెర్చ్ ఫండింగ్: అకడమిక్/స్టార్టప్‌లు చేసే పరిశోధనలకు రూ.30 లక్షలు లేదా నేషనల్ క్వాంటమ్ మిషన్ ఆమోదించిన ప్రాజెక్టులు పరిశోధనకు చేసే ఖర్చులో 50 శాతం సమకూర్చడం.

క్వాంటమ్ కంప్యూటింగ్ ఫెసిలిటీ: పరిశీలన, పరిశోధనలకు రాయితీ/ఉచితంగా అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌ను వినియోగించుకునే వెసులుబాటు.

సీడ్ ఫండింగ్: ఈక్విటీ విధానంలో రూ.కోటి వరకు.

మార్కెట్ మద్దతు: ఈక్విటీ విధానంలో రూ.5 కోట్ల వరకు.

క్వాంటమ్ ప్రోగ్రాంను ప్రోత్సహించేందుకు: ఒక్కో ప్రోగ్రాంకు చేసే ఖర్చులో 75 శాతం.

ఐటీ మద్దతు: పేటెంట్ల కోసం చేసే ఖర్చులో 75 శాతం తిరిగి చెల్లింపు. గరిష్ఠంగా రూ.4 లక్షలు (దేశీయ పేటెంట్), అంతర్జాతీయ పేటెంట్‌కు గరిష్ఠంగా రూ.20 లక్షలు చెల్లింపు.

అద్దె రాయితీ: గుర్తింపు పొందిన ప్రాంతంలో ఏర్పాటు చేసే కంపెనీకి అద్దె పూర్తిగా మినహాయింపు. . కనీసం 20 మందికి ఉపాధి కల్పించాలి.

మార్కెటింగ్ మద్దతు: ఈవెంట్లు/ ఎగ్జిబిషన్ల కోసం చేసే ఖర్చులో 75 శాతం తిరిగి చెల్లింపు.. గరిష్ఠంగా రూ.10 లక్షలు.

హార్డ్‌వేర్ తయారీ కంపెనీలకు ప్రోత్సాహకం

హార్డ్‌వేర్ కంపెనీల కోసం 100 ఎకరాల్లో ప్రత్యేక పార్కును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఇలా ఉన్నాయి

భూముల ధరలో రాయితీ: క్వాంటమ్ హార్డ్‌వేర్ పార్కులో కొనుగోలు చేసే భూముల ధరపై రాయితీ.

- మొదట అనుమతించిన 10 ప్రాజెక్టులకు 50 శాతం మూలధన రాయితీ

ఇతర కంపెనీలకు మూలధన రాయితీ: రూ.50 కోట్లతో ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు.. మూలధనంలో 30 శాతం రాయితీ (ఐదేళ్లలో సమాన వాయిదాల్లో చెల్లింపు).

టైలర్‌మేడ్ విధానంలో రాయితీలు: రూ.50 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టే సంస్థలకు టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు.

నియామకాల్లో రాయితీలు: స్కిల్డ్ ఉద్యోగికి రూ.30 వేలు, సెమీస్కిల్డ్‌కు రూ.15 వేలు చొప్పున..6 నెలల పాటు చెల్లింపు.

- **ఎస్‌జీఎస్టీ:** వాణిజ్య ఉత్పత్తిలోకి వచ్చినప్పటి నుంచి ఐదేళ్ల పాటు 100 శాతం రాయితీ.

విద్యుత్ రాయితీ: యూనిట్‌కు రూపాయి చొప్పున 5 ఏళ్లపాటు.

స్టాంప్ డ్యూటీ: పూర్తిగా మినహాయింపు.

క్వాంటమ్ అప్లికేషన్.. సిస్టమ్ డెవలపర్లకు ప్రోత్సాహకాలు

- **ప్రోత్సాహకాలకు అర్హత:** రూ.10 కోట్లకుపైగా రెవెన్యూ/రూ.10 కోట్లకు పైగా ఫండింగ్ సాధించాలి.
- **అద్దె రాయితీ:** నోటిఫైడ్ ఏరియాలో ఏర్పాటు చేసిన కంపెనీలు వర్క్ స్టేషన్‌కు చెల్లించే అద్దెలో 75 శాతం రాయితీ ఇస్తారు.
- ఐటీ హార్డ్‌వేర్‌కు చేసే ఖర్చులో 50శాతం..గరిష్ఠంగా రూ.10 కోట్లు రాయితీ.
- మొదటగా వచ్చిన 20 ప్రతిపాదనలకు.. అవి దిగుమతి చేసుకునే హార్డ్‌వేర్‌కు చెల్లించిన ఇంపోర్ట్ డ్యూటీలో 50 శాతం తిరిగి చెల్లింపు.
- **విద్యుత్ రాయితీ:** యూనిట్‌కు రూపాయి చొప్పున.

క్వాంటమ్ హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) ఎకోసిస్టమ్ అభివృద్ధికి ప్రోత్సాహకాలు

- ఐటీ హార్డ్‌వేర్ కొనుగోలుకు చేసే ఖర్చులో 50 శాతం రాయితీ.
- భూముల ధరల్లో రాయితీ.
- విద్యుత్‌కు యూనిట్‌కు రూపాయి చొప్పున రాయితీ.
- టైలర్ మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు.

సాంకేతిక పెట్టెలోంచి భవిష్యత్తు దర్శనం!

- ‘అమరావతి రాజధాని’ కళ్ల ముందు సాక్షాత్కారం
- ఏపీ పెవిలియన్‌లో ప్రత్యేకతలు
- ఆసాంతం పరిశీలించిన సీఎం చంద్రబాబు

విశాఖపట్నం నుంచి ‘ఈనాడు’ ప్రత్యేక ప్రతినిధి

మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలు పూర్తయితే రాజధాని అమరావతి ఎలా ఉండబోతోందనేది అందరికీ ఆసక్తి. సాంకేతికత దానిని కళ్ల ముందు సాక్షాత్కరింపజేసింది. భవిష్యత్తు రాజధాని నగరం ఎలా ఉందనే ఊహలకు త్రీడీ సాంకేతికత రెక్కలు తొడిగింది. ఏపీ కియోస్కులో ఏర్పాటు చేసిన అమరావతి నమూనాను సీఎం చంద్రబాబు ఆసాంతం ఆసక్తిగా తిలకించారు. ఎక్కడెక్కడ ఏపీ నిర్మాణాలు రాబోతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక ఆధారంగా వివిధ శాఖల నుంచి రియల్‌టైంలో అందే సేవలను అడిగి తెలుసుకున్నారు. విశాఖపట్నం సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఏపీ పెవిలియన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో ఐదు ప్రధాన శాఖలు.. వాటి ద్వారా అందే సేవలను సాంకేతికత ఆధారంగా తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసింది. దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, అతిథులు ఆసక్తిగా పెవిలియన్‌ను తిలకించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు రాష్ట్రంలో ఉన్న మౌలిక సదుపాయాలు.. భూముల అందుబాటు.. ప్రభుత్వ విధానాలను తెలిపే కియోస్కును వినియోగించి. . వివరాలను స్కానింగ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్నారు. సాంకేతికతకు ప్రాధాన్యమిచ్చేలా ప్రభుత్వం ఒక ప్రదర్శనశాలగా కాకుండా.. ఒక ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా పెవిలియన్‌ను తీర్చిదిద్దింది. గత రెండు రోజులుగా సదస్సుకు హాజరైన ప్రతిఒక్కరూ దీనిని ఆసక్తిగా గమనించారు.

క్లిక్ చేస్తే.. పార్కులోకి వెళ్లినట్లే

ఉన్నచోట నుంచే సందర్శక ప్రాంతాలను సందర్శించేలా పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ‘వర్చువల్ రియాలిటీ డెస్టినేషన్’ పరికరం వినియోగించి.. సీఎం అబ్బురపడ్డారు. దాన్ని క్లిక్ చేయడం ద్వారా కాలు కదపకుండా పార్కును సందర్శించిన అనుభూతిని సొంతం చేసుకున్నారు.

గూగుల్ సాంకేతికత ఇలా ఉండనుంది!

- గూగుల్ డేటా సెంటర్ ఎలా ఉండబోతోంది? ఎంత ఎట్టుబడులు పెడుతుంది? ఒక్క క్లిక్‌తో డేటా మొత్తం భారీ తెరపై కళ్ల ముందు సాక్షాత్కారమైంది. ఆ సంస్థ ఏఐ ఆధారంగా పనిచేసే కియోస్కును ఏర్పాటు చేసింది. దాని ద్వారా సంస్థ వివరాలను సీఎం చంద్రబాబు ఆసక్తిగా గమనించారు.
- ఏఐ ఆధారంగా ఆహారాన్ని విశ్లేషించే విధానాన్ని పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే ‘న్యూట్రిషన్ విధానానికి’ అనుసంధానం చేయాలని సీఎం అక్కడికక్కడే నిర్ణయించారు. డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి దగ్గరగా ఇది ఉందని ప్రస్తావించారు. ‘ఫుడ్ యాజ్ ఏ మెడిసిన్.. ప్రివెంటివ్ యాజ్ ఏ ఫార్మసీ అనేది నా నినాదం. రూ.ఏడెనిమిది కోట్ల దాతృత్వంతో న్యూట్రిఫుల్ అనే విధానాన్ని తీసుకురావాలన్నది ఆలోచన. గూగుల్ ఏఐనీ దానికి అనుసంధానం చేద్దాం” అని చంద్రబాబు చెప్పారు.

రైతుకు సమస్త సమాచారం..

రైతుకు అవసరమైన క్షేత్రస్థాయి సమాచారాన్ని పక్కాగా అందించేందుకు వీలుగా ఆర్టీజీఎస్ ఓ కియోస్కును ఏర్పాటు చేసింది. భూమి రకం ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలి? ఎంత తేమ శాతం ఉంది? భూములకు ఎలాంటి సూక్ష్మ పోషకాలు అందించాలి? పంట పరిస్థితి ఎలా ఉంది? ఎలాంటి చీడపీడలు ఉన్నాయి? అనే వివరాలు రైతులు కియోస్క్ ద్వారా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. “అందులో ఉపయోగించిన ప్రొడక్ట్స్ మొత్తాన్ని డాక్యుమెంట్ చేయాలి. వాటిని ఉపయోగించుకునే విషయాన్ని పరిశీలించడంతో పాటు.. ఇంకా కొత్తగా ఏమైనా ఏర్పాటు చేయాలా? అనే విషయాన్ని పరిశీలించొచ్చు” అని ఆర్టీజీఎస్ కియోస్కును పరిశీలించిన అనంతరం సీఎం అధికారులకు సూచించారు. ఉపగ్రహాల ద్వారా వచ్చే సమాచారాన్ని దీనికి అనుసంధానం చేసే వెసులుబాటు ఉంటుందా? అని ప్రశ్నించారు. ఉపగ్రహం నుంచి వచ్చే సమచారాన్ని అనుసంధానించడం తప్పించి.. మిగిలిన అన్ని ప్రక్రియలను పూర్తి చేసినట్లు సీఎంకు అధికారులు వివరించారు.

పారిశ్రామిక సమాచారం.. ఒక్క బటన్‌తో ప్రత్యక్షం

ఏఐ వినియోగించి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరగా ఎలా పూర్తి చేయవచ్చనేది వివరించేందుకు ఉన్న కియోస్కునూ సీఎం పరిశీలించారు. ఏ కారణంగా ప్రాజెక్టు ఆలస్యం అవుతుందనేది తెలుసుకుని.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకునే అవకాశం ఈ సాంకేతికత వినియోగించడం వల్ల లభిస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఏఐని వినియోగించి రాష్ట్రంలోని అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సమాచారాన్ని సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

రాష్ట్రాభివృద్ధిలో ప్రవాసాంధ్రుల సహకారం కీలకం

- ఎన్నారై సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, విశాఖపట్నం: వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలను అందుకోవడానికి ప్రవాసాంధ్రుల సహకారం చాలా కీలకమని ఎన్నారై సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భాగస్వామ్య సదస్సులో ‘ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి నుంచి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం’ అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. ప్రవాసాంధ్రుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసిన తొలి రాష్ట్రం మనదేనని గుర్తుచేశారు. ప్రపంచంలోని 140 దేశాల్లో 35 లక్షల మంది ప్రవాసాంధ్రులున్నారన్నారు. ఐటీ, డేటా, వ్యవసాయ, మౌలిక వసతుల రంగాల్లో సుమారు రూ.4,108 కోట్ల విలువైన ఎగుమతులకు అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ కంపెనీల్లో సీఈవో, సీటీవోలు, ముఖ్యస్థానాల్లో ఉన్న సుమారు 800 మంది తెలుగు వారితో సీఓఎక్స్ అనే క్లబ్ ఏర్పాటుచేసి వారితో స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించేలా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కంపెనీలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి రావాలంటే ఇక్కడే ప్లగ్ అండ్ ప్లే వంటి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాల్సిన అవరం ఉందని కొంత మంది ప్రవాసాంధ్రులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆ దిశగా ముఖ్యమంత్రి ఇప్పటికే చర్యలు తీసుకున్నారని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎన్ఆర్టీ డైరెక్టర్ కె.శేషుబాబు, పీ డేటా సెంటర్‌కు చెందిన ముప్పనేని కల్యాణ్, కెనడా ప్రతినిధులు సూర్య బెజవాడ, కోటేశ్వరరావు, సూరపనేని సుధాకర్‌బాబు, కార్పొరేట్ లాయర్ సుందరి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం

రాష్ట్రంలో ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఏయూలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన ‘ఆర్‌టీఐహెచ్ - వన్ ఫ్యామిలీ, వన్ ఆంత్రప్రెన్యూర్ - ఇన్నోవేషన్, ఇంక్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఏపీ’ అనే సమావేశంలో ఆయన మాట్లాడారు. “ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం వ్యవస్థలను ఎక్కువగా ప్రోత్సహిస్తారు. ఆయన మద్దతు, పరిశ్రమల సహకారంతో.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను నెలకొల్పాం. ఈ హబ్‌లో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమలను అనుసంధానిస్తున్నారు. అదేవిధంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి క్లస్టర్ విధానాన్ని అనుసరిస్తున్నారు. పారిశ్రామిక పార్కుల్లో కామన్ ఫెసిలిటీ కేంద్రాలను ఏర్పాటు చేశాం” అని తెలిపారు.



సీఐఐ సదస్సు ముగింపు అనంతరం సీఎస్ విజయానంద్‌ను అభినందిస్తూ జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు

ప్రత్యేక కార్గో విమానాశ్రయాలపై దృష్టి సారించాం

- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాఖపట్నం నుంచి ‘ఈనాడు’ ప్రత్యేక ప్రతినిధి


ప్రత్యేక కార్గో విమానాశ్రయాల ఏర్పాటుపై దృష్టి సారించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో శనివారం ఆయన మాట్లాడుతూ “మన దేశంలోనూ ప్రత్యేక కార్గో కేంద్రాలు అవసరం. ఎయిర్-కార్గో ఖర్చు తగ్గాలి. అందుకే ప్రత్యేక కార్గో విమానాశ్రయాలపై పని చేస్తున్నాం. ఒక్కో విమానాశ్రయాన్ని అక్కడి ప్రత్యేక ఉత్పత్తికి అనుసంధానించి శీతల గిడ్డంగులు, హ్యాండ్లింగ్, ఎగుమతి వ్యవస్థలు ఏర్పాటుచేయాలి. మెగా, పెద్ద, మధ్యస్థ, చిన్న విమానాశ్రయాలు, కార్గో విమానాశ్రయాల అవసరం ఉంది. ప్రపంచస్థాయి విమాన భాగాలను తయారు చేస్తున్న 500 ఎంఎస్ఎంఈలు భారత్‌లో ఉన్నాయి. పూర్తిగా భారత్‌లోనే డిజైన్ చేసిన విమానాన్ని తయారు చేయాలన్నది దీర్ఘకాల లక్ష్యం. పెండింగ్‌లో ఉన్న 1,700 విమానాల ఆర్డర్లు డెలివరీ అయితే.. దేశంలో 30 వేల మంది పైలట్ల అవసరం ఉంటుంది. ఇందుకోసం కొత్త ఫ్లైయింగ్ స్కూల్స్ ప్రారంభిస్తున్నాం. 2014లో దేశీయ ప్రయాణికులు రోజుకు 1.8 లక్షలు ఉంటే ప్రస్తుతం 4.6 లక్షలకు పెరిగింది. నవంబరు 10న ఒకే రోజు 5.3 లక్షల మంది ప్రయాణం చేశారు. ఇది రికార్డు. అంతర్జాతీయ ప్రయాణికులు సంఖ్య భారీగా పెరిగింది” అని తెలిపారు. అమెరికాలో ప్రత్యేక విమానాశ్రయాన్ని కలిగి ఉన్న గ్లోబల్ లాజిస్టిక్స్ కంపెనీ ఫెడెక్స్ తరహాలో.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశంలో కార్గో విమానాశ్రయాలను ఏర్పాటుచేయాలని ఆలోచిస్తోందని చెప్పారు.

- ఉత్తరాంధ్రకు మరో విమానాశ్రయం రానుంది. శ్రీకాకుళంలో నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సంబంధించి భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ మధ్య ఈ మేరకు అవగాహనా ఒప్పందం కుదిరింది.

ఎయిర్ ట్యాక్సీలకు ప్రత్యేక కారిడార్ అవసరం

ప్రొఫెసర్ సత్యచక్రవర్తి

ఈనాడు, విశాఖపట్నం: ఎయిర్ ట్యాక్సీ, ఎలక్ట్రిక్ విమానాల తయారీకి ప్రత్యేక నడవా అవసరమని ప్రొఫెసర్ సత్యచక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు అవసరమైన ఎకోసిస్టం ఏర్పాటు చేస్తుండగా ఎయిర్ ట్యాక్సీ, ఎలక్ట్రిక్ విమానాలకు తగిన ఎకోసిస్టంను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ సీఐఐ సదస్సులో శనివారం ‘దేశంలో విస్తృత స్థాయి అవకాశాలు.. ప్రపంచస్థాయి సంస్థలు నిర్మించడం’పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ ‘ఐటీతో యువత ఆలోచనల్లో మార్పులొచ్చాయి. మొదట్లో అంకురాలు విఫలమైనా బాధపడకుండా మళ్లీమళ్లీ ప్రయత్నించి విజయాలు సాధిస్తున్నారు. అంకురాల కోసం పాలసీ తీసుకొచ్చి కొత్త కంపెనీలను తీసుకురావడంలో దేశంలోనే రాష్ట్రం ముందడుగులో ఉంద’ని అన్నారు. అవేర్ సంస్థ సీఈవో వెంకటరమణ ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి, తయారీలో ఉన్న ఇబ్బందులు, గ్రామీణ స్థాయికి వాటిని ఏ విధంగా తీసుకెళ్లాలో వివరించారు.



ఫ్రేమ్‌ల్లో చీరలు.. సులువుగా కొనుగోళ్లు

గతంలో ఎక్కడైనా ఎగ్జిబిషన్లు, ప్రదర్శనలు నిర్వహించినా చేనేత, జౌళీ సంస్థ భారీ స్థాయిలో పట్టువస్త్రాలను తీసుకెళ్లి స్టాల్స్ నిర్వహించేది. సిబ్బంది వాటి మడతలు విప్పి.. సందర్శకులకు చూపేవారు. కొనుగోలుదారులు కూడా చీరలను చిందరవందరగా చేసేవారు. వాటిని తర్వాత మడతపెట్టుకునేందుకు తలనొప్పిగా మారేది. ఈ నేపథ్యంలో విశాఖలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆ సంస్థ వినూత్న రీతిని అవలంబించింది. స్థానికంగా ఏర్పాటు చేసిన స్టాల్‌లో 34 రకాల పట్టు చీరలను ఫొటో ఫ్రేమ్‌ల్లో పెట్టి ప్రదర్శించారు. సదస్సుకు వచ్చిన వారు ఫ్రేమ్‌లను చూసి.. నచ్చిన చీరలు కొనుగోలు చేశారు.

– ఈనాడు, విశాఖపట్నం